।। श्रीहरिः ।।

श्रीमद् देविभागवत

(तेलुगु)

శ్రీమాత్రే నమః

శ్రీ దేవీ భాగవతము

ప్రథమ స్కంధము

ఓమ్ సర్వచైతన్యరూపాం తా మాద్యాం విద్యాం చ ధీమహి।
బుద్ధిం యా నః ప్రచోదయాత్

శ్లో॥ నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం ।
దేవీం సరస్వతీం చైవ తతో జయముదీరయేత్ ॥
అచతుర్వదనోబ్రహ్మ ద్విబాహురపరోహరిః ।
అఫాలలోచన శ్శంభుః భగవాన్ బాదరాయణః ॥

మా బుద్ధులను సన్మార్గము వైపు ప్రేరేపించునట్టి సమస్త చైతన్య స్వరూపము, అన్నిటికి ఆద్యురాలు, మహావిద్యా స్వరూపిణియునైన పరమేశ్వరిని ధ్యానించెదము.

భగవంతుడగు నారాయణునకు నరోత్తముడగు నరమహర్షికి సరస్వతీ దేవికి నమస్కరించి అటు పిమ్మట జయమును పలుకవలయును. పూజ్యుడగు వేదవ్యాస మహర్షి నాలుగు ముఖములు లేని బ్రహ్మ, రెండు చేతులే కలిగిన-మరియొక శ్రీమన్నారాయణుడు, నుదుట కన్నులేని మరియొక శివుడు, అనగా వ్యాసమహర్షి, బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులతో సమానుడని భావము. అట్టి వ్యాసమహర్షికి నమస్కారము.

శౌనకుడు సూతుని ప్రశ్నించుట

సూత మహర్షితో శౌనకుడిట్లు పలికెను :-

సత్పురుషుడవు ధన్యుడవునగు ఓ మహానుభావా! సూతమహర్షీ! నీవు వేదవ్యాస మహర్షి రచించిన దివ్యమైన అష్టాదశపురాణములను చక్కగా చదివిన పుణ్యాత్ముడవు. సత్యవతీ పుత్రుడగు వ్యాసమహర్షివలన రహస్య విషయములతో బాటు పురాణముల నన్నింటిని తెలిసికొనిన నీవు మా పుణ్యమువలన లభించితివి.

ఈ క్షేత్రము కలియుగ దోషములకు దూరమైనది. దివ్యమైనది కూడ. ఓ సూత మహర్షీ! ఈ మునులందరు పుణ్యప్రదమైన పురాణమును నీనుండి వినవలెనని ఉత్సాహముతో కూడియున్నారు. నీవు స్తిమితమైన మనస్సు కలవాడవై మాకు పురాణకథను వినిపించుము.

ఓ సూతమహర్షీ! నీవు అన్ని విషయములు తెలిసినవాడవు. ఏ విధమైన తాపత్రయము లేనివాడవు. నీకు భగవంతుడు దీర్ఘాయువు నొసంగుగాక ఓ మహానుభావా! వేదములతో సమానమైన పురాణమును మాకు వినిపింపుము. మానవులు చెవులు కలవారైనను, కథలలోని రుచిని గ్రహించు నేర్పుకలవారైనను దైవముచే మోసగింపబడి పురాణములను వినుటలేదు. తీపి పులుపు మొదలగు రుచుల ననుభవించి, జిహ్వేంద్రియమువలన ఆనందమును పొందుచున్నట్లు విద్వాంసులు చెప్పిన మాటలవలన చెవులకు పరమానందము కలుగుచున్నది. చెవులులేని సర్పములును శబ్దమాధుర్యమునకు ఆకర్షింపబడుచున్నవి. చెవులుకల మనుష్యులు మధురములైన, సత్కథలను సదుపదేశములను వినకపోవుటచే చెవులు లేనివారనియే చెప్పవలెను.

ఓ బుద్ధిమంతుడా! కలియుగములోని పాపములకు భయపడి ఈనైమిశారణ్య క్షేత్రమున సర్వవర్ణములవారలును పుణ్యప్రదములగు పురాణ కథలను వినగోరిన వారై ప్రశాంతములైన మనస్సులతో నీ మాటలకు యెదురుచూచుచున్నారు. ఏదోఒకపనితో ప్రతివ్యక్తియు కాలమును గడుపును. మూర్ఖులైనవారు ఆయా వ్యసనములతో కాలమును గడుపుచుందురు. పండితులట్లుగాక జీవితమును సార్థకము చేసుకొనుటకు ఉపయోగపడునట్టి శాస్త్ర విషయములను మననము చేసికొనుచు, లేక ఇతరులకు బోధించుచునూ కాలమును గడుపుదురు. పురాణ ములు సత్త్వగుణ ప్రధానములు, రజోగుణ ప్రధానములు, తమోగుణ ప్రధానము అని మూడు విధములుగా నీ వెరిగించి యుంటివి. అట్టి పురాణములలో శ్రీ దేవీ భాగవతము ఐదవ వేదముగను పుణ్యప్రదముగను పూర్వము నీవే చెప్పి యుంటివి. ఆ దేవీభాగవతము మోక్షము కోరువారికి మోక్షమును, ధర్మము కోరువారికి ధర్మమును, మరియు నితరములగు కోరికలను కూడ అనుగ్రహింపగలదని చెప్పి తివి కదా! ఆ దేవీభాగవతమునే సవిస్తరముగా నిప్పుడు మాకు చెప్పవలసినదిగా కోరుచూ అన్ని వర్ణములువారు సావధానమనస్కులై యున్నారు. మహర్షీ! నీవు సర్వధర్మముల నెరిగిన వాడవు గురుభక్తి గలవాడవు, సత్త్వగుణ సంపన్నుడవును. అట్టి నీనుండి వేదవ్యాసునిచే చెప్పబడిన దేవీభాగవత పురాణమును వినగోరుచు న్నాము.

మహర్షీ! యెన్నో విషయములను నీవు చెప్పగా వినియున్నాము. ఐనను ఇంకను నీనుండి పలువిషయములు వినవలయునను కుతూహలముతో నున్నాము. అమృతము త్రాగువానికి తృప్తి యెట్లుండదో అట్లే నీవు చెప్పు విషయములను విన్నను మాకు తృప్తి కలుగుటలేదు. అమృతము త్రాగు వారికి మోక్షము సాధ్యముగాదు కాని దేవీభాగవతరసమును త్రాగువారికి కష్టములన్నియు తొలగి మోక్షముకూడ లభ్యమగును. అమృతపానము కొరకు మేము వేలకొలది యజ్ఞములు చేసినను శాంతి సమకూరలేదు. ఎందువలననగా యజ్ఞములుచేసి స్వర్గసుఖము ననుభవించినను చేసిన పుణ్యము నశింపగా పిమ్మట మరల భూలోకములో జన్మించుట తప్పదు. సత్త్వరజస్తమోగుణములతో కూడిన సంసార చక్రములో తిరుగువారికి జ్ఞానము కలిగిననే కాని ముక్తి ప్రాప్తించదు. కనుక అన్ని రసములతో నిండిన మోక్షప్రదమగు పవిత్రమైన శ్రీ దేవీభాగవతమును వినిపింపుము. ఈ భాగవతము మోక్షము కోరువారికి యెల్లప్పుడును ప్రియమైనది. అను శౌనకుని మాటలను విని సూతునిడిట్లు పలికెను.

దేవీభాగవత మందలి స్కంధముల వివరణము

ఇచ్చట నున్న మహాత్ములు వేదములు వలె పుణ్యప్రదమైన శ్రీదేవీభాగవతమును గూర్చి ప్రశ్నించుట నాయదృష్టము. నేను ధన్యుడను నేనిప్పుడు వేదార్థ సమానమైన దేవీపురాణమును చెప్పెదను.

ఓ మునులారా! పరమయోగులకు ముక్తి నిచ్చు శ్రీమదఖిలాండేశ్వరి లలితా దేవి యొక్క పాదపద్మములకు నమస్కరించి నవరస భరితమగు దేవీభాగవత పురాణమును మీకు చక్కగా వివరించుదును. అన్ని వేదములందు ఆదిశక్తిగా కోరికల నిచ్చునదిగా ప్రసిద్ధి చెందిన శ్రీరాజ రాజేశ్వరి మాకు ప్రత్యక్షమై సిద్ధుల నొసంగుగాక. తన మాయాశక్తిచే సకల ప్రపంచ ములను సృష్టించి పెంచిలయింప చేయుచు లీలావినోదమును చూపుచున్న విశ్వమాతను మనస్సులో స్మరించెదను. బ్రహ్మ విష్ణువు నాభికమలము నుండి పుట్టివాని ప్రేరణచే సృష్టిని ప్రారంభించెను. కనుక బ్రహ్మపరాధీనుడు స్వతంత్రుడుకాడు. విష్ణువు నకాధారము శేషుడు. కనుక నతడును సృష్టికాధారమని చెప్ప జాలము. మహాసముద్రజలమునకు పరదేవతయే ఆధారము కావున ఆ తల్లినే శరణు వేడు కొనుచున్నాను. బ్రహ్మ నిద్రలోనున్న విష్ణువును చూచి - యే దేవిని ప్రసన్నురాలుగా చేసికొనినో దయామృత తరంగిణియగు నామెను శరణుజొచ్చు చున్నాను. సగుణ నిర్గుణ స్వరూపిణి

ముక్తిదాయిని యగు ఆ తల్లిని ధ్యానించి సంపూర్ణ దేవీ భాగవత పురాణమును మీకు చెప్పెదను.

మునులారా! శ్రద్ధగా వినుడు. ఈ దేవీభాగవత పురాణము పుణ్యప్రదము ఉత్తమోత్తమమును. దీనిలో పదునెనిమిదివేల శ్లోకములు పన్నెండు స్కంధములు మూడువందల పదునెనిమిది అధ్యాయములును గలవు. ఈ పురాణమును చెప్పినవాడు వ్యాసమహర్షి. మొదటి స్కంధములో ఇరవై, రెండవ స్కంధమున పన్నెండు, మూడవ స్కంధమున ముప్పై, నాల్గవ స్కంధమున ఇరవై ఐదు, ఐదవ స్కంధమున ముప్పైఐదు, ఆరవ స్కంధమున ముప్పైఒకటి, ఏడవ స్కంధమున నలభై, ఎనిమిదవ స్కంధమున ఇరవైనాలుగు, తొమ్మిదవ స్కంధమున యాభై, పదవ స్కంధమున పదమూడు, పదకొండవ స్కంధమున ఇరవై నాలుగు, పన్నెండవ స్కంధమున పదునాలుగు అధ్యాయములును కలవు. ఇందు సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశాను చరితములు కలవు. పరదేవత నిత్య. నిర్గుణ శివ స్వరూపిణి, విశ్వాధార, యోగగమ్య ఆమెయే పరబ్రహ్మ స్వరూపిణి. ఆమె రూపాంతరములే మహాకాళీ లక్ష్మీసరస్వతులు. అట్టి రూపముల దాల్చు లక్షణమునే "సర్గ" మని చెప్పుదురు. ఆ మూడుశక్తుల వలననే బ్రహ్మ, విష్ణు, మహేశ్వ రులుద్భవించిరి. వీరు సృష్టి స్థితిలయముల నొనర్చుచుందురు. ఈ మూడు మూర్తుల వృత్తాంత మును "ప్రతిసర్గ" మందురు. సూర్యచంద్ర వంశరాజుల చరిత్రను తెలుపుట "వంశ" మనబడును. స్వాయంభువాది మనువుల వంశ, జీవిత కాలపరిమాణముల వర్ణించుట "మన్వంతరము" ఆ మనువుల వంశ కథలను తెలుపు "వంశానుచరితము" ఈ ఐదును పురాణముల కుండవలసిన లక్షణములు. వ్యాసమహర్షి మహా భారతకథను ఒక లక్ష యిరువది అయిదువేల శ్లోకములతో రచించెను. మహా భారతమును - వేదసారమనియు నందురు - అని సూతుడు చెప్పగా శౌనకమహర్షి అడుగుచున్నాడు.

"ఓ సూతమహామునీ ! ఆ పురాణములు మొత్తమెన్ని? వాటిపేర్లు వినగోరు చున్నాము" అని పూర్వము బ్రహ్మ మాకిచ్చిన చక్రమిక్కడకు వచ్చుసరికి శిథిలమై పడిపోయినది. అందుచే నీ క్షేత్రము "నైమిశమని" ప్రసిద్ధి చెందినది. సత్యయుగము వచ్చువరకు మేమిక్కడనే యుందుము. మేమేకాగ్ర చిత్తముతో పురాణము వినగోరుచున్నాము. నీవు దేవీభాగవతమును మాకు వినిపించి దీర్ఘాయుష్కుడవై జీవింపుము. పవిత్రమై సమస్త కోర్కెలను తీర్చునట్టి భగవతికి సంబంధించిన శ్రీ దేవీభాగవతమును మాకు దయతో వివరింపుమనియు శౌనకాదులు సూత మహామునిని ప్రార్థించిరి. అంతట సూతుడిట్లు పలికెను.

పురాణములను వ్యాసులను గురించి వివరములు

ఓ మునులారా! వ్యాసమహర్షి చెప్పిన పురాణములు పద్దెనిమిది. వాటిలో మొదటిది మత్స్యపురాణము. దీనిలో శ్లోకములు 14 వేలు, రెండవది మార్కండేయ పురాణము- ఇది అత్యద్భుతమైనది. దీనిలోని శ్లోకములు 9 వేలు, భవిష్య పురాణములో శ్లోకములు 14,500. శ్రీమహాభాగవతములో 18 వేల శ్లోకములు కలవు. బ్రహ్మాండ పురాణములో 12,100 శ్లోకములు , బ్రహ్మ పురాణములో శ్లోకములు, 10 వేల శ్లోకములు బ్రహ్మవైవర్తములో 18 వేలశ్లోకములు , వామన పురాణములో 10 వేల శ్లోకములు, వాయువు పురాణములో 24,600 శ్లోకములు కలవు. శ్రీవిష్ణు పురాణము మహాద్భుతము. అందు 23 వేలు శ్లోకములు. వరాహ పురాణమందు 24 వేల శ్లోకములు, అగ్నిపురాణమున 16 వేల శ్లోకములు, నారద పురాణమున 25 వేల శ్లోకములు, పద్మపురాణమున 55 వేలశ్లోకములు, లింగపురాణమున 11 వేల శ్లోకములు, గరుడ పురాణమున 19 వేల శ్లోకములు, కూర్మపురాణమున 17 వేల శ్లోకములు, స్కాందపురాణమున 51 వేల శ్లోకములు, ఇది పురాణములు వాటియందలి శ్లోకములు, సంఖ్యయు. ఇక ఉపపురాణములు సనత్కుమారము, నారసింహము, నారదీయము, శైవము, దౌర్వాసము, కాపిలము, మానవము, ఔశనసము, వారుణము, కలికము సాంబము, నందికృతము, ఆదిత్య పురాణము, మహేశ్వరము భాగవతము, వాసిష్ఠము అనునవి 18. వ్యాసుడు పురాణములు చెప్పిన పిమ్మట సారరూపముగ మహాభారతమును చెప్పెను.

ప్రతి మన్వంతరమున ద్వారపరయుగము వచ్చును. అట్టి ద్వాపరమున శ్రీహరి వ్యాసమహర్షిగ అవతరించి వేదములను విభజించును. పురాణములను వివరించెను. ప్రతి కలియుగమందును బ్రాహ్మణులల్పాయువులు అల్పబుద్ధులుగా నుండుటచే వేదమును విభజించి వారి మేలుకొరకు పవిత్ర పురాణ సంహితలను ప్రకటించెను. ఇప్పుడేడవ వైవస్వతమన్వంతరము జరుగుచున్నది. ఈ ద్వాపరమున నా గురువైన వ్యాసుడు వేదవ్యాస పీఠమునలంకరించెను. రాబోవు ద్వాపరమున అశ్వత్థామ వ్యాసపదము నలంకరించును.

ఈ విధముగా నిప్పటికి ఇరువదియేడుగురు వ్యాసులు వచ్చి వెళ్ళిరి. అని చెప్పగా మునులు నేటివరకు వచ్చి వెళ్ళిన వ్యాసుల పేర్లను వినగోరుచున్నా మనగా సూతుడిట్లు చెప్పెను. మొదటి ద్వాపరమున "బ్రహ్మ"యే వ్యాసుడు. రెండవ ద్వాపరమున "ప్రజాపతి" తరువాత శుక్రుడు "గురు" "రవి" మృత్యులు, యింద్రుడు, సారస్వతుడు "త్రిధాముడు" "త్రివృషుడు' భరద్వాజుడు,

అంతరిక్షుడు, ధర్ముడు, త్రైయారుణి ధనంజయుడు. మేధాతిథి "వ్రతి", అత్రి, గౌతముడు, హర్యాత్ముడు, వేనుడు, వాజశ్రవుడు, సోముడు, తృణబిందువు, భార్గవుడు, "శక్తి" జాతుకర్ణి కృష్ణద్వైపాయనుడు. ఇరువది యెనిమిది ద్వాపర యుగములతో వచ్చిన వ్యాసుల గురించి చెప్పితిని. వ్యాసుడు దేవీ భాగవతమును చెప్పుచుండగా నేను విన్నాను. అది పుణ్యప్రదము. ఈ కలిసంసార పాపములను పారద్రోలునది. కోరికలను తీర్చును- ముక్తి నిచ్చును. నవరసభరితము వ్యాసుడీ పురాణమును మొదట తన కుమారుడైన శుకునకు బోధించెను. అప్పుడు నేనక్కడనే యుంటిని.

కావున దేవీ పురాణ రహస్యమును వినుభాగ్యము నాకబ్బినది. దేవీ భాగవతము సంసార సముద్రమును దాటించునావ. ఎట్టివాడైనను, యే నెపముతోనైనను దేవీ భాగవతమును విననచో నీలోకమున భోగభాగ్యముల నను భవించి చివరకు అక్షయదేవీ లోకముల నొందగలడు. ఇట్టి దేవీ భారతమను నావ నుపయోగించు కొననివాడు సంసారమును దాటలేడు.

వ్యాసుడు పుత్ర సంతతికై పరితపించుట

ఋషులు శుకుని జన్మ వృత్తాంతమడుగగా సూతుడిట్లు చెప్పెను. వ్యాసుడు సరస్వతీనదీ తీరమున ఆశ్రమములో నివసించుచు రెండు గోరువంకలను చూచి ఆశ్చర్యపడెను. ఆ పిట్టలజంట తమ పిల్లలనోటిలో నాహారము పెట్టుచు వాటి స్పర్శచే నానందించుట చూచి పుత్రుని ముద్దాడి కౌగిలించుకొని యానందించుట యే ఉత్తమోత్తమ సుఖమనియు, పుత్రులు లేనివానికి సద్గతి లేదనియు విచారించి చింతాక్రాంతుడయ్యెను. పిమ్మట దేవతోపాసనముచే సంతానమును పొందవలెనని తలచుచుండగా నారదుడు ప్రత్యక్షమయ్యెను. అప్పుడు వ్యాసుడు దేవర్షియైన నారదుని కూర్చొనబెట్టి అర్ఘ్యపాద్యాదులచే సత్కరించి కుశలనుడిగెను. పిమ్మట నారదుడు ద్వైపాయనా! నీవేల చింతించుచుంటివో తెలుపుమనగా వ్యాసుడిట్ల నెను. సంతానము లేనివారికి సద్గతులు లేవు. వానికి శాంతియుండదు. కనుక నేను దుఃఖించుచున్నాననెను. మరియు సంతానప్రాప్తికై ఏ దేవతను ప్రసన్నునిగా చేసికొనవలెను? అని ఆలోచించుచున్నాను. ఏ దేవత నాకు త్వరగా పుత్రుని ప్రసాదించగలదో దయతో తెలుపుమని వేడుకొనెను.

ఓ పారాశర్యా! నీవు నన్నడిగిన ప్రశ్ననే పూర్వము నా తండ్రి యగు బ్రహ్మ శ్రీహరి తపస్సు చేయుటను చూచి యడిగెను. అప్పుడు హరి యిట్లు చెప్పెను! వేదపారగులగు మహాత్ములు సమస్తము మూలప్రకృతియైన పరదేవత వలన

జరుగుచున్నదని భావించుచున్నారు. నీవు నేను శివుడును ఆ పరశక్తికి లోబడి యుండువారలమే. దేవి దయవలననే నేను మధు కైటభుల సంహరింప గలిగితిని. ఆతల్లి దయచేతనే కూర్మ, వరాహ, నరసింహాద్య వతారములు ధరించుచున్నాను. నాకు స్వేచ్ఛ యున్నచో నేనీ నీచజన్మల నేలపొందె దను? నేను సర్వవిధముల శక్తికి పరతంత్రుడను నేను శక్తినే యెల్లప్పుడు ధ్యానించు చుందును అని విష్ణువు బ్రహ్మతో పలికెను. కనుక ఓ వ్యాసమహర్షి! ఆదేవి పాదపద్మములను నిరంతరము హృదయమున ధ్యానించినచో నీ కోరిక తీరునని పలికెను. అంతట వ్యాసుడా దేవిని గూర్చి తపస్సు చేసెను. అని చెప్పగా మునులు విష్ణువు హయగ్రీవుడెట్ల య్యెనో తెలుపుమని కోరగా సూతుడిట్లనెను.

శ్రీ హయగ్రీవావతార వర్ణనము

భగవంతుడగు జనార్దనుడు పదివేల సంవత్సరములు దానవములతో యుద్ధము చేయవలసి వచ్చెను. అలసిన అతడు పద్మాసనముపై కూర్చొని ధనుస్సు చివరపై వ్రాలి నిద్రించెను. ఇంద్రుడు మున్నగువారు విష్ణువు సహాయమున యజ్ఞము నొకదాని చేయదలచిరి. పరమాత్మయైన ఆ విష్ణువును దేవతలు దర్శించి యాతని మేల్కొని పుటెట్లని చింతాక్రాంతులైరి. అప్పుడు దేవేంద్రుడిట్లనెను. "నిద్రా భంగము చేయుట దోషము. అట్లు చేయ వలదు" అని అప్పుడు బ్రహ్మ యిట్లు పలికెను. నేనొక చెదపురుగును సృష్టించి దానిని యీ వింటివారిని కొరుకుట కాజ్ఞాపించెదను. అదియట్లు చేయగా వారి తెగి విల్లు విరిగి ఏర్పడు ధ్వనికి దేవ దేవుడు నిదురనుండి మేల్కొనును" అని పలికి ఆతడట్లే చెదపురుగును సృష్టించి వింటి వారిని కొరుకుమని దాని నాజ్ఞాపించెను. అప్పుడా పురుగు నేనిట్టి పాప కార్యమునేల చేయుదును? దీనివలన నాకు కలిగెడి ఫలమేమి? యని ప్రశ్నించెను. అప్పుడు బ్రహ్మ మేము చేయు యాగములో నీకు కొంతభాగము నిచ్చెదము. కనుక విష్ణువు మేల్కొనునట్లు చేయుమనగా చెదపురుగు వింటివారిని కొరికెను. ఘోరమైన ధ్వని యేర్ప డెను. విష్ణువు యొక్క కిరీటకుండలములతో శోభిల్లు తల కనబడలేదు. బ్రహ్మ రుద్రాదులు తలలేని శ్రీహరి మొండెమును చూచి యాశ్చర్యపడిరి. దేవతలెల్లరు దుఃఖింపసాగిరి. అప్పుడు బృహస్పతి ఓ మహాశయులారా! ఇట్లేడ్చిననేమి ప్రయోజనము? ఏదేని ఉపాయమాలోచింప వలయును అని పలికెను. అప్పుడు బ్రహ్మ పరదేవతయే మన కార్యము సమ కూర్చగలదు. ఆమె ముల్లోకములకు తల్లి యని పలికెను. మరియు దేవతల

కార్యసిద్ధి కొరకు జగన్మాతను స్తుతింపుడని వేదముల నాజ్ఞాపించెను. అప్పుడు వేదములు పరదేవతనిట్లు స్తుతించెను.

వేదములు చేసిన దేవీస్తుతి

శ్లో॥ నమోదేవి మహామాయే౹ విశ్వోత్పత్తి కరే! శివే
నిర్గుణే సర్వభూతేశి౹ మాతః౹ శంకరకామదే ।
త్వం భూమి స్సర్వభూతానాం ప్రాణః ప్రాణవతాంతథా ।
ధీః శ్రీః కాంతిః క్షమాశాంతిః శ్రద్ధా మేధాధృతిః స్మృతిః ॥
త్వముద్గీథేఽర్ధ మాత్రాసి గాయత్రీ వ్యాహృతిస్తథా౹
జయాచవిజయా ధాత్రీలజ్జాకీర్తిః స్స్వాహాదయా॥
త్వాంసంస్తుమోఽంబ భువనత్రయ సంవిధాన
దక్షాందయా రసయుతాం జననీంజనానామ్ ।
విద్యాం శివాం సకలలో కహితాంవరేణ్యాం ।
వాగ్బీజవాసవిపుణాం భవనాశకర్త్రీమ్॥
బ్రహ్మాహరశ్శౌరి సహస్ర నేత్ర వాగ్వహ్ని సూర్యాభువనాధినాథాః
తేత్వత్కృతాస్సన్తి తతోనముఖ్యామాతాయతస్త్వం స్థిరజంగమానామ్
సకలభువనమేతత్కర్తుకామా యదాత్వం
సృజసిజనని దేవాన్ విష్ణు రుద్రాజముఖ్యాన్ ।
స్థితి లయజననం తైః కారయస్యే కరుపా
నఖలు తవ కథంచిత్ దేవి౹ సంసారలేశః ॥

స్తోత్రభావము :- ఓ సకలభూతేశ్వరీ! శివకామినీ! విశ్వజననీ! శివాత్మికా! మహామాయాదేవీ! నీకు మా నమస్కారములు. నీవే సర్వభూతములకు మూలాకాధారము నీవే ప్రాణుల ప్రాణము. శ్రీ, క్షమ, బుద్ధికాంతి శాంతిశ్రద్ధ, మేధ, ధృతి, స్మృతి, ఇవన్ని యు నీవే. ప్రణవమందలి యర్ధమాత్రవు నీవు శ్రీగాయత్రీ దేవతవు సప్త వ్యాహృతులు, జయ, విజయ, ధాత్రి, లజ్జ, కీర్తి, దయ, స్వాహా ఇవన్నియు నీవే. దయామృత తరంగిణీ! విశ్వమాతా! ముల్లోకముల సృష్టించు భవభయ భంజనీ! వరేణ్యా! మహా విద్యాస్వరూపిణీ! వాగ్బీజనివాసినీ! అమ్మా! నిన్నెల్లప్పుడు స్తుతింతుము. హరిహర బ్రహ్మలు, యింద్రాగ్నులు, రవి, సరస్వతి, లోకాధిపతులును నీచే సృష్టింపబడిరి. ఇంతేకాదు. ఈ స్థావరజగములకన్నిటికి నీవే తల్లివి. నీవీ జగముల నిర్మించదలచి త్రిమూర్తుల సృష్టించి వారిచే సృష్టి స్థితిలయముల నొనరింపజేయుచున్నావు. నీలో సంసార వాసనలు లేశమాత్రము కనబడవు.

శ్లో॥ నతేరూపం వేత్తుం సకలభువనే కోపినిపుణో
నవామ్నాం సంఖ్యాంతే కధితుమిహ యోగ్యోఽస్తిపురుషః
యదల్పం కీలాలంకలయితుమశక్తస్సతు నరః
కథం పారావారాకలన చతురస్స్యాద్పృతమతిః
నదేవానాం మధ్యేభగవతి! తవానంతవిభవం
విజానాత్యే కోఽపిత్వమిహ భువనైకాసి జనని
కథంమిథ్యా విశ్వం సకలమపిచైకారచయసి
ప్రమాణం త్వేతస్మిన్ నిగమవచనం దేవి విహితమ్
విరీహై వాసిత్వం నిఖిలజగతాం కారణమహో
చరిత్రం తేచిత్రం భగవతి మనోవ్యథయతి
కథంకారంవాచ్య స్సకలనిగమాగో చరగుణ
ప్రభావః స్వంయంప్మాత్స్వయ మపినజానాతి పరమమ్
నకింజానా సిత్వం జనని మధుజిన్మౌళి పతనం
శివే కింవా జ్ఞాత్వా వివిదిషసిశక్తిం మధుజితః
హరే! కింవామాతర్దురితతతిరేషా బలవతీ
భవత్యాః పాదాబ్జేభజన నిపుణేక్వాస్తిదురితమ్
ఉపేక్షాకించే యంతవసురసమూహేతివిషమా
హరేర్మూర్ధ్నో నాశోమతమిహమహాశ్చర్య జనకమ్
మహద్దుఃఖంనత్రాత స్త్వమసిజననచ్ఛేదకుశలా
నజానీమోమాళే ర్విఘటన విలంబః కథమభూత్
జ్ఞాత్వాదోషం సకలసురతాపాదితం దేవిచిత్తే
కింవా విష్ణోవ మరజనితం దుష్కృతం పాతితంతే
విష్ణోర్వాకిం సమరజనితః కోపిగర్వోతివేగాత్
ఛేత్తుంమాతస్తవ విలసితం నైవవిద్మోత్రభావమ్
కింవాదైత్యైస్సమరవిజితై స్తీర్థదేశే సురమ్యే
ఘోరంతప్త్వా భగవతి! వరంలబ్ధ వద్భిర్భవత్యాః
అంతర్ధానం గమిత మధునా విష్ణుశీర్షం భవాని।
ద్రష్టుం కింవావిగత శిరసంవాసుదేవం వినోదః
సింధోః పుత్ర్యా రోషితా కింత్వమాద్యే కస్మాదేనాం ప్రేక్షసే నాథహీనామ్
క్షంతవ్యస్తే స్వాంశజాతా పరాధోప్యుత్థాప్యైనం మోదితాం మాంకురుష్వ॥

స్తోత్రభావము:- నీ స్వరూపమును తత్త్వమును తెలిసినవాడు యే లోకమునను లేడు. నీనా మమెంతో మధురము. ఎల్లజగత్తుల నిర్మించుటకు నీవు చాలుదువను టకు వేదములు ప్రమాణములు నీవు యే కోర్కెలు లేని దానవు. ఎల్లలోకములకు కారణ మైనదానవు. నీవిచిత్ర చరిత్ర పరమాద్భుతము. వేదములు నీ మహోజ్జ్వల ప్రతిభ నెరుగలేవు. మేమేమి గ్రహింపగలము? ఈ విష్ణువు శిరము కనబడకపోవుట నీకు తెలియదా? మధువైరి బలమెంతటిదో తెలిసికొన గోరుచున్నావా? హరి యందే దేని దోషమున్నదా? అతడు నీపాదములనే కొలుచువాడు. విశ్వమాతా! ఈ హరి యెల్ల దేవతలలో చాల గొప్పవాడు. ఈతని విషయమునను పేక్షింప తగదు. యితని తల తెగిపడుట ఆశ్చర్యముగానున్నది. దుఃఖాకరమైయున్నది. చావు పుట్టుకల వలన దుఃఖమును తొలగించుటకు నీవే సమర్థురాలవు. మధు సూదనుని తల నతికించుటకేల జాగుచేయుచున్నావు? దేవతల యపరాధమునకు ప్రతి ఫలముగా హరి శిరస్సును త్రుంచితివా? దేవతల పాపముచే వీనితల తెగిపడి నదా? లేక బలగర్వమును హరించుటకు నీవే యితని తల త్రుంచితివా? ఇందుకు కారణ మూహింపలేకున్నాము. తలలేని దేవుని చూచి వినోదము నొంద దల చితివా? ఏదియేమైనను మాకు శ్రీహరి తల కనబడుటలేదు. లక్ష్మిపై కోపించి యిట్లు చేసితివా? ఆమె ముఖమునెట్టు చూడగలవు? నీయంశతో పుట్టిన లక్ష్మిని వేదను మును నీవు హరిని క్షమించవలయును గదా। కనుక నీవిపుడీతనికి తల నను గ్రహింపుము తల్లీ!

శ్లో॥ **ఏతే సురాస్త్వాంసతతం నమంతి కార్యేషు ముఖ్యాః ప్రథితప్రభావాః**
శోకార్ణవాత్తారయ దేవి దేవానుత్థాప్య దేవం సకలాధినాథమ్ ।
మూర్ధాగతః క్వాంబహరేర్న విద్మోనాన్యోస్త్యుపాయఃఖలు జీవనేఽద్య
యథాసుధా జీవనకర్మదక్షా తథాజగజ్జీవితదాఽసిదేవి!

స్తోత్రభావము:- ఈ దేవత లెల్లప్పుడు నీకు నమస్కరించుచుందురు. లోకనాథు డైన శ్రీహరిని లేపి దేవతలను దుఃఖ సముద్రము నుండి దాటింపుము విష్ణువు తల యెక్కడ పడెనో తెలియుటలేదు. అతడు జీవించుటకు ఉపాయమేదియు లేదు. దేవతలకు జీవనమొసగు దివ్యామృతమూర్తిని నీవే కదా! యని వేదములు దేవతలతోబాటు దేవి స్తుతించినవి. అంతట సూతుడిట్లనెను. ఈ స్తోత్రమును వినిదేవి పరమానందము నొందెను. అప్పుడు ఆ శరీరవాణి యిట్లు పలికెను. "దేవతలారా! చింతింపవలదు. మీరుస్తిమితముగా నుండుడు. వేదముల స్తోత్రము నకు సంతసించితిని. ఎవడీ నా స్తోత్రమును భక్తితో చదువునో అతడు అన్ని కోరికలను పొందగలడు. ఈ స్తోత్రమును విన్నవాడు దుఃఖము

తొలగి సుఖించును. వేదములు పలికిన యీ స్తోత్రము వేదసమానము" ఈహరిశిరస్సు తెగుటకు కారణ చెప్పుచున్నాను వినుడు. ఒకప్పుడు విష్ణువు తన ప్రక్కనున్న ప్రియురాలి ముఖమును చూచి నవ్వెను. ఆమె కోపించి నీ తలతెగిపడుగాక యని శపించినది. పూర్వము మహావీరుడగు "హయగ్రీవు"డను రాక్షసుడుండెను. అతడు సరస్వతీ నదీతీరమున ఘోరమగు తపమొనర్చెను. నేనాతనికి ప్రత్యక్షమై వరమును కోరు కొమ్మంటిని. అప్పుడాతడు నాకు మరణము లేకుండునట్లు చేయుమనెను. అప్పుడు నేను మరణమెవ్వనికేని తప్పదు నీకిష్టమైన మరియొక వరము కోరు కొనుమనగా నాదైత్యుడు గుఱ్ఱము ముఖము కలవాని వలననే నాకు మరణము సంభవించునట్లు వరమిమ్మనెను.

అప్పుడు నేను నీవింటికి వెళ్లి సుఖముగా రాజ్యము చేసికొనుమని పలికి అంతర్ధానము చెందితిని. ఆ దానవుడు యింటికి వెళ్ళి వరగర్వితుడై మునులను బాధింపనారంభిం చెను. అతనిని చంపువాడెవ్వడును లేడు. కనుక బ్రహ్మ గుఱ్ఱము తలను తెచ్చి విష్ణువున కతికించును. విష్ణువు హయగ్రీవుడై ఆదైతేయుని సంహ రింపగలడు. దేవతలకు మేలు చేయగలడు. అని దేవి దేవతలకు చెప్పి యూర కొనెను. అంతట దేవతలు సంతోషించి దేవశిల్పిని ప్రేరేపింపగా నాతడు గుఱ్ఱము తలను నరికి విష్ణువు శరీరమునకు అతికించెను. ఈ విధముగావిష్ణువు హయగ్రీవు డయ్యెను. కొంతకాలము పిమ్మట మదగర్వితుడైన అరక్కసి హయగ్రీవ భగవాను నిచే యుద్ధమున చంపబడెను. ఈ శుభమైన కథను విన్న మానవులు సమస్త దుఃఖములు నశించి సర్వసంపదల నొంది సుఖింతురు. మునులు మధుకైటభవ వృత్తాంతము వివరముగా చెప్పుమని సూతుని ప్రశ్నింపగా నాతడిట్లు చెప్పెను.

మధుకైటభుల యుద్ధ ప్రయత్నములు

పూర్వము ప్రపంచమంతయు జలమయము కాగా శేషశయ్యపై విష్ణువు నిద్రింపగా వాని చెవిగూలి నుండి బలవంతులైన మధుకైటభులను రాక్షసులిరువురు పుట్టి పెరిగి సముద్రజలములో క్రీడించుచు నిట్లు విచారించిరి. ఈ నీటికి ఆధార మేమి? ఇంతనీ రెట్లు పుట్టెను? మనమిరువుర నీటిలో నెట్లు మునిగియుంటిమి? మనలను పుట్టించినవాడెవడు? ఆతడెక్కడున్నాడు? ఎంతగా నాలోచించినను తెలియుటలేదు" అని విచారించిరి చివరకు కైటభుడు మధువుతో నిట్లనెను. అన్నా! మన మీ జలమందుండుట ఒక మహాశక్తి కారణము కావచ్చు. ఆశక్తి మహాబలము గలదని నాయభిప్రాయము. ఈ మహాజలమునకంతకు ఆమెయే

ఆధారము. ఆశక్తియే మనకు మూలాధారము కావచ్చు. అని యిట్లు వారు తలచుచున్న సమయమున ఆకాశ మునుండి వాగ్బీజరూపమగు ధ్వని వినబడెను. అంతలో ఆకాశమున నొక మెరుపు కనబడెను. వారా ధ్వనిని మంత్రముగా భావించి జితేంద్రియులై వేయి సంవత్సరములు తపమొనర్చిరి. అప్పుడు దేవి అశరీర వాక్కుతో ఓ దానవులారా! మీ తపస్సుకు సంతసించితిని. మీ కోరికను తెలుపుడు. తప్పక దానిని నెరవేర్చెదనని పలికెను. అప్పుడు దానవులు తాము కోరినప్పుడు మరణించుట్లు వరమడిగిరి. దేవి యట్లేయని వారికి వరమిచ్చినది. కొంతకాలము నకు పద్మమందు బ్రహ్మవారికి కనబడెను. వారాతనితో నీవు మాతో యుద్ధమొన ర్చుము లేదా వేరొకచోటకు పొమ్ము అని పలికిరి. బలవంతులగు వారిని చూచి బ్రహ్మ చింతాక్రాంతుడయ్యెను. ఆలోచించి జనార్ధనుడు నాబాధలను తొలగింప గలవాడు. అని తలచి వానిని నిద్ర నుండి మేల్కొలుపుటకు నారాయణు నిట్లు స్తుతించెను.

ఓ శ్రీహరీ! మాధవా! సర్వాంతర్యామీ! లోకసృష్ట్యంతకరా! మధుకైటభులు నన్ను చంప తలపెట్టినారు. నీవఖిలాధారుడవు కదా! నీకీ విషయము తెలియుట లేదా? అని యెన్ని విధముల స్తుతించి ప్రార్థించినను వాసుదేవుడు మేల్కొన కుండగా తన మనస్సులోనిట్లు తలచెను. ఈదామోదరుడు మహాశక్తికి లోబడి మేల్కొనుటలేదు. ఇప్పుడు నేనేమి చేయుదును? అని యాలోచించి ఆ మహాశక్తియే నన్ను రక్షింప సమర్థురాల నిశ్చయిం చి యామెనే స్తుతించెదను. అప్పుడు హరి మేల్కొని నా శత్రువుతో యుద్ధము చేయగలడు. అని విష్ణు నాశ్రయించి యున్న యోగనిద్ర నిట్లు స్తుతించెను.

విష్ణు ప్రబోధము

శ్లో॥ దేవిత్వమస్య జగతఃకిలకారణం హిజ్ఞాతం మయా సకల వేదవ చోభిరంబ।
యద్విష్ణు రస్యఖిలలోక వివేకకర్తా నిద్రావశంచగమితఃపురుషోత్తమోఽద్య॥

స్తోత్ర భావము:- ఓ దేవీ! ఈసర్వ ప్రపంచమునకు నీవే కారణమని సమస్త వేదములు చెప్పుచున్నవి. ఓ తల్లీ అట్లు కానిచో సమస్త విజ్ఞానమును ప్రసాదించు పురుషోత్త ముడు నేడు నిద్రకు వశుడైయుండుటేమి? యని స్తుతించెను. దేవి వెంటనే నారాయణుని శరీరమునుండి వెడలి యతని చెంత నిలుచుండెను. ఇట్లు పరదేవత యగు యోగ నిద్రదనుజులనాశమునకు తేజోనిధియగు విష్ణుమూర్తి శరీరము నుండి తొలగినది. అప్పుడు గోందుడు కొంచము మెల్లగా కదలెను. అతి కనుగొని బ్రహ్మ పరమానందభరితుడాయ్యెను.

సర్వశక్తి స్వరూపిణి ఆరాధ్యదేవత యనుట

ఋషులు సూతమహర్షి నిట్లు ప్రశ్నించిరి. ఓమహానుభావా! పండితులు వేద శాస్త్రపురాణముల అధారముతో బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ముగ్గురును పురాతన దేవతలని నిశ్చయించినారు. ఈ ముగ్గురికంటె గొప్ప దైవములేదని నిర్ణయించిరి. బ్రహ్మలోకములను సృష్టించువాడు. విష్ణువు రక్షించువాడు, రుద్రుడు లయ మొన ర్చువాడని పురాణములలో నిశ్చయింపబడినది. అయితే ఈ ముగ్గురును ఒకే మూర్తి యొక్క భిన్నభిన్న రూపములుగా గ్రహింపవలెను. ఈ ముగ్గురిలో విష్ణువు శ్రేష్ఠుడు, సమర్థుడును. ఇట్టివాడును యోగమాయకు వశుడై ఎట్లు నిద్రావస్థనందెను. అతని విజ్ఞానము స్వతంత్రత సమర్థత యెట్లు నశించినవి? ఏ శక్తిచే విష్ణువు పరాధీనుడయ్యెనో ఆ శక్తి యెవరు? ఎట్లు జన్మించినది? ఈ విషయము గొప్ప అశ్చర్యకరముగా ఉన్నది. ఈ సందేహమును వ్యాసమహర్షి శిష్యుడవగు నీవు జ్ఞానోపదేశముచే తొలగింపుము"అని శౌనకమహర్షి సూతమహర్షిని ప్రార్థిం చెను.

సూతమహర్షి శౌనకముని మాటలను విని యిట్లు పలికెను. ఏ ప్రమాణము చేతను గ్రహింప శక్యముకాని పరబ్రహ్మతత్త్వ మొకటి కలదు. ఆ తత్త్వమే ఆదిశక్తి. ఈశక్తి అంతటను వ్యాపించియున్నది. అగ్నియందు మండుటగాను, వాయువు నందు ప్రేరేపించునదిగాను. అనేక వస్తువు లందనేక రీతులుగ ప్రకాశించుచున్నది. ఈ శక్తిలేనిచో శివుడు శవమగును. లోకములో శక్తిలేని వస్తువు గౌరవింపబడదు. ఇట్లు అనేక స్థలములందు వేర్వేరుగ గోచరించు శక్తియే పరబ్రహ్మ స్వరూపము. బ్రహ్మాండమును సృష్టించునది. రక్షించునది చివరకు లయింప చేయునది కూడా శక్తియే. ఈ శక్తితో కూడియుండుట వలననే బ్రహ్మాదిదేవతలును ఆయాపనులను చేయగలుగుచున్నారు. ఆ శక్తిస్వరూపమే కారణములందు కార్యములందును మనకు ప్రత్యక్షముగా గోచరించుచున్నది. ఆశక్తి గుణరహిత మని, గుణసహితమని రెండు విధములుగా పండితులు చెప్పుచున్నారు.

ఈ విధముగా అంతటను మనకు కనిపించు శక్తియే పరబ్రహ్మ స్వరూపము. బుద్ధిమంతులగు పండితులామెనే ఉపాసించెదరు. విష్ణువునందలి శక్తి సాత్వికము, బ్రహ్మయందలి శక్తి రాజసము, అట్లే శివుని యందలి శక్తి తామసము. ఆయా శక్తుల ప్రభావముచేతనే హరిహర బ్రహ్మలు జగద్రక్షణాది కార్యములను నిర్వర్తింప గలుగుచున్నారు. కనుక శక్తియే ప్రపంచమును సృష్టించి పాలించి లయింపచేయు చున్నది. ఆ శక్తి ప్రభావముచేతనే దేవతలందరు తమతమ పనులను నిర్వర్తింప గలగుచున్నారు. ఆశక్తి గుణసహితమనియు గుణరహితమనియు రెండు

విధములు. కోరికలు కలవారు సగుణశక్తిని సేవించి కృతార్థులగుచున్నారు. వైరాగ్యము కలవారు నిర్గుణశక్తిని సేవించెదరు. ధర్మార్థకామ మోక్షముల నీయగలది ఆమెయే. జనులు అజ్ఞానముచేత ఆమెను గుర్తింపలేక పోవుచున్నారు. జ్ఞానులు కూడ ఇతరులకు అజ్ఞానమును బోధించు చున్నారు. కలి పురుషప్రభావము అట్టిది. బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు పరబ్రహ్మ స్వరూపమైన ఆశక్తినే ధ్యానించి తమతమ కోరికలను తీర్చుకొనుచున్నారు. వారు నిత్యము పరమాత్మ సర్వరూపయగుశక్తినే తమ మనస్సులలో ధ్యానించుచున్నారు. కనుక విద్వాంసులు నిశ్చయముగా నెల్లప్పుడును ఆ పరదేవతయగుశక్తి స్వరూపమును సేవింపవలెను.

ఓ మునిశ్రేష్ఠులారా! సమస్త శాస్త్రములయొక్క నిర్ణయమిదియేయని గ్రహించండి. ఈ సిద్ధాన్తమును నేను వ్యాసమహర్షి నుండి గ్రహించితిని. వ్యాసమహర్షి నారదుని నుండి తెలిసికొనెను. నారదుడు తన తండ్రియగు బ్రహ్మదేవుని వలన తెలిసి కొనెను. బ్రహ్మకీ సిద్ధాన్తమును విష్ణువు బోధించినాడు. ఇతరుల మాటలను నమ్మక పండితులైనవారు, శక్తియే ఆరాధింప తగిన పరతత్త్వమని నిశ్చయముగా గ్రహింపవలెను. అంతయెందుకు శక్తిలేనివాని అశక్తత మనకు ప్రత్యక్షముగా తెలియుచునేయున్నది. కనుక ప్రాణులందరును అన్ని ప్రాణులందును గల శక్తినే తెలిసికొనవలయును.

దేవి దయచే విష్ణువు మధుకైటభులను చంపుట

జగన్నాథుడు అగు శ్రీమహావిష్ణువు నిద్రతొలగగానే సమీపమున భయముతో వణకుచున్న బ్రహ్మదేవునిచూచి ఉరుమువలె గంభీరమగు వాక్కుతో ఓ బ్రహ్మా! తపస్సు చేయుట మాని నీవేల వచ్చితివి? చింతతో భయముతోను వ్యాకులమగు మనస్సు కలవాడవై యుంటివేల? అని ప్రశ్నించెను. అంత బ్రహ్మ, మహాత్మా! నీ చెవిలోని మాలిన్యమునుండి పుట్టిన మధుకైటభులను రాక్షసులు ఘోరాకారములతో నన్ను చంపుటకై వచ్చిరి. వారిని చూచి భయపడి నీవద్దకు వచ్చితిని. నన్ను రక్షింపుమని వేడుకొనెను.

అంతట శ్రీమహావిష్ణువు ఓ బ్రహ్మ నీవు నిర్భయముగా నుండుము. యుద్ధము చేయదలచి ఎవతో సిద్ధపడిన వారిద్దరినీ నేను చంపెదను. అని విష్ణుమూర్తి పలుకుచుండగనే బ్రహ్మను వెదకుచూ మదోన్మత్తులైన ఆ రాక్షసులిద్దరు అచటకు వచ్చిరి. మఱియు నీవు మాకు భయపడి పారిపోయి యీతని దగ్గరకు వచ్చితివా? ఇతడు చూచుచుండగనే నిన్ను చంపుదుము. తరువాత ఇతనిని కూడ చంపుదుము. కనుక నీవిపుడు మాతో యుద్ధము చేయుము లేదా మాకు దాసుడనని పలుకుము

అని వారు పలికిరి. ఆ మాటలువిని విష్ణువు 'ఓ రాక్షసులారా! నాతో యుద్ధమును చేయుడు. మదించి యున్న మిమ్ములను చంపివైచెదను. పట్టుదల ఉన్నచోరండు' అని వారితో పలికెను. ఆ మాటలు విని రాక్షసులిద్దరును నీటియందుండియే యుద్ధమునకు సిద్ధపడిరి. ఆ రాక్షసులిద్దరిలో మధువనువాడు కోపముతో శ్రీ మహావిష్ణువుతో యుద్ధము చేయుటకు వచ్చెను. కైటభుడు చూచుచూ నుండెను. మదించినమల్లులవలె వారిరువును యుద్ధము చేసిరి. మధువు అలసిపోగా కైటభుడు యుద్ధమునకు వచ్చెను.

ఈ విధముగా ఒకరి తర్వాత నింకొకరుగా విష్ణువుతో చాలకాలము యుద్ధమును చేసిరి. బ్రహ్మ ప్రేక్షకుడుగా నుండెను. ఐదువేల సంవత్సరములు విష్ణువు ఆ ఇద్దరు రాక్షసులతో యుద్ధముచేసి అలసిపోయెను. మరియు రాక్షసులు యుద్ధోత్సాహముతో నుండగా, నేనిట్లలసిపోతినేమి? అని చింతించుచుండగా మదించి యున్న ఆ రాక్షసు లిద్దరును గంభీరమగు కంఠధ్వనితో నీవు యుద్ధము చేయ లేనిచో మాకు దాసుడనని చెప్పుము. చేయగలిగినచో యుద్ధమును చేయుము. ముందు నిన్ను చంపి తర్వాత నీ నాల్గుముఖాలవానిని గూడ చంపుదుము అని పలికిరి. ఆ మాటలువిని విష్ణువు ఓ రాక్షసులారా! వీరులు శ్రమపడి యున్న వారితో యుద్ధము చేయరు. ఐదువేల సంవత్సరములు మీతో యుద్ధము చేసితిని. నేను ఒకడనే, మీరిద్దరు. నేను కొంచెము విశ్రమించి మీతో యుద్ధము చేయుదును అని పలుకగా వారిద్దరును మరల యుద్ధము చేయవలయునని కొంతదూరములో కూర్చుండిరి. విష్ణుమూర్తి వారు మరణించక పోవుటకు కారణ మేమి?అని ఆలోచించి 'విద్యా స్వరూపురాలు, అన్ని కోకెలను తీర్చునట్టి శక్తి స్వరూపమును శరణువేడెదను. ఆమె యనుగ్రహము లేనిచో నేపనియు నెరవేరదు'అని ఆలోచించుచుండగా ఆకాశమందు మంగళ స్వరూపురాలగు శక్తి కనిపించెను. వెంటనే యోగవేత్తయగు శ్రీమహావిష్ణువు చేతులు జోడించి ఆ రాక్షసుల సంహరించుటకై భువనేశ్వరియైన శక్తి స్వరూపమును వరములనిచ్చు నట్టి యామెనిట్లు స్తుతించెను.

శ్లో॥ నమోదేవి! మహామాయే! సృష్టిసంహారకారిణి ।
అనాదినిధనేచండి భుక్తి ముక్తిప్రదే శివే ॥
నతే రూపం విజానామి సగుణం నిర్గుణం తథా ।
చరితానికుతోదేవి! సంఖ్యాతీతాని యానితే ॥

మహామాయా స్వరూపురాలవు, సృష్టిని లయమును చేయుదానవు, చావు పుట్టుకలు లేనిదానివి. దుర్మార్గులపై కోపించుదానవు ఇహపరలోకము లందు

నానందము నిచ్చుదానవు మంగళ స్వరూపురాలవు అగు ఓ దేవీ! నీకు నమస్కారము. నీ సగుణరూపమునుగాని, నిర్గుణరూపమును గాని నేనెరుగను. లెక్కకు మించిన నీచరిత్రల విషయమిక చెప్పనేల వినుము. నేను నిద్రకు వశమగుటచేతనే నీ ప్రభావమును గుర్తించితిని. నీవు నన్ను విడిచిపెట్టగనే నేను మేల్కొని అనేక విధముల యుద్ధము చేసితిని. అలసిపోయినవాడనై నీ నుండి ఆరాక్షసులు వరములను పొందిరని అలసటలేకుండా వారు యుద్ధము చేయుటచే గ్రహించాను. కనుక రక్షకురాలవైనతిని. నిన్ను శరణువేడుచున్నాను. యుద్ధముతో అలసి దుఃఖపడుచున్న నాకు సహాయము చేయవలసినదిగా ప్రార్థించుచుంటిని. వరములను పొంది మదించియున్న ఆ రాక్షసులు నన్ను చంపుటకు సిద్ధముగా నున్నారు. ఇప్పుడు నేనేమి చేయుదును? ఎక్కడకు పోదును?

అని ప్రార్థింపగా ఆ దేవి చిరునవ్వుతో తనకు నమస్కరించుచు నిలుచున్న జగన్నాథుడగు విష్ణువును మరల యుద్ధము చేయుమని ప్రోత్సహించుచూ క్రీగంటి చూపులతో ఆ రాక్షసులను మోహింపజేసెను. అందుకు సంతోషించి విష్ణుమూర్తి మరల యుద్ధమునకు సిద్ధమయ్యెను. అప్పుడా రాక్షసులు సంతోషముతో నాల్గు భుజములు కలవాడా! స్థిరముగా నిలిచి యుద్ధము చేయుమని హెచ్చరించిరి. కొంతసేపు యుద్ధము చేసి అశక్తుడగు విష్ణుమూర్తి దీనముగా దేవివైపు చూచెను. అంతట ఆమె రాక్షసులవైపు చూచి నవ్వుచు తనచూపులతో వారిని మోహింపచేసినది. అప్పుడు విష్ణువు, మోహములో పడిన ఆ రాక్షసులతో ఓ రాక్షసులారా! మీ యుద్ధము నాకు మిక్కిలి సంతోషము కలిగించినది. కనుక మీరు కోరిన వరము నిచ్చెదనని పలికెను. అంతట అభిమానవంతులైన ఆ రాక్షసులు ఓయీ! మేము యాచకులము కాము. నీవే కావలసిన వరమును కోరుకొమ్ము అని పలుకగానే నాచేతిలో మీరిద్దరును చావవలయును, యిదియే నాకు కావలసిన వరమని విష్ణువు పలుకగానే నీరులేని ప్రదేశము చూపినచో అక్కడ నీ చేతిలో మరణింతుమని వారు పలికిరి. అప్పుడు శ్రీమహా విష్ణువు తన తొడలను మిక్కిలి విశాలముగా పెంచి అక్కడ వారి నుంచి వారి శిరస్సులను చక్రాయుధముతో ఖండించెను. ఆ రాక్షసుల క్రొవ్వుతో సముద్రమంతయు వ్యాప్తమయ్యెను. అందువలన భూమికి "మేదిని" అని పేరు వచ్చినది. కావున మహా విద్యాస్వరూపురాలు మహామాయా స్వరూపిణి యగుశక్తియే అందరి చేతను సేవింపదగినది. ఆమెకంటె శ్రేష్ఠమగు వ్యక్తి ముల్లోకములందును లేదు. నిర్గుణశక్తిని కాని సగుణశక్తినిగాని అందరు పూజించవలెను. ఇదియే వేదశాస్త్ర నిర్ణయము.

ఋషుల సందేహము

ముకుందుడు నిద్రనుండి మేల్కొనిన విధమును విని ఋషులిట్లు సూతుని ప్రశ్నించిరి. ఓ మహానుభావా! మాకొక మహా సందేహము కలిగినది. అదియే మనగా పండితులు వేదశాస్త్రపురాణముల ద్వారా బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు ముగ్గురును సనాతన దేవతలని నిశ్చయించి చెప్పుచున్నారు. ఆ ముగ్గురికంటె పరదైవము వేరొకటిలేదని వారి నిర్ణయము. బ్రహ్మ సృష్టికర్తయని రక్షకుడు నారాయణుడని శివుడు సంహారకుడని వినుచున్నాము. వారి ముప్పురిలో మాధవుడు శ్రేష్ఠుడు విష్ణుమూర్తితో సమానుడు వేరొకలేడు. అతడు యోగమాయచే నిద్రకు వశుడగుట యెట్లు సంభవించును? అతని విజ్ఞానమేమైనది? ఇది మాకు కలిగి సందేహము విష్ణువును జయించిన ఆశక్తి ఎవరు? దేనినుండి పుట్టినది? పరమాత్మయగు వాసుదేవుడు కూడ నిద్రకు పరాధీనుడగుట యెట్లు సంభవము? ఇది ఆశ్చర్యకరమైన సందేహము మహాబుద్ధిశాలినగు సూతమహర్షీ మా యీ సంశయమును తొలగింపవలసినదిగా వ్యాసశిష్యుడవగు నిన్ను ప్రార్థించుచున్నాము. అని ప్రశ్నించిరి!

వ్యాసుడు పుత్రార్థియై శివుని గూర్చి తపమొనర్చుట

ఋషులు సూతమహర్షి నిట్లు ప్రశ్నించిరి సూతమహర్షీ! వ్యాసుడు దేవీ భాగవతమును రచించి కుమారుడైన శుకునకుపదేశించెనని చెప్పితిని. వ్యాసునకు శుకమహర్షి పుత్రుడుగా జన్మించిన వృత్తాంతమును వినగోరుచున్నామని యడుగగా సూతుడిట్లు చెప్పదొడగెను. పుత్రార్థియైన వ్యాసుడు నారదుని నుండి వాగ్బీజ మంత్రము నుపదేశము పొంది నిరాహారియై నూరేండ్లు తపమొనర్చెను. అతని తపోగ్నికి దేవేంద్రుడు గడగడలాడెను. రుద్రుడాతని చూచి నీవేల భయపడుచుంటివని యడిగెను. దేవేంద్రుడు వ్యాసుడేమి కోరి తపస్సు చేయుచున్నాడో తెలియక భయపడుచుంటిని. అతని కోరిక తెలిసినచో నాకు వచింపుడని రుద్రునడుగగా నాతడు నన్ను గూర్చి పుత్రసంతతి కొరకు వ్యాసుడు తపసు చేయుచున్నాడు. అతనికిప్పుడు పుత్రుడు కలుగునట్లు వరమిచ్చెదనని పలికి వ్యాసుని సమీపించి వ్యాసమునీ! లెమ్ము నీకు జ్ఞానియు తేజోనిధియగు పుత్రుడు జన్మించుగాక యని పలుకగా వ్యాసుడు శివునకు నమస్కరించి తన యాశ్రమమునకు వెళ్ళెను.

అప్పుడు స్త్రీ సంబంధము లేని నాకు పుత్రుడెట్లు కలుగునని చింతించుచుండగా ఘృతాచి యను దేవకాంత ఆకాశములో కనబడెను. ఆమెను చూచి కామము పెల్లుబుకగా నేనీమె యందాసక్తి చూపినచో పూర్వము

పురూరవుడు ఊర్వశిని కామించి చివర కామెచే తిరస్కరింపబడెను. అట్లే యగుదు నేమో యని తలచెనని చెప్పగా ఋషులు పురూరవుడెవరు? ఊర్వశి యెవరు? అతడెట్లు కష్టాలపాలయ్యెను? ఆ కథ మాకు వినిపింపుమని సూతుని కోరిరి. అప్పుడు సూతుడిట్లనెను.

బుధుని జన్మవృత్తాంతము

బృహస్పతి దేవతలకు గురువు. ఆతని భార్య తార. ఆమె మంచి సౌందర్యవతి పడుచుతనమందున్నది. ఆమె యజ్ఞము చేయుచున్న చంద్రుని యింటికి వెళ్ళి ఆతని కంటబడెను. ఆమెను చూడగనే చంద్రుడు కామాతురుడయ్యెను. ఆమెయు నాతని కాంచికామ పీడితయయ్యెను. వారిరువురును యథేచ్ఛగా క్రీడించుచు నెన్నియో దినములు గడిపిరి. ఈ విషయము తెలిసి బృహస్పతి తారను తీసికొని రమ్మని తన శిష్యుని పంపెను. చంద్రునకు వశురాలై ఆమె రాలేదు. ఎన్నిమార్లు శిష్యులను పంపినను ఆమె రాకపోవుటచే తానే చంద్రునింటికి వెళ్ళి యాతనిని నిందించి యిప్పుడైన నాభార్యను పంపుమనగా చంద్రుడు బ్రాహ్మణుడు కోపముచే పూజింపరాని వాడగును. ఆమె కామసుఖార్థిని. కొన్నాళ్ళిచటనే యుండి మీ యింటికి రాగలదు. అని పలుకగా నచటనే నిలిచి కోపము మితిమీరగా నిన్ను శపించి భస్మము చేయుదునని బృహస్పతి మండిపడెను.

అంతట చంద్రుడీమె నాకు తగినదిగాని నీకు తగినదికాదు. నేనీమెను విడు వను. నీచేతనైన పని చేసి కొనుమని పలుకగా బృహస్పతి దుఃఖించి వేగమే యింద్రుని వద్దకేగెను. అతడర్ఘ్య పాద్యాదులతో పూజించెను. దీనుడుగా నున్న గురువును చూచి యింద్రుడు మహాభాగా నీవు శోకార్తుడవైతివేల? నీచింతయేమి? నీవు నా గురుడవు. లోకపాలకులు దేవసైన్యము నీ యధీనము బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నీకు సాయమొనర్చెదరు. మీకష్టమును వేగవెల్లడింపుడని యడుగగా సురగురు నిట్లనెను. నా భార్యయైన తారను చంద్రుడు వశపరచుకొని మరల నాకిచ్చుటలేదు. నీవే నాకు దిక్కు, నేను మిక్కిలి కష్టపడుచున్నాను. నాకీ విషయమున సాయమొ నర్చుము'అని అప్పుడింద్రుడిట్లనెను. ధర్మజ్ఞా! మహామతీ! నీవింక దుఃఖింపకుము నేను నీదాసుడను- నీకాంతను తెప్పించి యిచ్చెదను.

ఇప్పుడే దూతను పంపెదను. అతడు నీభార్య నీయనిచో సైన్యముతో నాతనిపై యుద్ధమునకు వెడలెదను" అని యిట్లు సురాచార్యు నోదార్చి చంద్రుని వద్దకు దూతను పంపెను. దూత మాటలు విని చంద్రుడు ఈమెకు నాయందే అనురాగ మున్నది. ఇట్టి దానిని విడిచిపెట్టుట న్యాయము కాదు. నీవు పురందరునితో

నేను తారను విడువను నీకు చేతనైన పని చేసికొనుమని చెప్పుము అని పంపి వైచెను. అంత పురుహూతుడు దూతమాటలు విని యుద్ధమునకు సిద్ధమయ్యెను. శుక్రాచార్యులు చంద్రునకు మంత్రశక్తితో సాయమొనర్చుదుననెను. శివుడు బృహస్పతి కండగా నిలిచెను. రాక్షసులు కూడ చంద్రునకు సహాయుద్ధమున పాల్గొనిరి. ఘోరమైన దేవదానవ సంగ్రామము చాల సంవత్సరములు జరిగినది.

అప్పుడు బ్రహ్మదేవుడు శుక్రుని మందలించి చంద్రుని సమాధాన పరచి యప్పటికే గర్భవతియైన సురాచార్యుని భార్యను వాని కప్పగించునట్లు చేసెను. అంతట బృహస్పతి తన భార్యను స్వీకరించి తన యింటికి వెళ్ళెను. దేవదానవులు తమతమ నివాసములకు వెడలిపోయిరి. కొన్ని దినములకు తార కుమారుని కనెను. ఆతడు చంద్రుని పోలియుండెను. బృహస్పతి శిశువునకు జాతకర్మాదుల నిర్వర్తించెను. అంతట చంద్రుడు నా కుమారునకు నీవు జాతకర్మాదు వేల చేసితివని దూతచే నడిగించెను. అప్పుడు బృహస్పతి నా కుమారుడే యని సమాధానమిచ్చెను. ఆ వివాదమును మాన్పుటకు పరమేష్ఠి మరల వచ్చి రహస్య ముగా తార నడిగి వాస్తము తెలిసికొని శిశువును చంద్రునకు అప్పగించెను. చంద్రుడు సంతోషముతో కుమారునెత్తికొని యాతనికి "బుధు"డని పేరు పెట్టి తన యింటికి చేరెను. బ్రహ్మ తన లోకమున కరిగెను. ఇది బుధుని జన్మవృత్తము.

సుద్యుమ్నుస్తుతి -పురూరవూ జననము

బుధునకిల యనుకాంతయందు పురూరవుడు జన్మించెను. అతడు ధర్మా త్ముడు. వాని జన్మ వృత్తాంతము వినుడు! పూర్వము సుద్యుమ్నుడను రాజు కలడు. అతడు సత్యవాది జితేంద్రియుడును. ఒకనాడు గుఱ్ఱము నెక్కి అతడు ధనుర్బాణములు చేతబట్టి వేటకు వెళ్ళెను. అనేక పశువులను సంహరించుచు కుమారవనమున ప్రవేశించెను. సుందరమైన యావనమందు సుద్యుమ్నుడు స్వేచ్ఛగా విహరించుచు సంతసించుచుండెను. అప్పుడు అకస్మాత్తుగా స్త్రీ యయ్యెను. అతని మగ గుఱ్ఱముకూడ ఆడ గుఱ్ఱమయ్యెను. అందుకాతడు మిక్కిలి బాధచెందెను. అని చెప్పగనే ఋషులు సుద్యుమ్నుడు స్త్రీగా నేలమారెను. కుమారవ వనమందాతడేల విహరించెను? పిమ్మట నతడేమి చేసెను? వివర ముగా నంతయు తెలుపుమని కోరగా సూతుడిట్లనెను.

పూర్వము సనకాది యోగి పుంగవులు శివుని దర్శించుటకు వెళ్ళిరి. అప్పుడు శివుడు పార్వతితో క్రీడించుచుండెను. గిరిజ ఋషులను చూచి తలవంచుకొని శివుని ఒడినుండి దిగి వణుకుచున్న శరీరముతో నిలుచుండెను. ఋషులు పార్వతి

శివులను చూచి అప్రదేశము విడిచి నారాయణాశ్రమమునకు చేరిరి. శివుడు పార్వతి సిగ్గుచే బాధపడుచుండుటను చూచి నేటినుండి ఎవడైన నీ వనమున ప్రవేశించినచో నాతడు స్త్రీయగునని శాపమిచ్చెను. సుద్యుమ్నుడీ శాపము నెరుగక వనమందు ప్రవేశించి స్త్రీ యయ్యెను. ఆ స్త్రీగా మారిన వానికే "ఇల" యని పేరు బుధుడాయిలను చూచి కామించెను. ఇలయునతని ప్రేమించెను. వారిరువురకు పురూరవుడు జన్మించెను.

పిమ్మట ఇల వసిష్ఠుని ప్రార్థింపగా నాతడు ఇలకు పురుషరూపము కోరి శివుని గూర్చి తపస్సు చేసెను. శివుడు తన మాట యసత్యము కాకుండునట్లు ఒక నెల పురుష రూపము, మరొక నెల స్త్రీ రూపముతో నుండునట్లు నుగ్రహించెను. స్త్రీగా నున్నప్పుడు అంతఃపురమందే యుండుటవలన ప్రజలు సంతోషపడకుండిరి. కొంత కాలమునకు తన కుమారుడగు పురూరవుని రాజుగా చేసి తానరణ్యమునకు వెళ్ళెను. రమణీయమైన యావనమందు రాజు నారదుని వలన దేవీమంత్రము నుపదేశము పొంది భక్తిశ్రద్ధలతో నిరంతరము జపించుచుండెను. అంతట దేవి ప్రసన్నయై ఆతనికి సాక్షాత్కరించెను. ఆ రూపము చూచి రాజానంద భరితుడై యిట్లు స్తుతించెను.

శ్లో॥ దివ్యంచతే భగవతి ప్రథితం స్వరూపం
దృష్టంమయా సకలలోకహితానురూపమ్ ॥
వందేత్వ దంఘ్రికమలం సురసంఘసేవ్యం
కామప్రదం జనని చాపి విముక్తి దంచ॥
కోనేత్తి తేంబభువిమర్త్య తనుర్నికామం
ముహ్యాం తియత్రమున యశ్చసురాశ్చసర్వే
ఐశ్వర్యమేత దఖిలంకృపణేదయాంచ
దృష్ట్వైవ దేవి సకలంకిలవిస్మయోమే॥
శంభుర్హరిఃకమలజోమఘువారవిశ్చ విత్తేశవహ్నివరుణాః
పవనశ్చసోమః జానంతినైవవసవోపితవ
ప్రభావంబుధ్యేత్కంథతవగుణానగుణోమనుష్యః॥
జానాతివిష్ణురమితద్యుతి రంబసాక్షాత్
త్వాంసాత్వికీ ముదది జాంసకలార్థదాంచ
కోరాజసీంహర ఉమాంకిలతామ సీంత్వాం
వేదాంబకేనతు పునఃఖలు నిర్గుణాంత్వామ్॥

క్వాహంసుమందమతిరప్రతిప్రభావః
క్వాయంతవాతిని పుణోమయి సుప్రసాదః॥
జానేభవాని! చరితం కరుణాసమేతం
యత్సేవకాంశ్చదయ సేత్వయిభావయుక్తాన్ ॥
వృతస్త్వయాహరి రసావనజేశయాపినైవా చరత్యపిముదంమధుసూదనశ్చ॥
షాఢేతవాది పురుషః కిలపావకేనకృత్వాకరేణచకరోతి శుభే పవిత్రే॥
వాంఛత్యహెలా హరిరశోక ఇవాతి కామం
పాదాహతిం ప్రముదితః పురుషఃపురాణః॥
త్వంతంకరోషిరుషితా ప్రణతంచ పాదేదృష్ట్వాపతిం సకలదేవనుతం స్మరార్తమ్॥
వక్షస్థలేవససిదేవి సదైవతస్య పర్యంకవత్సుచరితే విపులేతి శాంతే॥
సౌదామనీవసుఘనే సువిభూషితేచకింతే వాహనమసౌ జగదీశ్వర్యోపి॥
త్వంచేజ్జహాసి మధుసూదన మంబ!
కోపాన్నైవార్చితోపిసభవేత్కిలశక్తిహీనః॥
ప్రత్యక్షమేవ పురుషం స్వజనాస్త్యజంతి
శాంతం శ్రియోజితమతీవగుణైర్వియుక్తం
బ్రహ్మాదయస్సురగణాః సతుకింయువత్యో
యేత్వత్పదాంబుజ మహర్నిశమాశ్రయంతే
మన్యేత్వయైన విహితాఃఖలు తేపు మాంసః
కింవర్ణయామితవశక్తి మనంతవీర్యే॥
త్వం నాపుమాన్నచపుమాన్ ఇతిమే
వికల్పోయాకాసిదేవిసగుణానను నిర్గుణావా॥
తాంత్వాం నమామి సతతంకిలభావయుక్తో
వాంఛామిభక్తి మచలాంత్వయి మాతరంతే॥
ఇతి స్తుత్వామహీపాలోజగామ శరణంతదా
పరితుష్టాదదౌ దేవీతత్రసాయుజ్యమాత్మని॥
సుద్యుమ్నస్తుతతః ప్రాప్తఃపదం పరమకంస్థిరం
తస్యాదేవ్యా ప్రసాదేన మునీనామపి దుర్లభం॥

స్తోత్ర భావము :- సమస్తలోకములకు మేలు కలిగించు నీ రూపదర్శనభాగ్యము నాకు నేటికి ప్రాప్తించినది. నీ పాదములే నాకు రక్షకములు. అవి కోరికలనిచ్చునవి. ముక్తి నిచ్చునవియును నీ దివ్యరూపము సురలను, మునులను సమోహింప

జేయును. సామాన్యమానవుడెట్లెరుగ గలడు. నీ మహిమ తెలియరానిది. ఈ దీనునిపై దలచియున్న సంపదల నిచ్చితివి. ఇదంతయు నాకాశ్చర్యము కలిగించు చున్నది. హరి హరబ్రహ్మేంద్రులెవ్వరును నీ ప్రభావమెరుగజాలరు. విష్ణువు కూడ నిన్ను లక్ష్మిగనే తలచును. బ్రహ్మరుద్రుడు కూడ నీ నిర్గుణ స్వరూపము నెరుగ జాలరు. నీ మహోజ్జ్వల చరిత్రను నీ దయామృతసాగరముగా భావింతును. ఓ లక్ష్మీ నీవు హరిని వరించితివి. పురుషోత్తముడు నీచే పాదము లొత్తించు కొనుట తగదని నీపాదముల నొత్తుచుండును. అతడు నీ పాదతాడనమును కోరుకొనును. అతడు నీకు నమస్కరించినను నీవాతని పాదతాడన మొనర్తువు. నీవాతని వక్షస్థలముపై కాంతుల విరజిమ్ముచుందువు. నీవాతని విడిచినచో నాతడు శక్తి హీనుడగును. బ్రహ్మాది దేవతలు నీభవ్యపాద పద్మముల భజింతురు. వారే మణి ద్వీపము చేరి యువతులుగ మారుదురు. నీ దయచే మరల పురుషులగు చుందురు. నీవు స్త్రీ పురుషాది చిహ్నములు కలదానివి కావు. నిన్నే మ్రొక్కెదను. నీయందే నిశ్చల భక్తియున్న చాలును. ఈ ప్రకారము ఆరాజు స్తుతింపగనే శ్రీదేవీ ప్రసన్నురాలై అతనికి మోక్షము ప్రసాదించినది. అని సూతుడు ఋషులకు సుద్యుమ్నస్తుతిని వినిపించెను.

(ఊర్వశి పురూరవుల చరిత్ర)

పూరురవ ఉపాఖ్యానము

సుద్యుమ్నుడు స్వర్గస్థుడు కాగా పురూరవుడు ప్రతిష్ఠానపురమందు ప్రజారంజ కముగ రాజ్యము చేయుచుండెను. అతడు సర్వధర్మములు తెలిసినవాడు. సర్వ రాజగుణశోభితుడును. ఆతని రూపమును గుణములను విని ఊర్వశి వానిపై మోహము కలదాయెను. ఆమె రెండు గొఱ్ఱెలను పోషించుమని వానికి వప్పచెప్పెను. మఱియు నేయి మాత్రమే నాకాహారమని పలికి యా రాజుతో కలిసియుండెను. సంభోగ సమయమున తప్పనితర సమయమున దిగంబరునిగా నిన్ను చూడను. నా యీ నియమములకు భంగము వాటిల్లిన మరుక్షణమే నిన్ను విడిచి వెళ్ళెదనని చెప్పెను. పురూరవుడా నియమములకు అంగీకరించి యామెతో విహరించుచుం డెను. చాల సంవత్సరములామెతో గడపినను మోహము తగ్గక నిమిషమైన ఆమెను విడువక కాలము గడుపుచుండెను.

ఎంతకాలమైనను ఊర్వశి స్వర్గమునకు రానందున దేవేంద్రుడు రాజునింటగల గొఱ్ఱెల జంటను దొంగిలించి ఊర్వశిని కొనిరండని గంధర్వులను పంపెను.

గంధర్వులు కటికచీకటిలో రాజునింట ప్రవేశించిన గొఱ్ఱెల నపహరించి ఆకాశమున కెగురుచున్నప్పుడు గొఱ్ఱెలు అరచినవి. ఆ యరపులు తన గొఱ్ఱెలవేయని ఊర్వశి నా ప్రతిజ్ఞను భంగము చేసితివి.

కనుక నేను నిన్ను విడిచి వెళ్ళుచున్నానని యామె వెళ్ళుచుండగా పురూరవుడు దిగంబరుడుగా నామెను వెనుదగిలెను. ఊర్వశి దిగంబరుడగు రాజును చూచెను. గంధర్వులు గొఱ్ఱెలను విడిచి వెళ్ళిరి. ఊర్వశి తన నియమమును బట్టి రాజును విడిచి వెళ్ళిపోయెను. పురూరవుడు ఊర్వశిపై మక్కువతో దుఃఖించుచు దేశదేశములు తిరుగుచుండెను. కురుక్షేత్రమున మరల ఊర్వశి కనిపించెను. అప్పుడు రాజు కామార్తుడై దిక్కులేని వానివలె బోరున దుఃఖించెను. అంతట ఊర్వశి రాజా! నీవు మూఢుడవైతివి. నీ జ్ఞానమంతయునే మయ్యెను? స్త్రీలతో స్నేహముతోడేళ్ళ తో స్నేహమునకు తీసిపోదు. రాజు దొంగలను కాని, స్త్రీలనుగాని నమ్మియుండ రాదు. కావున నీవికనింటికి వెళ్ళి దిగులు మాని సుఖముగా నుండు మని యెంత చెప్పినను దేవవేశ్యపై వలపుచే శోకార్తుడాయెను. ఇది పురూరవుని సంక్షిప్త చరిత్రము అని సూతుడు మునులకు- మునులకు వివరించెను.

శుక్ర మహర్షి జన్మవృత్తాంతము

వ్యాసమహర్షి యిట్లు ఆలోచించుచుండగా ఘృతాచి తనను వ్యాసుడు శపించునేమో యని చిలుకరూపము దాల్చి అటనుండి వెడలిపోయెను. వ్యాసుడామె యందులగ్నమైన మనస్సుతో అరణిని మథించుచుండగా దానినుండి యుజ్జ్వల తేజస్సుగల కుమారుడు జన్మించెను. వ్యాసుడు పరమేశ్వరుని యనుగ్రహముగా నా బాలుని భావించి యత్యంతప్రేమతో గంగలో స్నానము చేయించగా దేవతలు పుష్పవర్షము కురిపించిరి. అంతరిక్షము నుండి శ్రీశుకుని కొరకు దివ్యకృష్ణాజినము దండకమండులువులు నేలపై పడినవి. వ్యాసుడతనికి ఉపనయన సంస్కార మొనర్చెను. శుకుడు బృహస్పతిని గురువుగా భావించి బ్రహ్మచర్యమును యథా విధిగ పాటించెను. వేదరహస్యముల నెల్ల గ్రహించి తండ్రి వద్దకు వచ్చెను. శుకుని చూచి వ్యాసుడు పరమానందభరితుడాయెను.

వ్యాసుడు కుమారునకు వివాహము చేయదలచి చక్కని మునికన్యను వధువుగా నిశ్చయించి శుకునితో ఓ మహామతీ! నీ విద్యాభ్యాసము పూర్తియైనది. ఇక చక్కగా గృహస్థుడవగుము దేవపితృయాగము లొనర్చుము నీవు గృహస్థుడవైనా కోర్కె తీర్చుము. నా తపస్సుకు ఫలముగా నీవు నాకయోనిజుడవై పుట్టితివి. నీకొఱకు నేను ఘోరతపస్సు చేసితిని. నీవు తండ్రినగు నా మాట పాలించుము.

అని పలుకగా విరక్తుడైన శుకుడు మహారక్తుడైన తండ్రితో ధర్మజ్ఞుడనైన మహామతీ! నేను శిష్యుడను నీవాజ్ఞాపించిన పని చేయుదునని బదులు పలికెను. అప్పుడు వ్యాసుడిట్లనెను. కుమారా! నీకై నేను నూరు సంవత్సరములు తపస్సు చేసితిని. రాజును ధనమడిగి తెచ్చి నీకిచ్చెదను. నీవు యౌవన సుఖముల ననుభవింపుము అని పలికెను.

శుకుని వైరాగ్యము - వ్యాసుడు శుకునకు శ్రీదేవీ భాగవతముపదేశించుట

ఈ మాట విని శుకుడు వివాహము చేసికొని స్త్రీకి వశుడై పుత్రదారాదులచే సంసారమున బంధింపడి యెన్నటికిని ముక్తి పొందని స్థితినాకేల? అయోనిజుడనైన నేను పునర్జన్మను కోరుటలేదు. నాకు గురువైన బృహస్పతి సంసారబద్ధుడై యుండుటచే అతని విడిచి నీవద్దకు వచ్చితిని. దుర్లభమైన మానవజన్మమెత్తి వేదశాస్త్రములు చదివి సంసారబద్ధుడైనచో ముక్తి నెవడు పొందును? నేను సంసారమునకు భయపడుచున్నాను. నాకు బ్రహ్మతత్త్వమును యోగశాస్త్రమును బోధింపుము. స్త్రీలు భోగములతో ధనవీర్యముల నపహరింతురు కుటిలవచనములచే మనస్సును హరింతురు. అట్టి స్త్రీ నెవడు కోరుకొనును. మూర్ఖుడే భార్యను కోరును అని పలికెను. వ్యాసుడు వాని మాటలకు చింతాగ్రస్తుడై దుఃఖించెను. శుకుడు విద్వాంసుడైన వ్యాసునకు కూడ మోహము కలిగించు నీమాయ యెంతగొప్పది? యని యాశ్చర్యపోయెను. హరిహరబ్రహ్మలను సైతము మోహపెట్టునట్టి మహాద్భుత మాయాశక్తిని శరణు వేడుచున్నాను. అని దేవిని ధ్యానించి తండ్రితో ఓ మహా మనిషీ! ఎల్లరకు తెలియజెప్పు నీవే సామాన్యునివలె దుఃఖపడుట సమంజసము కాదు అని పలుకగా వ్యాసుడు మహాభాగా! నీవు నేవ్రాసిన శ్రీ మహాభాగతము చదువుము అది బ్రహ్మ సమ్మితము. ఆ పురాణము నా మనస్సున కెంతో ఇష్టమైనది. ఆ భాగవతము వినినచో సదసద్వికము కలుగును. నీవు దానిని శ్రద్ధగా చదువుము అని శుకునకు చెప్పెను.

శ్రీ శుకుడు మిథిలకు వెళ్ళుట

జీవన్ముక్తుడునైయె రాజ్యపాలనమొనర్చుట విచిత్రమైన విషయము కనుక అట్టి జనకమహారాజును చూడు వేడుక కలుగుచున్నది. నా సందేహములు పోగొట్టుకొనుటకు మిథిలానగరమునకు వెళ్ళెదనని శుకుడు పలికి చేతులు జోడించి తండ్రి పాదమలకు నమస్కరించి నాకు ఆజనకుని చూడననుజ్ఞ నిమ్మని పలుకగా

వ్యాసుడు కుమారునికాగిట చేర్చుకొని నీకు కళ్యాణమగుగాక చిరంజీవివి కమ్ము తిరిగివత్తునని మాట యిచ్చి క్షేమముగ వెళ్ళిరమ్ము. నీవచటి నుండి యెక్కడకును వెళ్ళవద్దు. నీ ముఖమును చూడనిచో నాకు శాంతియుండదు. నాకు నీవు ప్రాణము లోని ప్రాణము. జనకుని చూచివచ్చి యిచటనే వేదాధ్యయనము చేయుచు సుఖముగా నుండుము అని పంపెను. శుకుడు తండ్రికి ప్రదక్షిణ నమస్కారము లొనర్చి త్వరగా బయలుదేరి మార్గమధ్యమున తాపసులను యోగులను వానప్రస్థులను శైవవైష్ణవ సౌరశాక్తమతస్థులను దర్శించుచు మూడేండ్లు ప్రయాణించి మిథిలా నగరమును చేరి సదాచార సంపన్నులను కళాసమృద్ధిని దర్శించెను. రాజద్వారము వద్ద కాపలాకాయు ద్వారపాలకుడు- నీవెవడవు? ఎక్కడ నుండి వచ్చితివి? ఏ కులమువాడవు నీకిచట పనియేమి? యని ప్రశ్నింపగా శుకుడు సమాధానము చెప్పక ఒక ప్రక్క నిలబడి యుండెను.

ద్వారపాలకుడు శుకుని జ్ఞానిగా బ్రాహ్మణ శ్రేష్ఠునిగా గుర్తించి బ్రాహ్మణోత్తమా! నీకు పనియున్నచోటకు స్వేచ్ఛగా వెళ్ళవచ్చు నిన్నడ్డగించినా యపరాధమును క్షమింపుమని పలికెను. శుకుడు నీవు నీ ధర్మమును నిర్వహించితివి. దీనిలో అపరాధమేమియు లేదు అని పలుకగా ద్వారపాలకుడు శుకుని అడిగి తన సందేహములు తీర్చుకొనెను. ద్వారపాలకుడు శుకుని మాటలు విని అతని మహాజ్ఞానిగా గ్రహించి చక్కని రాజమార్గమున లోపలకు ప్రవేశపెట్టెను. శుకుడు నగరములో రాగ ద్వేషకామలోభ మోహములతో దెబ్బలాడు మనుష్యులను చూచుచు ముందునకు సాగి రాజమందిరములో ప్రవేశించెను. అచట కూడ ద్వారపాలకుడు అడ్డగింపగా వెనుకటి వలె నిలిచియుండెను. క్రమముగా సమాధిలో నిమగ్నుడయ్యెను. కొలది నిముసములలో జనకుని మంత్రి వచ్చి చేతులు జోడించి రాజభవనములోని రెండవ ద్వారమున శుకుని ప్రవేశింపజేసి అతిథిమర్యాదలు నెరపెను. మరియు వారస్త్రీలను వాని సేవకు నియమించి బయటకు వచ్చెను. అచటి స్త్రీలాతనిపై మోహము కలవారై వెంటనే జితేంద్రియునిగా తెలిపి పూజించిరి. ఆ కాంతలాతనికి మధుర పదార్థములను సమీపమందుంచిరి. అలంకరించిన పాన్పునమర్చిరి. శుకుడు సాయం సంధ్య నుపాసించి సమాధిలో మునిగెను.

అట్లొజాము ధ్యానించి రెండు జాములు నిద్రించి మేల్కొనెను. ప్రాతఃకాల క్రియలు నిర్వర్తించి బ్రహ్మ తేజముతో వెలుగొందుచుండెను. జనక మహారాజు గురుపుత్రుడగు-శ్రీశుకుని రాక విని మంత్ర పురోహితులతో అతని వద్దకు వెళ్ళి ఆసనముపై కూర్చుండబెట్టి ఆవునొసగి క్షేమ సమాచారమడిగెను. శుకుడు కూడ రాజును క్షేమ సమాచారమడిగెను. పిమ్మట సుఖముగా కూర్చొని యున్న శుకుని

చూచి రాజు ఏ కోరికయు లేని నీవు మా యింటికేమి కోరి వచ్చితివని ప్రశ్నించెను. శ్రీశుకుడిట్లనెను.

"రాజా! మా తండ్రి గృహస్థాశ్రమము స్వీకరింపుమనుచున్నాడు. ఇది బంధము కాదని ఆతడెంతయో చెప్పినాడు. కాని ఆతడే సంసారబద్ధుడగుట వలన ఆతని మాట పెడచెవిని పెట్టితిని. ఈ విషయమున నామనస్సు సందిగ్ధముగా నున్నది. మా తండ్రి నిన్ను దర్శించినచో నా సందేహము తొలగునని చెప్పెను. నీ మాటలు విని మరల తన వద్దకు రమ్మని మా తండ్రి చెప్పినాడు. నా తండ్రి యాజ్ఞచే నీ పట్టణమునకు వచ్చితిని. నేను మోక్షార్థిని. నాకు కర్తవ్యముపదేశింపుము. ముక్తికి కారణము తపమా? వ్రతమా? యాగమా? స్వాధ్యాయమా? తీర్థసేవనమా? యిందేది తగినదో తెలియజేయుము అని ప్రశ్నించెను.

జనకుడు శుకునకు కర్మమార్గము పదేశించుట

జనకుడు శుకునకిట్లు చెప్పెను. "బ్రాహ్మణశ్రేష్ఠుడా! మోక్షము కోరువాడు మొదట ఉపనీతుడై గురుకులమందు వేదము నభ్యసింపవలయును. సాంగవేద వేదాన్తములు చదివి గురుదక్షిణ నొసంగి సమావర్తన సంస్కారము నొంది వివాహితుడై సంతానమును కనవలయును. అగ్నిహోత్రాదుల నొనర్చుచు మితహితసత్య భాషణము కలవాడు కావలయును. ఆశలేనివాడై శుచియై నిత్యసంతోషిగా నుండ వలయును. ఆరోగ్యవంతులైన పుత్రపౌత్రులతో వర్థిల్లవలెను. పిమ్మట తన సర్వస్వమును భార్యా పుత్రులకర్పించి కామక్రోధాదుల నరికట్టి తపస్సు చేయుటకు వాన ప్రస్థము స్వీకరింపవలెను. అటు పిమ్మట అగ్నుల నాత్మారోపణము చేసికొని పరమ వైరాగ్యముతో శాంతుడై నాల్గవ సన్యాసాశ్రమము స్వీకరింపవలెను. వైరాగ్యము కలవానికే సన్యాసాశ్రమము స్వీకరింపనర్హత కలదు. ఇది తిరుగులేని పద్ధతి వేదసమ్మతము కూడ క్రమముగా నొకయాశ్రమము నుండి వేరొక యాశ్రమము నవలంబించుట శిష్టులిష్ట పడిన మార్గము" అని వివరించెను.

శుకుడామాటలు విని జ్ఞానకారణమైన నిర్మల వైరాగ్యము కలవాడు కూడ ఆశ్రమక్రమము ననుసరింపవలెనా? వనమందుండ వచ్చునా యని ప్రశ్నింపగా జనకుడిట్లనెను. "ఇంద్రియ వాసనలు మిక్కిలి బలవత్తరములైనవి. పక్వము కాని హృదయమున వికారములు రేకెత్తించుచుండును. సన్యాసియై పతితుడైన వానికి సద్గతులుండవు. మనస్సు బలవత్తరమైనది. విషయలంపటుల కదివశము కాదు. కనుక ఆశ్రమముల క్రమముననే సంసారమును గెలువవలెను. గృహస్థుడు కూడ కలిగిన వానికి సంతసించుచు నిత్యతృప్తుడై హర్ష శోకములు లేక సర్వసముడై

యుండవచ్చును. అట్లున్నవాడు నిశ్చయముగ ముక్తుడగును. నేను రాజ్యమేలు చున్నను జీవన్ముక్తుడనై యుంటినిగదా!" అని పలికెను.

అంతట శుకుడు మహారాజా! మీ బోధను విన్నప్పటికిని నా సందేహము తొలగుటలేదు. భూపాలా! నేను గుణముల కందనివాడను. నా హృదయము వైరాగ్యముతో నిండి యున్నది. నాకు ప్రాపంచిక విషయములతో పనియేమి? నీవు ముక్తుడనైతినని తలచుచున్నావు. అది వట్టిడం బాచారమేయని నాకు తోచుచున్నది. నీకొకప్పుడు ధనచింత మరొకప్పుడు శత్రుచింత కలుగుచుండును గదా! నీవు నిశ్చింతుడ నెట్లగుదువు. పూర్వము "నిమి"యను మీ వంశమందలి రాజు వసిష్ఠుడును పరస్పరము శపించుకొనిరని వింటిని. ఆరాజు విదేహుడైతే గురువేల శపించును? ఇదియంతయు వింతగా నాకు తోచుచున్నదని పలికెను. అప్పుడు జనకుడిట్లనెను.

నీవు కారడవికి పోవదలచుచున్నావు గదా! నీకచట ఆహారచింత తప్పునా? దండ అజనముల చింతయుండదా? అట్లే నాకిచట రాజ్యచింతయు నుండును. నాకు యేవి కల్పములు సంశయములును లేవు. సుఖముగా భుజింతును హాయిగా నిద్రింతును బద్ధుడను కాను. స్వతంత్రుడనను జ్ఞానముచే సుఖముగా నుందును. నీవు నిన్ను బద్ధునిగా భావించి దుఃఖించుచు న్నావు. నీవిక యిట్టి యనుమానము మాని స్థిర బుద్ధివై సుఖముగా నుండుము. నేను బద్ధుడనను కొన్నంతకాలము నీకు ముక్తి హుళక్కి నేనీ ధనరాసులను, భవనాలను, రాజ్యమును నావికావనితలచి సుఖముగా నుందును" అని శుకుడు జనక మహారాజు హితవచనములనువిని యాతని అనుమతితో తండ్రి యాశ్రమమునకు తిరిగి వచ్చెను. వ్యాసుడు కుమారుని అమితానందముతో కౌగిలించుకొని క్షేమమడిగెను. ఆపవిత్రాశ్రమమున శుకుడు వేదాధ్యయనము చేసి సర్వశాస్త్ర పారంగతుడాయెను.

శ్రీశుకుని గార్హస్థ్యము

పిమ్మటనతడు పరియను కన్యను వివాహమాడి యామెయందు నలుగురు పుత్రులపొందెను. వారు వరుసగ కృష్ణుడు గౌరప్రభుడు భూరిదేవశ్రుతుడను వారలు. పిమ్మట "కీర్తి" యనుకుమార్తెను కని యామెను విభ్రాజ పుత్రుడగు అణుహునకిచ్చి పెండ్లి చేసెను. అణుహుని కుమారుడు బ్రహ్మదత్తుడు. అతడు బ్రహ్మజ్ఞానము గల రాజయ్యెను. అతడు కొన్నాళ్ళకు రాజ్యము కుమారునకిచ్చి బదరికాశ్రమము చేరి పరిపూర్ణ బ్రహ్మజ్ఞాని యయ్యెను. శుకుడు నారదుని యనుగ్రహముచే కైలాసమునకు వెళ్ళి యచట నిర్వికల్ప సమాధిలో నిమగ్ను

డయ్యెను. తరువాత నాతడు కొండశిఖరము నుండి పైకెగిరెను. ఆకాశవీధిలో రెండవ సూర్యునివలె ప్రకాశిం చెను. వ్యాసుడు పుత్రవియోగముచే మహాదుఃఖము ననుభవింపగా శివుడు వాని నోదార్చి యంతర్ధానమయ్యెను. వ్యాసుడు తన యాశ్రమమున కేగెను. పిమ్మట సరస్వతీ నదీతీరమున ఆశ్రమము నిర్మించుకొని తనకు సోదరులిరువురు కలిగి రని తెలిసి సుఖముగా నుండెను.

వ్యాసుని కార్యాచరణము

అసితుడు దేవలుడు వైశంపాయనుడు జైమిని సుమంతుడు మొదలగువారు వ్యాసునివలన విజ్ఞానము నార్జించి యాతని యనుమతితో వెడలిపోయిరి. వ్యాసుడు తన యాశ్రమమున తపమొనర్చుచుండెను. వ్యాసుని సోదరులలో పెద్దవాడు చిత్రాంగదుడు రెండవవాడు విచిత్రవీర్యుడు. వీరిరువురి కంటె పూర్వము జన్మిం చినవాడు భీష్ముడు. చిత్రాంగదుడు యుద్ధములో గంధర్వునిచే చంపబడెను. పిమ్మట విచిత్రవీర్యుడు రాజయ్యెను. వివాహమును రాజ్యమును త్యాగము చేసిన భీష్ముడు తన సోదరుడగు విచిత్రవీర్యునకు వివాహము చేయ సంకల్పించెను. కాశీరాజు పుత్రికలకు ముప్పురకు స్వయంవరము జరుగుచుండ నచటి రాజుల జయించి యా ముప్పురను తన రథముపై తీసికొని వచ్చెను. ఆ కన్యలను తల్లి యగు సత్యవతికి అప్పగించెను. ఆ కన్యలలో పెద్దది నేను పూర్వమే సాల్వరాజును వరించి యున్నానని చెప్పగా భీష్ముడు తల్లితో, మంత్రులతో నాలోచించి యామెను ఇష్ట మైనచోటికి వెళ్ళుమని విడిచిపెట్టెను. ఆ కన్య సాల్వుని వద్దకు వెళ్ళగా నాతడు తిరస్కరించెను.

పిమ్మట భీష్ముని వద్దకు ౼గా నామె తల్లిదండ్రుల వద్దకు పొమ్మ నెను. తక్కిన యిద్దరును విచిత్రవీర్యుని భార్యలైరి. విచిత్రవీర్యుడు తొమ్మిదేండ్లు విలాసముగా గడపి క్షయరోగముతో మరణించెను. తరువాత సత్యవతిభీష్ముని సూచన పై వ్యాసుని రావించి పెద్దకోడలిని వాని వద్దకు సంతతికై పంపెను. ఆమె కన్నులు మూసికొని నందున గ్రుడ్డివాడు జన్మించెను. సత్యవతి దుఃఖించి రెండవ కోడలిని వ్యాసుని వద్దకు పంపగా పాండువర్ణమువాడు పుట్టెను. అతడు రాజుగా నుండత గడని మరియొక మారు కోడలిని ప్రోత్సహింపగా నామె వ్యాసుని తేజస్సు ముందు నిలువలేక దాసిని వ్యాసుని వద్దకు పంపగా నామె చక్కని కుమారుని కనెను. ఆ ముగ్గురిలో మొదటివాడు ధృతరాష్ట్రుడు, రెండవవాడు పాండురాజు, మూడవవాడు విదురుడు. ఇట్లు సూతుడు మునులకు వ్యాస వంశోత్పత్తిని వివరించెను.

ద్వితీయ స్కంధము

మత్స్యగంధి జన్మ వృత్తాంతము

ఋషులు సత్యవతీ వ్యాసుల జన్మవృత్తాంతమును వినగోరుచున్నామనగా సూతుడు పరమ సత్యజ్యోతియైన పరదేవతకు ననుసరించి యిట్లు చెప్పెను. పూర్వము ఉపరిచరడును రాజు తపస్సు చేయగా ఇంద్రుడు సంతసించి యాతనికి స్ఫటిక విమానము నిచ్చెను. ఆతడు ధర్మనిత్యుడని లోకప్రసిద్ధినొందెను. అతని భార్య గిరిక. ఆమెకైదుగురు కుమారులు.

ఒకనాడు తండ్రి చెప్పగా వేటకు వెళ్ళిన సందర్భమున ఋతుమతి యగు భార్యను స్మరించుటచే స్ఖలితమగు వీర్యమును మఱ్ఱియాకులో భద్రపరచి డేగద్వారా తన భార్యకు పంపెను. మఱ్ఱియాకులోనిది మాంసము కావచ్చుననని వేరొక డేగ డీకొనెను. ఆ పోరాటములో మఱ్ఱియాకు యమునానదిలో పడెను. ఆ సమయమున బ్రాహ్మణశాపముచే చేపయైన అద్రిక యను దేవకాంత ఆవీర్యము గ్రహించి గర్భవతియై జాలరివారికి దొరకినది. దానిని కోయగా ఒక బాలుడు, ఒక బాలిక వెలువడిరి. జాలరివాడు బాలబాలికల నిరువురిని రాజునకు చూపగా రాజు బాలకుని తీసికొని బాలికను జాలరికిచ్చి వైచెను.

ఆ బాలుడు పెద్దవాడై మత్స్యదేశమునకు ప్రభువయ్యెను. బాలిక జాలరి యింట కాళిమత్స్యోదరి యను పేరుతో వన్నెకెక్కినది. ఆమె శరీరము చేపల వాసన కలిగియుండుటచే ఆమెకు మత్స్యగంధయను పేరు వచ్చెను. ఇద్దరు పిల్లలను కనుటవరకే చేప రూపము కనుక అద్రిక మరల దేవకాంతయై వెడలి పోయెను. మత్స్యగంధ యను కన్య దాశరాజు నింటనే పెరిగి పెద్దదాయెను. తండ్రి యింటనే యుండి పనులెల్ల చక్కపెట్టుచుండెను.

వ్యాస మహర్షి జన్మ వృత్తాంతము

పూర్వమొకప్పుడు మహా తేజస్వియగు పరాశర మహర్షి తీర్థయాత్రలు సేవించు చు యమునా తీరమునకు వచ్చెను. అచట నొక కిరాతుడు భోజనము చేయు చుండెను. ముని వానితో నన్నీ పడవలో నది యావలిగట్టునకు చేర్చుమనెను. అతడు తన కూతురగు మత్స్యగంధను తెప్పపైన మునిని ఒడ్డునకు చేర్చుమనెను. ఆమె నతనిని తన పడవలో నెక్కించుకొని అవలివడ్డునకు వెళ్ళసాగెను. దైవ

యోగమున పరాశరుడా యువతిని చూచి కామాతురుడై చేతితో నామె చేయిపట్టు కొనెను. అప్పుడు సిగ్గుతో ఆ యువతి నీ తపస్సునకు పవిత్రతకు కులశీలము లకును చేపలకంపుగల నేను తగను. నాపై నీకిట్టి కామమేల కలిగినని ప్రశ్నించెను. మరియు నతని కామాతురతను చూచి నన్నొ ఒడ్డునకు చేర్చువరకు నిగ్రహముతో నుండు మని మునితోననెను. ఆమె వణకుచు నా శరీర దుర్గంధము వెట్లు సహించెదవు అని పలుకిన వెంటనే ముని యనుగ్రహమున యోజనగంధ సుందరి యు నయ్యెను. మునియామె చేతిని పట్టుకొనగా మునివల్లభా! లోకమంతయు చూచున్నది నా తండ్రియు చూడగలడు. కనుక చీకటి పడునంతవరకాగుమని పలుకగా ముని వెంటనే యాప్రదేశమంతయు మంచుతో నిండిన దానిగా నొనర్చెను. అప్పుడామె నేను కన్యను గర్భవతినైనచో తండ్రికేమని చెప్పుదును? నాగతి యేమి కావలెను? అని ప్రశ్నింపగా మునివర్యుడు నీకన్యాత్వమునకు భంగముండదనియు లోకముగాని తల్లితండ్రులుగాని యీ విషయము నెరుగ కుందురనియు పలికెను.

ఆ పిమ్మట నా యువతి నీవంటి పుత్రుడు నాకు కలుగునట్లు వరమిమ్మనగా అట్లే వరమిచ్చెను. మహర్షి యంతటనామె ననుభవించి అతిశీఘ్రముగ వెడలి పోయెను. సత్యవతి సద్యోగర్భమున నచటనే పుత్రుని కనెను. ఆ పుట్టిన కుమారుడు వెంటనే పెద్దవాడై నేను తపస్సు చేయుటకు వెళ్ళెదను నీవు కోరినప్పుడు వచ్చి కనిపించెదనని పలికి వెడలిపోయెను. అతడే వ్యాసుడు. దీవిపైపుట్టినందున ద్వైపాయనుడను పేరు వచ్చినది. సత్యవతియు తండ్రి వద్దకు వెళ్ళెను. విష్ణ్వంశ వలన పుట్టినవ్యాసుడు మహర్షియై వేదముల విభజించి మహాభారతమును పురాణ సంహితలను విస్తరించెను. తన ముఖ్యశిష్యులైన సుమంతుడు, పైలుడు, వైశం పాయనుడు, అసితుడు, దేవలుడు మొదలగువారిచే తన గ్రంథములను చది వించెను. సూతుడిట్లు మీకన్నియు చెప్పితినని ఋషులతో పలికెను.ఋషులు సంతసించిరి.

అంతట ఋషులు సత్యవతి శంతనున కెట్లు భార్యయయ్యెను? శంతనుని మొదటి భార్యఎవరు? వసువు భీష్ముడుగా శంతను పుత్రుడయ్యెను? భీష్ముడు పెద్దవాడుండగా విచిత్ర వీర్యుడు రాజెట్లయ్యెను? విచిత్రవీర్యుని మరణానంతరము సత్యవతి కోడళ్ళకు పుత్రులనెట్లు కలుగజేసెను? భీష్ముడేల పెండ్లి చేసికొనలేదు? ఈ విషయములన్నియు వ్యాసశిష్యుడవైన నీవు వివరించి మా సందేహముల నివారింపవలసినదిగా కోరుచున్నా మనగా సూతుడిట్లు మునుల ప్రశ్నలకు సమా

ధానములిచ్చెను. పూర్వమిక్ష్వాకు వంశమున మహాభిషుడను చక్రవర్తి యుండెను. అతడు సత్యవంతుడు ధర్మశీలి. అతడు వేయి అశ్వమేధయాగములు చేసి స్వర్గమలంకరించెను.

ఒకనాడాతడు బ్రహ్మసభకు వెళ్ళెను. దేవత లెల్లరువచ్చిరి. గంగాదేవి కూడ బ్రహ్మ కొలువునకు వచ్చెను. అప్పుడు పెనుగాలి వీచగా ఆమె ఉత్తరీయముపైకి లేచెను. దేవతలెల్లరు తలలు వంచుకొనిరి. మహాభిషుడు మాత్రము ఆమెను తేరిపార చూచెను. గంగ తనయందు ప్రేమ గలవాడాతడని గ్రహించెను. బ్రహ్మయిది చూచి నీవు మనుష్యలోకమున రాజుగా పుట్టుమని మహాభిషుని శపించెను. గంగను కూడ భూమిపై పుట్టుమని శపించెను. వారిరువురును బ్రహ్మను వదలి బయలుదేరిరి. పురువంశరాజగు ప్రతీపునకు మహాభిషుడు పుత్రుడు కాదలచెను. అదే సమయమున అష్టవసువులు తమ భార్యలతో వసిష్ఠుని ఆశ్రమములో విహారని నోదములలో ఓలలాడుచుండిరి. ఆ వసువులలో "ద్యో" అనువాని భార్య వశిష్ఠుని ఆశ్రమమందలి ఆవును తన చెలికత్తె కొరకు తెమ్మని భర్త నడిగెను.

అంతట "ద్యో"మరికొందరు వసువులను వెంటబెట్టుకొని మునియైన వసిష్ఠుని లెక్కచేయక అతని నందినీ ధేనువును అపహరించెను. ఫలములు మొదలగువాని కొరకు మరియొక చోటకు వెళ్ళిన వసిష్ఠమహర్షి తన యాశ్రమమునకు వచ్చి ఆవు కనబడక అంతటను వెదకెను. ఆవెక్కడను కనబడలేదు. ధ్యానములో వసువులు గోవు నపహరించిరని తెలిసికొని వారిని మానవులుగా పుట్టుడని శపించెను. వారు వేడు కొనగా వసిష్ఠుడు ఒక్కొక్క సంవత్సరము వ్యవధానముతో ఒకరి తరువాత నొకరుగ జన్మించి వెంటనే మరణింతురు. నాయావు నపహరించిన వాడు మాత్రము చాల కాలము భూలోకములో చాలకాలము నివసించునని శాపవిమోచనము చెప్పెను.

వసువులిట్లు శపింపబడి వెళ్ళుచుండగా దారిలో గంగాదేవి వారికి కనిపించెను. గంగ కూడ శాపమునకు గురియై దుఃఖించుచుండెను. వసువులామెకు నమస్కరించి నీవు స్త్రీరూపము ధరించి మాకు తల్లివి కమ్మని పలికి నీవు శంతను మహారాజునకు భార్యవగుము. పుట్టగానే మమ్ము గంగలో పడవేయుము అట్లు చేసిన మాకు శాపవిముక్తి యగునని చెప్పగా ఆమె అంగీకరించెను. వసువులు స్వస్థాన ములకు వెడలిపోయిరి. మహాభిషుడు ప్రతీపునకు కుమారునిగ జన్మించెను. అతడే శంతనుడు. అతడు ధర్మాత్ముడు, సత్యసంధుడు. ఆరాజు ప్రతీపుడు

సూర్యుని స్తుతించుచుండగా గంగాజలము నుండి అందగత్తె యగు యువతి బయటకు వచ్చెను. మరియు రాజుకుడితొడ పై కూర్చుండెను. రాజు నాయను మతి లేకయే నీవు తొడపై కూర్చొంటి వేలయని యడుగగా నిన్ను నేను ప్రేమించి వచ్చితిననగా కూడి తొడపై కొడుకులు, కోడండ్రు కూర్చొనవలెను. కనుక నాకు కుమారుడు జన్మించిన పిదప నాతని వరింపుమని చెప్పగా నామె వెడలిపోయెను. రాజు ఆమెనే తలచుచు తన భవనమునకు వెళ్ళెను. కొంతకాలమునకు ప్రతీప మహారాజు పుత్ర సంతానము కలవాడయ్యెను. అతడు పెద్దవాడై వేటకు వెళ్ళగోరు చుండగా వెనుకటి గంగా వృత్తాంతమును చెప్పి నీకామె కనబడినచో నేమియు ప్రశ్నింపక ఆమెను ధర్మపత్నిని చేసికొనుము. నీవామెనే ధర్మపత్నిగ స్వీకరించి సుఖముగా నుండుము అని చెప్పెను. పిమ్మట ప్రతీపుడు తపస్సు చేసి స్వర్గస్థుడు కాగా శంతనుమహారాజు ధర్మముతో ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించు చుండెను.

శంతనుడు గంగను పెండ్లియాడుట

శంతనుడు వేటకు వెళ్ళి అచట రూపయౌవనములతో ప్రకాశించు నొకజవ రాలిని చూచి తండ్రి చెప్పిన యువతి ఈమెయే కావచ్చునని తలచెను. శంతనుడు ఆమెపై అనురాగము కలవాడాయెను. గంగానది కూడ మహాభిషుడు చెప్పిన రాజితడే యని తెలిసి చిరునవ్వుతో రాజువద్ద నిలిచెను. శంతనుడు నాకు ధర్మ పత్నివి కమ్మని యామెను కోరెను. అప్పుడు గంగ రాజానీవంటి యుత్తముని యే స్త్రీ కోరదు? కాని నేనే పనిచేసినను నీవు కాదనకూడదు. నీవీ ప్రతిజ్ఞ నెరవేర్చినచో నీకు భార్య కాగలనని చెప్పగా నాతడంగీకరించెను. అంతట నామె రాజువెంట అతని ప్రాసాదమునకు వెళ్ళెను. అప్పటినుండి వారిరువురునేక భోగముల ననుభవించుచు పరస్పర ప్రేమాతిశయముతో నానందించుచుండిరి. ఇట్లు గంగా దేవి మానవ యువతిరూపమున శంతనునకు పత్నియయ్యెను.

గాంగేయుని జన్మ వృత్తాంతము

కొంతకాలము గడువగా గంగ గర్భవతియయ్యెను. వసువును పుత్రునిగా కనెను. ఆమె కనినవెంటనే ఆ శిశువును గంగలో పడవేసెను. అట్లే రెండవ కుమా రుని చేసెను. ఇట్లు మొత్తమేడుగురు కుమారులను గంగపాలు చేసెను. శంతను మహారాజు బోరున దుఃఖించి యిట్లయిన నావంశము స్థిరపడుటెట్లు? ఈ

పాపాత్మురాలు ఏడుగురు కొడుకులను నీటిలో కలిపినది. ఒకవేళ నన్నీమె వదలి వెళ్ళిన వెళ్ళుగాక ఎనిమిదవ పుత్రునైన చావకుండ నివారించెదనని నిశ్చయించుకొనెను. వసిష్ఠమహర్షి యావు నపహరించిన వసువే ఎనిమిదవ పుత్రుడు జన్మింపగా రాజామెపాదములు పట్టుకొని ఈ కొడుకునైన వదలి పెట్టుమని ప్రార్థించెను. గంగ ఎన్ని చెప్పినను వినక శిశువును తీసికొని పోవప్రయత్నించుచుండగా రాజు దుఃఖావేశమును పట్టలేక పాపిష్ఠురాలా! నీవే పాపాత్ముని కడుపున చెడపుట్టితివో గదా! ఇక నీవుండిన నుండుము పోయిన పొమ్ము నా పుత్రుడిక్కడనే యుండగలడు అని పలికెను.

అంతట గంగ నీవు చేసిన శపథము భగ్నమైనది నిన్నిదే వదలి వెళ్ళుచున్నానని వసువుల శాపమును చెప్పి తల్లి పెంపకము శిశువున కత్యావశ్యకముగాన యౌవనము వచ్చువరకు వీనిని పెంచి నీకు అప్పజెప్పగలనని పలికి శిశువును తీసికొని యంతర్ధానమయ్యెను. శంతనుడు దుఃఖార్తుడై తన భవనమున నివసించుచుండెను. శంతనుని ఎనిమిదవ శిశువే గాంగేయుడు భీష్ముడనియు పిలువబడువాడు. శంతను మహారాజు భార్యాపుత్రుల వియోగములచే లోలోనకుములుచు రాజ్యపరిపాలన సాగించుచుండెను. కొంతకాలము గడువగా శంతనుడు వేటకు వెళ్ళి మహిష సూకరాది మృగముల వేటాడుచు - తిరుగుచు గంగాతీరమున నారిసారించి బాణములు విడుచుచున్న సుకుమారుడైన కుమారుని చూచెను. ఆ బాలుని బాణప్రయోగ మందలి హస్తలాఘవము సాటిలేనిది. ఆతని రూపము మన్మథుని సిగ్గుపరచును రాజా బాలుని చూచి ఆశ్చర్యపోయెను. ఆ బాలుని నీవెవరి పుత్రుడవని యడుగగా ఆ బాలుడు వెంటనే అదృశ్యుడయ్యెను. ఈతడు నా పుత్రుడే కావచ్చు ఇపుడేమి చేయుదును? అని చింతాక్రాంతుడై శంతనుడు గంగను స్తుతించెను. ఆమె ప్రసన్నురాలై వెనుకటి రూపముతో దర్శనమిచ్చెను.

అప్పుడు రాజు గంగా! నా బాలుని నాకు వేగమే చూపుమని కోరగా గంగ రాజా! బాలుని చూడుము. ఈతడే నీ పుత్రుడు వీని నింతకాలము పోషించి నీచేతిలో పెట్టుచున్నాను. ఈ గాంగేయుడు మహాతపస్వి నీ కులమునకు వన్నె తెచ్చువాడు. ఇతడు వేదములను ధనుర్వేదమును చక్కగా చదివెను. వసిష్ఠమహర్షి వద్ద సకలవిద్యా బుద్ధులను నేర్చినాడు. అన్నిటియందు నేర్పరి. నీవికనీతని పుత్రునిగా స్వీకరించి సుఖముగా నింటికి వెళ్ళుమని పలికి రాజునకు పుత్రు నర్పించి అంతర్ధానమును చెందెను.

శంతను మహారాజు మితిమీరిన ఆనంద ముతో కొడుకును కౌగిలించుకొని రథముపై కూర్చొనబెట్టుకొని తన నగరమునకు బయలుదేరెను. రాజు హస్తినాపురములో ఘనముగా పుత్రోత్సవము కానించెను. సకలసద్గుణోపేతుడగు పుత్రుని యువరాజు చేసి శంతనుడు గంగను కూడ మరచి సుఖముగా నుండెను. ఈ యితిహాసమును శ్రద్ధగా వినువారికి పాపములు నశించి శుభములు సుఖములు సమకూరును అని సూతుడు చెప్పెను. ఋషులు సత్యవతి శంతనుని భార్య యెట్లు అయ్యెనో తెలుప గోరుచున్నామని యడుగగా సూతమహాముని ఆ కథనిట్లు చెప్పనారంభించెను

శంతనుడు సత్యవతిని వరించుట

శంతనుడు గాంగేయునితో సుఖముగా కాలముగ కాలము గడుపుచు నొక నాడు కాళిందీ నదీతీరమందలి వనములందు వేటకు వెళ్ళెను. అతడు దివ్యమైన పరిమళమునా ఘ్రాణించి ఆ సువాసన వచ్చువైపు చూచుచుండెను. ఇది యే పుష్పము యొక్క పరిమళమును గాదు. అద్భుతముగా నాసికను సంతోషపెట్టు చున్నది. అని యావనమంతయు కలయదిరిగెను. అంతలో నొకచోట అందమైన వనితను చూచి యీమె శరీరము నుండియే అపూర్వ పరిమళమునా ఘ్రాణించు చుంటినని నిశ్చయించుకొనెను. ఆమె సౌందర్యమునకు యౌవన సౌగంధ్యముల కాశ్చర్యపడి యామెవద్దకు వెళ్ళి నీ వెవ్వరి కన్యవు? నీవు వివాహితనా? అ వివాహితవా? నిన్ను చూచి నేను కానువశుడనైతిని. అని రాజు పలుకగా నామె చిరునవ్వు నవ్వుచు ఓ రాజా! నేను పల్లెవాని కూతురను. తండ్రి యాజ్ఞ ప్రకారము నడుచు దానను. ధర్మము కొరకు నేను నీటిలో నావ నడుపుచుందును. నా తండ్రి యిప్పుడే యింటికి వెళ్ళినాడు. అని చెప్పగానే కామాతురుడగు రాజు నేను కురువంశ ప్రభువును నన్ను భర్తగా చేసికొనుము. నాకు ప్రస్తుతము భార్యలేదు. నిన్ను చూచినా మనస్సు పరవశించినది అని పలుకగా దాశకన్య నేను స్వతంత్రురాలను కాను. మీరు శీఘ్రమే మాతండ్రి నన్ను మీకు యిచ్చి వివాహము చేయునట్లు ఆయనను అడుగ గోరుచున్నాను. మా తండ్రి నన్ను మీకు దానము చేసినచో వశవర్తిని యగు భార్యనయ్యెదను. నన్ను కూడ మన్మథుడు బాధించుచున్నాడని తన భావమును స్పష్టము చేసినది. కామాయత్తుడగు శంతనుడు దాశరాజునింటికి వెళ్లి ఆ కన్యను తనకిమ్మని కోరెను.

అప్పుడు దాశరాజు నాకన్యను మీరు కోరుట సంతోషకరమే కాని నా కూతురునకు పుట్టుకొడుకే నీ తరువాత రాజు కావలెను. ఇతర కుమారుడు

రాజు కాకూడదు - అని చెప్పగా రాజు చింతాక్రాంతుడయ్యెను. గాంగేయునికి రాజ్య మీయకుండుటెట్లు? అని విచారించును సమాధానమీయలేదు. రాజు కామాతురుడై యింటికి వెళ్ళి స్నానభోజనములను నిద్రను కూడ విడిచి బాధపడు చుండెను. గాంగేయుడాతని దుఃఖమున కారణమడిగెను. తండ్రి చింతను పోగొట్టి ఆతని నుద్ధరింపని కొడుకు పుట్టియేమి ప్రయోజనము? నీ మనస్సులోని విషయము తెలియ జేసినచో దానిని సాధించి మిమ్ము సంతోషపెట్టెదని పలుకగా మహారాజు సిగ్గు నణుచుకొని కుమారా! నాకు నీవెక్కడవే సంతానమగుట విచారము కలిగించుచున్నది. ఇదియే నాచింతయని చెప్పెను.గాంగేయుడు తండ్రి మాటలు విని మంత్రులతో రాజు సిగ్గుచే సరిగ చెప్పుట లేదు. మీరాతని మనస్సు నెరిగి నాకంతయు వివరముగా చెప్పినచో వెంటనే అన్ని పనులు చక్కపెట్టి తండ్రి మనస్సునకు శాంతిని చేకూర్చెదనని పలికెను.

వారు రాజు చింతాకారణమును తెలిసి కొని గాంగేయునకంతయు చెప్పిరి. గంగాసుతుడు వెంటనే మంత్రులను వెంట బెట్టుకొని దాశరాజు వద్దకు వెళ్ళి నాతండ్రికి నీకూతురు నిచ్చి భార్యగా చేయుమని కోరెను. ఆతడు తన మనుమనికే రాజ్యమీయవలయుననగా గాంగేయుడు తాను రాజ్యము చేయననియు వివాహము కూడ చేసికొనననియు ప్రతిజ్ఞ చేసి భీష్ముడని ప్రసిద్ధిని పొందెను. దాశరాజు తన కుమార్తెను శంతనునికిచ్చెను. సత్యవతికి - పరాశరుని వలన నింతకు ముందుగనే - వ్యాసమహర్షి జన్మించినట్లు శంతను మహారాజునకు తెలియదు. సత్యవతీ శంతనులకు కుమారులిరువురు కలిగివారు కాలవశమున మరణించిరి. అంబిక కనులు మూసికొని వ్యాసుని వలన ధృతరాష్ట్రుని కనెను. మరొకతె వ్యాసుని చూచి వెలవెలబోవుటచే పాండురాజు పుట్టెను. మూడవమారు దాసి వ్యాసుని సంతృప్తుని చేసినందున సత్యావాదియగు విదురుడు జన్మించెను. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడగుటచే పాండురాజు రాజాయెను. విదురుడాతని మంత్రియయ్యెను.

ధృతరాష్ట్రునకు భార్యలిద్దరు. ఒకతె గాంధారి. రెండవది వైశ్య స్త్రీ. పాండు రాజునకు కుంతిమాద్రి యను నిరువురు భార్యలు గలరు. గాంధారికి నూర్గురు కొడుకులు, వైశ్యకుమారుడు, యుయుత్సుడు. కుంతి కన్యగా నుండి సూర్యుని వలన కర్ణుని కనెను. తరువాత నామె పాండురాజునకు భార్య యయ్యెను. అని చెప్పగా ఋషులు సూర్యుని వలన కన్యయైన కుంతికి కర్ణుడెట్లు జన్మించెను? ఆమెకు పాండురాజుతో వివాహమెట్లయ్యెనని ప్రశ్నింపగా సూతుడు సమాధాన

మిట్లు చెప్పెను. శూరసేనుడను వాని కూతురు కుంతి. ఆమె చిన్నతనము నుండి కుంతి భోజుడను రాజు శూరసేనుని ప్రార్థించి కుంతిని తన కుమార్తెగా చేసికొనెను. ఒకనాడు దుర్వాసోమహర్షి చాతుర్మాస్యదీక్ష జరుపదలచి కుంతి భోజు నింటికి వచ్చెను. అప్పుడు కుంతి మునీశ్వరునకు సేవచేసి యాతని సంతుష్టుని చేసెను. ముని యామెకొక దివ్యమంత్రమునుపదేశించెను. ఆ మంత్ర ప్రభావముచే ధ్యానింపబడిన దేవత ప్రత్యక్షమై కోరికలను సఫలమొనర్చును. కుంతి మంత్ర ప్రభావము నెరుగదలచి ఉదయించిన సూర్యుని చూచి మంత్రము నుచ్చ రింపగా సూర్యుడు మానవాకారముతో నామెవద్దకు వచ్చెను. కుంతి యాశ్చర్యము నొంది భయముతో కంపించి నమస్కరించుచు మీ దర్శనము నేను సంతసించితిని. ముని యిచ్చిన మంత్రమహిమ నెరుగ కోరిమమ్ము పిలిచితినని పలికెను.

సూర్యుడును - నీ కన్యాత్వము చెడకుండునట్లు చేయుదును, నావంటి కొడుకు నీకు కలుగునని ఆమెను పొంది కోరినవరము నిచ్చి వెడలిపోయెను. తరువాత కుంతి కొన్నాళ్ళకు రహస్యమందిరమున కవచకుండలములతో కూడిన అందమైన బాలుని కనెను. లోకాపవాదమునకు వెరచి యాబాలునొక పెట్టెలో నుంచి దాదిచేత నదిలో వదలిపెట్టించెను. అధిరధుడను సూతునకా పెట్టె దొరకగా నాతడు తన భార్య రాధకు అందులోని బాలుని పెంచుమని యిచ్చెను. ఆతడే కర్ణుడను పేర ప్రఖ్యాతినొందెను.

పాండవుల జన్మ వృత్తాంతము

కొన్నాళ్ళకు కుంతికి స్వయంవరమేర్పరుపగా అందామె పాండురాజును వరించెను. మద్రరాజు కుమార్తె మాద్రియునాతనికి రెండవ భార్యయయ్యెను. ఒకనాడు పాండువేటకు వెళ్ళి మృగరూపముతో క్రీడించుచున్న మునిని బాణముతో చంపెను. ఆ ముని కోపించి స్త్రీ సంగమమున నీవు కూడనిట్లే మరణింతునని పాండురాజును శపించెను. పాండురాజందులకు దుఃఖపడుచు రాజ్యము విడిచి వనవాసము చేయుచుండెను. అతని సేవకై కుంతీమాద్రులు కూడ వాని వెంట వెళ్ళిరి. పాండురాజు తపస్సు చేయుచు ధర్మశాస్త్రమును వినునప్పుడు పుత్రులు లేనివారికి సద్గతి యుండదని విని పుత్రసంతతి పొందుటకు కుంతితో నిట్లనెను. నీవు మహాముని దయతో పుత్రుని కనుము. నా యాజ్ఞచే నీకు దోషముండదు' అని పలికెను. అపుడు కుంతి యిట్లనెను.

మహారాజా! పూర్వము దుర్వాసోమహర్షి నాకొక మంత్రమునుపదేశించెను.

అది నాయొద్ద కలదు. ఆ మంత్రప్రభావముచే నేనాహ్వానించిన దేవత నీముందు ప్రత్యక్షమై కోరికను తీర్చివెళ్ళును. అని పలికి భర్త యనుమతితో ధర్మదేవతను స్మరించినది. ఆతని యనుగ్రహముచే ధర్మ రాజును పుత్రునిగా పొందెను. పిమ్మట వాయుదేవుని యనుగ్రహముచే భీముని దేవేంద్రుని వలన అర్జునుని ఒక్కొక్క సంవత్సరముకు ఒక్కొరిని సంతానముగా పడసెను. మాద్రి తనకు సంతానము లేకపోయెనని విచారించుచుండగా కుంతి మాద్రికా మంత్రము నుపదేశించెను. మాద్రిఆమంత్రముతో అశ్వినీదేవతల నాహ్వానించి వారివలన నకులసహదేవులను నిరువురు కుమారులను కనెను. ఇట్లు పాండురాజునకు ఐదుగురు పుత్రులు సంభవించిరి.

పిమ్మట నొకనాడు పాండురాజు కామార్తుడై మాద్రిని కౌగిలించుకొని శాప కారణముగ మరణించెను. కుంతీ మాద్రు లిరువురును దుఃఖించుచుండగా మునులు వచ్చి పాండురాజునకు గంగా తీరమున దహనసంస్కారము చేసిరి. అంతట మాద్రి తన పుత్రులను కుంతికి అప్పచెప్పి సతీధర్మమును పాటించుచు పాండురాజుతో సహగమనము చేసినది. ఆచటి మునులు పాండవులచే పాండు రాజు అంత్యక్రియలను దానధర్మాదుల చేయించి కుంతిని పాండవులను హస్తినా పురమునకు తీసికొని వెళ్ళిరి. వారి రాకవిని గాంగేయుడు, విదురుడు, ధృతరాష్ట్రుడు ప్రజానీకము వారిని చూడబోయిరి. జనులకు పాండురాజు శాపము పొందెనని యెరుగక ఈ కుమారులెవ్వరని యడుగగా వీరు కురువంశమున పుట్టిన సుర కుమారులని చెప్పి వారి విశ్వాసమునకై దేవతలనాను ప్రార్థించిరి. అప్పుడు యింద్రాదిదేవతలు- వీరు మాకు కుమారులే. పాండురాజు - అనుమతితో - కుంతియందు - మావలన కలిగిరి. వారు మా బిడ్డలే వీరని చెప్పిరి. భీష్మాదు లందరు వారిని ఆదరించి పోషించిరి. ఈ విధముగా కుంతీ కుమారులు భీష్మునిచే పరి రక్షింపబడిరి.

దేవి దయవలన పాండవాదులు మృతవీరులను చూచుట

పంచ పాండవులకు ద్రౌపది పతివ్రతయైన భార్య. ఆమెకైదుగురు కుమారులు గలిగిరి. అర్జునుడు శ్రీకృష్ణుని యనుమతితో సుభద్రను హరించి తెచ్చి భార్యగా చేసికొనెను. అభిమన్యుడు ఉపపాండవులును మహాభారత యుద్ధమున వీరస్వర్గము లంకరించిరి. అప్పుడు అభిమన్యు భార్య గర్భవతి. అశ్వత్థామ బాణాగ్ని నుండి

వాసుదేవుడా శిశువును కాపాడెను. ఆతడు పరీక్షిత్తను పేర ప్రసిద్ధినొందెను. ధృతరాష్ట్రుడు తన కుమారు లెల్లరు మరణింపగా పాండవుల రక్షణలో నుండెను. భీముని పరుషవాక్కులకు దుఃఖింతుడై జీవించుచుండెను. గాంధారియు నక్కడనే యుండెను. ధర్మరాజు వారిరువురకు పరిచర్య చేయుచుండెను. విదురుడు మంచి మాటలను ప్రబోధించు వారివద్దనే యుండెను. ధృతరాష్ట్రుడు తన కొడుకులకు అంత్యక్రియలకై ధనమును కోరగా విదురుడు ధర్మరాజునకామాట చెప్పెను.

ధర్మరాజు భీముని పరుషవచనములను లెక్కచేయక తక్కిన ముగ్గురితో సంప్రదించి చాలధనము నిచ్చెను. ధృతరాష్ట్రుడంత్యక్రియలు పూర్తిచేసి విదుర, కుంతీ, గాంధారులతో నరణ్యమునకు పోయెను. సంజయుడు కూడ వారితో బయలుదేరెను. పాండవులు నివారించినను కుంతి వనమునకు వెళ్ళెను. వారు గంగాతీరమున శతయూపాశ్రమము చేరి అక్కడ పర్ణకుటీర మేర్పరచుకొని యచట తప మొనర్చిరి/వారు వెళ్ళిన రెండేళ్ళకు ధార్మికుడైన ధర్మరాజు వారి యెడబాటు నోర్వలేక నేను కలలో బలహీనురాలనుగా కుంతిని చూచినాను. మన తల్లిని చూడవలెనని నామనస్సు కోరుచున్నది. మహాత్ములగు విదుర సంజయులను పితరులను దర్శించి రావలెననుకొనుచున్నాను. మన మందరము కలసిపోవుట యుక్తమని తోచుచున్నది. అని పలుకగా పాండవులు ద్రౌపది సుభద్ర ఉత్తర నగరజనులు శతయూపాశ్రమము చేరిరి.

అచట విదురుడు మాత్రము కనబడ లేదు, అతని గూర్చి ధర్మరాజు ధృతరాష్ట్రునడిగెను. ధృతరాష్ట్రుడాతడెక్కడో ధ్యానము చేయుచుండునని చెప్పెను. మరునాడు తీవ్ర తపస్సుచే కృశించిన విదురుని చూచి ధర్మరాజు నమస్కరింపగా విననట్లు స్థాణువువలెను నాతడుండెను. ఒక్కక్షణములో విదురుని నుండి యొక మహాద్భుత తేజము వెడలి ధర్మరాజులో లీనమయ్యెను. ధర్మరాజు విదురునిని మరణమునకు దుఃఖించి వానికి దహనసంస్కారము చేయబూనగా నశరీరవాణి యాతని శరీరమును దహింపవల సిన పనిలేదని పలికెను. అంతట పాండవులు గంగలో స్నానము చేసి ధృతరాష్ట్రునకు జరిగిన విషయమును తెల్పిరి.

పిమ్మట పాండవులు పౌరులును వెనుకటి యాశ్రమమునకు వచ్చిరి. అప్పుడు వ్యాసమహర్షి నారదుడు కొందరు యితర మునులును పాండవుల వద్దకు వచ్చిరి. అప్పుడు కుంతివ్యాసుని చూచి తపోధనా! ద్వైపాయనా! నాకు కుమారుడైన కర్ణుని చూడవలెనని కుతూహలముగా నున్నది. నాకాతనిని చూపించుము - ఇందుకు నీవే సమర్థుడవు అని పలుకగా గాంధారి దుర్యోధనుని వాని సోదరులను చూపించు

మనెను. సుభద్ర అభిమన్యుని చూపుమనెను. అంతట వ్యాసుడు గంగా తీరమున ప్రాణాయామము చేసి యాదేవిని హృదయ కమలమున ధ్యానించి ధర్మరాజాదులను రావింపగా వారు గంగలో స్నానము చేసి పరిశుద్ధులైరి. వ్యాసుడు పరదేవతనిట్లు స్తుతించెను.

ఓ బ్రహ్మరూపిణీ! మణి ద్వీపవాసినీ! నీకు నమస్కారములు నేను మరణించిన వారిని చూపలేను నీవే యామృతవీరులను చూపింపుమనగా భువనేశ్వరి స్వర్గమునుండి మృతవీరులను రావించి యక్కడి వారికి చూపెను. అట్లు చనిపోయి మరల కనబడిన తమ యాప్తబంధువులను కుంతి గాంధారి సుభద్ర ఉత్తర పాండవులు చూచి ముగ్ధులై శ్రద్ధాంజలి ఘటించిరి.

పిమ్మట వ్యాసుని అమిత మహిమచే వచ్చినవారు మరల తమతమ స్థానములకు పంపబడిరి. ఈ విధముగా పాండవులు దేవి దయవలన ఇంద్ర జాలమువంటి దృశ్యమును చూచిరి. తరువాత నందరు తమతమ నివాసములకు వెళ్ళిరి. ఆనాటికి మూడవదినమున ధృతరాష్ట్రుడు గాంధారీ కుంతీ సహితుడై వనమందలి దావాగ్నిలో పడి భస్మమయ్యెను. సంజయు డంతకు పూర్వమే ధర్మరాజును ధృతరాష్ట్రుని వదలి తీర్థయాత్రకు వెళ్ళెను.

ఈ విషయములు నారదుని వలన తెలిసికొని ధర్మరాజు మిగుల దుఃఖించెను. కౌరవుల నాశము పిమ్మట ముప్పదియారేళ్ళకు యాదవులెల్లరు ప్రభాసతీర్థము నమసరించిరి. శ్రీకృష్ణుడవతారము చాలించుట విని వసుదేవుడు భువనేశ్వరీదేవిని ధ్యానించుచు ప్రాణములు వదలెను. అర్జునుడు మరణించిన యాదవులకు తగినట్లు దహనాది సంస్కారముల నొనర్చెను. అష్టమహిషులు శ్రీకృష్ణునితోపాటు దహనము నొందిరి. రేవతితో బలరాముడు నగ్నిలో దహింపబడెను.

అర్జునుడు ద్వారకనుండి జనులను వెడలించిన పిమ్మట సముద్ర మా పట్టణమును ముంచి వైచెను. అర్జునుడు అని రుద్ధుని కొడుకును ఇంద్రప్రస్థ పురమునకు రాజుగా చేసెను. తరువాత అర్జునుడు తన కష్టములనన్నిటిని వ్యాసునకు చెప్పి దుఃఖించెను. చోరులు కృష్ణుని భార్యల సొమ్ములను హరించిరి. వ్యాసునిచే నోదార్చబడి అర్జునుడు తేజోహీనుడై జరిగిన దంతయు ధర్మరాజునకు తెలిపెను. ధర్మరాజు ముప్పది యారేండ్లు వయస్సు గల పరీక్షిత్తునకు పట్టము గట్టెను. పిమ్మట తమ్ములతో ద్రౌపదితోడనుహి మాద్రికి వెళ్ళి యచటనే ప్రాణములు వదలిరి. పరీక్షిత్తు పరమధార్మికుడు రాజర్షి.

పరీక్షిత్తు శాపగ్రస్తుడగుట

పరీక్షిత్తు అరువది యేండ్లు చక్కగా పరిపాలించెను. ఒకనాడతడడవి కేగెను. అచట వేటాడుచు మధ్యాహ్నము వరకు తిరుగుటచే నాతడాకలిదప్పికలచే బాధపడ జొచ్చెను. దగ్గరలో ధ్యాననిమగ్నుడైన యొక మునిని చూచి జలమిమ్మనెను. అతడు సమాధిలో నుండి మాటాడలేదు. పరీక్షిత్తు దప్పికచే కలిమాయవలన కోపించి యచట చచ్చిపడియున్న పామును మహర్షి మెడలో వేసెను. మునిధ్యాన నిశ్చలుడై అట్లే యుండెను. రాజు ఇంటికి వెళ్ళెను. ఆ మునికుమారుడు శృంగి మహా తేజశ్శాలి గొప్పశక్తిమంతుడు. అతడు తన మిత్రులతో ఆడుకొనుచుండెను. ఆ బాలుని మిత్రుడొకడు నీ తండ్రి మెడలో నెవడో పాము వేసెనని చెప్పగా మునికుమారుడు కోపముతో వెంటనే దోసిలితో నీటిని తీసికొని నా తండ్రి మెడలో చచ్చినపామును వేసినవాడు తక్షకుని కాటుకు గురియై యేడుదినములలో మరణించుగాక యని శపించెను. మునికుమారులు కొందరు రాజభవనమునకు వెళ్ళి మునికుమారుడిచ్చిన శాపమును రాజునకు తెలిపిరి.

అంతట పరీక్షిత్తు శాపము తప్పదని తెలిసి వృద్ధులైన మంత్రుల రావించి శాపవిషయమును చెప్పి పూర్వమొక ముని మరణించిన తన భార్యను సగ మాయుస్సు నిచ్చి బ్రతికించుకొనెను. అట్లేదే నొకయుపాయము నాలోచింపుడు. ఏ యుపాయములేనిచో దైవమునే దిక్కుగా నమ్ముకొందునని పలికెను" అన్ని విని మంత్రులు ఆయుస్సు నిచ్చి ప్రియురాలిని బ్రతికించుకొన్న మునిఎవ్వరో ఆమె యెట్లు మరణించెనో తెలుపుడని కోరిరి. రాజా వృత్తాంతము నిట్లు చెప్పెను.

రురుముని ప్రియురాలిని బ్రతికించుకొనుట

భృగుమహర్షి భార్య "పులోమ" ఆమె అందాలరాశి. ఆమెకు చ్యవనుడను పుత్రుడు కలిగెను. చ్యవనునకు శర్యాతి కూతురు సుకన్య భార్య. సుకన్యయు సుందరాంగి. వారి కుమారుడు ప్రమతి. అతని భార్య "ప్రతాపి." ఆమె కుమారుడు రురువు. ఆ కాలములో "సూర్యకేతుడ"ను మహర్షి యుండెను. అతడు విశ్వావసు వలన మేనకకు జన్మించిన అందగత్తెయగు బాలికను ప్రమద్వరయను పేరు పెట్టి పెంచుచుండెను. కొంతకాలమునకు ప్రమద్వర సర్వలక్షణ శోభితయగు యువతి యయ్యెను రురుమహర్షి యొకనాడా యువతిని చూచి కామార్తుడాయెను. అతని తండ్రి దిగులుతో నుంటివేమని కుమారుని ప్రశ్నింప నాతడు స్థూలకేతు

నాశ్రమమందున్న ప్రమద్వరను నాకు భార్యగా చేయుమనెను. ప్రమతి స్థూలకేశుని తో మాట్లాడి రురువునకు వివాహము నిర్ణయించెను. వివాహమునకు ముందే నిద్రించుచున్న ప్రమద్వర నొకపాము కాటు వేయగా నామె మరణించెను. స్థూల కేశువు మిక్కిలి దుఃఖించుచుండెను. రురువా సన్నివేశమును చూచి బయటకు వచ్చి విరహాతురుడై బోరున ఏడ్చెను. కొంచెమాలోచించి యాతడు స్నానము చేసి ఆచమనమొనర్చి నేను నాగురువులను భక్తితో పూజించితినేని నాప్రియు రాలిపుడే మరల జీవించుగాక లేనిచో నేనును మరణింతునని పలికి దోసిలితో నీటిని నేలపై విడిచెను.

అంతటనొక దేవదూత రురువు వద్దకు వచ్చి నీ యాయుస్సును సగమును యీమెకిచ్చి బ్రతికించుకొనుమని సలహా యిచ్చెను. విశ్వావసువు కూడ స్వర్గము నుండి వచ్చెను. విశ్వావసు, దేవదూత లిరువురు ధర్మదేవునకు రురువు సగమాయువు ప్రమద్వరకీయ నిశ్చయించి నాడని చెప్పగా ఆతడు సమ్మతించెను. దేవదూత ప్రమద్వరను రురువర్ధాయువుతో పునర్జీవితురాల నొనర్చి వెంటనే యామెను రురునకు సమర్పించెను. కనుక మణిమంత్ర ఔషధములచే ప్రాణ రక్షణము శాస్త్రసమ్మతమైన యుపాయము. అని పలికి మంత్రులను తనకు రక్షకులనుగా చేసికొని ఏడంతస్తుల మేడ నిర్మింపచేసి మంత్రులతో ఆ మేడ నెక్కెను. రాజా మేడయందే స్నాన భోజనాది సర్వకార్యములు నిర్వర్తించుచు మంత్రులతో నాలోచ నలు చేయుచు దినములు లెక్కపెట్టుచుండెను.

పరీక్షిత్తు విప్రశాపమున మరణించుట

ఆ సమయమున మంత్రవేత్త యగు కశ్యపుడను నొక మునిధనార్థియై రాజు నకు చావు తప్పించి డబ్బు సంపాదించుటకు రాజున్నచోటకు బయలుదేరెను. ఆనాడే తక్షకుడు బ్రాహ్మణవేషముతో రాజు వద్దకు వెళ్ళుచు దారిలో కశ్యపుని చూచి నీవెక్కడకు యేమి పనిమీద వెళ్ళుచున్నావని ప్రశ్నింపగా నాతడు నా మంత్రప్రభావముచే రాజును బ్రతికించి ధనమును సంపాదింపవలెనని వెళ్ళుచు న్నాను అని పలికెను.

అప్పుడు తక్షకుడు నీకు కావలసినంత ధనము నేనే యిచ్చెదను శ్రమపడక నీవింటికి వెళ్ళుమనగా కశ్యపుడు ధ్యానించి రాజునకు మరణము తప్పదని యెరిగి తక్షకుని నుండి కావలసిన ధనమును తీసికొని యింటికి వెళ్ళెను. తక్షకుడు సర్పము లను తాపసులనుగా మార్చి రాజదర్శనమునకు పంపెను. తాను కూడ తాపస

వేషముతో మంచిఫలములను రాజునకు తీసికొని వెళ్ళుచు నొక పండులో చిన్న పురుగు రూపమున తానుదూరి యుండెను. ఆనాడు రాజ దర్శనము నిషేధింప బడుటచే మరునాడు రమ్మని ద్వారపాలకులు చెప్పిరి. బ్రాహ్మణవేషములో నున్న సర్పములు తాము తెచ్చిన ఫలములను మహారాజునకు పంపి వెడలిపోయిరి.

పిమ్మట రాజు మంత్రులతో మీరీపండ్ల నారగింపుడు. నేను కూడ నొకపండును తినెదనని యొక పండును చీల్చగా నల్లని కన్నులతో ఎఱ్ఱనిపురుగు కంటబడెను. "ఇప్పుడు సూర్యుడస్తమించును. నాకు శాపము గడచినది. నేను తక్షకవిషమునకు భయపడుటయేల? యని యాపురుగును తన కంఠముపై నుంచు కొనెను. ఆ పురుగు వెంటనే భయంకర తక్షకరూపము దాల్చి రాజుమెడను చుట్టి కాటు వేసెను. మంత్రు లెల్లరాశ్చర్యపడి మిక్కిలి దుఃఖించిరి.

ఆ సర్పమును చూచి యెల్లరు భయపడి పరువెత్తిరి. రక్షకులు గొల్లున నేడ్చిరి. హాహాకారములు మిన్ను ముట్టినవి. తక్షకుని విషాగ్ని జ్వాలలు చెలరేగి రాజును నిలువున కాల్చి ప్రాణములను తీసినవి. తక్షకుడు రాజు ప్రాణములు తీసి యాకాశమున కెగిరెను. రాజు కాలిపడిన చెట్టువలె ప్రాణాలు వదలి నేలపై కూలెను. జనులెల్లరు మృతుడయిన రాజును చూచి మిగుల దుఃఖించిరి. పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుడు పసినాడగుటచే మంత్రులు రాజునకు పరలోక క్రియలు జరిపించిరి. మంత్రులు పౌర జానపదులును బాలుడగు జనమేజయుని ఒక సుముహూర్తమున సింహాసనముపై కూర్చుండబెట్టిరి. జనమేజయునకు కృపాచార్యులు ధనుర్వేదమునంత యును నేర్పెను. జనమేజయుడుఅన్ని విద్యలను నేర్చి బలశాలియై పరమార్థ వేత్తయై జితేంద్రియుడై ధర్మరాజువలె రాజ్యపరిపాలన మొనర్చెను. అతనికి కాశిరాజు సువర్ణవర్మాక్షుడు వపుష్టమ యను తన కన్యనిచ్చి వివాహము జరిపెను. తన పరిపాలనచే ప్రజలను పరీక్షిత్తు సంతసింపజేసెను.

ఆస్తీక మహాముని జనమేజయుని సర్పయాగమును మాన్పించుట

తక్షకునిచే బాధింపబడిన ఉత్తంకుడను ముని జనమేజయుని వద్దకు వచ్చి నీతండ్రిని చంపిన తక్షకునకు నీవు ప్రతీకారము చేయకుండుట న్యాయము కాదని పలికి పూర్వము రురువను మునితన భార్య పాముకాటుచే మరణించగా కనపడిన ప్రతిపామును చంపెనని చెప్పి ప్రతీకారచర్యకు ప్రోత్సహింపగా జనమేజయుడు మంత్రుల రావించి నేను సర్పయాగమొనర్చి సర్పములు నగ్నిలో వేల్చి

తక్షకునకు ప్రతీకారమొనర్ప నిశ్చయించితిని. గంగాతీరమున యాగమునకు తగిన చోటు నిర్ణయింపుడు. నూరుస్తంభములతో మండపము నిర్మింపవలెను. అందు శ్రేష్ఠమైన యజ్ఞవేదిక నమర్పదలయును. సర్పయాగము మహా ఘనముగా సాగవలెను. ఈ యాగమందు తక్షకుడు పశువు ఉత్తంక మహర్షి హోతగా నుండవలయును. త్వరగా వేదపారగులగు బ్రాహ్మణుల నాహ్వానింపుడు అని యాజ్ఞ యిచ్చెను. తక్షకుడీ సంగతి తెలిసి యింద్రుని రక్షింపుమని కోరగా నాతడు తక్షకునకు భయమిచ్చెను. ఉత్తంకుడు యీ విషయము తెలిసి యింద్రునితో సహ తక్షకుని వేల్చుచున్నానని మంత్రము చదివెను. అప్పుడు తక్షకుడు జరత్కారు కుమారుడగు నస్తీకుని స్మరింపగా నాతడు జనమేజయుని యజ్ఞము వద్దకు వచ్చి రాజును స్తుతింపగా జనమేజయుడు సంతోషించిన కోరిన యేమని అడిగెను.

ఆస్తీకుడు మహారాజా! ఈయజ్ఞము నాపివేయుము. ఇదియే నాకోరిక అని పలికెను. సత్యమునకు బద్ధుడైన జనమేజయుడు యాచకుని కోరిన ప్రకారము యజ్ఞమును విరమించెను. కాని జనమేజయమహారాజునకు శాంతి చేకూరలేదు. అతడు తన మనశ్శాంతికి వేదవ్యాసమహర్షి నుపాయమడిగెను. వ్యాసమహర్షి మహాసభలో జనమే జయునకు రసభరితమైన దేవీ భాగవతమును వినినచో నీకు మనశ్శాంతి కలుగ గలదనెను. అప్పుడు జనమేజయుడీ యాస్తీకుడెవడు ఈ యాగవిఘ్నము నేల చేసెను. సర్పములను రక్షించినచో వీనికి ఏమిలాభము? తెలుపమనగా వ్యాసుడిట్లు చెప్పెను.

ఆస్తీక మహాముని జన్మ వృత్తాంతము

పూర్వము జరత్కారువను ముని గృహస్థుడుకాలేదు. అందుచే నతని పితృదేవతలు పెద్దగుంటలో వ్రేలాడుచుండిరి. వారిని చూచి జరత్కారువు యిందుకు కారణమడుగగా నీవు పెండ్లి చేసికొనక పోవుటయే యని వారు సమాధానమిచ్చిరి. నీవు పెండ్లి చేసికొనుమని వారు జరత్కారునడిగిరి. జరత్కారుడు పూజ్యులారా! నా పేరుతో సమానమగు పేరు కలిగి అనుకూలురాలైన కన్య కోరకనే లభించినచో తప్పక పెండ్లియాడి గృహస్థ జీవితము సాగింతునని వారితో పలికి తీర్థయాత్రకు వెళ్ళెను. నాగమాతయైన కద్రువ తన మాట వినని పాములను అగ్నిలో పడునట్లు శపించెను. అవి యన్నియు జనమేజయుని సర్పయాగమున అగ్నికాహుతియైనవి. తల్లిచే శపింపబడిన వాసుకి మొదలగు పన్నగములు బ్రహ్మను శరణువేడుగా నాతడు జరత్కారు మునికి అతని పేరుగల నాగకన్యను వివాహము చేసినచో

నా దంపతులకు పుట్టువాడు మీకష్టమును తొలగింపగలడని చెప్పెను. అతడాస్తీకుడను పేర పిలువబడునని యు బ్రహ్మ పలికెను.

వాసుకి తన సోదరియైన జరత్కారును- జరత్కారు మునికి సవినయముగ సమర్పించెను. వారిరువురు పర్ణకుటీరమున నివసించుచుండిరి. జరత్కారు ముని తనకిష్టములేని పని చేసినప్పుడు నిన్ను విడిచిపోయెదనని భార్యతో చెప్పెను. అట్లే ఒకనాడు సూర్యాస్తమయ సమయమున నిద్రించుచున్న భర్తను సంధ్యా వందనము చేయుమని లేపగా నతడు కోపించి భార్యను విడిచి వెళ్ళెను. ఆమె సోదరునింట నివసించు నొకబాలుని కనెను. ఆతడే ఆస్తీకనామమున వన్నెకెక్కెను ఆతడు తన వారినిట్లు సంరక్షించెను. అవి దేవిని పూజింపమనెను.

తృతీయ స్కంధము

త్రిభువనేశ్వరీ దేవి ప్రాభవము

బ్రహ్మ నారదునికిట్లు చెప్పెను:- పూర్వము సర్వప్రపంచము జలమయమై యున్న పుడు నేను ఒక పద్మములో పుట్టితిని. అప్పుడు సూర్యుడుగాని, చంద్రుడు గాని, చెట్లుగాని, కొండలుగాని లేవు. పద్మము మధ్యలో కూర్చుండి నన్నెవరు పుట్టించిరి? ఈ మహాజలములో నాకు రక్షకుడెవడు? భూమి కనిపించుటలేదు. ఈ పద్మము ఎట్లు పుట్టినది? ఈనీటి అడుగున యేమున్నది? చూచెదనని ఆ నీటిలోనికి దిగి వేయి సంవత్సరములు వెదకినను భూమి కనిపించలేదు. అప్పుడు తపస్సు చేయుము, తపస్సు చేయుము, అని ఆకాశవాణి పలికిన మాట వినిపించినది. ఆ పద్మమందే వేయి సంవత్సరములు తపస్సు చేసితిని. అప్పుడు సృష్టి చెయుము అని మరల ఆకాశవాణి వినిపించినది. దేనిని సృష్టించవలయునో నాకు తెలియలేదు.

తరువాత మధుకైటభులను ఇద్దరు రాక్షసులు కనిపించిరి. అప్పుడు నేను భయపడి నీటిలో ఇంకా లోతుకు పోయాను. అక్కడ పరమాద్భుత స్వరూపము గల పురుషుడొకడు కనిపించెను. అతని శరీరము మేఘమువలె నల్లగా నున్నది. పచ్చని వస్త్రమును కట్టుకొని నాలుగు భుజములు తాల్చి వనమాలాలంకారముతో ఆదిశేషునిపై పరుండిన జగత్ప్రభువును చూచితిని. శంఖము, చక్రము, గద, పద్మము వానిచేతులలో ప్రకాశించు చున్నవి. అట్టి విష్ణుమూర్తిని చూచితిని. అప్పుడు ఏమిచేయవలయునో తోచలేదు. విష్ణుమూర్తికి నిద్ర కలిగించిన పరదేవతను స్తుతించితిని. అప్పుడు ఆ దేవి అతని శరీరము నుండి వెలుపలకు వచ్చి ఆకాశములో నిలిచినది. వెంటనే విష్ణుమూర్తికి మెలకువ వచ్చినది. తరువాత ఆ మహా విష్ణువే మధుకైటభులను రాక్షసులను సంహరించెను. తరువాత నేను, విష్ణుమూర్తి ఉన్నచోటునకే రుద్రుడు కూడవచ్చెను. మేము ముగ్గురము ఆ దేవిని చూచితిమి. స్తోత్రము చేసితిమి. అప్పుడామె సంతోషించి ఓ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులారా! జాగరూకతతో మీమీ పనులను నిర్వర్తించుడు. సృష్టిస్థితి లయములు మీరు చేయవలసిన పనులు కదా! ఇక మీమీ నివాసములకు పొండని పలికినది. ఆ మాటలువిని మేము తల్లీ ప్రపంచమంతయు జలమయమైయున్నది. ఇచ్చట నెట్లు సృష్టి చేయ గలము? అని పలుకగా పరదేవత చిరునవ్వు నవ్వినది. వెంటనే ఆకాశము నుండి చక్కటి విమానము వచ్చినది. ఆ దేవి దేవతాలారా! మీరీ

విమానము నెక్కుడు. మీకు ఆశ్చర్యకరమైన విషయమును చూపుదును అని పలికినది. అట్లేయని మేమును రత్నములతో అలంకరింపబడిన ఆ విమానము నెక్కితిమి. పరదేవత తన శక్తితో ఆ విమానమును ఆకాశమున నడిపినది.

త్రిమూర్తులు త్రిమూర్తులనుగని ఆశ్చర్యపడుట

ఆ విమానము మనోవేగముతో కదిలి ఒక స్థలమునకు చేరినది. అక్కడ నీరు లేదు. పండ్లతో నిండిన చెట్లు, కోకిల ధ్వనులుగల వనములు, ఉద్యానములు, స్త్రీ పురుషులు, పశువులు, భూమి, కొండలు, నదులు, చెరువులు, సెలయేళ్ళు కనిపించినవి. తరువాత ఒక అందమైన నగరము దివ్యమైన ప్రాకారము యజ్ఞ శాలలు, పెద్దపెద్ద మేడలు కనిపించినవి. ఇది స్వర్గమై యుండుననికొంటిమి. ఇంతలో ఆ నగరపు రాజు విమానములో జగదంబయు కనిపించిరి. వెంటనే మేమెక్కిన విమానము ఒక్క క్షణములో మరొక అందమైన ప్రదేశము చేరినది. అక్కడ నందనవనములో పారిజాత వృక్షము నీడన కామధేనువు, నాలుగు దంత ములుగల ఏనుగులు కనిపించినవి. మరియు అక్కడ అప్సరసలు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు, కల్పవృక్షములమధ్య గానము చేయుచు క్రీడించు చుండిరి. మరియు శచీదేవితో కూడిన ఇంద్రుడు వరుణయమ కుబేర సూర్యా గ్నులు కనిపించిరి. అప్పుడు ఆ పట్టణపురాజు మనుష్యులతో నీ విమానములో కనిపించెను. మేము కూర్చున్న విమానము వెంటనే వేగముతో బయలుదేరినది.

మా విమానము బ్రహ్మలోకమును చేరినది. అక్కడ బ్రహ్మదేవుని చూచి శివ కేశవులాశ్చర్యపడిరి. అక్కడ సభలో షడంగములతో కూడిన వేదములు మూర్తీభవించి ఉండినవి. సముద్రములు, నదులు, పర్వతములు కనిపించినవి. అప్పుడు శివకేశవులు క్రొత్త బ్రహ్మ ఇతడెవరని నన్నడిగిరి. ఇతడెవరో నేనెవరినో నాకే మాత్రము తోచుటలేదని సమాధానమును చెప్పితిని. అంతలోనే మనో వేగముతో విమానము కైలాస పర్వతశిఖరము నకు తీసికొని వెళ్ళినది. అచ్చట యక్షులు గుంపులుగా నుండిరి. కోకిల ధ్వనులు వీణావేణువు మొదలగు వాద్య ధ్వనులు వినిపించుచున్నవి. అప్పుడే శివుడు వృషభమునెక్కి బయలుదేరెను. గజానన, షడాననులు ప్రక్క నుండిరి. నందీశ్వరుడు ప్రమథగణములు జయజయ ధ్వనులు చేస్తున్నారు. ఆ మరొక శంకరునిచూచి మేము ఆశ్చర్యపడితిమి. మా విమానము వెంటనే అట నుండి వైకుంఠమునకు చేరినది.

అచట అందమైన విష్ణుమూర్తి భవనము గొప్ప సంపదను చూచితిమి. విమానము మరి కొంతదూరము వెళ్ళగానే అచట దివ్యాభరణములు ధరించి

లక్ష్మీదేవి చామరముతో సేవించుచుండగా చతుర్భుజుడు పీతాంబరధారి మేఘశ్యామల దేహుడైన విష్ణువును చూచి అత్యాశ్చర్యము నందితిమి. ఒకరినొకరు చూచు కొంటిమి. మరల వెంటనే విమానము వాయు వేగముతో అమృత సముద్రము వద్దకు తీసికొనివెళ్ళినది. ఆ సముద్రము నడుమ అనేక పుష్పవృక్షములు కలవు. అచట శివాకారమైన అందమైన శయ్య ఉన్నది. ఆ మంచముపై ఒక దివ్యాంగన కూర్చొనియున్నది. ఆమె యెఱ్ఱని గంధమును, పూలమాలను ధరించి నది. కోటిమెరుపు తీగెలకాంతితో ప్రకాశించుచున్నది. పాశాంకుశాది దివ్యాయుధములను ధరించి మందస్మిత వదనయైన ఆమూర్తి శ్రీభువనేశ్వరి. ఆమె హ్రీంకారమనే పంజరమందుండు చిలుక. కరుణామూర్తి నవయౌవన. అనేక మణిమయభూషణ విరాజిత దేవకన్యలతో చుట్టబడియున్నది. అట్టి యామెను చూచి మేము ఆశ్చర్యపడితిమి. ఎవరీ స్త్రీ? వేయి కన్నులు, వేయి చేతులు, వేయి ముఖములు కలిగియున్నది. ఈమె అప్సరస కాదు, గంధర్వ కన్యకాదు, ఎవరా? అని మేము నిర్ణయించలేక ఆశ్చర్యపడితిమి. అప్పుడు శ్రీమహావిష్ణువు సుందరమైన చిరునవ్వుతో నున్న పరదేవతను చూచి తన విజ్ఞానమువలన ఆమెను తల్లిగా మనస్సులో నిశ్చయించు కొని యిట్లు పలికెను.

ఈ పూజ్యురాలైన పరదేవత అందరకును కారణమైనది. మహావిద్యా స్వరూపిణి మహామాయా స్వరూపిణి, నాశరహితమైన పరిపూర్ణ ప్రకృతి స్వరూపము. అల్పబుద్ధులకు తెలియరానిది. యోగమార్గముచే తెలిసికొనదగిన దేవత, పరమాత్మ యొక్క యిచ్ఛా స్వరూపము. నిత్యానిత్యస్వరూపములు గలది. భాగ్యహీనులచే సేవింపరానిది. సమస్త ప్రపంచమునకు నియామకురాలు. వేదములను గర్భమందు ధరించినది. అందరకు మొదటి వ్యక్తియైన శక్తి స్వరూపము. అన్ని బీజాక్షరముల స్వరూపమైనది. సమస్తైశ్వర్యములును నీమె ప్రక్కనే యున్నవి. ఇట్టి యామె దర్శనముచే మనము ధన్యులము. కృతకృత్యుల మైతిమి. మనము పూర్వము చేసిన తపస్సునకీమె దర్శనమే ఫలము. పుణ్యాత్ములు గొప్పదాతలు, గొప్ప తపశ్శాలురు మాత్రమే యీమెను దర్శించగలరు. రజోగుణముతో కూడిన వారికి ఈమె దర్శనము పొందరానిది. మూలప్రకృతి స్వరూపమైన ఈమె పరమ పురుషునితో కూడి యీ ప్రపంచమునంతను సృష్టించి పరమాత్మకు చూపుచున్నది. చూచు వ్యక్తియు చూడబడు సర్వప్రపంచమును యీమెయే.

సర్వమునకు కారణమైన మంగళ స్వరూపమైన యాశక్తి యీమెయే. నేనుగాని తక్కిన దేవతలు గాని లక్ష్మి మొదలగు దేవతా స్త్రీలుగాని యీమెలోని లక్షాంశకు

కూడ సరిపోము. మహా సముద్రజలములో బాలునిగా ఉన్న నాకు కనబడిన దివ్యస్వరూప మీమెయే - మర్రియాకుపై పరుండి బాలుడనైన నన్ను ఉయ్యాలలో ఊపినది. ఈమెయే ఈ మనందరకు తల్లి. నేను చెప్పు చుంటిని వినుము"అని యిట్లు స్తుతించెను.

శ్రీదేవిని విష్ణువు స్తుతించుట

శ్లో॥ ఏషా భగవతీదేవీ సర్వేషాంకారణంహినః ।
మహావిద్యా మహామాయా పూర్ణా ప్రకృతి రవ్యయా ॥
దుర్జ్ఞేయాఽల్పధి యాందేవీ యోగమాయా దురాశయా ।
ఇచ్ఛా పరాత్మనః కామం నిత్యానిత్య స్వరూపిణీ ॥
దురారాధ్యాఽల్ప భాగ్యైశ్చ దేవి విశ్వేశ్వరీ శివా ।
వేదగర్భా విశాలాక్షీ సర్వేషా మాదిరీశ్వరీ ॥
ఏషా సంహృత్య సకలం విశ్వమాక్రీడతి నరక్షయే ।
లింగాని సర్వజీవానాం స్వశరీరే నివేశ్య చ॥
సర్వబీజమయీ హ్యేషా రాజతేసాంప్రతం సురే ।
విభూతయః స్థితాః పార్శ్వే పశ్యతాంకోటిశః క్రమాత్ ॥
దివ్యాభరణ భూషాఢ్యా దివ్యగంధానులేపనాః ।
పరిచరాద్యా పరాస్సర్వాః పశ్యతాం బ్రహ్మశంకరౌ ॥
ధన్యావయం మహాభాగాః కృతకృత్యాః స్మసాంప్రతం ।
యదత్ర దర్శనం ప్రాప్తా భగవత్యాః స్వయం త్విదమ్ ॥
తపస్తప్తం పురాయత్నాత్త స్యేదం ఫలముత్తమమ్ ।
పశ్యంతి పుణ్యపుంజాయే వదాన్యాయే తపస్వినః ॥
రాగిణోనై వపశ్యంతి దేవీం భగవతీంశివాం
మూల ప్రకృతిరేవైషా సదా పురుషసంగతా ॥
బ్రహ్మాండం దర్శయ త్యేషాకృత్వావై పరమాత్మనే
ద్రష్టాఽసౌ దృశ్యమఖిలం బ్రహ్మాండం దేవతాస్సురే ॥
తస్యైషాకారణం సర్వా మాయా సర్వేశ్వరీ శివా
క్వాహం వాక్యసురాస్సర్వేరమాద్యాః సురయోషితః ॥
లక్షాం శేన తులామస్యాన భవామః కథంచన
సైషావరాంగనానాము యాదృష్టావై మహార్ణవే ॥

బాల భావే మహాదేవీ డోలయం తీవమాంముదా
శయానంవటపత్రేచ పర్యం కేసుస్థిరేదృఢే ॥
పాదాంగుష్ఠం కరేకృత్వా నివేశ్యముఖపంకజే
లేలిహంతం చక్రీడంతం అనేకైర్బాలచేష్టితై: ॥
రమమాణం కోమలాంగం వటపత్ర పుటే స్థితం
గాయం తీడోలయం తీచ బాల భావాన్మయిస్థితే ॥
సేయం సునిశ్చితం జ్ఞాతం మేదర్శనాదివ
కామంనో జననీ సైషాశ్రుణుతం ప్రవదామ్యహం ॥
అనుభూతే మయా పూర్వం ప్రత్యభిజ్ఞానముత్థితా ॥

స్తోత్ర భావము :- పూజ్యురాలయిన ఈ దేవి మహావిద్య, మహామాయ, సంపూర్ణ వినాశము లేనిది ప్రకృతిరూప. ఇట్టి యీమెయే మా అందరకును కారణము. ఈమె అల్పబుద్ధి కలవారికి యెరుగరానిది. ఈ యోగమాయ అభిప్రాయమే అర్థము కాదు. పరమాత్మయొక్క యిచ్ఛారూపమైన నిత్యానిత్య స్వరూపిణి. విశ్వేశ్వరి, శుభప్రదయగు నీమెను మందభాగ్యులు పూజింపజాలరు. ఈమె వేదగర్భ. విశాలాక్షి. అన్నిటికిని ఆదియైన ఈశ్వరి. ఈమెయే సమస్త విశ్వమును నశింపజేయుట యీమెకు ఒక క్రీడ. సర్వ ప్రాణుల చిహ్నములను తన శరీరము నందుంచుకొని యీమె సర్వబీజ స్వరూపిణి యగుచున్నది. అనగా మరల సృష్టించు సమయమున ఆయా ప్రాణులను సృష్టించుచున్నది. ఈమె సమీపమున కోట్ల కొలది విభూతులు గలవు. వీరు దివ్యాభరణములు, దివ్యగంధములను కలిగి యుందురు. ఇట్టి వీరందరును దేవీపరిచర్యయందు ఆసక్తులు. శివ,బ్రహ్మలారా! ఈ విషయమును చూచుచున్నారు కదా! యిట్టి యీమెను చూచుటచే మీరేగాక మేమును అదృష్టవంతులము, కృతకృత్యులమగుచున్నాము. ఇట్టి యీమెను చూచుటచే పూర్వజన్మలో మేము చేసిన తపములు ఫలించినవని తలచుచున్నాము. ఇట్టి యీమెను చూచుటయు మహాతపఃఫలమే.

శ్రీమహావిష్ణువీ రీతిగా స్తుతించి, శివబ్రహ్మలతో "మనము నమస్కరించుచు నీమె ప్రక్కన నిలుచుందము. మహామాయా స్వరూపిణి యగు నీమె మనకు వరములిచ్చును. ఆమె పాదములవద్దకు చేరి నిర్భయముగా స్తోత్రము చేయుదము. ఒకవేళ ద్వార పాలకులుగాని పరిచారకులుగాని మనలను నివారించినచో అక్కడే నిలిచి స్తోత్రమును పఠించుదము అని పలికెను. విష్ణువు యిట్లు పలుకగా శివుడు బ్రహ్మకూడ సంతోషించి ఆమెవద్దకు వెళ్ళుటకు త్వరగా సిద్ధపడిరి. ద్వారము దగ్గరకు వెళ్ళి సందేహించుచున్న వీరిని చూచి ఆమె చిరునవ్వు నవ్వుతూ ముగ్గురినీ

ఆడువారినిగా చేసినది. దేవి మనలను అందగత్తెలైన యువతులనుగా చేసినది. అని వారు సంకోచము లేకుండా ఆమె దగ్గరకు చేరిరి. ఆమె తన పాదముల వద్ద స్త్రీ రూపముతో నున్న మాపై ప్రేమతో నిండిన చూపును ప్రసరింపచేసినది. మేము ముగ్గురము నమస్కరించి మా స్త్రీరూపములను పరస్పరము చూచుకొంటూ అనేక మణులతో అలంకరింపబడిన కోటి సూర్యులకాంతితో వెలుగొందుతున్న ఆమె పాదపీఠమును చూచుచు నిలిచి యుంటిమి.

ఆ దేవి చెలికత్తెలు వేలసంఖ్యలో నుండిరి. కొందరు ఎఱ్ఱని వస్త్రముల ధరించినవారు. కొందరు నీలవస్త్రములను, మరికొందరు పచ్చని వస్త్రములను ధరించిరి. అందరు సుందరమైన ఆకారము కలవారు, విచిత్ర భూషణములు వస్త్రములు కలవారు. వీరందరు ఆమె సేవకై నిలిచియున్న పరిచారికలు. కొందరు గానము చేయువారు, మరికొందరు నాట్యము చేయువారు, వేరొక కొందరు వీణావేణు మద్దెల మొదలగు వాద్యములతో సేవలందించుచుండిరి. నారదా! అక్కడ నేను చూచిన మరియొక అద్భుత దృశ్యమును చెప్పుదును వినుమని బ్రహ్మ యిట్లనెను. ఆ పరదేవత యొక్క కాలిగోరునందు ప్రపంచమంతయు కనిపించినది. నేను విష్ణువు, రుద్రుడు, వాయువు, అగ్ని, యముడు, సూర్యుడు, వరుణచంద్ర కుబేర, దేవేంద్రులు, పర్వతములు, నదులు, సముద్రములు, గంధర్వులు, అప్సరసలు, నారద తుంబురాదులు, అశ్వినీదేవతలు, పితృదేవతలు, శేషాది సర్పములు, రాక్షసులు, వైకుంఠము, బ్రహ్మలోకము, కైలాసపర్వతము సమస్తమును ఆమె కాలిగోటిలో చూచితిమి. మరియు నేను పుట్టిన పద్మము అందులో నా స్వరూపము శేషశాయియైన విష్ణువు మధుకైటభులు కనిపించిరి. ఇట్టి ఆ దృశ్యమును చూచి ఆశ్చర్యపడి మేము ముగ్గురము (బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులము) ఆ దేవిని సమస్తమునకు తల్లిగా భావించితిమి. అలా చూచుచుండగనే వంద సంవత్సరములు గడిచినవి. మమ్ములను చెలికత్తెలు గనే అమె పరిచారికలు తలచిరి. మేము చాలా సంతోషముతో నుంటిమి. ఒకనాడు యువతిరూపములో నున్న భువనేశ్వరీదేవిని విష్ణువిట్లు స్తుతించెను.

స్త్రీ రూపములోను విష్ణువు చేసిన దేవీస్తుతి

నమోదేవ్యై ప్రకృత్యైచ విధాత్ర్యైసతతం నమః ।
కల్యాణ్యై కామదాయైచ వృద్ధ్యైసిద్ధ్యై నమోనమః ॥
సచ్చిదానందరూపిణ్యై సంసారారణయే నమః ।
పంచకృత్య విధాత్ర్యైతే భువనేశ్యై నమోనమః ॥

సర్వాధిష్ఠాన రూపాయై కూటస్థాయై నమోనమః ।
అర్ధమాత్రార్ధ భూతాయై హృల్లేఖాయై నమోనమః ॥
జ్ఞాతంమయాఖిలమిదంత్వయి సన్నివిష్టం ।
త్వత్తోఽస్య సంభవలయావపి మా తరద్య ॥
శక్తిశ్చతేఽస్య కరణే వితతప్రభావా
జ్ఞాతాధునా సకలలోకమయీతి నూనమ్॥
విస్తార్య సర్వమఖిలం సదసద్వికారం
సందర్శ యస్య వికలాపురుషాయకాలే ।
తత్త్వైశ్చ షోడశభిరేవచ సప్తభిశ్చ
భాసీంద్రజాలమివ నః కిలరంజనాయ ॥
నత్వామృతే కిమపివస్తు గతం విభాతి
వ్యాప్యైవ సర్వమఖిలం త్వమవస్థితాసి ।
శక్తిం వినావ్యవహృతౌ పురుషోఽప్యశక్తః
బంభణ్యతే జనని బుద్ధిమతాజనేన ॥
ప్రీణాసి విశ్వమఖిలం సతతం ప్రభావైః
స్వైస్తేజసాచసకలం ప్రకటీకరోషి ।
అత్స్యేవదేవి తరసాకిల కల్పకాలే
కోవేద దేవి చరితం తవవైభవస్య ॥
త్రాతావయం జననితే మధుకైటభాభ్యాం
లోకాశ్చతే సువితతాః ఖలుదర్శితావై ।
నీతాస్సుఖస్య భవనే పరమాంచకోటిం
యద్దర్శనం తవ భవాని మహా ప్రభావత్ ॥
నాహంభవోన చవిరించి వివేదమాతః
కోన్యో హివేత్తి చరితం తవ దుర్విభావమ్ ॥
కానీహసంతి భువనా ని మహాప్రభావే
హ్యస్మిన్భవాని చరితే రచనాకలాపే ॥

స్తోత్ర భావము:- ప్రకృతి విధాత్రిరూపులతో నుండు సమస్త శుభస్వరూప దేవతా మూర్తివగు నీకు నమస్కారము. నీవు కోరికల తీర్చుదానవు. అభివృద్ధి నీ స్వరూపము. కార్యసిద్ధి నీరూపము, సచ్చిదానంద స్వరూపురాలవు. ఈ సర్వ ప్రపంచము నీయందే ఉన్నట్లు నేను తలచుచున్నాను. తల్లీ నీవలననే సృష్టిస్థితి

లయములు జరుగుచున్నవి. సమస్తలోకములు నీ స్వరూపమేయని యిప్పుడు నేను తెలుసుకొంటిని. సమస్తమును నీవు సృష్టించి పరమపురుషునకు చూపించు చుంటివి. ఇంద్రజాల విద్య నేర్చినదానివలె నీవు నీసృష్టి నైపుణ్యముచే మమ్ము రంజింప చేయుచుంటివి. నీవు సర్వమును వ్యాపించి యున్నావు. శక్తి స్వరూపమగు నీవులేనిచో పరమ పురుషుడును అసమర్థుడే యగుచున్నాడు. ప్రళయకాలములో సమస్తమును లయము చేయు నీచరిత్రను వైభవమును తెలుసుకొన్న వాడెవడును లేడు. మధుకైటభ రాక్షసుల నుండి మమ్ము రక్షించితివి. మాకు పరమ సుఖప్రదమైన నీ దర్శనము ననుగ్రహించితివి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకే నీ మహిమ తెలియదంటే యితరుల విషయము చెప్పనేల? ఈ విధముగా విష్ణువు స్తుతింపగా తరువాత శివుడిట్లు స్తుతించెను :-

శ్రీదేవిని శివ బ్రహ్మలు స్తుతించుట

యదిహరిస్తవ దేవి విభావజ స్తదను పద్మజ ఏవతవోద్భవ : ।
కి మహమత్ర తవాపి నసద్గుణ స్సకలలోక విధౌ చతురాశివే ॥
త్వమసి భూస్సలిలం పవనస్తథా ఖమపివహ్ని గుణశ్చ తథా పున: ।
జననితాని పున: కరణానిచ త్వమసి బుద్ధి మనోప్యథాహంకృతి: ॥
నచవిదంతి వదంతిచయే౽న్యథా హరి హరా జకృతం నిఖిలం జగత్ ।
తవకృతాస్త్రయ ఏవసదైవతే విరచయంతి జగత్య చరాచరమ్ ॥
అవని వాయుఖ వహ్నిజలాదిభి స్వవిషయైస్స గుణైశ్చ జగద్భవేత్ ।
యదితథాకథ మద్య చతత్స్ఫుటం ప్రభవతీతి తవాంబ కళామృతే ॥
భవసి సర్వమిదం సచరాచరం త్వమజ విష్ణు శివాకృతి కల్పితమ్ ।
వివిధ వేషవిలాస కుతూహలై ర్విరమసేరమసేంబ యథారుచి ॥
సకలలోక సిసృక్షురహం హరి: కమల భూశ్చభవాయ యదాంబికే ।
తవ పదాంబుజ పాంసు పరిగ్రహం సమధి గమ్యతదానను చక్రిమ॥
యది దయార్ద్రమనా నసదాంబికే కథమహం విహితశ్చతమోగుణ:॥
కమలజశ్చ రజోగుణ సంభవ: సువిహిత: కి ము సత్వగుణో హరి: ॥

స్తోత్ర భావము :- ఓ జగదంబ! బ్రహ్మ, విష్ణువు నీ ప్రభావముచేతనే జన్మించిరి. భూమి, ఆకాశము, నీరు, అగ్ని, ఇంద్రియములు, బుద్ధి, అహంకారము అన్నియు నీవే. తెలియనివారు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే యీ ప్రపంచ సృష్టి స్థితిలయము లను చేయుచున్నారని చెప్పుదురు. నీ దయవలననే వారీ పనులు చేయగలుగుచు న్నారు. సత్త్వరజస్తమో గుణములచే త్రిమూర్తులను నీవు సృష్టించుచుంటివి. విమానములో మేము సంచరించునప్పుడు మార్గములో అనంతములైన పుణ్యా

లోకములను చూచితిమి. అవి నిత్య నూతనములుగానున్నవి. వానిని ఎవరు నిర్మించిరో తెలియదు. నీవే యీ లోకములను పుట్టించి పెంచి నశింప చేయ దలచుచున్నావు. నీవు నీ భర్తతో కలిసియుండి నిత్యానందము ననుభవించు చున్నావు. మాకు నీ దివ్యమైనమార్గము బోధపడుటలేదు. మాకు నీ పాదపద్మము లందలి భక్తిని ప్రసాదింపుము అని స్తుతించిరి.

శ్రీదేవి బ్రహ్మకు తన తత్త్వమును ప్రతిపాదించుట

బ్రహ్మదులిట్లు స్తుతించిన తరువాత దేవి యీరీతిగా మాట్లాడినది. ఓ దేవత లారా! బ్రహ్మ మొక్కటియే ఉన్న వస్తువు. రెండవ వస్తువులేదు. ఆ బ్రహ్మ స్వరూపము నేనే. శక్తికి శక్తి కలవానికి భేదమున్నట్లు కనిపించును. కాని అది సరికాదు. మా యిరువురి భేదము అతిసూక్ష్మమై తెలియరానిది. అది తెలిసినవాడే యీ సంసార సముద్రమును దాటగలడు. ప్రపంచమంతయు ప్రళయములో మాయ యందు లయమునొందును. సృష్టికాలమున భిన్నభిన్నముగ కనిపించును. ప్రపంచములో నేనులేని వస్తు వేదియు లేదు. ఇదియే నిజమని తెలుసుకొనుడు. అన్ని రూపములు నాశక్తి స్వరూపములే నాశక్తి చైతన్యమే అంతటను వ్యాపించి యున్నది. దేవత లందరిలోను నేను అనేక నామరూపములతో అలరారుచుందును. నీటి యందలి చల్లదనము, అగ్నియందలి వేడిమి, సూర్యునిలోని ప్రకాశము, చంద్రునిలోని చల్లనివెన్నెలయు నేనే. నాశక్తి సహాయములేనిచో బ్రహ్మయు అణు మాత్రము కూడ కదలజాలడు. అన్నిటికి కారణమైనది శక్తియే యని గ్రహింప వలెను.

భూమిలో గొప్పశక్తి ఉన్నది. కనుకనే అన్నిటినీ మోయగలుగుచున్నది. ఆ శక్తియే లేనిచో భూమి పరమాణువును కూడ మోయజాలదు. అట్లే శేషుడు, ఆదికూర్మము, దిగ్గజములు, నా సహాయమువలననే గొప్ప భారమును మోయ గలుగుచున్నవి. నేను నీటినంతను త్రాగివేయగలను. సూర్యుని గాలినిస్తంభింప చేయగలను. మహత్తత్త్వము నుండి అహంకారము పుట్టును. దానివలన సమస్త ప్రాణి సృష్టియు చేయవచ్చును. ఇకమీరు మీమీలోకాలను నిర్మించుకొని సుఖముగా నివసించుడు. ఓ బ్రహ్మదేవా! నీవీ సరస్వతీ శక్తిని స్వీకరించుము. ఈమె మంచిరూపము కలది. రజోగుణముతో కూడినది. అందమైన చిరునవ్వు గలది. తెల్లనివస్త్రమును ధరించినది. శ్రేష్ఠమైన ఆసనముపై కూర్చున్నది. ఈమె నీకు సహధర్మ చారిణియై నీకు చేదోడువాదోడుగా నుండును. ఈమె నెన్నడును అవమానింపకుము. అందరికినీ యీమె పూజింపదగినదని భావింపుము. నీవు

యీమెతో కలిసి సత్యలోకమునకు పొమ్ము. అక్కడనుండి ప్రజలను సృష్టించుము. జీవులందరిని వారి వెనుకటి కర్మలనుబట్టి మునుపటివలెనే మరల సృష్టింపుము. ఇట్లు పదునాలుగు లోకములను సృష్టించుము. శ్రీమహావిష్ణువు సత్వగుణ ప్రధానుడు. అందువలన అతడు నీకంటె శ్రేష్ఠుడు. నీవెల్లప్పుడును వానిని గౌరవించి పూజించ వలెను. లోకములో అధర్మము ప్రబలినపుడు శ్రీహరి ధర్మసంరక్షణము నకై అవతరించును. అతడు అనేక అవతారముల నెత్తి రాక్షసులను వశింపజేసి సజ్జనులకు సంతోషమును కలిగించును. మహాబలశాలియగు శివుడు కూడ నీకు తోడుగా నుండును. అప్పుడు నీవు సమస్త ప్రపంచములను సృష్టించి స్వేచ్ఛగా విహరించుము. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు అందరు శాస్త్ర ప్రకారముగ గొప్ప గొప్ప దక్షిణలతో మిమ్ములను గూర్చి యజ్ఞములను చేయుదురు. దేవతలు యాగములలో అమృతమువలె మధురమైన నా నామమును జపించుచు సంతో షింతురు. పరమశివుడు తమోగుణ ప్రధానుడు. అతడు అన్ని యాగములలోను పూజ్యుడు. రుద్రాభిషేకములను పొందును. దేవతలకు రాక్షసులవలన భయము కలిగినపుడు నాదివ్యశక్తులు జన్మించి దేవతల భయమును తొలగించి వారిని కాపాడును.

నాదివ్యశక్తులు లోకోత్తరమైన పనులను చేయగలవు. ప్రణవరూపమైన నా రహస్య నవాక్షర మంత్రమును బీజాక్షరములతో పాటు ధ్యానముతో నెల్లప్పుడు జపించుచు నీ పనులనన్నిటిని చక్కబెట్టుకొనుము. ఈ మంత్ర రాజము కోరికల నన్నిటిని నెరవేర్పగలదు. ఈ మంత్రమును యే మరుపాటు లేకుండా హృద యములో నిలుపుకొనుము.

అని జగన్మాత బ్రహ్మకు చెప్పి చిరునవ్వు చిందిస్తూ శ్రీహరితో ఈ విధముగా చెప్పినది:- ఓ విష్ణూ! నీవు అందగత్తెయగు నీ లక్ష్మీదేవిని స్వీకరించుము. ఈమె నీ వక్ష స్థలమున నివసించును. ఈమె సిరిసంపద లకు గనివంటిది. నీవిలాసమున కనుకూలముగా ఈ కల్యాణిని నీకు సమర్పించుచున్నాను. ఈమె సమస్తలోకము లకు వెలుగు. ఈమెను నీ వెన్నడు నిందింపవద్దు. గౌరవాదరములతో చూడుము. నేను మీకు ఈరీతిగా కార్యభారమునకు సహాయము సమకూర్చితిని. దీనికి తిరుగు లేదు. దేవతల జీవనమునకు యజ్ఞములను నేర్పరచితిని. మీలోమీరు పోట్లాడు కొనకూడదు. ఓర్పుతో సమ భావముతో మెలగవలెను. మీరు ముప్పురు సమానులే. త్రిమూర్తులును నావలన పుట్టినవారే. విష్ణువే శివుడు శివుడే విష్ణువు వీరిరువురకు భేదమును భావించువాడు నరకమునకు పోవును. అట్లే బ్రహ్మయు. ఈ విష యమున సంశయింప పనిలేదు. వాగ్బీజము మాయా బీజము, కామబీజము గల

మంత్రము సమస్తములైన కోరికలను తీర్చగలదు. దీనిని నీకు ప్రసాదించితిని. ఈ మంత్రమును నియమముతో జపించుము. నీకు మృత్యుభయముండదు. నేను మాయాశక్తితో విహరించుచున్నంతకాలము జగత్తులుండును. చివరకీ చరాచర ప్రపంచము నాలో లీనమగును. అంతవరకు నీ మంత్రమును నిత్యము జపించుము. విష్ణూ ఇక నీవు వైకుంఠమును నిర్మించుకొని దానిలో సుఖముగా నివసించుము. నన్నెప్పుడును ధ్యానించుచుండుము. అవి యిట్లు పరదేవత విష్ణువుతో పలికినది. పిమ్మట శంకరుని చూచి అమృతము కురియుచున్నట్లు మధురముగా నిట్లుపలికెను.

ఓ మహాదేవ! నీవు సర్వశక్తి మయ స్వరూపయగు మహాకాళి గౌరిని స్వీకరించుము. నీవు కైలాసము నిర్మించుకొని అచ్చట స్వేచ్ఛగా నుండుము. నీకుతమో గుణము ప్రధానముగా నుండును. పరమాత్మను నిత్యము స్మరించుచు జాగరూకతతో తపస్సు చేయుము. నీవు సత్త్వగుణ సంపన్నుడవై శర్వరూపమును పొందెదవు. ఇట్లు మీరు ముగ్గురు త్రిగుణములతో సృష్టిస్థితి సంహారములను చేయుడు. అన్ని జగత్తులకును త్రిగుణములే మూలస్తంభములు. ఈప్రపంచ ములో ప్రతి వస్తువు త్రిగుణములతో కూడియే యుండును. నిస్సారమైన ఈ ప్రపంచమున నిర్గుణ తత్త్వమును చూడగలవాడు లేడు. పరమాత్మయే నిర్గుణ స్వరూపము. ఓ శంకరా! నేను సృష్టికాలమున గుణసహితురాలను లయ కాల మందు నిర్గుణ స్వరూపము కలదానను. పరమపురుషుని సమాగమమున సగుణనై యుందును. నేను సర్వమునకు కారణమైనదానను. అహంకారము త్రిగుణము లతో కూడినది. దానినుండి పంచతన్మాత్రలు వాటినుండి పంచ మహాభూతములు పుట్టినవి. ఇట్లు మీకు సంక్షేపముగా సృష్టిక్రమమును చెప్పితిని. ఇక మీరు విమానములమీద మీస్థానములకు వెళ్ళి మీమీ పనులను నిర్వహించుడు. మీకు ఆపద వచ్చినప్పుడు నన్ను మనస్సులో స్మరింపుడు. నేను మీ బాధలను తొలగించి శుభములను కలిగింతును. దేవతలారా! నన్ను సనాతన పరమాత్మ స్వరూపముగా నిత్యము స్మరింపుడు. మాలో నెవరిని తలచుకొన్ననూ మీకు కార్యసిద్ధి యేర్ప డును. మీరు మా మీదనే ప్రేమ విశ్వాసములనుంచుడు. లోకములో నితర వస్తువులను నమ్ముకొని మోసపోవద్దు. అవి నీటిబుడగలవంటివి.

ఈ విధముగా ఆ మహాశక్తి మాతో మాట్లాడి మమ్ము సంస్కరించి శ్రీమహా లక్ష్మిని విష్ణువునకు, మహాకాళిని శివునకు సరస్వతిని నాకు (బ్రహ్మకు) అర్పించి జగదంబ మమ్ము విడిచి వెళ్ళినది. ఆ ప్రదేశమును విడువగానే మేము పురుష

రూపములతో ప్రకాశించితిమి. అప్పుడిది అంతయు ఆదేవి యొక్క మానవా తీతము అలౌకికము అత్యద్భుతమైన ప్రభావమని మేము గ్రహించితిమి. మేమపుడు ఆదివ్యవిమానము నెక్కితిమి. అప్పుడు దేవీద్వీపము, అమృత సముద్రము అన్నియు మాయమైనవి. ఇది బ్రహ్మ నారదునకు చెప్పిన అద్భుత మైనగాథ.

శక్తి తత్త్వప్రతిపాదనము

బ్రహ్మ నారదునితో మరియు నిట్లనెను. శక్తి స్వరూపమును జ్ఞానశక్తి, క్రియా శక్తి, అర్థశక్తియని మూడువిధములు అనియు, జ్ఞానశక్తి సత్త్వగుణమునకు, క్రియా శక్తి రజోగుణమునకు అర్థశక్తి తమోగుణమునకు సంబంధించి నట్లుగను గ్రహించుము. పరమాత్మకు స్థూలరూపము, సూక్ష్మరూపము అని రెండు రూపము లున్నవి. మొదటిది నిరాకారము జ్ఞానరూపము వివర్తముల కన్నింటికిని కారణమైనది. రెండవది సాకారము సగుణము. ధ్యాన సమయ మందు దేవియొక్క దయా స్వరూపము నుపాసించవలెను. అది దేవిస్థూలరూపము. పరమాత్మలోని స్వరూపము సూక్ష్మము. ఆ సూక్ష్మరూపమునే సూత్రాత్మకమని పండితులు చెప్పు చున్నారు. పంచీకరణముచేత ఆకాశము మొదలగు పంచభూతములు నేర్పడినవి. ఆకాశమునకు శబ్దమొకటియే గుణము. వాయువునకు శబ్దము స్పర్శ రెండు గుణములు. అగ్నికి శబ్ద స్పర్శరూపములు మూడుగుణములు. నీటికి శబ్దస్పర్శరూప రసములు నాలుగు గుణములు. భూమికి శబ్దస్పర్శ రూప రస గంధములు ఐదు గుణములు. ఈ గుణముల కలయికచేత బ్రహ్మాండము పుట్టినది అని బ్రహ్మ నారదునకు చెప్పెను.

బ్రహ్మ నారదునకు త్రిగుణస్వరూపము వివరించుట

నారదుడు త్రిగుణముల స్వరూపమును గూర్చి వివరించి చెప్పుమనగా బ్రహ్మ ఆతనికిట్లు చెప్పెను. సత్త్వగుణమొక్కటియే యెచ్చటను నిలిచియుండదు. తక్కిన గుణములతో కలిసియే గోచరించుచుండెను. ఇంద్రియములు సమస్తావయవ ములు స్వచ్ఛముగా వికాసము చెందునప్పుడు మనస్సు నందే కోరికలులేనప్పుడు సత్త్వగుణము ప్రకాశించుచున్నదని తెలియవలయును. చంచలత్వము ఆవులింత స్తంభము సోమరితనము రజోగుణలక్షణములు, వివాదములందు చిక్కుకొనుట శరీరము బద్ధకించుట మొదలగు లక్షణములు గలది తమోగుణము. తమో గుణము వృద్ధి చెందినప్పుడు మనస్సు ఇంద్రియములును క్రియాశూన్యములగును. అని అంతట నారదుడు పరస్పర విరుద్ధములగు నీ మూడుగుణము లెట్లుకలిసి యుండునో వివరింపుమనగా బ్రహ్మ యిట్లు పలికెను.

ఆ గుణములు దీపకాంతి లక్షణముకలవి. వత్తితైలము జ్వాలపరస్పర విరుద్ధములైయైనను మూడును కలిసి వస్తువులను కనబడునట్లు చేయుచున్నవి కదా! అట్లే యివియును కలిసి వుండును. ఇవి సంసారమునకు కారణములన్ని బ్రహ్మనుండి వింటినని నారదుడు వ్యాసునకు తెలుపగా వ్యాసుడు జనమేజయునకు చెప్పెను. గుణములన్నిటిని కల్పించి జగన్నాటక మాడించు ప్రకృతి మహాశక్తి యెల్లరకు నారాధ్యదేవత. ఆ మహామాయా శక్తియే బ్రహ్మ విష్ణు రుద్రాదిదేవతలను గుణకర్మ విభాగము ననుసరించి సృష్టించును. అందరును ఆశక్తి సహాయముచేతనే పనులను నిర్వర్తింపగలుగుచున్నారు. కనుక జనమేజయా! దేవీ యజ్ఞమొనర్చి ఆ తల్లి నారాధింపుము. ఆ మాతృదేవి హరిహరబ్రహ్మలచే ఆరాధింపబడినది. అడవిలో క్రూరములైన మృగముల చూచి భయముతో "ఐ,ఐ" అని సున్న ప్రక్కన చేర్చకుండ ఉచ్చరించినను దేవి వాని భయమును పోగొట్టి కోరికలను తీర్చును. ఇందుకు సత్యవ్రతుని చరిత్ర దృష్టాంత మని చెప్పి యా చరిత్ర నిట్లు వివరించెను.

సత్యవ్రతుని చరిత్రము- వాగ్బీజ మహిమ- వాగ్బీజ ప్రభావమున సత్యవ్రతుడు సిద్ధినొందుట

ఓ జనమేజయా! ఒకప్పుడు నేనొక మునిసమూహములో గొప్ప పౌరాణికదివ్య కథను వింటిని. నేను తీర్థాటనము చేయుచు పవిత్రమగు నైమిశారణ్యము చేరితిని. అచట మహావ్రతులు, జీవన్ముక్తులు, మునిశ్రేష్ఠులునగు బ్రహ్మకుమారులు నివసించుచుండిరి. నేను వారెల్లరకు నమస్కరించితిని. అప్పుడచట సత్కథా కాలక్షేపము జరుగుచుండెను. వారిలో జమదగ్నిముని తక్కిన మునుల నిట్లు ప్రశ్నించెను. ఓ మహాతాపసులారా! బ్రహ్మ విష్ణు శివాదిదేవతలలో ఎవరు గొప్ప కోరికలన్నియు ఒకేమారు త్వరలో తీర్చి పూజలందుకొను దేవదేవోత్తము లెవరు? దేవతలందరిలో అతిశీఘ్రముగా సులభముగా ప్రసన్నుడగు దేవుడెవడు? అని ప్రశ్నించెను. ప్రశ్నను విని లోమశమహర్షి ఓ జమదగ్ని మునీ! నీ ప్రశ్నకు సమాధానము చెప్పెదను వినుమని లలితాదేవిని ఆరాధించి అన్ని కోరికలను తీర్చుకొనవచ్చునని యు ఆమె అంతకును మూలమైనదనియు, దేవలకెల్లరకు తల్లి యనియు, దయార్ద్రహృదయు రాలనియు, ఆమె అందరిచే సేవింపబడుచుండునని చెప్పి యీ విషయమున నొకకథ చెప్పెదని వినుమని యిట్లు పలికెను.

పూర్వమొక బ్రాహ్మణుడు ఒక దివ్యాక్షరము చ్చరించిన మాత్రముననే గొప్ప సిద్ధిని కైవసము చేసికొనెనని ఆ కథ చెప్పనారంభించెను. కోసలదేశమున దేవదత్తు

డను బ్రాహ్మణుడు సంతానము లేనివాడై యాగమొనర్చెను. ఆ యాగములో గోభిలుడనువాడు అప్రశుతిగ స్వరభంగముగా మంత్రము నుచ్చరించుటచే దేవదత్తుడాతని మూర్ఖుడవని నిందింపగా గోభిలుడు కోపముతో నీకు జన్మించు పుత్రుడు మూర్ఖుడు మాట నుచ్చరింపలేని వాడు అగుగాక యని శపించెను. దేవదత్తుడు భయపడి శాపమును తొలగింపుము, అనుగ్రహింపుమని యాతని పాదములపై తలనుంచి ప్రార్థించెను. అంతట గోభిలుడు దయార్ద్రహృదయుడై దేవదత్తునితో నీ కుమారుడు మూర్ఖుడయ్యును విద్వాంసుడై పేరు పొందునని అనుగ్రహించెను. దేవదత్తుడు యజ్ఞము పూర్తి చేసిన కొన్నిదినములకు ఆతని భార్య గర్భవతియై శుభలగ్నమున చక్కని కుమారుని కనెను. ఆ కుమారునకు "ఉతథ్యుడ"ని పేరు పెట్టిరి. అతని యెనిమిదవ ఏట ఉపనయనము చేసిరి. గురువు వేదము చెప్పగా ఉతథ్యుడు పలుకలేకుండెను. తల్లిదండ్రులనేకవిధముల ప్రయత్నించినను ప్రయోజనము లేకపోయెను. నలువురు నతనిని పరిహసించుచుండిరి. బంధువులు తల్లిదండ్రులు కూడ నిందించుటను సహింపలేక పవిత్ర గంగాతీరమునకు టీరమేర్పరచుకొని అందు నివసించుచుండెను. ఎప్పుడైనను అసత్యము పలుకనని ప్రతిజ్ఞ చేసినందున లోకులతనిని సత్యతపుడని పిలువ జొచ్చిరి. చదువు రానందులకు అనేకవిధముల పరితపించుచు పదిహేను సంవత్సరములు గడిపెను. నిత్యము సత్యమే పలుకుచుండుట వలన అతనికి సత్యతపుడను పేరు సార్థకమయ్యెను. అతని కీర్తి నలుదెసల వ్యాపించెను. ఒకనాడు బోయవాడొకడు బాణముతో పందిని కొట్టగా అది గడగడలాడుచు సత్యతపుని వద్దకు వచ్చెను. దానిని చూచి దయార్ద్రహృదయుడై సత్యతపుడు "ఐ" అని పందిని నదలించెను. అది మూలుగుచు ఆశ్రమపు పొదరిటిలో దూరెను. బోయవాడు పందిని వెదకుచు మునివద్దకు వచ్చి నమస్కరించి యిట్లనెను.

"ఓ మునీ! నా పంది యెటు పరుగెత్తెనో చెప్పుము. నీవు సత్యవ్రతుడవని పేరు పొందితివి. అని అడగగా ఆతడు పందిని బోయవాడు హింసించునని సత్యము చెప్పజాలకపోయెను. బోయవాని ఆకలిని చూచి సత్యము చెప్పవలెననియు తలచెను. ఈ రెండు విషయములు నెట్లు జతపడునని విచారించుచుండెను. అంతలో తలనని తలంపుగా "ఐ" అని పలికెను. అందుకు సరస్వతీ శక్తి సంతసించి అతడు తన వాగ్బీజమునే పలికెనని యతనికి గొప్ప పాండిత్యము ననుగ్రహించెను. ఆ వాగ్దేవతా ప్రభావముచే నతడు మహాకవి యయ్యెను. తన ముందు నిలిచియున్న బోయవానిని జూచి ఓ కిరాతా! పలుకునది చూడదు

చూచునది పలుకదు. కనుక నన్ను నీవేల ప్రశ్నించెదవు? అని సత్యవ్రతుడు పలుకగా కిరాతుడు పందిపై ఆశ విడిచి యింటికి వెళ్ళెను. పిమ్మట సత్యవ్రతుడు పండితుడుగా కవిగా గొప్ప కీర్తి గడించెను. వెనుకనతనిని నిందించి హేళన చేసినవారే అతని ప్రభావము తెలిసికొని మరల యింటికి తీసికొని వెళ్ళి ఆదరా తిశయముతో చూచి యాతని సత్కరించిరి.

దేవీ యజ్ఞవిధానము

జనమేజయుడు దేవీ యజ్ఞము యొక్క విధానమునడుగగా వేదవ్యాసు డిట్లు చెప్పెను. సాత్వికమైన యజ్ఞము మిక్కిలి దుర్లభము ఈ యజ్ఞము వైఖానస వ్రతనిష్ఠకల మునివర్యులకే చెప్పబడినది. తపస్సు చేయువారు న్యాయముగా సంపాదించినట్టియు అరణ్యమున దొరికిన సాత్వికమైన ఆహారమును భుజింతురు. ఆయాహారము మిక్కిలి మేలుచేయునది. ఇతరుల మేలుకోరి శ్రద్ధా భక్తులతో మంత్రసహితముగా చేయబడు యజ్ఞములు సాత్త్వికములు, ఇక రాజస యజ్ఞములు అధికద్రవ్యముతో కూడి యూపస్తంభము గలిగి అభిమానముతో కూడియుండును. ఇవి క్షత్రియులకు వైశ్యులకు చెప్పబడిన యజ్ఞములు. తామస యాగములనగా కామక్రోధలోభమదములగు దుర్గుణములను పెంచునట్టివి. క్రూరములైనవి యగు యాగములు. అవి రాక్షసులకు అని మహాత్ములు చెప్పినట్టివి. మహాత్ములైన మునులకు మానస యజ్ఞము చెప్పబడినది.

ఈ యాగములలో మానస యజ్ఞమొక్కటియే దోషరహితము పరిపూర్ణము పరిశుద్ధమునై ప్రకాశించునది. మొదట మనస్సును సంకల్ప రహితముగ నిష్కల్మ షముగ నుంచుకొనవలెను. రాగద్వేషములు నశించినచో మనస్సు పరిశుద్ధ మగును. నిర్మలమైన మనస్సు కలవాడే యజ్ఞము చేయుటకు సరియైన అధికారి. అట్టి అధికారి తన హృదయమున యజ్ఞ వృక్షస్తంభములతో సుదీర్ఘమైన చల్లని దేవీ మండపమును కల్పించుకొన వలయును. ఆ మండపములో తన పవిత్రమైన మనస్సుతో చక్కని యజ్ఞవేదికను కల్పించుకొని ఆ వేదికపై అగ్నులను శాస్త్ర ప్రకారము తన మనస్సుతో ప్రతిష్ఠించుకొనవలయును. ఆ మానసయాగమునకు బ్రహ్మ, అధ్వర్యుడు, హోతఉద్గాత ప్రతిహర్త ఇతర సభ్యులు మొదలగు బ్రాహ్మణు లను శాస్త్రప్రకారము ఋత్విక్కులుగా వరించాలి. ఆ ఋత్విక్కులను మనస్సుతోనే యథావిధిగ పూజించాలి. ఆ యజ్ఞవేదిక యందు ప్రాణము, అపానము, వ్యానము ఉదానము సమానము అనే ఐదు ప్రాణములు, ఐదు అగ్నులు వాటిలో ప్రాణము గార్హపత్యాగ్ని, అపానము ఆహవనీయాగ్ని వ్యానము దక్షిణాగ్ని సమానము

ఆవసధాగ్ని ఉదానము సభ్యాగ్నిగను చెప్పబడినవి. ఈ పంచాగ్నులు మిక్కిలి శ్రేష్ఠమైనవి. కోరికలను తీర్చునవి కూడా. తరువాత మనస్సునందు మిక్కిలి పవిత్రములైన నిర్గుణ ద్రవ్యములను భావించి సమకూర్చుకోవలయును. ఈ మానస యజ్ఞములో మనస్సును హోమముచేయు యజమానిగ నెన్నుకోవల యును. యజ్ఞాధి దేవతగా నిర్గుణ సనాతన బ్రహ్మముండవలెను.

పిమ్మట నిర్గుణ జగదంబ నుద్దేశించి కల్పించిన వస్తువులను బ్రహ్మాగ్నిలో హోమమును చేయవలయును. పిమ్మట మనస్సును ప్రాణమును సంకల్ప రహితములుగ చేయవలెను. ప్రాణములను కుండలినీ మార్గమున పరబ్రహ్మ మందు లగ్నము చేయవలయును. అప్పుడు సంకల్పవికల్పములు బ్రహ్మ సమాధిలో నశించి పోవును. సాధకుడు తన యనుభవముతో సర్వాత్మభూతయైన మహేశ్వరిని స్వయముగా సమాధిలో నిర్వికల్పుడై ధ్యానించవలెను. అప్పుడా యోగి సర్వప్రాణు లను తన యాత్మలోను తనను సర్వభూతాత్మలోను ఉన్నట్లు తెలిసి కొనగలుగును. అప్పుడు పరమ దివ్యమంగళ విగ్రహయగు శ్రీదేవీ దర్శన భాగ్యము ననుభవించును. ఆ పరమయోగి సచ్చిదానంద స్వరూపిణియగు పరదేవత యందు లీనమై బ్రహ్మానందము ననుభవించును. ఈవిధముగ జగదంబను మానస యాగ మున ధ్యానించువాడు సోమయాగము చేసిన ఫలమును పొందును. కృతకృత్యుడు జీవన్ముక్తుడు కూడనగును. వాని కోరికలన్నియు తీరును. అతడు మోక్షమును పొందును. ఇది నిజము. కనుక శ్రీభువనేశ్వరీ దేవిని గురూపదేశముచే ప్రయత్నించి తెలిసికొని ధ్యానింపవలెను. ఇట్లు నిశ్చలముగ మానసయజ్ఞము చేసినచో పరమపద సౌఖ్యమనాయాసముగ పొంద[illegible]ను. ఇతర యాగములు కోరికలతో కూడినవి క్షీణఫలములు. అని వ్యాసమహర్షి జనమేజయునకుప దేశించెను.

శ్రీమహావిష్ణువు చేసిన దేవీయజ్ఞమును వ్యాసుడు జనమేజయునకు వివరించుట

ఒకప్పుడు వైకుంఠమందున్న విష్ణువు అమృతసముద్రములోని మణు లతో అలకరింపబడిన ద్వీపమును తలచుకొన్నాడు. పూర్వమక్కడనే తాను మహా మాయను చూచి ఆమెనుండి మంత్రమును కూడా ఉపదేశమును పొందెను. తనను స్త్రీగా మార్చిన ఆ మహాశక్తిని తలచుకొని యజ్ఞము చేయదలపెట్టెను. విష్ణువు తన భవనమును విడిచి ఈశ్వరుని బ్రహ్మను వరుణుని ఇంద్రుని కుబేరుని వసిష్ఠకశ్యపదక్ష వామదేవ బృహస్పతుల నాహ్వానించి దేవీయజ్ఞమును నెరవేర్చుటకు

అతివిస్తారమైన వస్తు సమూహామును కల్పించెను. ఆవస్తుసమూహము మహా వైభవముతో మనోహరమై సాత్త్వికముగా నుండెను. శిల్పులచేత విశాలమైన మండప మును తయారు చేయించెను. నియమవంతులైన ఇరవై యేడుగురు ఋత్విక్కులను ఏర్పరచెను. విశాలమైన యజ్ఞవేదికను నిర్మించి దానిపై అగ్నిని ఉంచి శ్రీదేవీ బీజాక్షరములతో కూడిన దేవీ మంత్రములతో హోమము చేసిరి. అప్పుడాకాశవాణి మధురమైన కంఠస్వరముతో ఈ విధముగా పలికినది - ఓ విష్ణువా ! నీవు దేవతలందరిలో శ్రేష్ఠుడవు దేవత లందరకు పూజనీయుడవు సమర్థుడవు. ఇంద్రాదిదేవతలు నిన్ను పూజింతురు.

మానవులు నీయెడల మధురభక్తి పరిపూరితులై ఉందురు. మానవు లందరికీ వరముల నిచ్చువాడవుగా ప్రఖ్యాతి పొందినవాడవు. యజ్ఞములలో ముఖ్య దేవతవు యజ్ఞము చేయువారందరు నిన్ను పూజింతురు. రాక్షసులచే బాధింపబడి దేవతల నిన్ను శరణువేడెదరు. నీ వందరకును వరములనిచ్చువాడవు. అభయ ప్రదుడవు. అన్ని పురాణములలోను వేదములందును నీవు మిక్కిలి పూజింప దగినవాడవుగా చెప్పబడుదువు. లోకములో ధర్మము తగ్గిపోవునప్పుడు నీవు భూమిపై నవతరించి ధర్మరక్షణమును చేయుదురు. భూమియంతటను నీ యవతారములు మిక్కిలి ప్రసిద్ధిచెందినవి. మహాత్ములకును నీ యవతారములు గౌరవింప దగినవి. అన్ని అవతారములలోను నీ శక్తియే అయిన లక్ష్మి నీకు సహచారిణిగా ఉండును. నాయంశచే ఆమె అన్ని పనులను సాధించగలదు. నేనిచ్చిన వరములతో దేవతల సమస్త కార్యములను నీవు సాధించగలవు. నాశక్తి స్వరూపము పలుతెరగులనున్నను. నీ వెన్నడును నాశక్తి స్వరూపములను కించపరచవద్దు. ఆ శక్తులు కర్మభూమియైన భరతఖండములో అన్ని కోరికలను నెరవేర్చగలవు. పూజింపదగినవి. మానవులా శక్తులను నిన్నుకూడ తను కోరికలు నెరవేరుటకై పూజింతురు.

ఓ మధుసూదనా! నీ మహిమ భూలోకమందు స్వర్గము నందును వృద్ధి నొందును. ఈ విధముగా విష్ణుమూర్తికి వరములిచ్చి ఆకాశవాణి విరమించించి నది. విష్ణుమూర్తి కూడ ఆ మాటలు విని సంతోషించి యథావిధిగా యజ్ఞమును పూర్తి చేసెను. దేవతలను మునులను సాగనంపి గరుడధ్వజుడు తన సేవకులతో వైకుంఠమునకేగెను. దేవతలు మునులు ఆశ్చర్యముతో ఒకరికొకరు యజ్ఞ విషయ ములను చెప్పుకొనుచు తమతమ ఆశ్రమములకు వెళ్ళిరి. ఆకాశవాణిని విని అందరును పరదేవత పై భక్తి భావము కలవారయిరి. బ్రాహ్మణులు మునులు భక్తితో పూజలు చేసిరి.

ధ్రువ సంధి చరిత్ర - కామరాజ బీజమహిమ

జనమేజయుడు దేవీ మహాత్మ్యమును మరింత విపులముగా వినగోరుచున్నానని యడుగగా వ్యాసమహర్షి ఇట్లు చెప్పనారంభించెను. పూర్వము కోసల దేశమున సూర్యవంశమందు జన్మించిన "ధ్రువ సంధి" యను మహారాజు కలడు. అతడు పుష్పరాజు కుమారుడు. సత్యసంధుడు ధర్మపాలకుడునై ఆతడు అయోధ్యను రాజధానిగా భూమండలము నేలుచుండెను. రాజ్యమంతయు సుభిక్షముగా నుండెను. ధ్రువసంధికి మనోరమలీలావతి యను యిద్దరు భార్యలు కలరు. ఇద్దరును మంచి గుణములు కలవారు అందగత్తెలును. రాజు వివిధ భోగముల ననుభవించుచు భార్యలిరువురితో విహరించుచుండెను.

అంతనొక శుభదినమున మనోరమ సర్వ లక్షణ సంపన్నుడగు నొక కుమారుని కనెను. అతని పేరు "సుదర్శనుడు" లీలావతి కూడ ఆ మాసమునందే కుమారుని కనెను. రాజుకుమారు లిరువురకు జాతకర్మాది క్రియలనొనర్చెను. బ్రాహ్మణులకు భూరిదానములొసగెను. రాజకుమారుల నిరువురను సమభావముతో చూచు చుండెను. ఆ కుమారులిరువును జనరంజకులై తండ్రికి ప్రీతిపాత్రులై యుండిరి. రెండవ భార్య కుమారుని పేరు "శత్రుజిత్తు" రాజునకు శత్రుజిత్తుపై ప్రేమ అధిక మయ్యెను. సుదర్శనమని కంటె నాతడు ప్రియుడైయెను కొంతకాలము గడిచిన పిమ్మట ధ్రువసంధి వేటకు వెళ్ళెను. అచట అనేక మృగములను వేటాడెను. చివరకొక సింహము పొదరింటి నుండి బయటకు వచ్చుచుండగా దానిపై రాజు బాణము ప్రయోగించెను. ఆ సింహము కోపము గర్జించి రాజుపై దుమికెను. రాజభటులా సింహముపై బాణవర్షము కురిపించిరి. సింహము రాజుపై తీవ్రముగా దాడి చేసెను. రాజు ఖడ్గముచే దానిని కొట్టగా సింహము గోళ్ళతో దారుణముగా చీల్చి యాతనిని చంపెను. సైని కులు బాణములు ప్రయోగించి యా సింహమును చంపివైచిరి. సైనికులు రాజు మరణవార్తను మంత్రులకు తెలియజేసిరి. వసిష్ఠుడా తనికి అంత్యక్రియలు యధావిధిగా జరిపించెను.

పిమ్మట వసిష్ఠుడు ప్రజలును "సుదర్శను"ని రాజుగా చేయు టకు సమాలోచన చేసిరి. లీలావతి తండ్రి అల్లుని మరణవార్త విని తన మనుమనికి రాజ్యము నిప్పింపవలెనని అచటకు వచ్చెను. మనోరమ తండ్రియు వచ్చెను. వీరిరువును కాబోవు రాజును గూర్చి మంత్రులతో మంతనము లాడనారంభించిరి. లీలావతి తండ్రి యుధాజిత్తు మనోరమ తండ్రి వీరసేనుడు. నామనుమడు రాజు కావలె ననగా నా మనుమను మడే రాజు కావలెనని యిరువురును కలహించి

యుద్ధమునకు సిద్ధపడిరి. తీవ్రమైన పోరాట మిరువురకు జరిగెను. ఆ ఘోరయుద్ధ ములో యుధాజిత్తు తన తీవ్రబాణములతో వీరసేనుని సంహరించెను. అతని బలము దిక్కులకు పరుగెత్తెను. అంతట మనోరమకు తనకు తన కుమారునకు రక్షణకోరి సమస్తకార్యములందు నేర్పరియైన "విదల్లుడ"ను మంత్రిని పిలిచి నా కొడుకు బాలుడు నా తండ్రి మరణించెను. ఈ సమయమున చేయదగిన నాలో చించి చెప్పుమని కోరెను. అతని సలహాపై మనోరమ తన తండ్రికి అంత్యక్రియల నెపమున లీలావతితో చెప్పి తన కుమారుని వెంటబెట్టుకొని త్రికూట పర్వతమును చేరెను. అచట భరద్వాజమహర్షి యాశ్రమమున నిర్భయముగా నివసించు చుండెను. యుధాజిత్తు తన మనుమని రాజుగా చేసి రాజ్యభారము మంత్రులకు వప్పచెప్పి తన పట్టణమునకు వెళ్ళెను.

మనోరమ సుదర్శనునితో మునిని శరణువేడుట

భరద్వాజ మునినీ భార్యవు? వెవరి ఇక్కడికేల వచ్చితివని ప్రశ్నింపగా మనోరమ తాను ధ్రువసంధి భార్యనని చెప్పి. ఈ బాలుడు నా కుమారుడు. శత్రుభయముచే మిమ్ము శరణువేడుటకు వచ్చితినని పలుకకగా మహర్షి కల్యాణీ నీవు నిర్భయముగా నీ కుమారుని పోషించుకొనుచునుండుమని మనోరమతో చెప్పెను. సైంధవ పరాభవము - విశ్వామిత్రుని ఓటమి వ్రాయవచ్చును.

యుధాజిత్తును సుదర్శనుని చంపదలచుట

యుధాజిత్తు తన యింటికి వెళ్ళుచు దారిలో భరద్వాజాశ్రమమున సుదర్శనుడు తల దాచుకొని పెరుగుచున్నాడని తెలిసి అక్కడకు వెళ్ళి మంత్రిని సుదర్శనుని చంపుటకుపాయడిగెను. అంతట మంత్రి మహర్షి రక్షణలో నున్న సుదర్శనుని చంపినచో ముని కోపించి నిన్ను భస్మము చేయగలడని పలుకగా యుధాజిత్తు మునికి నమస్కరించి సుదర్శనుని చంపకుండనే వెడలిపోయెను.

సుదర్శనుడు కామరాజ బీజమును జపించుట

మనోరమ యుధాజిత్తు వెళ్ళిన పిమ్మట స్వస్థచిత్తురాలై తన కుమారుని పోషించుకొనుచు నా యాశ్రమమందుండెను. సుదర్శనుడు ముని బాలురతో నిర్భయముగ ఆటలాడుచుండెను. ఒకనాడు మంత్రి విదల్లుడచటకు వచ్చెను. ముని బాలురు సుదర్శనునిక్లీబుడని పిలిచి హేళన చేసిరి. అది విని సుదర్శనుడు "క్లీం" కారమును షూటిమాటికి ఉచ్చరింపనారంభించెను. ఆ కామరాజ బీజము

నాతడు మనస్సులో జపము చేయసాగెను. పదకొండవ ఏట భరద్వాజుడతనికి ఉపనయనము చేసి వేదము నేర్పెను. "క్లీం" మంత్రప్రభావముచే సకలవిద్యా రహస్యములను గ్రహించి నదీతీరమున విహరించుచుండగా శ్రీదేవి దయతో ధనుస్సును బాణము లను కవచమును అంబులపొదులను వాని కనుగ్రహించినది. ఆ సమయమున కాశీరాజు కుమార్తె శశికళ సుదర్శనుని గూర్చి విని యాతనినే భర్తగా చేసికొన నిశ్చయించెను. ఒకనాటి రాత్రి జగదంబ శశికళకు కలలో కనబడి నా భక్తుడైన సుదర్శను వివరింపుము. అతడు నీకు అన్ని కోరికలను తీర్చగలవాడు. అని పలికి అంతర్ధానము చెందెను. ఒకనాడు శశికళ విహారమునకు వెళ్ళగా దారిలో నొక బ్రాహ్మణుడు కనిపించెను. ఆతనికి నమస్కరించి శశికళ ఎక్కడ నుండి మీరు వచ్చుచున్నారని ప్రశ్నింపగా భరద్వాజాశ్రమము నుండి వచ్చుచు న్నానని యతడు బదులుపలుకగా అచట విశేషము ఏమని మరల శశికళ యాత్రని ప్రశ్నిం చెను. ఆ బ్రాహ్మణుడు రాజకుమారుడు సుదర్శనుడు సమస్త సద్గుణములు గల సుందరమూర్తి అక్కడనున్నాడు. నీకాతడు భర్త కాదగిననవాడని చెప్పెను.

శశికళ విరహ వర్ణనము

అంతట శశికళ యింటికి వచ్చి సుదర్శనుని పై మోహముతో బాధపడ దొడగెను. తన చెలికత్తెకు మాత్రము బాధపడుటకు కారణము సుదర్శనునిపై అనురాగము మాత్రమే యని వివరించెను. మరియు తాను భరద్వాజాశ్రమము కు వెళ్ళి యాతనిని చూడవలెనన్న తల్లిదండ్రుల చాటుపిల్లను గదాయని విచారిం చుచు తన తండ్రి స్వయంవరము నేర్పరచినచో నేనా సుదర్శనునే వరించెదను. అతడు రాజ్యము లేనివాడని వింటిని. ఐనను నాకతడే యిష్టుడు. అని నిర్ణయించు కొనెను. చెలికత్తెలు శశికళకు శైత్యోపచారములు చేయుచుండిరి. ఇంతలో ఆమె తండ్రి సుబాహువు తన కూతురు తనకు నచ్చినవానిని వరింపగోరుచున్నదని తెలిసికొని వెంటనే స్వయంవరము చాటించెను. స్వయంవరమునకు నచ్చు రాజ కుమారులకు బస లేర్పరచబడెను. స్వయంవర సభామండపము వివిధాసనము లతో అలంకరింపబడెను. అప్పుడు శశికళ చెలికత్తెతో నీవు నాతల్లి వద్దకు వెళ్ళి రహస్యముగ నా మాటగా ధ్రువసంధి మహారాజు పుత్రుడగు సుదర్శనుని నేను వరించి తినని చెప్పుము. నేనితరు వివరింపను. పూర్వము దేవి యితడే నీకు భర్తకాగలడని చెప్పినది. అనగా చెలికత్తె వెళ్ళి శశికళ తల్లికి విషయమంతయు తెలియజేసెను. తల్లిదండ్రులు సుదర్శనుడు రాజ్యము సైన్యము ధనము కూడ లేనివాడుకాన మరియొకని వివరించుమని చెప్పగా శశికళ యంగీకరింపలేదు.

అంతట అప్పుడగు నొక బ్రాహ్మణుని పిలిచి శశికళ సుదర్శనుని వద్దకు నాతని పంపుచు నిట్లుచెప్ప మనెను. "ఓ దేవసమానుడా! దేవి కలో కనిపించి నిన్ను వివాహము చేసికొనుమని చెప్పినది. నేను నిన్నే కోరుచున్నాను. నీకిష్టపడనిచో నాకు మరణమే శరణము జగదంబ మాటను సత్యము చేయు బాధ్యతనీది"అని ఆ బ్రాహ్మణుడు శశికళ మాటలను సుదర్శనునకు చెప్పి తిరిగివచ్చెను. సుదర్శనుడు స్వయంవరమునకు వెళ్ళుటకు నిశ్చయించుకొనెను.

సుదర్శనుడు స్వయంవరమునకు వెళ్ళుట

భరద్వాజ మహర్షి పరమాదరముతో శశికళను వివాహమాడుమని సుదర్శనుని ప్రోత్సహించెను. స్వయంవరమునకు ప్రయాణమైన కుమారుని చూచి మనోరమ వణకుచు కన్నీరుగార్చుచు నాయనా! ఒక్కడవే నీవు రాజసమూహముతో నిండిన స్వయంవరమునకు ఏ సహాయము లేకుండ ఎట్లు వెళ్ళదవు? దేని నాశ్రయించి నీవిట్లు సాహసించుచుంటివి? యని ప్రశ్నించెను. యుధాజిత్తు నిన్ను చంపుట కక్కడకు రాగలడు. కనుక నీవు వెళ్ళవద్దు. నేను నిన్నే నమ్ముకొని యున్నాను నన్ను నిరాధరను చేయవలదని పలుకగా సుదర్శనుడు ఓ యమ్మా! నీవేల విచారించెదవు? నేను ఆ జగజ్జనని ఆజ్ఞచే స్వయంవరమునకు వెళ్ళుచున్నాను. ఆ దేవియనుగ్రహముచే నాకెట్టి భయమును లేదని బయలుదేరిన కుమారుని మనోరమ ఆశీర్వదించి పంపెను. స్వయంవరమునకు యుధాజిత్తు తన మనుమని వెంటబెట్టుకొని వచ్చెను. అనేక రాజకుమారులు స్వయంవర సభలో కూర్చొని యుండిరి. శిష్టులైన రాజులందరు సుదర్శనునితో యుధాజిత్తు నిన్ను చంపుటకు వచ్చియున్నాడు. నీకు సైన్యముగాని సహాయము చేయువారు గాని లేరు. కనుక తిరిగివెళ్ళుమని పలికిరి. సుదర్శనుడు శ్రీదేవి ప్రేరేపించి నన్ను పంపినది. నాపై నెవడైన సగబూనినచో నా దేవియే వానిని దండింపగలదు. దైవమునే నమ్మియున్నానని సమాధాన మిచ్చెను.

స్వయం వరమును గూర్చిన వాదోపవాదములు

సుదర్శనుని మాటలు విని రాజులు ఒకరి ముఖమొకరు చూచుకొనిరి. మరియు సుదర్శనునితో నిట్లనిరి. ఓ సాధూ! నీవు పలికినది నిజమే. అందు సందేహమేయు లేదు. కాని ఉజ్జయినీ రాజు నిన్ను చంపుట కెదురు చూచున్నాడు. మేము నీమీద దయకొలది చెప్పుచున్నాము. నీకేది తగినదితోచిన దానిని మనస్సులో బాగుగా విచారించి చేయుము. అని పలికిరి! అపుడు సుదర్శనుడు

ఓ రాజులారా! మీరు నాపై ప్రేమతో పలికిన మాటలు సత్యములే. జగత్తంతయు దైవము పై నాధారపడి యున్నది. నాకు మరణము దైవము నిర్ణయించినచో ఎట్లైనను తప్పదు. దేవుడు కూడ కాలము రానిదే యే ప్రాణిని చంపలేడు. నేనెవ్వనికిని భయపడుట లేదు. భగవతి మధురనామ స్మరణము చేయుచున్నాను. యుధాజిత్తు పై నాకు వైరభావము లేదు. అతనికి నాపై వైరభావమున్నచో దాని ఫలమునడే యనుభవించగలడు అని పలికెను. సుదర్శనుని మాటలకు రాజులు సంతసించి వెడలిపోయిరి. సుదర్శనుడు తన వసతికి వెళ్ళెను. అంత నొక శుభసమయమున రాజులనందరను స్వయంవర సభాభవనమునకు రావలసినదిగా సుబాహువు - ఆహ్వానించెను. రాజులందరు శుభాలంకారముల ధరించి శుభాసనములపై కూర్చుండిరి. అప్పుడు శశికళ తండ్రితో నేను సుదర్శనునే వరించితిని, నీవు నామేలుకోరినచో శుభముహూర్తమున నన్ను సుదర్శనునకిచ్చి వివాహము చేయుము. ఈ స్వయంవరము వ్యర్థమని పలికెను. అంతట సుబాహువు చింతాకులుడై రాజులందరి వద్దకు వెళ్ళి నా భార్యయు నేమను ఎంత నచ్చచెప్పినను నా కుమార్తె స్వయంవరసభకు రానను చున్నది. అని చేతులు జోడించి వినయ పూర్వకముగా చెప్పెను. మీరందరు నా పుజాదికము స్వీకరించి మీ మీ నివాసములకు వెళ్ళుడని పలికెను.

అప్పుడడు యుధాజిత్తు కోపించి నీవు నీ కుమార్తెను సుదర్శనునకీయదలచి యిట్లు మాట్లాడుచున్నావు. కనుక సుదర్శనుని ముందు చంపి తదుపరి నిన్ను సంహరించి నా మనుమనికి నీ కుమార్తెతో పెండ్లి చేయుదుననెను. మరియు విచారించి భార్యతో నాలోచించి తగిన పని చేయుమని గర్జించెను. సుబాహువు భార్యతో నా విషయము చెప్పి యిరువురును శశికళను మార్చచూచిరి కాని సాధ్యపడలేదు. శశికళ తల్లిదండ్రులకు మీరు నన్ను సుదర్శనునకు ధారపోసి మమ్ము పట్టణము వెలుపలకు సాగనంపుడు నా భర్త నన్ను రథముపై నెక్కించుకొని స్వేచ్ఛగా ప్రయాణింపగలడు. మీరు చింతింపవద్దు కానున్నది కాకమానదు. ఒకవేళ నీపై యెవరైన యుద్ధమునకు వచ్చినచో ఆ దేవియే మనలనందరను రక్షింపగలదని చెప్పెను. సుబాహువు తన కుమార్తెను సుదర్శనునకిచ్చి వివాహము చేయుటకే నిశ్చయించి రాజులనందరను బ్రతిమాలి నేడు స్వయంవరము జరుగుటలేదు. రేపు జరుగగలదు. నేడు నా కూతురిక్కడకు వచ్చుట కిష్టపడనందున ఇట్లు చెప్పవలసి వచ్చినది. రేపు ఆమెను ఒప్పించి సభకు రప్పింతునని చెప్పగా నందరు తమతమ విడిది యిండ్లకు వెళ్ళిరి. అంతట సుబాహువు పురోహితులను పిలిచెను.

శశికళ సుదర్శనుల వివాహము

వేదవేత్తలైన పురోహితులతో రహస్యమందిరమున సుబాహువు తన కుమార్తెకు సుదర్శనునితో వివాహము జరుపుటకు సిద్ధపడెను. వరునకు మంగళస్నానము చేయించిరి. వివాహాలంకరణము నొనర్చిరి. రాజు సుబాహువు వరుని పెండ్లి మండ పమునకు తీసికొని వచ్చి అతనికి పూజావిధుల నెనర్చెను. సుబాహువు వరునకు వస్త్రభూషణాదుల నొసంగి యధావిధిగా కన్యాదాన మొనర్చెను. మనో రమ మనస్సు చింతలేనిదయ్యెను. సుదర్శనునకు సుబాహువు పెండ్లి కట్నముగా రెండువందల రథములను అంబులపాదులను నూటయిరువది యైదు మత్తగజ ములను దాసీశతమును రెండువేల గుఱ్ఱములను ధాన్యముతో నిండిన రెండు వందల బండ్లను సమర్పించెను. పిమ్మట రాజపుత్రి రాజమాత యగు మనోరమకు నమస్కరించి నీకు దాసుడను. నీ మనస్సులోని విషయము తెలుపుమనెను. అప్పుడు మనోరమ యిట్లనెను. నీకు మేలగుగాక నీ కులము వృద్ధిచెందుగాక. నీ కన్యారత్నము నిచ్చి సమ్మానిం చితివి. రాజ్యభ్రష్టుడైన నా పుత్రునకు నీ కుమార్తె నిచ్చితివి. ఇంతమంది రాజులతో వైరమునకు సిద్ధమైన నా కుమారునకు పిల్లనిచ్చిన నీ ధైర్యముకొని యాడదగినది. యని పలుకగా సుబాహువు సంతోషముతో ఇదిగో నా రాజ్యము తీసికొనుము. నీకు నేను సేనాపతిగా నుందును. లేనిచో నా రాజ్యములో సగభాగము తీసికొని కుమారునితో రాజ్యసుఖముల ననుభవింపుమని మనోరమకు చెప్పెను. మనోరమ మమ్ము సాకేతవనమునకు పంపుము భవానీ దేవి నీకు శుభము కలుగజేయుగాక. పరాంబికాదేవిని స్మరించు నాకు చింత సుంతైన లేదని పలికెను. తెల్లవారినది రాత్రి వివాహము జరిగెనని తెలిసి రాజులెల్లరు నగరము వెలుపల కోపముతో మనము సుదర్శనుని చంపుదము శశికళను గ్రహించుదమని కేకలు వేసిరి. సుదర్శనుని వివాహమును సమ్మతించని వారెల్లరాతని మార్గము నడ్డగించి నిలిచిరి.

శ్రీదేవి సుదర్శనుని కాపాడుట

వ్యాసుడు జనమేజయునితో నిట్లు పలికెను. పూర్వము సుబాహువను రాజు తనకుమార్తెను సుదర్శనుడను రాజు కుమారునకిచ్చి వివాహము చేసెను. తక్కిన రాజులందుకు కోపించిరి. వివాహానంతరము సుదర్శనుడు భార్యతో తన నివాసమునకు బయలుదేరెను. వివిధ ధనరాసులనిచ్చి సుబాహు తన కుమార్తె నత్తవారింటికి పంపుతూ సుదర్శనునితో పెద్ద సైన్యమును గూడ పంపెను. సుదర్శనుడు సైన్యము రథములతో వెంటరాగా భార్యతో కూడ రథమెక్కి

వెళ్ళుచుండగా శత్రురాజులాతని చుట్టుముట్టిరి. అప్పుడు సుదర్శనుడు భక్తి శ్రద్ధలతో జగదేకమాతయగు పరదేవతను శరణ జొచ్చెను. ఒక అక్షరముగల కామరాజమంత్రమును ఎడతెరపి లేకుండా జపించుచు నూతన వధువుతో వెళ్ళు చుండగా శత్రురాజులు పెద్దకోలాహల ముగా సైన్యముతో వచ్చి పెండ్లికుమార్తెను అపహరింపదలచిరి. కాశీరాజు శత్రువులను చంప పూనుకొనగా అతనిని సుదర్శనుడు నివారించెను. సుబాహువు కూడ మరికొందరు రాజులతో భేరీశంఖా దులను ప్రయోగించిరి.

యుధాజిత్తు శత్రుజిత్తులను వారు తీవ్రముగ బాణయుద్ధము చేయు చుండగా సుబాహువు తన యల్లునికి సాయము చేయుటకు సిద్ధపడెను. దారుణమగు సంగ్రామము సాగుచుండగా ఎక్కడనుండియో అనేకా యుధ ములు ధరించి సర్వాభరణభూషితమైన సింహ వాహనాసీనయగు దేవి. ప్రత్యక్షమైనది. దివ్యవస్త్రములు పూలదండలను ధరించి ఆ తల్లి ప్రకాశించు చున్నది. ఆ లోక మాతనుచూచి రాజు లెల్లరు ఆశ్చర్యపడిరి. సుదర్శనుడు మాత్రము దేవిని చూచి సుబాహువుతో ఇట్లు పలికెను. దివ్యమగు దర్శనము గల దేవి యనుగ్రహించుటకు దయతో ఆవిర్భవించినది. ఇప్పుడు నాకు భయములేదు అని యనెను. సుదర్శన సుబాహు లిరువురు ఆ దేవికి నమస్కరించిరి. అంతట దేవి వాహనమగు సింహము గర్జించి నది. శత్రువుల ఏనుగులు కంపించినవి. భయంకరముగ గాలులు వీచినవి. సుదర్శనుడప్పుడు తన సేనాపతితో నీవా శత్రురాజులున్న తావునకు వెళ్లుము దుర్మార్గులగు ఆ రాజులు కోపించినను ఏమి చేయగలరు? మనలను రక్షించుట కొరకే దేవి యిక్కడకు వచ్చినది. మనమిక నిర్భయ ముగా వెళ్ళవచ్చును. నేను రక్షించుమని స్మరించగానే పరదేవత ప్రత్యక్ష మైనది. అనగా సేనాపతి బయలు దేరెను. అప్పుడు యుధాజిత్ శత్రు జిత్తులను వారు సుదర్శనునితో యుద్ధానికి సిద్ధమయ్యారు. సుదర్శనుడు బాణాలతో వారిని ఎదుర్కొని యుద్ధము చేయ సాగెను. ఇట్లు యుద్ధము జరుగుచుండగా దుర్గాదేవి మిక్కిలి కోపించి యుధాజిత్తు పైబాణములను ప్రయోగించినది. జగదంబిక అనేక రూపాలతో అనేకములగు అస్త్రములు ప్రయోగించి భయంకరముగా యుద్ధము చేసినది. యుధాజిత్తు శత్రుజిత్తు లిరువురును మరణించిరి. జయజయ దుర్గాదేవి! అనుమాటలు మిన్ను ముట్టాయి. తక్కినరాజులు వీరి మరణము చూచి యాశ్చర్యపడిరి. అప్పుడు విజయము చేకూరిన సంతోష ముతో సుబాహువు దుర్గాదేవిని యిట్లు స్తుతించెను.

శ్లో॥ నమో దేవ్యైజగద్ధాత్ర్యై శివాయై సతతం నమః ।
దుర్గాయై భగవత్యైతే కామదాయై నమోనమః ॥

నమశ్శివాయై శాంత్యైతే విద్యాయైమోక్షదే నమః ।
విశ్వవ్యాప్త్యై జగన్మాతః జగద్ధాత్ర్యై నమశ్శివే ॥
నా హంధియా తవగతింపరిచింతయన్వై
జానామిదేవి! సగుణఃకిల నిర్గుణాయాః ।
కింస్తౌమి విశ్వజనని ప్రకట ప్రభావాం
భక్తార్తి నాశనపరాం పరమాంచ శక్తిమ్ ॥
వాగ్దేవతాత్వమసి సర్వగతైవ బుద్ధి
ర్విద్యామతిశ్చ గతిరప్యసి సర్వజంతోః ।
త్వాంస్తౌమికిం త్వమసి సర్వమనో నియంత్రీ
కిం స్తూయతే హిసతతంఖలు చాత్మరూపామ్ ॥
బ్రహ్మా హరశ్చ హరిరప్యనిశంస్తువన్తి
నాంతం గతాస్సురవరాః కిలతేగుణానామ్ ।
క్వాహం విభేద మతిరంబ! గుణ్యైర్వృతోవై
వక్తుంక్షమస్తవ చరిత్ర మహో ప్రసిద్ధః ॥
సత్సంగతిః కథ మహోనకరోతికామం
ప్రాసంగి కాపి విహితాఖలు చిత్తశుద్ధిః ।
జామాతురస్య విహితేన సమాగమేన
ప్రాప్తం మయాద్భుత మిదం తన దర్శనంవై ॥
బ్రహ్మాపివాంఛతి సదైవహరో హరిశ్చ
సేంద్రాస్సురాశ్చ మునయో విదితార్థ తత్త్వాః ।
యద్దర్శనం జనని! తేఽద్యమయా దురాపం
ప్రాప్తం వినాదమశమాది సమాధిభిశ్చ ॥
క్వాహం సుమందమతి రాశుత వానలోకం
క్వేదంభవాని భవభేషజమద్వితీయం
జ్ఞాతాసి దేవి సతతం కిలభావయుక్తా
భక్తానుకంపన పరాఽమకవర్గ పూజ్యా
కిం వర్ణయామి తవదేవి చరిత్ర మేతత్
యద్రక్షితోఽసి విషమేఽత్ర సుదర్శనోఽయం
శత్రూహతేసుబలినే తరసాత్వయాయత్
భక్తాను కంపిచ్ఛ్రుతం పరమం పవిత్రం

నాశ్చర్యమే తదితిదేవి విచారితేర్థే త్వం
పాసి సర్వమఖిలం స్థిరజంగమంవై
త్రాతస్త్వయాచ విని హత్యరిపుర్దయాత:
సంరక్షితో యమధునాధ్రువ సంధిసూను:
భక్తస్వసేవన పరస్య యశోఽతి దీప్తం
కర్తుం భవాని రచితం చరితం త్వయైతత్
నోచేత్ కథం సుపరిగృహ్యా సుతాం మదీయాం
యుద్ధే భకేతుశల వానవద్యశీల:
శక్తాసి జన్మమరణాది భయాని హంతుం
కించిత్రమత్ర కిలభక్త జనస్యకామం
త్వంగీయసే జనని! భక్తజనై రపారా
త్వం పాపపుణ్యరహితా సుగుణాఽగుణాచ ।
త్వద్దర్శనాదహ మహో సుకృతీకృతార్థ:
జాతో స్మిదేవి! భువనేశ్వరి! భవ్యజన్మా ॥
బీజం న తేన భజనం కిలవేద్మి మాత:
జాతస్త వాద్య మహిమా ప్రకట ప్రభావ: ।

స్తోత్రభావము :- శ్రీవిద్య, మోక్షమిచ్చునది, అంతను వ్యాపించియున్న జగదేక మాతకు అంజలి ఘటించుచున్నాను. పరమశక్తి విశ్వమాతా! సగుణ నిర్గుణములలో నీ మార్గమేదో నాయల్ప బుద్ధికి గోచరించుటలేదు. నీవు భక్తుల కష్టములను తొలగించుదానవు. నీవే వాగ్దేవతవు. హరిహరబ్రహ్మలు నిన్ను విడువక యెల్లప్పుడు స్తుతించుచున్నారు. నాయీ చపలచిత్తము నీ సచ్చరిత్రను నీ సత్సాంగత్యమును అలవర్చుకొనలేకున్నది/నీ కథలు వినినందున తప్పక చిత్తశుద్ధి యేర్పడునుగదా! నా యల్లుని సాంగత్యము వలన నాకు నీయద్భుత దివ్యసందర్శన భాగ్యమబ్బినది. ఏ సాధనలు లేకుండగనే నీ సుదుర్లభ దివ్యదర్శనము నాకు లభించెను. నిన్ను భక్తులు గానము చేయుచున్నారు. నీకు పాపముగాని, పుణ్యముగానిలేదు. నీవు సమస్త సుగుణములు కలదానవు. ఏ గుణములులేని దానివి కూడ. నేను పూర్వ జన్మమున పుణ్యము చేసినందున నీ దర్శనము కలిగింది. కృతార్థుడ నైతిని. ఓ భువనేశ్వరీ! నా జన్మశుభమైనది. నీ బీజాక్షరమునుగాని సేవనుగాని నేనెరుగను. మహా ప్రభావము గల నీమహిమ నీనాడు తెలిసికొంటిని. ఇట్లు స్తుతింపబడిన దేవి ప్రసన్నమైన ముఖముతో ఓ రాజా! నీవు మంచి నియమములు గలవాడవు వరము కోరుకొనుము అని పలికెను.

దేవి కాశీలో నివసించుట:- శ్రీదుర్గా ప్రతిష్ఠ

సుబాహువు భక్తితో శ్రీదేవి కిట్లనెను జననీ! నీ దర్శనముచే నేను ధన్యుడు నైతిని. నేనింకేమి కోరుదును? ఐనను నేనొక వరము కోరుచున్నాను. నీ పాదపద్మ ములందు నాకు సర్వదా ప్రేమ భక్తి నెలకొనుగాక. ఓమాతా! కాశీనగరములో నీశక్తిరూపము దుర్గాదేవి నామముతో నెల్లకాలము నిలిచియుండుగాక. సుదర్శనుని శత్రుసమూహము నుండి రక్షించితివి. మమ్ము‌ను కాపాడితివి. నీవీనగరము నెల్ల ప్పుడు కాపాడుచుండుము. నా వైరులను సంహరించి లోకమునకు శుభముచే కూర్పుము. ఇట్లు స్తుతించి వరము పొంది నమస్కరించుచున్న సుబాహుని చూచి యాదేవి ప్రసన్నయై అతని కిట్లనెను. రాజా! ఈ భూమి యున్నంతకాలము నేను కాశీ క్షేత్రమందు జగత్తును రక్షించుటకై నివసించెదను. అని పిమ్మట సుదర్శనుడు ఆనందభరితుడై వచ్చి పరమభక్తితో నమస్కరించి జగదంబిక నిట్లు స్తుతించెను.

అమోక్షపాతే కథయామ్యహం కింత్రా తస్య యాయత్కిలభక్తిహీన :
భక్తాను కంపీసకలో జనోస్తి విముక్త భక్తే రవనం వ్రతంతే
త్వందేవి సర్వం సృజసి ప్రపంచం శ్రుతంమయా పాలయాసి స్వసృష్టం
త్వమత్సి సంహార పరేచకాలే నతేత్ర చిత్రం మమరక్షణంలై
కరోమి కిం తేవదదేవి కార్యంక్వవా ప్రజామత్యను మోదయాశు
కార్యేవిమూఢోస్మి తవాజ్ఞ యాహం గచ్ఛామి తిష్ఠే విహరామిమాత: ॥

ఓ దేవీ! నీ దయనెంతని వర్ణింతును? నేను నీచేత కాపాడబడితిని. నీవు భక్తిలేని వారిపై కూడ దయచూపెదవు. బ్రహ్మాండములను పుట్టించి పెంచి సంహ రించుదానవు. భవానీ! నేను ఏమి చేయవలెనో తెలియని స్థితిలోనున్నాను. నేనెక్కడకు వెళ్ళవలెను? నీయాజ్ఞ ప్రకారము వెళ్ళెదను ఆ స్తుతిని విని దేవి దయాంతరంగయై ఆతనికిట్లనెను.

ఓ మహాభాగా! నీవయోధ్యకు వెళ్ళి రాజ్యము చేయుము. నన్నెల్లప్పుడు తలచు కొని పూజింపుచుండుము. నేను నీ రాజ్యమున సుఖశాంతులను విస్తరింప చేయు దును అని పలికి అదృశ్యమయ్యెను. రాజులెల్లరు సుదర్శనునకు ప్రణమిల్లిరి. పిమ్మట దేవి మాహాత్మ్యమును తెలుపుమని సుదర్శనుని ప్రార్థించిరి. అప్పుడు సుదర్శనుడు రాజులారా! దేవి మహిమనునేనేమని చెప్పను ఎంతని చెప్పగలను? బ్రహ్మరుద్రాది దేవతలు కూడ ఆమె తత్త్వమును సంపూర్ణముగా నెరుగజాలరు. ఆ దివ్యచరిత్రను వర్ణింప నేనెంతవాడను? నాకు చిన్నతనముననే భగవతి యొక్క కామరాజ బీజము లభించినది. నేను దానిని రాత్రింబవళ్ళు జపించితిని. మహర్షులు

పరదేవతా శివతత్త్వమును తెలియజేసిరి. ఆనాటి నుండి ఆమెను భక్తితో స్మరించి తిని అని పలికెను. అంతట నారాజు లెల్లరు నాశక్తి స్వరూపమును తలచుకొనుచు తమ నివాసములకు వెళ్ళిరి. సుబాహువు సుదర్శనుని వీడ్కొని కాశికి వెళ్ళెను. సుదర్శనుడు సాకేతనగరమున పట్టాభిషిక్తుడై మంత్రులు ప్రజలు తనను ప్రశంసింపగా రాజ్యపరిపాలనము చేయుచు. మంత్రులను దేవీ ప్రతిమను నిర్మింపజేయ నాజ్ఞాపించి శుభముహూర్తమున వేదవేత్తల ద్వారా శ్రీదేవిని ప్రతిష్ఠింప చేసి అనేక పూజలు జరిపెను.

శ్రీదేవీ నవరాత్రి పూజా విధానము

శరన్నవరాత్రములలో ఆచరింపదగిన విధానమును జనమేజయునకు వ్యాస మహర్షి యిట్లు చెప్పెను. ఓ రాజా! దేవీ నవరాత్రములను వసంతఋతువు నందు, శరదృతువులోను ఆచరించాలి. ఈ రెండు ఋతువులును ప్రాణులకు రోగములు కలిగించునవి. చైత్ర- ఆశ్వయుజమాసములయందు- నవరాత్రి వ్రతమును - చండీపూజను చేసి శుభములనందవలెను. కనుక రోగములు కలుగ కుండుటకు నవరాత్రము లాచరించి చండీపూజలు జరపాలి. కావలసిన వస్తువుల నన్నిటిని సమకూర్చుకొని శుద్ధపాడ్యమి నుండి ఏకభుక్తము హవిష్యాన్నముల గ్రహించుచు నియమముతో పూజలు చేయవలెను. సమతల ప్రదేశమందు 16 చేతుల ప్రమాణముగల స్తంభములు జెండాలు కలుగునట్లు చక్కని మండపమును నిర్మించవలెను. ఆ మండపమును ఎట్టిమట్టి గోమయంతో అలకాలి. ముగ్గులు పెట్టాలి. మధ్యలో ఎత్తైన అరుగును అమర్చాలి. ఆ వేదికమీద 4 మూరల పొడవు అంతే వెడల్పును మూరయెత్తు గల పీఠము తయారుచేసి దానిని అలంకరించవల యును. మండపము చుట్టును మామిడి తోరణాలు విచిత్రములైన పూలమాలలు కట్టవల యును. అంతకు ముందు రాత్రియే దేవీ తత్త్వము తెలిసిన సంపన్నులు ఇంద్రియ నిగ్రహము గల వేదవేదాంగములు తెలిసిన బ్రాహ్మణులను పిలువ వలెను. పాడ్యమినాడు ప్రాతఃస్నానము చేసి నిత్యకృత్యములు తీర్చుకొని బ్రాహ్మ ణులకు వరుణలిచ్చి వారికి వస్త్రములిచ్చి గౌరవించాలి. సంపద గలవాడు ద్రవ్య లోపమేమాత్రము చేయకూడదు. బ్రాహ్మణులు సంతృప్తి చెందినచో పూజ సంపూర్ణ ఫలము నీయగలదు. బ్రాహ్మణులు తొమ్మిదిమంది గాని, ఐదుగురుగాని, ముగ్గురు గాని, చివరకు ఒక్కడైనా శ్రీదేవీభాగవతం పారాయణ చేయాలి. వేదఘోషతో స్వస్తివాచనము జరపాలి. వేదికమీద సింహాసనముంచాలి. దానిపై తెల్లని వస్త్రం పరచాలి. దానిమీద దివ్యవస్త్రములు ధరించి దివ్యాయుధ ధారిణియగు చతుర్భు

జయైన జగదంబను ప్రతిష్ఠ చేయాలి. శంఖచక్రాద్యాయుధములు ధరించిన దేవిని సింహాసన మందుంచాలి. ఆమెను యధాశక్తిగా అలంకరించాలి. ఆమెకు 18 భుజముల మర్చాలి. అలాంటి విగ్రహము సాధ్యము కాకపోతే నవార్ణ మహామంత్ర సహితమగు యంత్రము నుంచాలి. దాని ప్రక్కన కలశస్థాపనము చేయాలి. మామిడి, రావి, మఱ్ఱి, మేడిచిగుళ్ళు బంగారము గల కలశంలో వేదమంత్రాలతో తీర్థజలాన్ని నింపాలి. పూజకు శుభప్రదములగు ద్రవ్యములు సమకూర్చుకోవాలి. తదుపరి మంగళవాద్యములు మ్రోగించాలి. తరువాత మంత్రపూర్వకముగ పూజలు చేయాలి. మాలతీ బిల్వాది పూలదండలతో ధూపదీపాలతో పూజించి దేవికి అర్ఘ్యమివ్వాలి. నారకేళకదలీ పనసాదిఫలములు నివేదన చేయాలి. తరువాత ఘనముగా బ్రాహ్మణ సమారాధన జరపాలి. హోమం చేయటానికి త్రికోణా కారముగా కుండమును నిర్మించాలి. నిత్యము నేలపైపడుకోవాలి. కుమారికలను వస్త్రాలంకారాలతో అమృతాన్నంతోను పూజించాలి. శక్తికి తగినట్లు యాగము చేయాలి. ధనలోపము చేయరాదు. రెండేళ్ళు మొదలు 10 ఏళ్ళలోపు కన్యకలనే పూజించాలి. హస్తా నక్షత్రము కలనందా తిథి- పాడ్యమినాడు పూజా ప్రారంభము శ్రేయస్కరము. ఇట్లు పూజించుటచే దుఃఖము దారిద్ర్యము నశించుట శత్రు క్షయము అయుర్బల ధనములు వృద్ధిచెందుతాయి. మంచి వంశములో పుట్టి అందగత్తెయైన కన్యనే పూజించాలి. అన్ని ఫలితాలకు బ్రాహ్మణకన్యను, భయము తొలగుటకు రాచకన్యను లాభానికి వైశ్యకన్యను లేదా శూద్రకన్యను గాని పూజిం చాలి. నవరాత్రములలో అష్టమి మిక్కిలి ముఖ్యమైనది. ఆనాడు విశేషముగా ఆరాధించాలి. బ్రాహ్మణభోజనాలతోను ఫలపుష్పోపహారాలతోను జగజ్జననిని సంతోష పెట్టవలెను. తొమ్మిదిరోజులు ఉపవాసము చేయలేనివాడు మూడు దినము లైనా ఉపవాసము చేసిన పూర్తి ఫలితం కలుగుతుంది.

దేవీ నవరాత్రవ్రత మాహాత్మ్యము

వ్యాసమహర్షి యింకను చెప్పుచున్నాడు :- సప్తమి, అష్టమి, నవమి, ఈ మూడు దినములు భక్తితో దేవిని పూజించినచో సమస్త ఫలములు సమ కూరును. నవరాత్రవ్రతము దేవీ పూజలు, హోమాలు, కుమారీ పూజలు బ్రాహ్మణ సంతర్పణ ములతో సంపూర్ణమగును. ఇతర వ్రతములు, దానములు దేవీ నవరాత్ర వ్రత ముతో సరిపోలవు. అన్ని విధములైన కోరికలను దేవీనవరాత్ర వ్రతముచే తీర్చుకొన వచ్చు. హరిహర హిరణ్య గర్భాది దేవతలు దేవినారాధించి సర్వసిద్ధులను పొందగలిగారు. పూర్వము కోసలదేశమున దరిద్రుడైన వర్తకుడు కలడు. అతనికి

సంతాన మధికము ఒకనాడు సద్బ్రాహ్మణుడొకడు కనబడగా తనబాధను వివరించి దారిద్ర్య నిర్మూలనకుపాయము చెప్పుమని ప్రార్థించాడు. ఆ బ్రాహ్మణుడు జాలి పడి ఓ వైశ్యోత్తమా! దేవీనవరాత్రవ్రత మాచరించిన సర్వ సుఖములు కలుగును. బాధలన్నియు తొలగిపోవునని చెప్పెను. వైశ్యుడా బ్రాహ్మణునే గురువుగా చేసికొని భక్తిశ్రద్ధతో తొమ్మిది సంవత్సరములు నవరాత్ర వ్రతము చేయగా తొమ్మిదవ సంవత్సరము అష్టమినాడు అర్ధరాత్రి దేవి ప్రత్యక్షమై అనేకవరములిచ్చి ఆ వైశ్యుని కృతార్థుని గావించినది.

శ్రీసీతారామ చరిత్ర

జనమేజయుడు వ్యాసుని వలన దేవీ నవరాత్ర మహాత్మ్యమును విని అందులో రాజ్యభ్రష్టుడై రావణుడు సీతాపహరణమును చేయగా శ్రీరాముడు దేవీవ్రత మాచరించి సుఖపడెనని విని రామచరిత్రను జెప్పుమనగా వ్యాసుడు సీతారామ చరిత్ర నిట్లు చెప్పెను. సూర్యవంశమందలి దశరథ మహారాజునకు రామలక్ష్మణ భరతశత్రుఘ్నులను నలుపురు పుత్రులు జన్మించిరి. నలువురును విద్యాబుద్ధులు గరచి తండ్రికి ప్రీతిపాత్రులై యుండిరి. ఒకనాడు విశ్వామిత్రుడు దశరథుని వద్దకు వచ్చి తన యాగమును రక్షించుటకై రాముని పంపుమని కోరెను. పదహా రేళ్ళు వయస్సు గల రాముని లక్ష్మణునితో కూడ విశ్వామిత్రుని వెంట పంపెను. దారిలో రాముడు తాటక యను రాక్షసిని సంహరించి పిమ్మట సుబాహుమారీచు లను రాక్షసులనుండి విశ్వామిత్రుని యాగమును కాపాడెను. పిమ్మట విశ్వామిత్రు నితో రామలక్ష్మణులు మిథిలానగరమునకు వెళ్ళిరి. మార్గమధ్యమున అహల్యకు శాపవిముక్తిని శ్రీరాముడను గ్రహించెను. అచట శివధనుస్సును భగ్నమొనర్చి సీతను రాముడు పెండ్లియాడెను. జనకుని కూతురైన ఊర్మిళను లక్ష్మణుడు, కుశధ్వజుని కుమార్తెలైన మాండవీశ్రుతకీర్తులను భరతశత్రుఘ్నులు వివాహము చేసికొనిరి. తరువాత దశరథుడు రామునకు పట్టాభిషేక ప్రయత్నము చేయగా కైకేయి మంథరచే ప్రేరేపింప. డి పూర్వము దశరథుడు తనికిచ్చి యున్న రెండు వరములలో నొకదానికి తన కుమారుడగు భరతునకు పట్టాభిషేకమును రెండవ దానికి రామునకు పదునాల్గు సంవత్సరము అరణ్యవాసమును కోరెను. రాముడు సీతాలక్ష్మణులతో అరణ్యమునకు వెళ్ళెను. భరతుడు రాజ్యము నంగీకరింపలేదు. రాముడు పంచవటిలో నివసించుచుండగా రావణుని చెల్లెలైన శూర్పణఖ కామాతి రేకముచే రాముని సమీపించి లక్ష్మణునిచే వికృతరూపము కలదిగా చేయబడెను. అందుకు ప్రతీకారమొనర్చుటకై రామునితో యుద్ధము చేసి ఖరదూషణ

త్రిశిరసులు యుద్ధమున మరణించిరి. రావణుడందుకు కోపించి మారీచుని బంగారు లేడిరూపముతో తిరుగుచు రాముని ఆశ్రమము వద్ద సీతకు కనబడుమని పంపెను. ఆ లేడిని చూచి సీత యాలేడిని తెచ్చి పెట్టుమని తన భర్తను కోరగా రాముడు ఆ లేడి వెంట దూరము వెళ్ళెను. రాముడా లేడిని బాణముతో కొట్టగా అది హా సీతా హా లక్ష్మణా! యని కేకవైచి మరణించెను. అంతట సీత రామునకాపద వచ్చెనని తలచి లక్ష్మణుని రామునివద్దకు పంపెను.

సీతాపహరణము

రామలక్ష్మణు లిరువురును లేనియప్పుడు రావణుడు యతివేషమున భిక్షకై వచ్చినట్లభినయించి సీతను బలాత్కారముగా నపహరించెను. రాముడు జింకను చంపి తెచ్చుచుండగా దారిలో లక్ష్మణుడెదురయ్యెను. లక్ష్మణుడు సీతాదేవి మాటలు సహింపలేక వచ్చితినని రామునికి చెప్పెను. ఇరువురును పర్ణశాలకు వెళ్ళగా అచట సీత కనబడలేదు. రామలక్ష్మణు లామెను వెదకుచు మరణించుటకు సిద్ధముగా నున్న జటాయువును చూచి వాని ద్వారా రావణుడు సీత నపహరించినట్లు తెలిసికొని సీతను విడిపించుటకు రావణునితో యుద్ధము చేసిన జటాయువు మరణించగా వానికి సద్గతి నిచ్చి కబంధుని శాపవిముక్తుని చేసి వాని మాటననుసరించి సుగ్రీవుతో మైత్రి చేసికొనెను. రామసుగ్రీవులు పరస్పర సాహాయ్యము నొనర్చు కొనుటకై ప్రతిజ్ఞ చేసికొనిరి. రాముడంతట వాలిని చంపి సుగ్రీవుని వానరరాజు నొనర్చెను.

పిమ్మట వర్షాకాలము నాలుగు మాసములు లక్ష్మణునిచే ఓదార్పబడుచు శ్రీరాముడు ఎట్లో గడపెను. రాముడు భరింపరాని సీతావియోగముతో దుఃఖించుచుండ లక్ష్మణుడు మహానుభావా నేనా రాక్షసాధముని చంపి సీతను తెచ్చెదను నీవు దుఃఖపడవలదు. కష్టములందు ధైర్యముతో నున్నగాని సుఖపడు మార్గము తోచదు నీవు రఘువంశమున పుట్టినవాడవు. అని యూరడించెను! దుఃఖము తగ్గియున్న సమయమున ఆకాశమునుండి నారద మహర్షి రామలక్ష్మణుల వద్దకు భగవన్నామము గానము చేయుచు దిగివచ్చెను.

శ్రీ రాముడు శ్రీ దేవీవ్రతము నాచరించుట

శ్రీరాముడు తన భార్యయైన సీతను రావణుడపహరింపగా దుఃఖా క్రాన్తుడై యుండ లక్ష్మణుడతని ఓదార్చి మాట్లాడునప్పుడు నారదమహర్షి వీణా గానముతో రామలక్ష్మణుల సమీపమున ఆకాశమునుండి దిగెను. ఆతడు స్తిమితముగా

కూర్చొని తమ్మునితో కూడియున్న రాముని చూచి దుఃఖించుచున్నట్లు గ్రహించి. శ్రీరామా నీభార్య సీత రావణునిచే అపహరింపబడినదని నాకు తెలియును. నీవు జన్మించింది రావణుని చంపుట కొరకే. ఆ రావణుని నాశమునకు నేను ఉపాయము ను చెప్పు చున్నాను వినుమని అశ్వయుజమాసములో తొమ్మిది దినములు ఉపవాసము చేసి దేవిని పూజించుము/జపహోమవిధానముతో పరదేవతను పూజించి నచో నీవు సర్వసమర్థుడవై సీతాదేవిని పొందగలవు. పూర్వ మీవ్రతమును విష్ణువు, శివుడు, బ్రహ్మ, దేవేంద్రుడు చేసి తమతమ కోరికలను తీర్చుకొని సుఖపడిరి. నీవు కూడా శుభప్రదమైన యీ వ్రతమును చేసి సుఖపడుమని బోధించెను. విశ్వామిత్రుడు భృగుమహర్షి వసిష్ఠ కశ్యపులు, అపహరింపబడిన తమ భార్య కొఱకు బృహస్పతి ఈ విధంగా ఎందరో దేవీవ్రతం చేసి సుఖపడ్డారు.

నీవు కూడా యీ వ్రతమును చేసినచో తప్పక శత్రువును జయించి సుఖపడ గలవని చెప్పెను. మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇంద్రుడు, సూర్య చంద్రులు, భూమి, పర్వతాలు లేనప్పుడు పరిపూర్ణ ప్రకృతి స్వరూపమైన ఆ దేవి పరమపురుషునితో కూడి విహరిస్తుంది. సగుణ మూర్తియై మూడులోకాలను నిర్మిస్తుంది. ఆమెను తెలిసికొనినవాడు సంసారబంధము నుండి విముక్తుడౌతాడు అని నారదుడు చెప్పెను.

నారదుడు చెప్పినట్లు శ్రీరాముడు వ్రతమును చేయగా అష్టమినాడు అర్ధరాత్రి దేవి సింహవాహనముపై నుండి దర్శనమిచ్చింది. మరియు నాశక్తితో కూడిన వానరులు నీకు సహాయ చేసెదరు. నీవు భార్యా సమేతుడవై రాజ్యము నేలగలవు. తప్పక శత్రుసంహారము చేయగలవని పలికెను. శ్రీరాముడు దేవి చెప్పిన విధముగా వానరసైన్య సహాయముతో రావణ సంహార మొనర్చి భార్యాసమేతుడై చిరకాలము రాజ్యమేలెను.

చతుర్థ స్కంధము

జనమేజయుని సంశయములు

జనమేజయుడు వ్యాసమహర్షిని యిట్లు ప్రశ్నించెను. "వసుదేవుడు పూజనీయుడు గదా! అట్టి వానిని కంసుడు కారాగారమందేల నిర్బంధించెను. దేవకీవసుదేవుల ఆరుగురు కుమారులేల చంపబడిరి? శ్రీహరి చెరసాలయందెట్లవతరించెను? తల్లి గర్భమందుడగనే భగవంతుడు తల్లిదండ్రులను చెరనుండి యేల విడిపింపలేదు? కంసుడు చంపిన ఆ ఆరుగురు పిల్లలు ఎవరు? కంసుడు కొట్టగా ఆకాశమున అష్టభుజయై కనపడిన బాలికయెవరు? కృష్ణుడొనరించిన పనులను అతని దేహ త్యాగము వాసుదేవుని చరిత్రము నంతయును నాకు చెప్పవేడుచున్నాను నరనారాయణులు కృష్ణార్జునులుగా ఎట్లు పుట్టిరి? శంబరాసురుడు ప్రద్యుమ్నుని ఏల అపహరించెను? శ్రీకృష్ణుడు భయముతో మధురారాజ్యమును విడిచి ద్వారకకేల వెళ్ళెను? మహాత్ములైన భీష్మద్రోణులను కృష్ణుడేల చంపించెను. ధర్మాత్ములైన పాండవులేల దుఃఖమనుభవించిరి? ద్రౌపది యెందులకు కష్టపడవలసి వచ్చెను. పాండవులు భీష్మద్రోణులను మోసముతో నేల చంపిరి? నా తండ్రి మునిమెడలో చచ్చిన పామును వేసినాడని వింటిని ఇది ఆశ్చర్యకరముగా నున్నది. ఈ సందేహములకన్నిటికిని సమాధానములు చెప్పి శాంతిని ప్రసాదింపుము"అని జనమేజయుని ప్రశ్నలకు వ్యాసుడీరీతిగా సమాధానములు చెప్పెను.

కర్మ ప్రభావము- అదితి కశ్యపులు దేవకీవసుదేవులుగ జన్మించుటకు కారణము

రాజా! కర్మగతి మిక్కిలి తెలియ శక్యముగానిది. ఈ లోకములు త్రిగుణముల మేళనముచే పుట్టుచుండును. జగత్తంతయు కర్మవలననే పుట్టుచున్నది. ప్రపంచమంతయు శుభము, అశుభము, మిశ్రము అను మూడువిధములగు కర్మలచే వ్యాప్తమైయున్నది. కర్మవలననే రుద్రుడు కపాలమును ధరించుచున్నాడు. ఈ కర్మకు మొదలు లేదు. ఈ ప్రపంచము శాశ్వతముగా తోచుచుండును. మాయ అన్నిటికి కారణమైయున్నది. విష్ణువు కూడ తన యిష్టప్రకారము అవతరించుట లేదు. బ్రహ్మాదిదేవతలు కూడ తమతమ కర్మలనుబట్టి కష్టసుఖములననుభవించుచుండును. రాజా! యదువంశమున అవతరించిన శ్రీకృష్ణుని దివ్య

శుభగాథలను వివరించెదను వినుము. కశ్యపునంశమున జన్మించిన వసుదేవుడు గోవుల రక్షించుచుండెను. అతనికిద్దరు భార్యలు వారే దేవకీ, రోహిణులు. పూర్వము కశ్యపమహర్షి యాగము కొరకు వరుణుని ఆవు నపహరించెను. ఎంత వేడినను కశ్యపుడా ఆవు నీయలేదు. వరుణుడు బ్రహ్మ వద్ద విషయము చెప్పగా బ్రహ్మ వానిని పిలిపించి వరుణుని ఆవు నిమ్మనెను. అప్పుడు కూడ అతడు ఆవును విడువక పోవుటచే బ్రహ్మ వానిని భూలోకమున జన్మింపుమని శపించెను. నీ భార్యలు కూడ మానవ స్త్రీలగుదురు. నీవు గోపాలక వృత్తితో జీవింపుమనెను. ఇట్లేదితి -ఏడుగురు కుమారులు నీకు పుట్టగనే మరణింతురని అదితిని శపించినది. ఇట్లు దితికశ్యపులు దేవకీ వసుదేవులుగా జన్మించిరి. ఈ కథ విని జనమేజయుడు జీవుడు సంసార బంధము నుండి యెట్లు విముక్తుడగునో తెలుపుమని యడుగగా వ్యాసుడిట్లు చెప్పనారంభించెను.

మాయాశక్తి ప్రభావము

రాజా! భూమండలమునంతను దానము చేసిన బలిచక్రవర్తి నిజముగా గెలు పొందినవాడు. హరి బలినివంచించుటకు వామనుడయ్యెను. పిమ్మట శ్రీహరి బలికి ద్వారపాలకుడయ్యెను. కనుక సత్యము ధర్మమే దైవము. ఎల్లకాలము సత్యమును పాటించుట కష్టసాధ్యము. మహామాయ త్రిగుణాత్మకమైనది. ఎంతటి వానికిని యిది దాటశక్యము కానిది. ఈ ప్రపంచము మాయచేతనే సృష్టింపబడు చున్నది. ఇది త్రిగుణముల సమ్మేళనము వంచవకును సత్యపరిపాలనమెట్లు సాధ్యపడును? ఈ విశ్వము మిశ్రితగుణములతో జన్మించినది. ఇది సనాతనము. వైఖానసాది మునులు మాయాతీతులు వారే సత్యధర్మమునకు దృష్టాంతముగ చెప్పదగినవారు. త్రిగుణములు విడివిడిగా నుండవు. ఎల్లప్పుడు కలిసియేయుం డును. నిర్మలము సుస్థిరమునైన పరమధర్మమందు యెవని బుద్ధియు నిలువదు. మహారాజా! బలవత్తరములైన యింద్రియములు మానవుని మాయామోహితుని చేయుచున్నవి. మనస్సు ఇంద్రియములలో తగుల్కొని విడివడ జాలకున్నది. ఈ మనస్సు వలన అనేకవిధములైన భావములు కలుగుచున్నవి. మాయకువశుడు కానివాడు లేడు. మానవుడు విషయభోగములను కాంక్షించి అసత్యమాడును. ఆభోగములు దక్కనప్పుడు వంచనకు పాల్పడును. దానిచే పాపములు సంభవించును. కామ క్రోధలోభములు బలవత్తర శత్రువులు. ఈ శత్రువులకు బానిసలై వివేకమును కోల్పోవుచున్నారు.

నరనారాయణుల తపఃప్రభావము

పూర్వము బ్రహ్మ హృదయమునుండి ధర్ముడను కుమారుడు జన్మించెను. అతడు సత్యసంధుడు వేదనిరతుడును. అతడు దక్షుని కుమార్తెలను పదిమందిని వరించెను. వారికి పుత్రులు కలిగిరి. వారి పేర్లు హరి, కృష్ణుడు, నరుడు, నారాయణుడు అని హరి కృష్ణులు యోగనిరతులైరి. నరనారాయణులు హిమాలయము వద్ద బదరికాశ్రమమున తపస్సు చేసిరి. ఇంద్రుడు-వారి తపస్సునకు భయపడి ప్రత్యక్షమై వరమును కోరుకొనుడని పలికెను. నరనారాయణులు ధ్యానవిష్ఠలో నుండి మాట్లాడలేదు. అంతట దేవేంద్రుడు మాయచే సింహవ్యాఘ్రాది క్రూర జంతువులను సృష్టించి భయపెట్టజూచెను. కాని వారు చలింపక అట్లే ధ్యాననిష్ఠలో నుండిరి. అప్పుడు యింద్రుడు మన్మథ వసంతులను పిలిచి మీరు అప్సరసలను వెంట బెట్టుకొని బదరికాశ్రమమున తపస్సు చేయుచున్న నరనారాయణుల వద్దకు వెళ్ళి వారి తపస్సునకు భంగము కలిగించుడు. దేవవేశ్యలను నీతో కూడ పంపుచున్నాను. నాపని నెరవేర్చుడు. నీవు కోరినది యిచ్చెదనని చెప్పగా వారు బదరికాశ్రమమునకు వెళ్ళిరి. మొదట వసంతుడు ఆప్రదేశమునంతను అతిమనోహరముగ నొనర్చెను. స్త్రీ పురుషులు మదనాతురులై క్రీడాసక్తులైరి. రంభ తిలోత్తను మొదలగువారు ఆశ్రమమును చేరి మధురముగా గానమొనర్చుచుండిరి. దేవకాంతల గానము విని మన తపోభంగమునకు ఇంద్రుడు పన్నినపన్నుగడయే యని నారాయణుడు పలుకుచుండగా మన్మథుడు మొదలగువారు కనబడిరి. నారాయణుడు వారిని చూచి యాశ్చర్యపడెను. మన్మథ వసంతులు పదహారువేల ఐదు వందల మంది అప్సరసలు మునివరులకు నమస్కరించి యెదుట నిలిచిరి. నారాయణుడు - మీరు యాతిథ్యమును స్వీకరింపుడు. ఇక్కడనే సుఖముగా నుండుడనెను.

తరువాత నారాయణుడు తన ఊరువునుండి ఒక సర్వాంగ సుందరిని సృష్టించెను. ఊరువు నుండి పుట్టుటచే ఊర్వశి యని పేరు పొందినది. అప్సరసలు ఆ స్త్రీని చూచి వెలవెలపోయిరి. అతిథులైన వారి సేవలకు అత్యద్భుత సౌందర్యవతులను సృష్టించెను. ముని సృష్టించిన ఊర్వశిని చూచి దేవవేశ్యలు ఆశ్చర్యపడి నారాయణునితో ఇట్లనిరి. ఆర్యా! మీ తపో మాహాత్మ్యమును ఆత్మస్థైర్యమును చూచితిమి. మమ్ము చూచి మీ మనస్సులు చలించుటలేదు. మేము ఇంద్రుని పని సాధించుటకు వచ్చితిమి. మీ దర్శనభాగ్యము కలిగినది. మమ్ము శపింపకుండ విడిచినందుకు ధన్యవాదములు. అని పలుకగా నరనారాయణులు ఈ ఊర్వశిని ఇంద్రునకు కానుకగా ఇచ్చుచున్నాము. ఈమెను స్వర్గమునకు కొనిపొందు

నేటినుండి మీరెవ్వరి తపస్సునకును విఘ్నము నొనొర్పవలదు. అని పలుకగా దేవవేశ్యలు మాకు నీవు పతివికమ్ము అని ప్రార్థించిరి. అప్పుడు నారాయణుడు కోపము తెచ్చుకొని వారినుండి బయట పడుటకు ఆలోచించుచుండగా నరుడు కోపముచే వచ్చెడి అనర్థమును చెప్పి శాంతింపజేసెను.

అహంకార ప్రభావము

మరియు గర్వము నణచి వేయవలయును శాంతభావము నాశ్రయించుము అహంకార దోషముచే మన తపస్సునకాటంకము కలిగినది. పూర్వము దురహం కారము చేతనే ప్రహ్లాదునితో వేయి సంవత్సరములు పోరాడవలసి వచ్చినది. కనుక శాంతిని పొందుము అని నరుడు పలికిన మాటలు నారాయణుని శాంతుని చేసినవి. మనస్సులో అహంకారము పుట్టినచో తపస్సు నశించుట కామక్రోధాదులు విజృంభించుట జరుగును. గర్వముచేత ప్రహ్లాదుడు శ్రీహరితో యుద్ధము చేసెను. ఓ రాజా! ప్రహ్లాదుని పుణ్యమంతయు వ్యర్థమయ్యెను. నరనారాయణులు తమ తపఃఫలమును చెడగొట్టుకొనినారు. అహంకారముచే బంధింపబడినవాడు ఎప్పటికిని ముక్తుడుగాడు. మహాత్ములు కూడ కామక్రోధములచే బంధింపబడు చుండిరి. ఈజగత్తులో అహంకారము లేనివాడు ముందురాబోవు నరకము నెవ్వ డును గమనించడు. అని బోధింపగా జనమేజయుడు నరనారాయణులకు ప్రహ్లా దునితో యుద్ధమేల యేర్పడెనని ప్రశ్నించెను. అంతట వ్యాసుడిట్లు చెప్ప దొడగెను.

ప్రహ్లాదుని తీర్థయాత్ర

హిరణ్యకశిపుడు మరణించగా ప్రహ్లాదుడు పట్టాభిషిక్తుడయ్యెను. అతడు దేవబ్రాహ్మణ పూజానిరతుడు. అతని పాలనమున రాజు పెక్కుయాగముల నొనర్చిరి. ఒకప్పుడు చ్యవనమహర్షి నర్మదానదిలో స్నానము చేయుటకు వెళ్ళెను. అతడు నదిలో దిగుచుండగనే ఒక భయంకర విషసర్పమాతనిని గట్టిగా చుట్టు కొనెను. అది పాతాళమునకు తీసికొనిపోవుచుండ నాతడు హరినామమును మన సార స్మరించెను. దానిచే సర్పము విషము లేనిదయ్యెను. పాము ఇతడెవడో మహాత్ముడని శపించునను భయముతో నాతని విడిచి పెట్టెను. అంత చ్యవనుడు పాతాళమునకు వెళ్ళి తిరుగుచుండగా ప్రహ్లాదుడు ఇంద్రుడు నన్ను రమ్మని నారాజ్యమునకు మిమ్ము పంపెనా? మీ రాకకు కారణమేమని యడిగెను. చ్యవనమహర్షి నేను దేవేంద్రుని దూతనుగాను. నర్మదానదిలో నన్ను పాము పట్టు కొనినది. హరినామస్మరణము చేయగా అది విడిచిపెట్టినదని చెప్పెను. అంతట ప్రహ్లాదుడు పుణ్యతీర్థముల గూర్చి తెలియజేయుమని చ్యవనమహర్షి నడిగెను.

చ్యవనమహర్షి దానవోత్తమా! మనస్సు వశముందుండవలె గాని నదీ స్నానము ముఖ్యము కాదు. మనస్సు శుద్ధముగా లేక ఎన్ని పుణ్యకార్యములాచరించినను అవి తగినఫలము నీయవు. చిత్తశుద్ధి, ద్రవ్యశుద్ధి, ఆచారశుద్ధి, తీర్థశుద్ధి, ఇట్టి పరిశుద్ధత లేనిచో ఏదియు ఫలము నీయదు. ఈ భూమండలమందెన్నియో తీర్థములు గలవు వానివనిట్టిని చెప్పుట శక్యముకాదని పలుకగా ప్రహ్లాదుడు నైమిషమునకు బయలుదేరెను. అతని వెంట పలువురు రాజులును బయలుదేరిరి. అందరును నైమిషారణ్యము చేరి అచట తీర్థమున స్నానము చేసిరి. తరువాత ప్రహ్లాదుడు రాక్షసులెల్లరతో కూడి తీర్థములన్ని తిరిగెను. సరస్వతీ నదీపావన తీర్థమందు స్నానము చేయగనే మనస్సు ప్రసన్నమయ్యెను. ఇట్లు ప్రహ్లాదుడు తీర్థాటనముచే పరిశుద్ధాత్ముడై అనేక శుభకర్మలనాచరించెను.

నరనారాయణులకు ప్రహ్లాదునితో యుద్ధము

ప్రహ్లాదునకక్కడ నొక మఱ్ఱిచెట్టు కనబడెను. అక్కడ నతనికి పలువిధములైన బాణములు కనిపించెను. ఈ బాణము లెవరివని ఆలోచించుచుండగనే జడలు లేడి చర్మము ధరించిన నరనారాయణులు కనబడిరి. వారు ధ్యాన నిమగ్నులై యుండిరి. ధనుస్సును అంబులపొదులను వారి వద్ద చూచి ప్రహ్లాదుడు కోపముతో ఓ మునులారా! ఈ సత్యయుగమున తపోధర్మమునకు విరుద్ధముగా ధనుర్బాణ తూణీరములు కలిగియుండుట తగదు. మీరు తపస్సు చేయవలెగాని ఈ ఆయుధముల ధరింపరాదు అని పలుకగా నరనారాయణులు దానవేంద్రా! మేము రెండిటి యందును సమర్థులమని లోకవిదితమే. మాకు యుద్ధమందు కూడ అపారమైన సమర్థత కలదు. నీవేమి చేయగలవు? బ్రహ్మతేజోబలమే బలము మూఢబుద్ధివి నీకేమి తెలియును? నీ దారిన నీవు పొమ్మనిరి.

ఓ తపశ్శాలులారా! మీరు మందమతులు గర్విష్ఠులు ఈ తీర్థమున అధర్మాచరణము తగదు. యుద్ధమందుశక్తి కలదేని చూపుడు అని ప్రహ్లాదుడనెను. అంతట నరుడు నీకు యుద్ధము చేయు బుద్ధియున్నచో నాతో యుద్ధము చేయుము. నీ శరీరమిప్పుడే ముక్కలు చేయుదును. అని పలుకగా దైత్యపతియగు ప్రహ్లాదుడు నేనెట్లైనను వీరిని గెలిచి తీరెదనని ప్రతిజ్ఞ చేసి వెంటనే ధనుస్సు నెక్కుపెట్టెను. నరుడు కూడ విల్లును అందుకొని తీవ్రములైన బాణములను ప్రహ్లాదునిపై ప్రయోగించెను. దైత్యపతి వానినన్నిటిని ఖండించెను. అంతట మిక్కిలి కోపించి నరుడు రాక్షసరాజుపై బాణవర్షము కురిపించెను. ప్రహ్లాదుడు వానినన్నిటిని ఛేదించి నరుని రొమ్ముపై శరములను నాటునట్లు చేసెను. నరుడుగ్రుడై ఐదుబాణములతో

ప్రహ్లాదుని బాహువుపై కొట్టెను. దేవతలీ యుద్ధము నాశ్చర్యముతో చూచుచుండిరి. అంతట నారాయణుడు విల్లందుకొని రాక్షసరాజు పై బాణవర్షము కురిపించెను.

ప్రహ్లాద నారాయణుల ఘోరమైన పోరును దేవతలాకాశమునందు నిలిచి చూచుచు పుష్పవర్షము కురిపించిరి. ఇట్లు వారిరువులు దీర్ఘకాలము యుద్ధము చేయగా భగవంతుడు పీతాంబరధారియై శంఖచక్రాది దివ్యాయుధములను పట్టుకొని ప్రత్యక్షమైయెను. అంత ప్రహ్లాదుడు భగవంతునకు నమస్కరించి దేవదేవా! మాధవా! ఈ మునులు జయింపబడుట లేదు. వీరిని నేను జయింప లేకపోవుట ఆశ్చర్యకరముగా నున్నదని పలుకగా వీరు నా దివ్యాంశముచే సంభవించినవారు. కనుక ఆశ్చర్యపడవలసినదేమి యున్నది. కనుక నీవు పాతాళమునకు పొమ్ము అని చెప్పగా తక్కి రాక్షసులతో ప్రహ్లాదుడు వెడలిపోయెను.

దేవదానవుల యుద్ధము-రాక్షసుల విజయము

జనమేజయుడు తన పూర్వులగు పాండవులు మున్నగువారి విషయ ములను శ్రీకృష్ణుని జన్మాదికము మున్నగు వానిని గూర్చి యడిగెను. ధర్మము-దైవము శక్తి మున్నగు విషయములలో తనకు గల సందేహములను వెలిబుచ్చెను. వ్యాస మహర్షియు వాని సందేహములను తీర్చెను. దేవదానవుల యుత్పత్తిని వారి పరస్పర వైరమును వివరించెను. నరనారాయణుల జన్మను వారి తపోమహిమను వివరించెను. శుక్రుని తపమును వరలాభమును వివరించెను. దేవదానవుల యుద్ధమును వివరించుచు ప్రహ్లాదునికి యింద్రునికి జరిగిన యుద్ధమును వారు చేసిన దేవీ స్తుతులను వివరించెను.

ఇంద్రాదులు దేవీ మహిమను కొనియాడుట

పూర్వమొకప్పుడు శుక్రాచార్యుడు రాక్షసులకు ప్రస్తుతము దేవతలతో యుద్ధము వలదనిచెప్పెను. మహాత్ముడగు శుక్రాచార్యుల మాటలు విని ప్రహ్లాదుడు దైవము బలవత్తరమైనది. ఇప్పుడు దేవతలతో యుద్ధము చేసినను మనము జయించుట సున్నయని తక్కిన రాక్షసులకు చెప్పెను.

అప్పుడు మదగర్వితులగు రాక్షసులు మేము యుద్ధముచేసెదము. మాకు దైవముతో పనిలేదు. రాజా! ప్రయత్నము చేయని సోమరులు దైవమును ప్రధానముగా తలచెదరు. దానినెవరు చూచిరి? ఎక్కడ చూచిరి? దానినెవరేర్పరచిరి? అదెట్టిది? మేము తగినబలము చేకూర్చుకొని యుద్ధము చేయుదుము. నీవు అంతయు నెరిగినవాడవు. కానమాకు నాయకుడువుగా నుండుము. అనుచు

నుత్సాహపడు రాక్షసుల మాటలకు సమ్మతించి ప్రహ్లాదుడు దేవతలను యుద్ధమున కాహ్వానించెను. యుద్ధమునకు సిద్ధమైన రాక్షసులను జూచి దేవతలు కూడ తగిన సన్నాహ ములతో యుద్ధము చేయసిద్ధపడిరి. అప్పుడు ఇంద్రునకు ప్రహ్లాదునకు చిరకాలము యుద్ధము జరిగెను. ఆ యుద్ధము మునులకు కూడ చాల ఘోరముగా కన్పట్టెను. అట్టి భీకరపోరాటమున శుక్రాచార్యులు గురువుగా గల ప్రహ్లాదుడు మొదలగు రాక్షసులకు జయము చేకూరెను.

ఆ కష్టసమయమున గురువు మాటప్రకారము సర్వ దుఃఖవినాశని ముక్తి దాయిని శివస్వరూపిణియైన శ్రీరాజరాజేశ్వరిని మనస్సులో తలచుకొని యింద్రుడు యిట్లు స్తోత్రము చేసెను ఓ దేవీ! ఓ మహాదేవీ! ఓ మహా మాయా! భక్తులయిలవేల్పు! ఓయమ్మా నీవు శంఖచక్రగదా పద్మములను శూలఖడ్గములను ధరించి మాక భయమును వరములను ఇమ్ము. ఓ తల్లీ నీకు జయమగుగాక భువనేశానీ! మాతా! నాదబిందుకళా స్వరూపిణీ! దశతత్త్వాత్మికా! శక్తి ప్రధానమైన దర్శనశాస్త్రములకు ముఖ్యనాయికా! నీకు వందనములు తల్లీ! యని ప్రార్థించి యిట్లు స్తుతించెను.

శ్లో॥ జయదేవి మహామాయే! శూలధారిణిచాంబికే ।
శంఖచక్ర గదాపద్మ ఖడ్గహస్తేఽ భయప్రదే ।
నమస్తే భువనేశాని! శక్తిదర్శన నాయికే ।
దశతత్త్వాత్మికే మాతర్మహా బిందుస్వరూపిణి ॥
మహాకుండలినీ రూపే సచ్చిదానందరూపిణి ।
ప్రాణాగ్ని హోత్ర విద్యేతే నమో దీపశిఖాత్మికే
పంచకోశాన్తరగతే పుచ్ఛ బ్రహ్మస్వరూపిణి ।
ఆనందకళికే మాతః సర్వోపనిషదర్చితే
మాతః ప్రసాద సుముఖీభవ హీనసత్త్వాం
స్త్రాయస్వనో జనని దైత్యవరాన్ జితాన్వై
త్వం దేవినశ్శరణదా భువనేప్రమాణా
శక్తాసి దుఃఖ శమనేఽఖిల వీర్యయుక్తే
ధ్యాయంతియేఽపి సుఖినో నితరాంభవన్తి
దుఃఖాన్వితా విగతశోకభయాస్త్ర థాన్యే
మోక్షార్థినో విగత మానవిముక్త సంగా
స్సంసారవారిధి జలం ప్రతరంతిసంతః
త్వం దేవి విశ్వజనని ప్రథిత ప్రభావా

సంరక్షణార్థము దితార్తి హరప్రభావా।
సంహర్తుమే తదఖిలంకిలకాలరూపా
కోవేత్తితేఽంబ చరితం నను మందబుద్ధిః।
బ్రహ్మా హరశ్చహరి దశ్వరథో హరిశ్చ
ఇంద్రోయమోఽధవరుణాగ్ని సమీరణౌచ।
జ్ఞాతుంక్షమాన మునయోఽపి మహానుభావా
యస్యాః ప్రభావమతులం నిగమాగమాశ్చ
ధన్యాస్త యేవ తవభక్తి పరామహాంతః
సంసార దుఃఖరహితా స్సుఖసింధు మగ్నాః ।
యేభక్తి భావరహితా నకదాపి దుఃఖాంభోధిం
జనిక్షయ తరంగముమేతరంతి
యేవీజ్యమానా! స్సిత చామరైశ్చ క్రీడంతి ధన్యాశ్శిబికాధిరూఢాః।
తైః పూజితాత్వం కిలపూర్వదేహే నానోపహారైరితి చింతయామి
యే పూజ్యమానావరవారణస్థా విలాసినీ బృందవిలాసయుక్తాః
సామంతకైశ్చోపనతైర్వ్రజంతి మన్యేహితైస్త్వంకిల పూజితాసి ॥
ఏవం స్తుతామఘువతా దేవీ విశ్వేశ్వరీతదా
ప్రాదుర్బభూవతరసా సింహారూఢా చతుర్భుజా ।
శంఖచక్ర గదా పద్మాన్‌బి భ్రతీ చారులోచనా
రక్తాంబరధరా దేవీ దివ్యమాల్య విభూషణా ॥
తామువాచసురాన్దేవీ ప్రసన్నవదనాగిరా
భయంత్యజతభో దేవాః శంవిధాస్యేకిలాధునా ॥
ఇత్యుక్త్వా సాతదాదేవీ సింహారూఢాఽతిసుందరీ ।
జగామతరసా తత్రయత్రదైత్యామదాన్వితాః ॥

స్తోత్రభావము:- ఓదేవి! మహాదేవి! మహామాయా! భక్తుల యిలవేల్పా! ఓయమ్మా! నీవు శంఖచక్ర గదాపద్మశూలఖడ్గములను ధరించిమాకు అభయము వరములను యిచ్చునట్టి తల్లివి. నీకు జయమగుగాక భువనేశి! మాతా! నాదబిందుకళా స్వరూపిణి! దశతత్త్వాత్మికా! శక్తిప్రధానమైన దర్శన శాస్త్రములకు ముఖ్యనాయికా! నీకు మా వందనములు తల్లీ! మహా కుండలినీశక్తి స్వరూపిణీ! సచ్చిదానంద స్వరూపిణీ! నిత్య చైతన్యజ్యోతీ! ఓ ప్రాణాగ్నిహోత్రవిద్యా శిఖాత్మికా! నీకు వందనములు నీవు పంచకోశాన్తర నిలయవు. ఆనందకోశ మందలి పుచ్ఛబ్రహ్మ

స్వరూపిణివి. ఆనందశివ మూర్తివి. సర్వోపనిషదర్చితవు. నీకు వందనములు తల్లీ! ఓ జగజ్జననీ! మేము రాక్షసులతో ఓడితిమి. బలహీనులమైతిమి. మా యెడల ప్రసన్నురాలవు అగుము. అమ్మా! మమ్ము కాపాడుమమ్మా! ఈ త్రిభువనము లందు నీవొక్కతెవే శరణమిచ్చుదానవు. మా దుఃఖములను తొలగించుటకు నీవే సర్వసమర్థురాలవు. నీకు వందనములు తల్లీ!

ఓ విశ్వజననీ! నిన్ను నిరంతరము ధ్యానించువారు. శాశ్వత సుఖశాంతులను పొందుదురు. నిన్ను ధ్యానింపనివారు భయశోకములతో దుఃఖములపాలగుదురు. సంగరహితు లైన ముముక్షువులీ సంసారసాగరమును దాటగలరు. ఓయమ్మా! నీవు విశ్వజననివి. దేవీ! నీ ప్రభావము ప్రపంచ ప్రసిద్ధము. నీవు దుఃఖహారిణివి. నీవే సర్వ రక్షణదక్షురాలవు. నీవే యఖండ కాలస్వరూపురాలవు. ఈ సకలమును నీవే సంహరించుదానవు. తల్లీ నీ దివ్యచరితము మందమతికేమి తెలియును? నీ అ తులదివ్యశక్తి ప్రభావమును హరి హర బ్రహ్మలు ముని గణమును యెరుగ లేరు. నిగమాగమములు కూడ తెలిసికొన లేవు. ఓయుమాదేవీ! నీపాదపద్మ సేవాపరాయణులైన మహాత్ములే ధన్యులు. వారు సంసార దుఃఖరహితులు. కాని భోగసాగరమగ్నులు భక్తి రహితులు జన్మమృత్యుసాగరమును దాటజాలరు. ఓ మాతా! నిత్యము చామరములచే వీచబడు వారును సుఖ క్రీడలాడువారును. అందలము లెక్కువారును పూర్వ జన్మమున నిన్ను పూజించియుందురని తలతును. ఎవరు నిత్యము పూజింపబడుదురో, ఎవరు ఏనుగుల నెక్కితి రుగుదురో, ఎవరు విలాస వంతులై వర్తింతురో, తమకు లోబడిన సామంతులతో కూడి సంచరింతురో వారు పూర్వము నిన్ను పూజించి యుండిరని భావించెదను.

అని యీ విధముగా ఇంద్రుడు స్తుతింపగా శ్రీత్రిభువనేశ్వరీదేవి సింహాధి రూఢయై చతుర్భుజయై వేగమే ప్రత్యక్షమయ్యెను. ఆజనని శంఖ చక్ర గదాకమల ముల ధరించి రక్తాంబరధారిణియై దివ్యమాల్య భూషితయై దేదీప్యమానయై ఒప్పెను. శ్రీదేవి ప్రసన్నవదనముతో అమృతవచనములతో దేవతల గూర్చి యీ విధముగా పలికెను. ఓ దేవతలారా! భయము విడువుడు. మీకు సిరిసంపదలును సుఖశాంతులును కలిగించెదను. అని పలికి సింహాసనాసీనయై జగదేకమాత వెంటనే మదగర్వితులగు రాక్షసులున్నచోటికి వెళ్ళెను. //

శుక్రుడు మంత్రప్రాప్తికై తపమొనర్చుట

పూర్వము దేవదానవులు యుద్ధము చేయుచుండగా విష్ణువు సహాయముచే దేవతలు రాక్షసుల నోడించిరి. అప్పుడు రాక్షసులకు శుక్రాచార్యులు నేను మంత్ర

శక్తితో మిమ్ము రక్షింపగలను. కొంతకాలము వేచియుండుడని చెప్పెను. మరియు నేను శంకరుని నుండి మంత్రవిద్య గ్రహించిన వచ్చువరకు మీరు తపస్సు చేయుడు. సమయము అనుకూలముగా నున్నప్పుడు దేవతలను మీరు జయింప గలరు అని పలికి పరమశివుని వద్దకు వెళ్ళెను. అప్పుడు రాక్షసులు సంధి చేసికొను టకు ప్రహ్లాదుని దేవతలవద్దకు పంపిరి. అతడు దేవతల వద్ద వెళ్ళి దేవతలారా! మేము అస్త్రసన్యాసము చేసితిమి. అని చెప్పగా దేవతలు క్రీడాసక్తులై యుండిరి. రాక్షసులు శుక్రుని రాక కెదురుచూచుచుండిరి. శుక్రాచార్యులు శివునివద్దకు వెళ్ళి బృహస్పతి వద్దలేని మంత్రములను నాకనుగ్రహింపుమని కోరెను. శివుడు దేవతలకు ఉపకారము చేవలెనని తలచి శుక్రునితో వేయి సంవత్సరములు తపస్సు చేసినచో నీ కోరిక సిద్ధించుననెను. శుక్రుడట్లే యని తపమాచరించపదొడగెను. దేవతలు యుద్ధవిముఖులై యున్న రాక్షసులపై ఒక్కుమ్మడిగ దాడిజరిపిరి. అప్పుడు దానవులు శుక్రాచార్యుల తల్లిని శరణువేడిరి. ఆమె తన తపోబల ముచే దేవతలను నిద్రపోవునట్లు చేసెను. విష్ణువు ఆసమయమున ఇంద్రుని తనలో ప్రవేశింపుమనెను. ఇంద్రుడట్లే చేసెను. శక్రుని తల్లిని విష్ణువు తన చక్రా యుధముతో తలను ఖండించెను. అందుచే ఇంద్రోపేంద్రులు బాధలేనివారైరి.

జయంతీ శుక్రుల సమాగమము

భృగుమహర్షి తన భార్యను విష్ణుమూర్తి చంపినందులకు చాల బాధపడి నీవనేకములైన అవతారములెత్తెదవని శపించెను. మరియు తన భార్యను తన తపశ్శక్తిచే బ్రతికించుకొనెను. నిద్ర నుండి మేల్కొంచిన యింద్రుడు తపస్సు చేయుచున్న శుక్రాచార్యుడింకేమి యపకారము చేయునోయని తన కూతురగు జయంతిని శుక్రునకు పరిచర్య చేసి అతనిని వశమొనర్చుకొనుమని పంపెను. ఆమెయు నట్లేయని శుక్రునకు సేవచేసి యాతని మెప్పించెను. శుక్రుడు నీకిష్టమైన దాని నిత్తును కోరుకొనుమనగా ఆమె నన్ను భార్యగా చేసికొనుమనెను. శుక్రా చార్యులు జయంతితో కామభోగములను అనుభవించుచుండగా బృహస్పతి శుక్రుని రూపములో రాక్షసుల వద్దకు వెళ్ళి మీ మేలుకోరి శివుని మెప్పించి యొక విద్యను పొందితిని. దానిని మీకు బోధింతుననెను. రాక్షసులా మాటలను సంతసించి నిర్భయముగా నుండిరి.

దేవగురువు దానవులవంచించుట

దైత్యులు బృహస్పతిని తమ గురువైన శుక్రునిగా తలచి యతని పట్ల విశ్వా సముతో అతని మాటజవదాటకుండిరి. చాల శుక్రుని వియోగముచే దైత్యులు

బాధపడిరి. కనుక వారు బృహస్పతి మాయచే మోహితులైరి. వారు విద్యకొరకు శుక్రరూపములో నున్న గురుని శరణు జొచ్చిరి. శుక్రుడు పదిసంవత్సరములు జయంతితో క్రీడించుచు సంతోషముగా గడపెను. పిమ్మట శుక్రునకు తన శిష్యులు గుర్తు కొచ్చిరి. అయ్యో రాక్షసులు నాపై కొండంత విశ్వాసముతో ఆశ పెట్టుకొని నాకైయెదురు చూచుచుందురు. నేనిపుడే వెళ్ళి వారిని చూచెదను. వారు భయాతురులు. నాభక్తులు వారికి దేవతల వలన భయము ప్రాప్తించకుండు గాక యని మనస్సులో తలచి సుందరీ! నా పుత్రులు దేవతలకు లొంగిపోయిరి. నేనిపుడు వెళ్ళి వారిని చూచి వెంటనే నీవద్దకు వచ్చెదను. జయంతి అట్లే కానిమ్మని పలికెను. అప్పుడు శుక్రుడు రాక్షసులను నిందించి జైనధర్మమును బోధించుచుం డెను. శుక్రుడు తన శిష్యులు బృహస్పతిచే వంచింపబడిరని విచారించెను. దేవత లకు గురువైయుండి కూడ అసత్యమును ప్రచారము చేయుచున్నాడని నా శిష్యులు మూఢులు. వీరిని గురువునట్లునివలె మిక్కిలి మోసము చేసినాడు.

దైవబలమే బలవత్తరమును ఉపాఖ్యానము

శుక్రాచార్యుడిట్లు ఆలోచించుకొని నవ్వుచు దైత్యులతో నిట్లనెను. ఓ దానవు లారా! నా రూపముతో వచ్చిన దేవతల గురువుచే. మీరు మోసపోతిరి. వాస్తవ శుక్రుడను నేను. ఇతడు దేవకార్యము సాధించుటకు వచ్చిన బృహస్పతి. ఇతని మాటలు నమ్మవద్దు. అని పలుకగా దైతేయులు ఇరువురు నొకేరూపములో నుండు టచే అసలు శుక్రుడెవడో గ్రహింపలేకపోయిరి. శుక్రునకు కోపము వచ్చి మీరు చైతన్యరహితులై తిరస్కరింపబడుదురు గాక యని శపించి యచటనుండి వెడలి పోయెను. బృహస్పతి అక్కడనే స్థిరచిత్తుడై యుండెను. శుక్రుడు శపించినట్లు విని అచటి నుండి వెడలి నిజరూపముతో ఇంద్రుని వద్దకు చేరి యసురులు శాపగ్రస్తులై నిరాశ్రయులైయున్నారు. ఇప్పుడు వారిని జయించుట సులభమని చెప్పగా ఇంద్రాది దేవతలు రాక్షసులపై యుద్ధమునకు వెడలిరి. రాక్షసులు ఎంత కాలమునకు గురువు రానందున దేవగురువు తమను మోసగించెనని తెలిసికొని నిందించి కోపముతో వెళ్ళిపోయిన శుక్రుని వద్దకు ప్రహ్లాదుని వెంటబెట్టుకొని వెళ్ళిరి. ప్రహ్లాదుడు శుక్రాచార్యులను స్తుతించి ప్రసన్నుని చేసికొనెను. శుక్రా చార్యుడు దివ్యదృష్టితో సంతయు గ్రహించి రాక్షసులకిట్లు చెప్పెను.

పూర్వము బ్రహ్మదేవుడు సత్యము హితకరమైన ఒక మాట చెప్పెను. అదియే మన ఈ భూమిపై మేలుకాని, కీడుగాని జరుగవలసినది తప్పక జరిగి తీరును. దైవమునకు విరుద్ధముగ నెవ్వడును ఏమియు చేయజాలడు"అని. కనుక మీరిపుడు

బలహీనులై యుంటిరి పాతాళమునకు పోయి తలదాచుకొనుడు. కాలము కలిసివచ్చినప్పుడు మీరు మూడులోకములకు రాజులై వెలుగొందెదరనియు చెప్పెను. ఒకనాడింద్రులు గాడిద రూపము ధరించెను. విష్ణు చేప, తాబేలు రూపము దాల్చెను. ఇట్టి సందర్భములబట్టి దైవమే బలవత్తరమైనదని తెలియుచున్నది. జగత్తంతయు దైవాధనమే.

శ్రీ విష్ణువు అవతారములు

జనమేజయుడు మునిశ్రేష్ఠా! శ్రీహరి దివ్యావతారములను విశదముగా తెలుపుమని యడుగగా మహాపాప వినాశకములు అమృతమయమైన శాంతి సమృద్ధి కరములునగు భగవదవతారముల నిట్లు వ్యాసుడు చెప్ప మొదలిడెను. చాక్షుష మన్వంతరమున ధర్మపుత్రులుగా నరనారాయణులు ప్రసిద్ధినొందిరి. అది ధర్మావతము. వైవస్వత మన్వంతరమున హరిఅత్రి పుత్రుడుగా నవతరించెను. అది దత్తాత్రేయావతారము. నాల్గవయుగమున దేవతల నుద్ధరించుట రెండు మనోహరరూపముల ధరించెను. అవియే వరాహనృసింహ రూపములు. త్రేతాయుగమున కశ్యపమహర్షికి వామనుడుగ నవతరించెను. పిమ్మట పందొమ్మిదవ త్రేతాయుగమున పరశురాముడగా నవతరించెను. అదే యుగమున రామావతారము కూడ సంభవించెను. ఈ విధముగా హరిప్రతి యుగమునందును. అనేకావతారముల నెత్తుచుండును. త్రిగుణముల సమష్టియగు మాయచే సర్వప్రపంచము ఆవరింపబడి యున్నది.

జనమేజయునకు కలిగిన సందేహములు

జనమేజయుడు వ్యాసునితో దేవకన్యలు వివాహము చేసికొనుమనగా నారాయణుడేమి చేసినో వివరింపుమని యడిగెను. వ్యాసుడిట్లు చెప్పెను! నారాయణుడు దేవకన్యలకు శాపమీయతలచగా నరుడు వారించి యాతని శాంతుని చేసెను. పిమ్మట నారాయణుడు నేనీ జన్మమందు తపస్సు చేయనిశ్చయించితిని. గనుక మిమ్ము వివాహమాడుట కుదురదు. మీరు స్వర్గమునకు వెళ్ళుడనెను. రాబోవు ద్వాపరయుగమున మీరెల్లరు నాకు భార్యలగుదురు అని వారి నోదార్చి పంపెను. దేవకాంతలు స్వర్గమునకు వెళ్ళి జరిగినదంతయు తెలుపగా దేవేంద్రుడు నరనారాయణుల ధైర్యమునువే నోళ్ళనుగ్గడించెను. ఆ నరనారాయణులే కృష్ణార్జునులుగా జన్మించిరి. అని చెప్పగా విని రాజు శ్రీకృష్ణుని చరిత్ర విస్తరముగ చెప్పుమని వ్యాసుని ప్రార్థించెను.

భూదేవి తన భారమును బాపదేవతల వేడుట

అప్పుడు వ్యాసమహర్షి యిట్లు చెప్పెను. పూర్వమొకప్పుడు శాంతమూర్తి యగు భూదేవి పాపాత్ముల బరువు మోయలేక కృశించి భయపడి యేడ్చుచు గోరూపముతో దేవలోకమునకు వెళ్ళెను. ఇంద్రుడామెను చూచి నీకు భయమెందు లకు? నీకు దుఃఖమెందులకు కలిగెను? అని ప్రశ్నించెను. అప్పుడు భూమాత! యిట్లు చెప్పెను. మగధరాజు జరాసంధుడు పాపాత్ముడు. చైద్యుడు శిశుపాలుడును దుర్మార్గుడు. నరకుడు రుక్మి, కంసుడు, కేశిధేనుకవత్సకులు మొదలగువారు ధర్మహీనులు పాపాత్ములును. వీరిచే నేను మిక్కిలి పీడింపబడుచుంటిని. వారి భారము మోయ జాలకున్నాను. నేనిప్పుడు ఏమి చేయుదును? అని విన్నవించగా నీవు బ్రహ్మను శరణువేడుము. ఆతడు నీ దుఃఖమును తొలగింపగలడని చెప్పి నేను కూడ నచటకు వచ్చెదననెను. వెంటనే భూదేవి బ్రహ్మలోకమునకు వెళ్ళెను. ఆమె వెనుక దేవతలు ఇంద్రుడు కూడ వెళ్ళిరి. బ్రహ్మ భూదేవిని చూచి ధ్యానముచే ఆమె రాకకు కారణము నెరిగి నీ దుఃఖమునకు కారణమేమని ప్రశ్నింపగా భూదేవి పాపాత్ములైన రాజుల సంహరించి నాభారమును తొలగింపుమనెను. అంతట బ్రహ్మ ఓ భూదేవీ! ఈ విషయమున ఇంద్రుని వలె నేనును అసమర్థుడనే. దేవ దేవుడగు విష్ణువొక్కడే. నీ భారమును తొలగింప సమర్థుడు. మనమందరము శ్రీ మహావిష్ణువు వద్దకు పోదము రండని బ్రహ్మ భూదేవి యింద్రాది దేవతలతో వైకుంఠమున కేగెను. వైకుంఠమున శ్రీమహావిష్ణువు దర్శనమయ్యెను. బ్రహ్మాది దేవతలు నారాయణుని స్తుతించి భూదేవి భారమును తొలగింపుమని ప్రార్థింపగా గోవిందుడు, శివుడు నేను బ్రహ్మాదిదేవతలు అందరము పరదేవత యొక్క కటా క్షముచే పని చేయువారలమే నేను స్వతంత్రుడను కాను. కనుక భువనేశ్వరీదేవిని ప్రార్థించి ఆమె యనుగ్రహముతో మన కష్టములను తొలగించుకొనవలయునని అందరును శ్రీత్రిపురసుందరీ దేవిని మనసార సంస్మరించిరి. అంత నామెప్రత్యక్షమై వారికి దర్శనమొసంగెను. అప్పుడెల్లరు నామెకు నమస్కరించి స్తుతించగా ప్రసన్ను రాలై మీ కార్యమేదియో తెలిపినచో దానిని సాధించి తీరుదునని పలికెను. దేవతలు పరదేవత కిట్లు విన్నవించిరి.

తల్లీ! భూదేవి దుష్టరాజుల భారముచే పీడింపడి దుఃఖించుచున్నది. ఈమె భారమును తొలగించుట ఒక్కటే మా కోరిక. ఈ పనికే సాధ్యము కాని మాకు శక్యము కాదు అని విన్నవించిరి. అప్పుడు మేఘ గంభీరధ్వనితో దేవి యిట్లనెను. దేవతలారా! నేను పూర్వదేవతల అవతార విషయము నాలోచించితిని. ఆ

దుష్టదానవులచే కలిగిన భూభారమును తొలగింతును మగధపతి మొదలగు వారిని నాశక్తిచే బలహీనుల నొనర్చెదను. మీరు మీయంశలతో భూమిపై నవతరింపుడు. మీకు నా యద్భుతశక్తి తోడుకాగలదు. కశ్యపుడు తన భార్యతో యదువంశమున వసుదేవుడుగా జన్మింపగలడు. అట్లే విష్ణువు వసుదేవునకు పుత్రుడుగా నవతరించును. నేను గోకులమున యశోదకు జన్మించ గలను. దేవతలారా! నేనీవిధముగ దేవకార్యమొనర్పగలను. హరికారాగారామున జన్మించును. నేనతనిని గోకులమునకు చేర్చెదను. శేషుని దేవకీ గర్భమునుండి రోహిణీ గర్భమునకు చేర్పగలను. వారు నా దివ్యశక్తి వలన దుష్టులను చెండాడెదరు. కురుక్షేత్రమున దుష్టక్షత్రియులను నశింపజేసెదను. విప్రశాపముతో యాదవవంశమంతరించును. హరిశాప వశమున శరీరము విడువగలడు. మీరు మీస్త్రీలతో కృష్ణునకు సహాయ ముగా మధురలో గోకులమందును జన్మింపుడు. అని యీ విధముగా పలికి యోగ మాయాశక్తి యంతర్ధానమొందెను. దేవతలు భూదేవియు వెడలిపోయిరి.

దేవకీవసుదేవుల జన్మవృత్తాంతము- కంసుడు దేవకీవసుదేవుల చంపుట- దేవదానవుల యంశావతార వర్ణనము

సూర్యవంశమతరించిన పిదప మధురానగరము యాదవులవశమయ్యెను. శూరసేనుడు మధురకు రాజై సుఖసంపదల ననుభవించెను. అతనికి కశ్యపాంశమున వసుదేవుడు పుత్రుడై జన్మించెను. ఆ కాలమున ఉగ్రసేనుడు శూరసేన దేశమునకు రాజాయెను. అతనికి కంసుడు పుత్రుడు. అదితి దేవకుడను వానికి కుమార్తెయై దేవకి యని పిలువబడుచుండెను. ఆ దేవకమహారాజు తన కుమార్తెను వసుదేవునికిచ్చి వివాహము చేసెను. అప్పుడాకాశవాణి దేవకి అష్టమగర్భము నీ పాలిటి మృత్యుదేవతయని కంసుని హెచ్చరించినది. కంసుడు దేవకిని చంపి తనకు మృత్యువు లేకుండ ౘేసికొనజూచెను. వసుదేవుని అనుచరులైన వీరులు దేవకిని విడిపించిరి. కంసుని కోపాగ్ని చల్లారుటకు వసుదేవుడు -దేవకికి పుట్టిన ప్రతిశిశువును నీకిచ్చెదనని పలికెను. అంతట కంసుని కోపము శాంతించినది. వసుదేవుడు దేవకితో నిర్భయముగా తన యింటికి చేరెను. కొలది కాలమునకు దేవకి గర్భవతి యై పుత్రుని కనెను. వసుదేవుడు దేవకిని ఒప్పించి యాబాలుని కంసుని కీయగా కంసుడా శిశువును బండపై వేసి కొట్టిచంపెను. దేవకికి పుట్టిన ఆరుగురు బాలురను కంసునిచేనిట్లే చంపబడిరి. దేవకికి ఏడవ గర్భమున శేషుని

అంశావతారము ముండెను. అప్పుడు యోగమాయ దేవకి గర్భమందలి శిశువు నాకర్షించి రోహిణి గర్భమందుంచెను. జనులును కంసుడును గర్భస్రావమయ్యెనని తలచిరి. అష్టమ గర్భమున భగవంతుడు జన్మించెను. నారాయణాంశమున వాసు దేవుడు నరుని అంశము వలన అర్జునుడు. ధర్మరాజు ధర్మాంశమున వాయువు యొక్క అంశచే భీముడు అశ్వినిదేవతల యంశచే నకులసహదేవులు సూర్యుని యంశచే కర్ణుడు, ధర్మాంశమున విదురుడు బృహస్పతి యంశమున ద్రోణుడు శివాంశమున అశ్వత్థామ, ఇట్లే రాక్షసులయంశచే పలువురు రాజులు జన్మించిరి.

శ్రీ రామకృష్ణుల యవతారవర్ణనము

దేవకి కుమారుల నారుగురను కంసుడు చంపెను. ఏడవ గర్భము పోయినది. ఎనిమిదవ గర్భమున జన్మించువాడే తనను చంపునను భయముతో కంసుడు జాగరూకుడై చూచుచుండెను. శ్రీమహావిష్ణువు దేవకి ఎనిమిదవ గర్భము నాశ్రయిం చెను. అదే సమయమున రోహిణి గోకులమున బలరాముని ప్రసవించెను. దేవకి గర్భములో శ్రీహరి దేవకార్యార్థమై వర్థిల్లుచుండెను. పదియవ నెలలో శ్రావణకృష్ణ అష్టమి రోహిణి నక్షత్రమున హరి యవతరించెను. అప్పుడు కంసుడు గడగడ లాడెను. దానవులతో మీరు జాగరూకులై యెనిమిదవ శిశువు జననమును నాకు తెలుపుడని చెప్పి తన భవనమునకు వెళ్ళెను. కాని మనస్సులో భయముచే శాంతి లేకుండెను. దేవకి అర్ధరాత్రి పరమాద్భుత దివ్యకాంతుల విరజిమ్ము సుందర బాలుని ప్రసవించెను. ఆ బాలుని చూచి ఆమె అత్యాశ్చర్యము నొందెను. వసు దేవుడు ముద్దులొలుకు బాలకుని ఎత్తుకొనెను. అప్పుడాకాశవాణి వసుదేవా! త్వరగా నీవు నీ బాలుని గోకులమును చేర్చుము. కాపలావాళ్ళు నిద్రలో మునిగియున్నారు. ద్వారములు తెరచియున్నవి. ఈ బాలుని నందునింట విడిచి యచటి యోగ మాయను తెమ్ము అని పలికినది. వసుదేవుడు వెంటనే బాలకు నెత్తికొని బయటకు వెళ్ళి యమునా నది దాటి చీకటిలో గోకులము చేరెను. అచట నందుని యింట యశోదకు జన్మించిన యోగమాయను (బాలికను) నిద్రలో మునిగిన ఆమె వద్ద నుండి గ్రహించి వసుదేవుడు శీఘ్రముగా తన చెరసాలలో ప్రవేశించెను. అప్పుడా పిల్లకెవ్వున ఏడ్చెను. ద్వారపాలకులు లేచి వెంటనే కంసునకు దేవకి ప్రసవించినదని చెప్పిరి. కంసుడు త్వరగా చెరసాల వద్దకు వచ్చి వసుదేవుని నీ బిడ్డనిమ్ము. అష్టమ గర్భమైన యీ బిడ్డను చంపి శాంతి నొందెదని పలికెను. వసుదేవుడు వణకుచు పసిబిడ్డను కంసుని చేతులందుంచెను. బాలిక పుట్టినదేమి? ఇదియంతయు కాలవైపరీత్యమని యీ పసిబాలను రాతిబండపై విసిరికొట్టెను. ఆ బాలిక వెంటనే

ఆకాశమున కెగసి ఓరి పాపీ! నిన్ను చంపువాడెప్పుడోపుట్టి యున్నాడు అని పలికి అదృశ్యమయ్యెను. కంసుడింటికి వెళ్ళి పూతనను గోకులమునకేగి పుట్టిన ప్రతి శిశువును చంపమనెను. కేశి, బక, ధేనుక, ప్రలంబాది, దానవులను, బాలకృష్ణుని చంపుటకు నియమించి మాటిమాటికి తన చావును తలచుకొనుచు మిక్కిలి దీనుడయ్యెను.

శ్రీకృష్ణుని అత్యద్భుత చరిత్రము

గోకులమున నందునింట పుత్ర జన్మోత్సవము కన్నుపండువగా జరుగుచుండెను. ఆ వార్త విని కంసుడు క్రోధోద్రిక్తుడై మారువేషమున రాక్షసులనచటకు పంపెను. శ్రీకృష్ణుడు పూతన రాక్షసిని చంపివైచెను. బకవత్సకధేనుకాది రాక్షసులను చంపివైచెను. గోవర్ధనగిరిని లీలగా నెత్తెను. ఇవి యన్నియు విని ధనుర్యాగము నెపమున రామకృష్ణులను పిలిపించెను. వారు మొదట ధనుర్భంగ మొనర్చి రజకునివల యా పీడగజమును చాణూరముష్టికులకు చంపిరి. సర్వేశ్వరుడు కృష్ణుడు కంసుని జుట్టు పట్టి యీడ్చిచంపెను. తల్లిదండ్రులను చెరసాలనుండి విడిపించెను. ఉగ్రసేనుని మధురకు రాజుగా చేసెను. వసుదేవుడు రామకృష్ణులకు ఉపనయన మొనర్చెను. వారు సాందీపుని వద్ద సమస్త విద్యలనభ్యసించి మధురకు వచ్చిరి. పిమ్మట జరాసంధుని ఓడించిరి. కాలయవనాదుల వలన కలిగిన బాధలచే యాదవులు శ్రీకృష్ణుని యభిప్రాయానుసారముగ ద్వారకయందు నివసింపసాగిరి. పిమ్మట యవనుడు యుద్ధమునకు రాగా శ్రీకృష్ణుడు ముందు నడుచుచు ఒక కొండ గుహలో ప్రవేశించెను. అచటి ముచుకుందుడు నిద్రించుచుచుండెను. కృష్ణుడే యనుకొని కాలయవనుడు వానిని కాలితో తన్నెను ముచుకుందుడు కోపించి వానిని భస్మమొనర్చెను. ముచుకుందుడు కృష్ణునకు నమస్కరించి వనమునకు వెళ్ళగా కృష్ణుడు బలరామునితో ద్వారకకు చేరెను. ఉగ్రసేనుని రాజుగా చేసి శ్రీకృష్ణుడు స్వేచ్ఛగా విహరించుచుండెను. రుక్మిణిని శ్రీకృష్ణుడు రాక్షస వివాహము చేసికొనెను.

పిమ్మట జాంబవతి మిత్రవింద సత్యభామలను పెండ్లాడెను. కాళింది, లక్ష్మణ, నాగ్నజితి యను వారలను వేర్వేరు సమయములందు వివాహమాడెను. రుక్మిణి కుమారుడు ప్రద్యుమ్నుడు. శంబరుడను మాయావి పురిటింటనే బాల ప్రద్యుమ్ను నపహరించెను. అంతట పద్మనాభుడు శ్రీభువనేశ్వరీ దేవిని ప్రార్థించి స్తుతింపగా నామె ప్రసన్నురాలై నీ కుమారుడు పదహారేండ్ల వయస్సున శంబరుని చంపి తిరిగి రాగలడని పలికి యంతర్ధానము చెందెను.

శ్రీకృష్ణుడు పుత్రప్రాప్తికి తపమొనర్చుట

జాంబవతి రుక్మిణి యొక్క గుణవంతులైన పుత్రులను చూచి తన కట్టిపుత్రు నను గ్రహింపుమని శ్రీకృష్ణుని కోరగా కృష్ణుడు పుత్ర సంతికై తపస్సు చేసెను. కృష్ణుడు తపస్సు చేయు పర్వతమునందే ఉపమన్యువను శివభక్తుడు కలడు. కృష్ణుడతని వద్దకు వెళ్ళి అతని గురువుగా భావించి నియమనిష్ఠలతో పాశుపత మంత్రము జరిపించెను. శివుడు దర్శనమిచ్చెను. మరియు వాసుదేవా! నీ కోరికను తీర్చెదను ఏమి కావలెనో కోరుమనెను. అంతట కృష్ణుడు భక్తితో నమస్కరించి నిలిచి మేఘగంభీర ధ్వనితో స్తోత్రము చేసెను. శ్రీకృష్ణుడు పుత్రసంతానమును కోరుచున్నానని చెప్పగా నీ భార్యలందరకు ఒక్కొక్కతెకు పదిమంది చొప్పున పుత్రులు కలుగుదురని పలికెను. అంతట శ్రీకృష్ణుడు పార్వతీదేవికి నమస్కరించెను. ఆమె ప్రపంచమున కీర్తి నొందెదవు గృహస్థ శ్రేష్ఠుడవగుదువు అని పలికెను. పిదప పార్వతీ పరమేశ్వరులు అంతర్ధానము నొందిరి. శ్రీకృష్ణుడు ఉపమన్యునకు నమస్కరించి ద్వారకానగరమునకు వెళ్ళెను. కనుక బ్రహ్మాదిదేవతలు కూడ మాయకు వశులగుదురు. వారివారి పూర్వజన్మ కర్మలను బట్టి చిద్రూపిణి మాయా శక్తియై ప్రేరేపించుచుండును. దేవి జీవులను ముక్తులు నొనర్చును.

ప్రహ్లాదుడు దేవిని ప్రార్థించుట

ప్రహ్లాదుడు మొదలగు వారు ఆ దేవిని చూచి ఒకరి మొగమొకరు చూచుకొని యిప్పుడేమి చేయుదమని చింతించిరి. ఈ దేవత చండిక. దేవతలను రక్షించుటకీమె యిటువచ్చినది. పూర్వము చండముండా సురుల నీమెయే సంహరించినది. పూర్వ మీతల్లియే వంకర చూపుతో మధుకైటభులను తెగటార్చినది. ఇప్పుడీమె తప్పక మనయంతు తేల్చ గలదు. అని యిట్లు చింతాపరులగు రాక్షసులను చూచి ప్రహ్లాదుడిట్లనెను. ఓ రాక్షసలారా! ఇప్పుడు యుద్ధము తగదు మనము కాలికి బుద్ధి చెప్పుట మంచిది అని పలికెను. ఆ మాటలు పాటించి పరుగెత్తుటకు సిద్ధపడినవారిలో నముచియనువాడు ఇట్లనెను. మనము పరుగెత్తినను జగన్మాత రోషముతో ఆయుధములచే మనలను చంపకవదలదు. కనుక మనకు దుఃఖము కలుగని పనిచేయుట మంచిది. ఆ తల్లినిపుడు స్తుతించి ఆమె ఆజ్ఞ తీసికొని మనము పాతాళమునకు పోవుదము అనగా ప్రహ్లాదుడు ఇట్లనెను. నేను సృష్ట్యంత స్థితి కారిణిని సర్వజనని భక్తుల కభయప్రదాయిని మహామాయాశక్తి యగు మహాదేవిని స్తుతించుచున్నాను. అని నుతించి పరమార్థవిదుడు విష్ణు భక్తుడునైన ప్రహ్లాదుడు జగదంబకు నమస్కరించెను. పూలమాలయందు సర్పభ్రాంతి

కలుగునట్లే యే తల్లియందు చరాచర జగము భాసించుచున్నదో ఆ సర్వాధిష్ఠాన రూపిణి యగు హ్రీం బీజ స్వరూపిణిని నమస్కరించుచున్నాను. తల్లీ ఈ స్థావరజంగమాత్మకమైన విశ్వ మంతయు నీవలననే కలిగినది. బ్రహ్మాదులును నీచేతనే సృజింపబడిరి.

ఓ మహా మాయాదేవీ! నీకు నా నమోవాకములు. నీవు బ్రహ్మాండ మాతవు. దేవదానవులను నీవే సృష్టించితివి. కావ నీకు వీరిపట్ల భేదమెక్కడిది? తల్లికి పుట్టిన పుత్రులలో సన్మార్గులు దుర్మార్గులు నుందురు. ఐనను తల్లి వారిని సమభావముతో చూచును. అట్లే యిప్పుడు దేవతలందు మాయందును నీకు భేదభావము తగదు. మాతా! నీవు పురాణముల విశ్వజననివిగా పేరు పొందితివి. నీకు దేవతలవలె మేమును పుత్రులమే. వారును మేమును స్వార్థపరులమే నిజముగా దేవదానవుల మధ్య భేదములేదు.

ఓయమ్మా! దేవేశ్వరీ! మేము ధనభార్యాదిభోగములందు నిత్యము ఆసక్తి కలిగి యుండుట సత్యమే. వారును మావంటివారే. ఇక మాయిరువురి నడుమ నీకు భేదభావమేల కలిగెను? విశ్వజననీ! నీకిట్టివిరుద్ధ భావము తగదు. దేవతలనువలె మమ్ముకూడ చూడుము. వారు కశ్యపపుత్రులే మేమును కశ్యపపుత్రులమే దేవతలు మాకంటె గుణవంతులెట్లగుదురు? కామక్రోధ లోభ మోహములందరియందును కలవు. తల్లీ నీకు బుద్ధియందు మా యుద్ధము చూచువేడుక పుట్టియుండును. అందుచే నీవు లీలామాత్రముగ మాలో భేదములు పుట్టించి పరస్పర విరోధములు కల్పించి తివని తలచుచున్నాను. చాముండా! నీకు నిజముగా మా కలహము చూచు కోరికయే లేనిచో అన్నదమ్ములమైన మాలో మాకీపొరపొచ్చెములేల కలుగును? మేము కూడ కొంచెము ధర్మమెరుగుదుము. ఇంద్రుని గూర్చి మాకంతయును తెలియును. ఇక మాలో మాకు కలహము కేవలము నీభోగము కొరకే సుమా! నీకంటే శాసకుడెవడున్నాడు?

పూర్వమొకప్పుడు దేవతలు రాక్షసులు కలిసి పాలసముద్రమును మథించిరి. అప్పుడు దానినుండి అమృతము దివ్యరత్నములును వెలువడినవి. ఆయమృతమును పంచునెపముతో శ్రీహరి మాలోమాకు భేదములు కల్పించెను. ఓ విశ్వమాతా! జగద్గురువగు శ్రీహరి ప్రపంచ పోషణకు నీచేతనే నియమింప బడినవాడు. అతడే స్వయముగా దేవకాంతయైన శ్రీమహాలక్ష్మిని స్వీకరించెను. ఆ సమయమున దేవరాజు ఐరావతమును ఉచ్చైశ్రవమును కామధేనువును పారిజాతమును స్వీకరించెను. హరియనుమతితో తక్కిన దేవతలే విలువగల తక్కిన వస్తువులను

గ్రహించినారు. ఆ విధముగా అన్యాయమునకు ఒడిగట్టిన దేవతలే ఈనాడు సత్ప్రవర్తనులైరి. నిజమునకు దేవతలే అన్యాయపరులు. ధర్మలక్షణమెట్టిదో నీవే యెరుగుదువు. లోకమాన్యుడైన విష్ణువే వారినంత మహోన్నతస్థాన మందుంచెను. అప్పుడు దేవతలవలన రాక్షసులు పరాభవమునకు గురియైరి. కనుక ఏది ధర్మము? ఏది కార్యము. అధర్మ స్వరూపమెట్టిది? అ సాధుత్వమెట్టిది? ఇవి యన్నియు నీవేల యెరుగుదువు. నీవు ధర్మ సూక్ష్మదృష్టితో అంతయును సమదృష్టితో చూడుము. తార్కికులు యుక్తివాద మెరిగినవారు. వేదవాదులు విధిమార్గమును సూటిగా అనుసరించువారు.

ఈ ప్రపంచము నంతయు సృష్టించిన ఈశ్వరుడున్నాడను విషయమున మందబుద్ధులగు నిరీశ్వర మీ మాంసకులు వివాదము చేయుచుందురు. నిజముగ ఈ విశాల ప్రపంచమునంతటిని ఒక్కడే సృష్టించిన యెడల సృష్టిలోనింత భేదము ఎందుకుండవలెను. వేదశాస్త్రములందన్నింటి యందును ఐక్యభావమెందుకు లేదు? అని నిరీశ్వరవాదులు వాదింతురు. మొత్తము ఈ ప్రపంచమంతయును స్వార్థముతో నిండియున్నది. అందుచే ఈ వేదవేత్తల వాక్కులలో ఐక్యము లేదు. కోరికలేనివాడు ప్రపంచములో ఒక్కడునులేడు. నామనుమడు బలి ధార్మికులలో గొప్పవాడు. సత్యవ్రత పరాయణుడు శాంతుడు సర్వజ్ఞుడు సర్వపూజితుడు నిరప రాధి. రాక్షసరాజు. ఐనను శ్రీహరి కపట వామనరూపమున అతని తలపై కాలుపెట్టి అతని రాజ్యమునపహరించెను. ఐనను దేవతలే ధర్మపరులని పండితులు పొగడు చున్నారు. లోకములో నెదుటివాని కిష్టమగు మాటలు మాట్లాడిన వాడే ధర్మము చెప్పువాడుగా లెక్కింపబడుచున్నాడు. ఇవన్నియు నీకు తెలియనివి కావు. కనుక నీకెట్లులోచినట్లు చేయుము. రాక్షసులందరు నీకిప్పుడు శరణార్థులు. వారిని కాపాడుదువో విడిచిపెట్టెదవో అంతయు నీయిష్టము. అని ప్రార్థించెను!

అని పలుకగా దేవి యిట్లు మాట్లాడెను:- ఓ రాక్షసులారా! మీరిపుడు పాతాళమునకు పోయి స్వేచ్ఛగా నుండుడు. మీరు కోపమును విడిచి పెట్టుడు. నిర్భయముగానుండుడు. కాలము నెదురుచూడుడు. నిరాశా నిస్పృహలకు లోనుకాకుడు అట్టివారికి సుఖము చేకూరదు. మీకు శుభకాలము రాగలదు. ఇప్పుడు మీరీ భూమిని విడిచి పాతాళమునకు పొండు. నాయాజ్ఞచే మీరందరును పాపము లేని వారగుదురు. అనగా వారు దేవికి మ్రొక్కి పాతాళమునకు పోయిరి. దేవియు అంతర్ధానము చెందెను. దేవతలు కూడ తమ నివాసములకు పోయిరి. ఈ విధముగా దేవదానవులు విరోధమును విడిచిపెట్టిరి.

పంచమ స్కంధము

యోగ మాయా ప్రభావము

ఋషులు సూతమహర్షీ! శ్రీకృష్ణుడు సామాన్యుని వలె తపమేల చేసెను? అని ప్రశ్నింపగా వ్యాసుడు తనకు చెప్పిన విషయమును వినిపింతునని సూతుడిట్లు చెప్పెను. వాసుదేవుడు సర్వకార్యదక్షుడు, దానవాంతకుడు నిజమే ఐనను మానవుడుగా నున్నందున మానవభావము కలిగియుండెను. మరియు ఓంకారములో అకారము బ్రహ్మ ఉకారము విష్ణువు, మకారము శివుడు అని చెప్పుదురు. ఈ ముగ్గురిలో ఒకరికంటె రెండవవాడు, వానికంటె మూడవవాడు గొప్పవాడని చెప్పుదురు. అందుచే కృష్ణుడు తనకంటె గొప్పవాడగు శివుని సేవించుట సమంజసమే. యోగమాయా ప్రభావముచే యుయాగమున విష్ణువవతరించుచుండును. విశ్వ జననియైన పరదేవత కనురెప్ప తెరచినంత మాత్రమున ఈ బ్రహ్మాండములనెల్ల సృష్టించి పెంచిలయింపచేయును. ఆ దేవి కృష్ణుని నందగోపునింట నుండునట్లు చేసినది. కృష్ణు చేసిన ఘనకార్యములన్నియు అ దేవి చేయించినవే. కృష్ణుడు నిఖిలధర్మ సంస్థాపకుడు. మూలప్రకృతి యనబడు పరదేవత నుండియే హరిహర హిరణ్యాగర్భులుద్భవించిరి. అహంకారము నరుని పతితుని చేయును.బ్రహ్మ తన అహంకారమును విడిచిపెట్టిన, ముక్తుడగును. అతడు అహంకారముతో నున్నప్పుడు ప్రపంచమును సృష్టించును. అట్లే జీవుడు అహంకారము విడిచినచో ముక్తుడగును. అహంకారమునకువశుడైనచో బద్ధుడగును. ప్రాణికి అహంకారమే బంధ కారణము. హరి అహంకారముతో కూడి జగత్తులను పాలించుచుచుండును. భగవంతుడైన విష్ణువు స్వతంత్రుడుకాడు. స్వతంత్రుడైనచో గర్భనరకము నను భవించుట సామాన్యునివలె అనేక కష్టముల నెందుటయేల సంభవించును? కనుక హరిహర బ్రహ్మలు మాయచే బంధింపబడి క్రీడించుచుందురు. అని వివరించెను!

మహిషాసురుని జన్మ వృత్తాంతము

జనమేజయుడు పరదేవత యొక్క అమృతచరిత్రను యింకను విన కుతూలము గానున్నది. దయతో వివరింపుమనగా వ్యాసుడిట్లు చెప్పెను. పూర్వము మహిషాసురుడను రాజు కలడు. అతని కాలమున దేవదానవులకు ఘోరమైన యుద్ధము సంభవించెను. ఆ రాక్షసుడు తన కోరిక సిద్ధించుటకై మేరుపర్వతముపై తీవ్రమగు తపస్సు చేసెను. బ్రహ్మ సంతోషించి ప్రత్యక్షమై ఏమి కావలెనని వాని ప్రశ్నించెను. మహిషుడు నాకు చావులేకుండునట్లు వరమిమ్మనెను. బ్రహ్మ అది

యసంభవము. వేరొక వరమును కోరుకొనుమనెను. మహిషుడు దేవదానవ నరుల వలన చావులేకుండ చేయుము- స్త్రీ నన్ను చంపలేదు. కనుక స్త్రీ వలన చావు సంభవింపనిమ్మనెను. అంతట బ్రహ్మ ఓ మహిషాసురా! నీకు స్త్రీవలననే చావు కలుగును. ఇతరులెవ్వరు నిన్ను చంపలేరని వరిమిచ్చి తన లోకమునకు వెళ్ళెను. దైత్యుడు సంతోషముతో నింటికి వచ్చెను. అని చెప్పగా జనమేజయుడాతడెవ్వని కొడుకు వానికి మహిష రూపమేట్లు వచ్చెనని ప్రశ్నింపగా వ్యాసుడు ఇట్లు చెప్పెను.

పూర్వము రంభుడు, కరంభుడు అను ఇరువు దానవులు కలరు. వారికి పుత్రసంతతి లేదు. వారిరువు పుత్ర సంతతికై చాల సంవత్సరములు తపస్సు చేసిరి. ఇంద్రుడు మొసలిరూపము ధరించి కరంభుని చంపెను. రంభుడు తన యన్నచావు విని తన తలను ఖండించి అగ్నిలో వేయబోవుచుండ అగ్నినీవేల ఊరక ప్రాణములు పోగొట్టుకొందువు? వరమడుగుము అని పలికెను. అంతట రంభుడు ముల్లోకముల గెలుచు కుమారుని ప్రసాదింపుమని కోరెను. అగ్నిదేవుడట్లే నీకు పుత్రుడు జన్మించునని పలికి అంతర్ధానమొందెను. రంభుడు అక్కడక్కడ విహరించుచు మదించిన గేదెపై మనస్సు గలవాడై దానియందు కుమారుని పొందెను. పిమ్మట రంభుడొక దున్నపోతుతో పోరాడగా అది కొమ్ములతో గుండెలపై పొడిచి యాతని చంపివైచెను. రంభుని వియోగము భరింపలేక గేదె చచ్చుటకు ప్రయత్నించుచుండగా మహిషి గర్భము నుండి మహాబలుడగు మహిషుడు జన్మించెను. రంభుడు పుత్రవాత్సల్యముచే మరియొక రూపుదాల్చి వచ్చెను. ఈతడే రక్తబీజుడను రాక్షసుడు, మహిషుడు రాజుగా పట్టాభిషిక్తుడయ్యెను. మహిష రక్తబీజులు దేవదానవులకు చంపరానివారయ్యిరి.

మహిషాసురుడు వరగర్వితుడగుట

మహిషాసురుడు వరగర్వితుడై భూమినంతటిని ఏకచ్ఛత్రాధిపతిగా పాలించెను. అతనికి వీరుడైన చిక్షురుడు సేనాపతి. గొప్ప సైన్యముగల తామ్రుడు కోశాధిపతి. అసిలోముడు ఉదర్కుడు బిడాలుడు బాష్కలుడు, త్రినేత్రుడు మొదలగువారు సేనలతో భూమినంతటిని ఆక్రమించిరి. బ్రాహ్మణులెల్లరు మహిషునకే హవిర్భాగముల నర్పించిరి. ఆ రాక్షసరాజు దేవేంద్రుని వద్దకు దూతను పంపుచు ఓ సహస్రాక్షా! నీవు స్వర్గము విడిచి వెళ్ళుము లేద మహిషునికి దాసుడవగుము. నీవు మహిషాసురుని శరణువేడనిచో యుద్ధమునకు సిద్ధపడుము అని చెప్పుమనెను. ఇంద్రుడు మహిషుని సందేశము విని కోపించి ఓరి మందబుద్ధీ! నీవు మదించియున్నావు దూతవుగాన నిన్ను చంపక విడుచుచున్నాను. మీ రాజుతో

నిట్లు చెప్పుము. ఓ మహిషీపుత్రా! నీకు యుద్ధమిష్టమైన త్వరగా రమ్ము. నీ బలమునే నెరుగుదును. నీ కొమ్ములు కోసివేసెదను. నీకు యుద్ధ మేమియు తెలియదు కొమ్ములతో పొడుచుట మాత్రమే తెలియును. అని పలుకగా దూత వెంటనే మహిషునకు దేవా! ఇంద్రుడు నిన్ను లెక్కపెట్టుట లేదు. మిక్కిలి నిందించి నాడు అని చెప్పెను. అప్పుడు మహిషాసురుడు నన్ను రుద్రుడు కూడ ఎదిరింప లేడు. ఇక ఇంద్ర విష్ణువు లేమి చేయగలరు? నేను దేవతనెల్ల జయించి స్వర్గమును వశము చేసికొందును. దానవీరులనందరను సేనాపతులుగ నియమింపుడు. స్వర్గమును జయించుటకు సంసిద్ధులు కండని రాక్షసుల నాదేశించెను.

ఇంద్రునకు గురుని హితబోధ

మహిషుని దూత వెళ్ళిన పిమ్మట ఇంద్రుడు యమవరుణవాయు కుబేరులను పిలిచి సురలారా! రంభుని పుత్రుడు మహిషుడు మహాబలశాలి వరగర్వముచే మదించియున్నాడు. అతడు నావద్దకు దూతను పంపినాడు. ఆ దూత నేను స్వర్గము విడిచి యెక్కడ కేనివెళ్ళవలెననియు. అట్లుకానచో మహిషునకు భృత్యుడను కావలెనని చెప్పెను. ఇప్పుడు మన కర్తవ్యమేమో తెలుపుడు. బాలునితో సంధి తగినది కాదు. మనము ముందు శత్రుసేనల సంఖ్యాబలములను చారుల ద్వారా తెలిసికొని పిమ్మట యుద్ధభేరి మ్రోగింపవలయును. తొందరపడి యే పనియు చేయురాదు. అని నేర్పరియైన చారుని పంపెను. అతడు శత్రుసేనల బలాబలములు తెలిపెను. మహిషుని బలమును ప్రయత్నము విని యింద్రు డాశ్చర్యపడెను. అంతట బృహస్పతి దగ్గరకు వెళ్ళి మహిషుడు మహావీర్యుడు మత్తుడును. అతడు దానవులందరితో కలిసి యుద్ధమునకు రానున్నాడు. ఇప్పుడు మాకు నీవే దిక్కు. ప్రతిక్రియ నాలోచింపుము అని పలుకగా బృహస్పతి బాగుగా నాలోచించి ఇంద్రునితో నిట్లనెను. ఇప్పుడు బాగుగా ఆలోచించి యథావిధిగ ప్రయత్నమొనర్పుము. పిమ్మట కాదగినది కాగలదు. మనమెంత ప్రయత్నించినను దైవమనుకూలించిన గాని యేపనియు ఫలము నీయజాలదు. మమకారము లేని వాడు సుఖపడును. మమకారము నశించిననే జ్ఞానము అలవడును. ఏది జరుగ వలెనో అది జరిగితీరును. అని ధైర్యమును కలిగించెను!

ఇంద్రుడు మహిషుని సేనలతో పోరుట

ఇంద్రుడు గురువు మాటలు విని నేను మహిషుని నాశమునకు యుద్ధ ప్రయత్నమొనర్తును. పూర్వము వృత్రనముచి బలాసురుల వధించినట్లే మహిషుని సంహరింతును. నీ బలము వజ్రాయుధ బలము నాకు గలవు. హరిహరులు నాకు

సహకారులు. నీవు రక్షోఘ్నమంత్రములు జపించిన నన్ను కాపాడుమని ప్రార్థించెను. బృహస్పతి యుద్ధములో జయాపజయములు నిర్ణయింపజాలము. ఇప్పుడు యుద్ధమునకు సిద్ధమగుమని కానివద్దని కాని నేను చెప్పను జరుగవలసినది జరుగునని యూరకుండెను. అంతట బ్రహ్మవద్దకు పోయి ఇంద్రుడు పితామహా! మహిషాసురుడు స్వర్గము నాక్రమించు ప్రయత్నమొనర్చుచున్నాడు నేను భయపడి నీవద్దకు వచ్చితిని. మీ సహాయము కోరుచుంటిననెను. అప్పుడు బ్రహ్మ మనము కైలాసమునకు వెళ్ళి శివుని కూడ కలుపుకొని శ్రీహరిని సన్నిధికి చేరుదము. దేశ కాలపరిస్థితులలోచించి యుద్ధము చేయవలయును అని పలికెను. వారు కైలాసము చేరి శివునితో కలిసి అందరు విష్ణువు సన్నిధికి వెళ్ళిరి. దేవదేవుడగు నారాయణుని స్తుతించి మహిషునివలన భయమును విన్నవించిరి. శ్రీహరి మనమందరము యుద్ధమొనర్చి వానిని సంహరింతమనగా అందరును తమతమ వాహనములపై యుద్ధమునకు బయలుదేరిరి. మహిషుని బలము కూడ పోరసమకట్టెను. దేవ దానవులకు ఘోరమైన యుద్ధము జరిగెను. మహిషుని సేనానిచిక్షురుడు ఇంద్రునితో పోరి మూర్ఛనొందెను. పిమ్మట బిడాలునితో ఇంద్రుడు పోరాడెను. బిడాలుడు తన వాహనమైన ఏనుగు ఇంద్రునిచే కొట్టబడి పారిపోగా ఒకానొక రథమెక్కి దేవతల ముందు నిలిచెను. ఇంద్రుడు వానిపై తీవ్రబాణముల ప్రయోగించెను. బిడాలుడు కూడ ఇంద్రునిపై బాణములు కురిపించెను. ఘోరమైన యుద్ధము జరిగెను. ఇంద్రుని బాణప్రయోగమునకు బిడాలుడు రథములో కూలబడెను. పిమ్మట తామ్రుడను వానిని చంపెను. అంతట వరుణులు తామ్రుని మూర్ఛనొందించిరి. దైత్యసైన్యము హాహాకారము లొనర్చెను. అంతట మహిషుడు వచ్చెను.

హరిహరులు మహిషునితో పోరుట

అతడు గద పట్టుకొని దేవతలపై కురికి దేవతలారా! మిమ్ములను నా గదతో చంపివైతును. అని పలికి ఇంద్రుని భుజముపై గదతో కొట్టెను. ఇంద్రుడు వజ్రాయుధము గ్రహింపగా మహిషుడు ఖడ్గము చేతబట్టెను. అప్పుడు వారిరువురకు ఘోరమగు పోరుజరిగెను. మహిషుడు శాంబరమాయతో కోట్లకొలది యోధులను సృష్టింపగా వారు దేవతలపైబడి కొట్టసాగిరి. మహిషుని మాయకందరు దేవతలు విస్తుపోయిరి. అప్పుడు దేవతలు త్రిమూర్తులను స్మరింపగా వారు దివ్యాయుధములతో దేవతలను కాపాడుటకు వచ్చిరి. అప్పుడు శ్రీహరి చక్రము ప్రయోగింపగా మహిషునిమాయ మాయమయ్యెను: అంతట మహిషుడు పెద్ద పరిఘచేతబట్టి త్రిమూర్తులపై కురిసెను. అతని వెంట చిక్షురుడు, ఉగ్రాస్యుడు, ఉగ్రవీర్యుడు,

అసిలోముడు, త్రినేత్రుడు, బాష్కలాంధకులు నితరులును యుద్ధమునకు తల పడిరి. వాసుదేవాంధకులకు తుములమైన యుద్ధము జరిగెను. ఇంద్రబాష్కలులు రుద్రమహిషులు, యమత్రినేత్రులు, కుబేరమహిషులు, వరుణాసిలోములు పరస్పరము దారుణరణమొనర్చిరి. విష్ణువు చక్రాయుధమును రాక్షసుడు తన చక్రముతో వారించి దేవతలనాశ్చర్యపరచెను. శంకరుని రొమ్ముపై శక్తిని ప్రయోగించి గర్జించెను. విష్ణువు మహోజ్జ్వలమైన పాంచజన్యమును వేగముగ పూరించెను. ఆ ధ్వని దానవుల గుండెలు బ్రద్ధలయ్యెను. ఋషులు దేవతలును సంతోషించిరి.

దేవతలు త్రిమూర్తుల శరణుజొచ్చుట

దానవులు వ్యాకులమనస్కులగుట చూచి మహిషుడు సింహరూపము ధరించెను. ఆ సింహము దేవసేనలోనికి దుమికి తన వాడి గోళ్ళతో గరుత్మంతుని చీల్చి విష్ణువు బాహువులను గాయపరచెను. హరి దానిని చక్రముతో కొట్టెను. అంతలో సింహము మహిషమయ్యెను. దాని కొమ్ములదెబ్బలకు సహించలేక శ్రీహరి వైకుంఠమున కేగెను. శంకరుడు కూడ కైలాసమునకు వెళ్ళెను. బ్రహ్మయు భయపడి తన లోకమునకు పోయెను. ఇంద్రయమ కుబేరులు అగ్నియును వరుణుడు అచటనే యుండిరి. రాక్షసబలము బాణవర్షమును కురియుచు ముందునకు నడచెను. మహిషుని యుద్ధము చూచి యెల్లరు వెరగందిరి. ఇంద్రుడు భయపడి పారిపోయెను. వరుణ కుబేరులును నిలువలేక పోయిరి. మహిషుడు తన విజయమును చాటి ఐరావతమును ఉచ్చైశ్రవమును కామధేనువును గ్రహించి స్వర్గరాజ్యమును చేపట్టెను. దేవతలు స్వర్గము విడిచి గిరిగుహాలలో తలదాచుకొనిరి. వారు బ్రహ్మ వద్దకు వెళ్ళి మొరపెట్టుకొనిరి. పరమేష్ఠి యిట్లనెను. సురలారా! నేనేమి చేయగలను వాడు వరగర్వితుడు స్త్రీచేతనే చంపబడువాడు. కనుక మనము శివుని కూడ వెంటబెట్టుకొని జనార్థనుని దర్శించి ప్రార్థింతము. అతడే దేని ఉపాయము చెప్పగలడని అందరు శివుని ముందుంచుకొని శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళిరి. వైకుంఠము సంపదలకు శోభలకును నిలయము- అతి సుందరము.

శ్రీదేవి యావిర్భవించుట

ఒకప్పుడు దేవతలందరు శ్రీమహావిష్ణువు నివసించు వైకుంఠమునకు వెళ్ళిరి. పిమ్మట విష్ణుమూర్తి నివసించే మందిరాన్ని చూచారు. జయవిజయు లను వారు ద్వారపాలకులుగా బంగారు బెత్తములు చేత ధరించి భవన సమీపమున కనబడిరి. బ్రహ్మాది దేవతలు తమ దర్శనార్థమై వచ్చి ద్వార మందున్నారని శ్రీహరికి మనవి

చేయవలసినదిగా ద్వారపాలకులను ప్రార్థించారు. అంతట వెంటనే విజయుడు శ్రీమహావిష్ణువు సమీపమునకు వెళ్ళి దేవదేవా! రమాకాంతా! దేవతలందరు మిమ్ము దర్శింపగోరి ద్వారమందున్నారు. బ్రహ్మ రుద్రాదులు వేదసూక్తములతో మిమ్ము స్తోత్రము చేస్తున్నారని మనవి చేశారు. విష్ణుమూర్తి విజయుని మాటలువిని మిక్కిలి కుతూహలముతో నింటిలో నుండి బయటకు వచ్చి శ్రమచే కృశించి యున్న దేవతలను వాత్సల్యము కూడిన చూపులతో సంతోషపెట్టెను. దేవత లందరు శ్రీహరికి నమస్కరించిరి. ఇంద్రాదులు రాక్షస సంహారియైన ఆ విష్ణువును స్తోత్రము చేశారు.

అంతట ఆయన దుఃఖంతో దీనులుగా మీరు కనిపించుటకు కారణ మేమని ప్రశ్నించెను. దేవతలిట్లు పలికిరి:- మహా రాజా! పాపాత్ముడు వర గర్వితుడగు మహిషాసురుడు మాయజ్ఞ భాగములను అపహరిచుచున్నాడు. వానికి భయపడి దేవతలు పర్వత దుర్గములలో తిరుగుచున్నారు. కనుక నిన్ను శరణు జొచ్చుచు న్నాము. రాక్షసుల మాయలు తెలిసినవాడా! మమ్ముద్ధ రించుటకు నీవే సమర్థుడవు. కనుక ఆ రాక్షసుని సంహరించునట్టి ఉపాయముతో మమ్ము కాపాడుము. మానవులాతని చంపలేరని బ్రహ్మ వరమిచ్చియున్నాడు. పార్వతికాని, లక్ష్మికాని, యే స్త్రీయైనను అతని చంపజాలదు. వరదాన గర్వితుడైన మహిషాసురుని నీవే ఉపాయమాలోచించి సంహరింపవలెను. అని పలుకగా విష్ణుమూర్తి నవ్వుచు పూర్వము నేను వానితో యుద్ధమును చేసితిని. కానివాడు చావలేదు. ఇప్పుడు దేవత లందరి తేజోరూప సంపదలతో ఒక స్త్రీ జన్మిస్తే ఆమె యుద్ధములో వానిని చంపగలదు. మనందరి తేజస్సులతో తేజోరాశియై ఒక స్త్రీ ఆవిర్భవించునట్లు ప్రార్థించుదు. మనమందరము ఆమెకు సమస్తములైన మన ఆయుధములను సమర్పించుదము. సర్వాయుధముల ధరించి సర్వతేజస్సులతో కూడిన ఆమె మదగర్వితుడైన ఆ దురాత్ముని చంపగలదని పలికెను.

ఇలా మాట్లాడుచుండగనే బ్రహ్మయొక్క ముఖము నుండి మిక్కిలి సహింప శక్యముగాని తేజస్సు పుట్టినది. అ తేజస్సును చూచి శివకేశవు లాశ్చర్యము నందిరి. రుద్రుని శరీరమునుండి రుద్ర తేజస్సు పుట్టినది. ఆ తేజస్సు అతిఘోరముగా నుండెను. మరియు విష్ణువు శరీరము నుండి వైష్ణవ తేజస్సు పుట్టినది. ఆ తేజస్సు సత్త్వగుణముతో కాంతిమంతమై యుండెను. సుందరమైనను సహింపరానిదిగా నుండెను. పిమ్మట అగ్ని యమవరుణ కుబేరుల శరీరముల నుండి ఒకేమారు గొప్పగొప్ప తేజస్సులు పుట్టినవి. అట్లే ఇతర దేవతలనుండి కూడ తేజస్సులు

పుట్టినవి. ఆ తేజస్సులన్నియు ఒకరాశియై పరదేవత పుట్టినది. పదునెనిమిది భుజములు ధరించిన ఆదేవి రెండవ హిమాలయమా అన్నట్లుండెను. ఆ రూపమును చూచి విష్ణువు మొదలగు వారందరు ఆశ్చర్యపడిరి. హరిహరబ్రహ్మలు కూడా ఆ దేవిని వర్ణింప సమర్థులు కాకపోయిరి. అసాధ్యములైన దేవతల పనులు నెరవేర్చుటకు అనేక రూపముల నామె ధరించుచుండును. ఆమె సౌందర్యము అత్యద్భుతమైనది. లోకాతీత సౌందర్యవతియైన ఆ దేవిని చూచి మహిషాసురునిచే బాధపడిన దేవతలందరు పరమానందభరితులైరి.

అప్పుడు విష్ణువు దేవతలారా! మీరిప్పుడు శ్రీదేవికి మీమీ దివ్యభూషణ ములను దివ్యాయుధములను సమర్పించుడు అని పలికెను. విష్ణువు మాటలు విని సమస్త దేవతలు సంతోషముతో తమతమ దివ్యభూషణములను వస్త్రములను పర దేవతకు సమర్పించిరి. క్షీరసముద్రము శ్రీదేవికి రెండు దివ్యవస్త్రములను ఒక మణిహారమును సమర్పించెను. విశ్వకర్మ దివ్యమగు చూడామణిని కుండలము లను, కంకణములను దివ్యములైన భుజకీర్తులను సమర్పించాడు. త్వష్టగజ్జె లందియలనిచ్చెను. వరుణుడు కమలములమాలను సమర్పించెను. హిమవం తుడు బంగారు సింహావాహనమును అనేక రత్నరాసులను కూడ నొసగెను. శ్రీమహా విష్ణువు దివ్యసుదర్శనచక్రమిచ్చెను. శివుడు త్రిశూలమునొసగెను. వరుణుడు శంఖమును అగ్నిదేవుడు తీవ్రవేగముగల శతఘ్ని అనేశక్తిని ఇచ్చారు. వాయుదేవుడు అంబులపొదిని బాణాలతో నిండిన దానిని అద్భుతమైన ధనుస్సును. ఇంద్రుడు వజ్రాయుధము నిచ్చెను. మరియు ఐరావతము తన కంఠమందుండు ఘంటను కూడ సమర్పించెను. ఇట్లు సమస్తదేవతలు తమతమ ఆయుధములను, భూషణ ములను శ్రీదేవికి సమర్పించిరి. ఆయుధములతో భూషణములతోను కూడిన పరదేవతను చూచి ఆశ్చర్యపడుచు దేవతలందరు ఇట్లు స్తోత్రము చేశారు.

శ్లో॥ భగవత్యై నమోదేవ్యై రుద్రాణ్యై సతతం నమః ।
కాళరాత్ర్యై తథాంబాయై ఇంద్రాణ్యైతే నమోనమః ॥
సిద్ధై బుద్ధై తథా వృద్ధై వైష్ణవ్యై తే నమోనమః ।
పృథివ్యాం యాస్థితా పృథ్వ్యా సజ్ఞాతా పృథివీంచయా ।
అంతస్థితా యమయతి వందే తమీశ్వరీం పరామ్
మాయాయాం యాస్థితా జ్ఞాతా మాయయానచతామజాం
అంతస్థితా ప్రేరయతి ప్రేరయిత్రీం నమశ్శివామ్ ।
కల్యాణం కురుభో మాతః త్రాహిన శ్శత్రుతాపితాన్ ॥

జహిపాపం హయారింత్వం తేజసాస్వేన మోహితం ।
ఖలం మాయావినం ఘోరం స్త్రీ వధ్యం వరదర్పితమ్ ॥
దుఃఖదం సర్వదేవానాం నానారూపధరం శఠమ్ ॥
త్వమేకా సర్వదేవానాం శరణం భక్తవత్సలే ।
పీడితాన్దానవానద్య త్రాహి దేవి నమోஉస్తుతే ।

స్తోత్రభావము:- తల్లీ! నీవు శాంతి పుష్టి, కాళరాత్రి, సిద్ధి, బుద్ధి, స్వరూపు రాలవు రుద్రాణి శివస్వరూపిణివగు నీకు నమస్కారము. ఏ శక్తి భూమిలో నుండి భూమికి తెలియబడదో భూమిని నియమించుచునుండునో అట్టి మాయ కెరుగబడక మాయను కార్యములకు ప్రేరేపించునట్టి శివశక్తి కంజలి ఘటిస్తున్నాము. ఓ జగదంబా! నీ దివ్య తేజస్సుతో మహిషాసురుని మోహింపజేసి ఆ పాపాత్ముని సంహరింపుము. మహిషుడు ఘోరమైనవాడు, దుర్మార్గుడు, మాయావి. స్త్రీ చేతనే చంపదగినవాడు, వరబలదర్పితుడు, అనేకరూపములు ధరించువాడు, దేవతలను దుఃఖపెట్టువాడు,శఠుడు, ఓభక్తవత్సలా! నీవాక్కతివే దేవతలకందరకు రక్షకు రాలవు. మేము రాక్షసునిచే బాధింపబడుచున్నాము. అమ్మా! మమ్ము రక్షించుము నీకు వందనములమ్మా! ఇట్లు స్తోత్రము చేయగా.

శ్రీ దేవి స్వరూపమునుగని మహిషుడు మోహితుడగుట

దేవి చిరునవ్వుతో ఈ విధముగా పలికినది. దేవతలారా! ఇక భయపడ నక్కలేదు. ఆ మహిషాసురునిపుడే యుద్ధములో సంహరింతును. అని పెద్దగా నవ్వెను. మరియు ఘోరముగ గంభీరమగు ధ్వనిచేసినది. అభీకరాద్భుత ధ్వనికి భూమి కంపించింది. కొండలు కదిలినవి. సముద్రములు ఘూర్ణిల్లినవి. ఆ ధ్వనికి దిక్కులు పిక్కటిల్లాయి. రాక్షసులకు గుండెలు దడదడలాడినవి. అంతట దేవతలు ఓహో దేవీ! నీకు జయమగు గాక మమ్ము కాపాడుమమ్మా! అని పలికిరి. మహిషుడా ధ్వనివిని మదగర్వముతో కనులెఱ్ఱ చేసెను. ఆ ధ్వని యతని కను మానము కలిగించెను. ఆధ్వనికి కారణము తెలిసికొనిరండని రాక్షసులను పంపెను. ఇట్లు భయంకర ధ్వని చేసిన వ్యక్తి యెవ్వరైనను ఆ దుర్మార్గుని నావద్దకు తీసికొని రండు వానిని తప్పక సంహరింతును. అని దూతలను పంపెను. దూతలు వెళ్ళి సర్వాంగ సుందరియగు దేవిని చూచిరి. ఆమె సర్వాభరణములు ధరించి సర్వశుభ లక్షణములతో ప్రకాశించుచుండెను. మరియు అనేక దివ్యాయుధములు ధరించి యున్నది. ఆమె చేతిలో మధుపాత్ర కలదు. మాటిమాటికి మధురసమును త్రాగు

చుండెను. దూతలామెను చూచి భయపడి పారిపోయిరి. వారు మహిషాసురునకు ధ్వని కారణమిట్లు తెలియజేసిరి.

"ఓరాక్షసరాజా! ఒక ప్రౌఢయైన యువతి మాకు కనబడినది. ఆమె శరీరావయవములు సర్వాభరణములతో నలంకరింపబడినవి. ఆమె సర్వశుభలక్షణములు కలిగినది. రాక్షస స్త్రీగాని మానవ వనిత గానికాదు. ఆమె శరీరము నుండి దివ్యకాంతులు వెడలుచున్నవి. ఆ దేవి సింహాసనముపై కూర్చున్నది. పదునెనిమిది భుజములు గలిగి దివ్యాయుధములు ధరించియున్నది. ఘోరమైన ధ్వనిచేయుచున్నది. మదముచే గర్వించి యున్నది. మద్యపానముచే మదించి యున్నది. ఆమెకు భర్తలేడని తెలుసుకొన్నాము. దేవతలు అమితా నందముతో ఆమె చెంత చేరి స్తుతిస్తున్నారు. ఓదేవీ! నీకు విజయము. మా శత్రువులను సంహరింపుము. మమ్ము కాపాడుమని వారు స్తోత్రము చేస్తున్నారు. ఆమె యెవతెయో ఆమె ఎందుకిక్కడకు వచ్చెనో, ఏమి చేయవలెనని తలచుచున్నదో మాకు తెలియలేదు. ఆమె తేజస్సు మమ్ము ముగ్ధులను చేసింది. మిరు మిట్లు గొలుపు ఆమె కాంతిని మేము చూడలేకపోతిమి. ఆమె నవరసముల కాశ్రయమై యున్నది. ఆ నారీమణిని చూచి మేము పలుకరించకనే తిరిగి వచ్చాము. ఇప్పుడు మేమేమి చేయవలయునో ఆజ్ఞాపింపుడు"అని పలికిరి.

అప్పుడు మహిషాసురుడు బలవంతులగు మంత్రులు వెళ్ళి సామాద్యుపాయములతో ఆశుభాంగిని ఇక్కడకు తీసుకురావలెను. ఆమె వీరి మాటలకు వశురాలై రానియెడల ఆమెను చంపకనే నావద్దకు తీసికొని రండు. సుందరమైన కను బొమ్మలగల ఆమెను సంతోషముతో పట్ట మహిషిగా చేసుకొందును. ఆ సుందరి సంతోషముతో రాదలచిన యెడల రసభంగముకాని విధముగా నాకోరికను నెర వేర్చండి. ఆమె సౌందర్యమును విని నేను మోహము చెందితిని. మహిషుని ఈ మాటలు విని గజాశ్వరధములతో వెళ్ళి మంత్రి ఆమెకు దూరముగ నిలబడి ఓ మంజు భాషిణి! నీవెవతెవు నీవేల యిక్కడకు వచ్చితివి. అని మా ప్రభువు నన్ను పంపినాడు. అతడు పరాక్రమశాలి మానవులు గాని దేవతలుగాని వానిని చంపలేరు. బ్రహ్మ నుండి వరములు పొందినవాడు. కామరూపధారి మదమత్తుడు. మారాజు నిన్ను చూడలవలెనని ఉత్సాహపడుచున్నాడు. ఓశోభనాంగీ! అతడు మానవ రూపముతో నీవద్దకు రాగలడు. మేము నీ యిష్టప్రకారము నడుచుకొందుము. నీవా బుద్ధిమంతుని వద్దకు రమ్ము నీ సౌందర్యమును విని నీకతడు వశుడైయున్నాడు. నీవు చెప్పినట్లు చేయుదుము. అని పలికెను. మహిషుని మంత్రి మాటలువిని మహామాయ నవ్వి గంభీరముగా ఇట్లు పలికినది.

మహిషునకు దేవి విహితములు

"ఓ మంత్రివర్యా నేను దేవతలకు తల్లిని. రాక్షసులను సంహరించు శ్రీమహాలక్ష్మిని. మీ రాజు దేవతలను బాధపెట్టినాడు వారి యాగభాగముల నపహరించినాడు. దేవతలందరు ప్రార్థింపగా నేను మహిషాసురుని చంపుటకు వచ్చితిని నాకు సైన్యమక్కరలేదు. పెద్ద ప్రయత్నమును చేయనవసరము లేదు. నీవు మధురముగా మాట్లాడినందుకు సంతోషము. నీవు మహిషాసురుని వద్దకు వెళ్ళి బ్రతుకుపై ఆశ ఉన్నచో వెంటనే మీ రాజును పాతాళమునకు పొమ్మని చెప్పుము. అట్లు కానిచో పాపాత్ముడగు నాతని నిప్పుడే యుద్ధమున సంహరింతును. వానికిట్లు చెప్పుము. నీవు మరణించినచో దేవతలు శీఘ్రముగా స్వర్గము నలంకరించెదరు.

మూఢుడా! నావాడి బాణములు నాటక ముందే భూమండలమును విడిచి పాతాళమునకు పొమ్మ. యుద్ధము చేయవలె ననియున్నచో వీరులను వెంటబెట్టుకొని రమ్ము. అందరను యముని వద్దకు త్వరగా పంపుదును. ప్రతియుగమందు నీవంటి మూఢులు లెక్కకు మిక్కిలిగా నాచేతిలో సంహరింపబడుచుందురు. అట్లే నిన్నుకూడ ఈనాడు తప్పక చంపెదను. ఓరి కామపీడితుడా! నాతో యుద్ధము చేయుము. నేను అనేక శస్త్రములు ధరించి నందుకు ఫలము సిద్ధించును. ఓరి! దుష్టాత్మా! బ్రహ్మ యిచ్చిన వరము కలదని గర్వించకుము. నీవు స్త్రీ చేతిలో చచ్చెదవు. కనుక స్త్రీ రూపముతో నిన్ను చంపుటకు వచ్చితిని. నీకు బ్రతుకుపై తీపియున్నచో స్వర్గమును భూమిని విడిచి పాతాళమునకు పొమ్మ"అని పలికెను.

అంతట మంత్రి దేవి! నీవు మదముచే గర్వించియున్నావు. ఆడుది మాట్లాడదగని మాటలను మాట్లాడినావు. అతడెక్కడ? నీవెక్కడ? మీ యిరువురకు యుద్ధము తగినది కాదు. నీవు ఒక్కదానవు. బాలికవు. మహిషాసురుడు దృఢశరీరుడు. మరియు అతనికి గుఱ్ఱములు యేనుగులతో గొప్ప సైన్యము అనేకాయుధములతో కూడినది కలదు. ఏనుగు మాలతీ పుష్పమును నులిమినట్లు మహిషాసురుడు యుద్ధమందు నిన్ను సంహరింపగలడు. శృంగారరసమునకు విరుద్ధమగునని నేను పరుషముగా మాట్లాడుటకు భయపడుచున్నాను. దేవతలకు శత్రువైన మారాజు నీ యందు మిక్కిలి భక్తిభావముతో ఉన్నాడు. కనుక సామదానోపాయములతోనే మాట్లాడుచున్నాను. అట్లు కానిచో అసత్యములు పలుకుచున్నట్టియు లేనిపోని అభిమానమును చూపుతూ రూప యౌవనములచే గర్వించిన నిన్ను యిప్పుడు బాణముతో చంపగలను. మాస్వామి నీపై మోహము కలిగి ఉన్నాడు. రాజ్యము ధనము సర్వము నీకు సమర్పించి నీకు దాసుడగును. కనుక

విశాలములగు కన్నులు కలదానా! రోషమును విడిచి పెట్టుము. భక్తితో నీపాదముల పై పడుచున్నాను. శీఘ్రముగా మా రాజునకు పట్ట మహిషివికమ్ము. ముల్లోకముల వైభవము నీదే. మా స్వామిని స్వీకరించి సమస్త సంసారసుఖము ననుభవింపుము అని పలికెను.

అది విని దేవి యిట్లు మాట్లాడినది "ఓ మంత్రీ నీవు మహిషునకు ప్రధానుడవు. మహిషబుద్ధియే నీది. బ్రహ్మ తగిన రాజమంత్రులనొకచోట చేర్చినాడు. ఓరి మూఢుడా! నేను పురుష స్వభావముగల స్త్రీని. నీవను కొన్నట్లు నాది స్త్రీ స్వభావము కాదు. నీ ప్రభువు స్త్రీ చేతిలో చచ్చునట్లు వరము పొందినాడు. దానినిబట్టి అతడెంతటి మూర్ఖుడో తెలియుచున్నది. ఒక స్త్రీచేతిలో చచ్చుట వీరులకు దుఃఖము కలిగించును. నపుంసకులకు సంతోషకరము. అందుకే నేను స్త్రీ రూపమును ధరించి దేవతలకార్యమును సాధించుటకు వచ్చితిని. వరములు పొంది గర్వించువారు మందబుద్ధులై చచ్చెదమని భావించరు. కనుక నీవు వెళ్ళి నా మాటలను మీ రాజునకు చెప్పుము. రాజు చెప్పినట్లు నీవు నడువవలెనుగదా! దేవేంద్రుడు స్వర్గమును పాలింపవలెను. దేవతలు తమ హవిర్భాగముల ననుభవించాలి. ఇట్లు కానిచో నాతో యుద్ధము చేయుము" అని యనెను.

శ్రీదేవి హితవచనములువిని, యా మంత్రి నేనిప్పుడు రాజువద్దకు వెళ్ళవలెనా? లేక ఈమెతో యుద్ధము చేయవలెనా? రాజు కామాతురుడై యున్నాడు. అతని భావమునకు విరుద్ధమైన విషయమును రాజుకెట్లు మనవి చేయదగును? అని తలపోసి యేమైనను జరిగిన విషయమును రాజునకు తెలుపుటయే సమంజసమని ఆలోచించి తెలివికల యా మంత్రి తన రాజువద్దకు వెళ్ళి చేతులు జోడించి యిట్లు పలికెను.

రాజా! ఆ దేవి సింహముపై కూర్చొని పదునెనిమిది భుజములతో దివ్యా యుధములు ధరించి యున్నది. నీవు మహిషాసురునకు పట్ట మహిషి కమ్మని చెప్పితిని. మారాజు నీకు వశుడై సర్వభోగములను సమకూర్చునని చెప్పితిని. నా మాటలు విని ఆమె గర్వముతో నవ్వుచు నిట్లు పలికినది. పశువులలో అధము డైన మహిషాసురుని దేవతల కోరికమేరకు బలియిత్తును. లోకములో బుద్ధి లేని ఏ స్త్రీ దున్నపోతు భర్తకావలెనని కోరును? కనుక నేను యుద్ధము చేసి దేవతలకు శత్రువైన మహిషుని సంహరింతును. జీవించ తలుచుకుంటే దుష్టుడా! పాతాళానికి పొమ్ము" అని మాట్లాడినది. శృంగారరసము భగ్నమగునని నేను యుద్ధము చేయలేదు. ఇకపై ఆలోచించి తమ చిత్తము వచ్చినట్లు చేయుడని విన్నవించెను.

మహిషుడు దేవి వద్దకు రాయబారులను పంపుట

దూతమాటలు విని మదముతో పరవశుడైన మహిషుడు అనుభవము గల మంత్రి వృద్ధులను పిలిచి వారి సలహానడిగెను. పండితులు పెద్దలునగు మంత్రులు రాజా! సత్యము మేలు చేయును. ఇష్టమైనది హానికలిగించును. కనుక మేమేమి చెప్పగలము? అనిరి. మీమీ భావాలను విని బాగుగా విచారించి శ్రేయస్కర మగు పనినవలంబింపవలెగదా! అని పలుకగా గొప్ప బలముగల విరూపాక్షుడనువాడు రాజును రంజింప చేస్తూ యిలా మాట్లాడినాడు:-

రాజా! ఈ స్త్రీ మదముచేత గర్వించి మాట్లాడుచున్నది. కేవలము బెదిరింపు మాటలేయివి. ఆడు దాని మాటలు లెక్క చేయదగినవికావు. మనమామె మాటలకు జంకవలసిన పనిలేదు. నీవు మూడు లోకములను జయించి మహావీరుడవు. ఇప్పుడొక స్త్రీకి భయపడినచో నీకు పరువు దక్కునా? నేనిప్పుడొంటరిగా వెళ్ళి యామెతో యుద్ధము చేసి ఆమెను చంపివచ్చెదను. నీవు నిశ్చింతగానుండు మనెను. మరియు సైన్యముతో వెళ్ళి అనేక శస్త్రములతో ఆమె నోడింతును, సర్పపాశములతో బంధించి ఆమెను నీ వద్దకు తెచ్చెదను. అప్పుడు నీకామె వశు రాలగును చూడుము నా బలము అని పలికెను. తరువాత దుర్ధర్షుడను వాడిట్లు పలికెను:-

రాజా! బుద్ధిమంతుడగు విరూపాక్షుడు నిజము మాట్లాడినాడు. నా మాటలు కూడా వినుడు. ఈమె కామపీడితగా కనిపించుచున్నది. అందచందాలచే గర్వించిన స్త్రీ యిట్లే యుండును. ఈమె భయపెట్టి నిన్ను వశము చేసుకొన వలెనని చూచుచు న్నది. ఆమె మాటలు వక్రోక్తులు. స్త్రీలకు తమ ఓరచూపులే బాణాలు వ్యంగ్య వచనములు పూలదోసిళ్ళు. నేత్రములనే బాణములతో నిన్ను వశపరచుకొందునని ఆమె భావము ఈ విధముగా ఆమె మాటలకు శృంగారపర మైన వ్యాఖ్యానముచేసి నిన్ను ఆమె వరిస్తున్నది. ఇక పై కర్తవ్యము నాలోచింపుమని చెప్పి సామ దానోపా యములే తగినవనెను. మధురములైన మాటలతో ఆమెను నీవద్దకు తీసికొని వచ్చి నీకు వశమగునట్లు చేసెదను అని పలికెను.

ఆ మాటలు విని తామ్రుడనువాడు. రాజా! ఈమె కామపీడిత కాదు. నీపై అనురాగము కలదియుకాదు. ఆమె ఏ ఆధారములేకుండా ఒక్కతెయే వచ్చుట ఆశ్చర్యకరముగానున్నది. పదునెనిమిది భుజములు గల స్త్రీని ఎప్పుడును చూచిగాని వినిగాని యుండలేదు. ఆయుధములను పదునెనిమిదిటిని ధరించుటయును ఆశ్చర్యకరము రాజా! ఇది కాలవైపరీత్యముగా తలచుచున్నాను. నాకు స్వప్నములో

నల్లని వస్త్రము ధరించి యొక స్త్రీ ఇంటిగుమ్మము వద్ద దుఃఖిచుచు కనపడినది. రాత్రి పక్షులు ప్రతియింటిలోను కూయుచున్నవి. అనేక వినాశసూచనలు కనిపించు చున్నవి. నిన్ను ఆ స్త్రీ యుద్ధానికాహ్వానించుట వలన ఆమె దేవతలచే సృష్టింపబడి నదిగా తోచుచున్నది. భయపడపవలదు. యుద్ధము చేసి తీరవలసినదే. జరుగ వలసినది జరుగును. దైవికముగ జరుగుదానిని ఎవ్వడును మార్చలేడు గదా అని చెప్పెను.

మహిషుడు ఓయీ! తామ్రా! యుద్ధము కొఱకు వెళ్ళి ఆమెను జయించి తీసికొనిరమ్ము. ఆమె యుద్ధములో నీకు లొంగనిచో చంపి వేయుము. ఆమె కామముతో వచ్చినదా? లేక వైరముతో వచ్చినదా? తెలుసు కొనుము. ఆమెకు భయపడవద్దు. నిర్దయగాను ప్రవర్తించ వద్దు. ఆమె మనయెడ ఎట్లుండునో అట్లే నీవును ఉండవలయును అని పలికెను. ఈ మాటలు విని తామ్రుడు రాజైన మహిషునికి నమస్కరించి సైన్యముతో యుద్ధమునకై వెళ్ళెను. దారిలో అతనికి దారుణములైన అపశకునములు కనిపించినవి. వానిని చూచి అతడు ఆశ్చర్యము నకు భయమునకు లోనయ్యెను. అతడు వెళ్ళి సింహముపై కూర్చొన్నట్టియు దేవతలందరిచే స్తుతింపబడుచున్నట్టియు సమస్తా యుధములను ధరించిన దేవిని చూచి వినయముతో మధురమగు వాక్కుతో సామోపాయము ననుసరించి యిట్లు పలికెను:-

"ఓ దేవీ! మా మహిష రాక్షసరాజునీ రూప యౌవనగుణములకు పరవశుడై నిన్ను పెండ్లియాడుటకు నుత్సాహముతోనున్నాడు. అతని పై అనురాగమును చూపుము. దుఃఖప్రదమైన యుద్ధమెందులకు? దేవతలచేత రాక్షసులచేతను పూజింపబడు మా నాధుని నాధుని చేసికొనుము. నీ కోరికలెల్లతీరును. నీవతని పట్ట మహిషివికాగలవు. నామాటను నమ్ము. నీకు అమితమైన సుఖము లభించును. నీకు పుట్టిన కుమారుడే రాజుకాగలడు" అని పలికెను.

మహిషుని మంత్రాలోచన

తామ్రుని మాటలు విని జగదంబ నవ్వుచూ మేఘగంభీర మగు వాక్కుతో వానితో నిట్లనెను. "ఓ తామ్రుడా! నీవు వెళ్ళి చావుకు సిద్ధమై నట్టియు కామార్తుడై నట్టియు మూఢుడైన మహిషునకు ఇట్లు చెప్పుము" నేనెవరినీ ప్రేమించుట లేదు. నాకు భర్త ఉన్నాడు అతడు దేనినైనను చేయుగలడు. అన్నిటికిని సాక్షియైనవాడు. దేనికీ కర్తకాని వాడును సర్వజ్ఞుడు. అట్టి భర్తను విడిచి మందుడైన ఈ మహిషుని

సేవించుట కెట్లు నేనుత్సాహపడుదును? నాతో యుద్ధము చేయునచో మీ రాజును యమపురికి పంపి యమునికి వాహనము చేసెదను. పాపాత్ముడా బ్రతుకుపై ఆశయున్నచో త్వరగా పాతాళమునకు పొమ్ము. సమస్త రాక్షసులును పాతాళ మునకు వెళ్ళనిచో అందరిని యుద్ధంలో చంపి వేయుదును. నీ విటనుండి వెళ్ళుము లేదా యుద్ధము చేసిన యెడల బంధువులతో సహ నిన్ను చంపుదును. దేవతల యజ్ఞభాగములను వారికిచ్చి దేవలోకమును విడువవలెను. అని పలికి ఆ దేవి ఆశ్చర్యకరముగా గర్జించెను.

ప్రళయకాలములోని ధ్వనికివలె పర్వతములు చలించినవి. రాక్షస స్త్రీలకు గర్భస్రావమయ్యెను. తామ్రుడా ధ్వనివిని భయపడి పారిపోయెను. పట్టణము లోని రాక్షసులందరు దిగులుపడిరి. ఆ ధ్వనికి చెవిటివారై పరుగులెత్తిరి. పరదేవత యొక్క వాహనమైన సింహముకూడ భయంకరముగా గర్జించినది. ఆ ధ్వనికి రాక్షసులు భయభ్రాంతులైరి. మహిషుడు తామ్రుని ముఖమును చూచి చేయదగి నది తోచక మంత్రులతో ఆలోచించెను. రాక్షసశ్రేష్ఠులారా! ఇప్పుడు కోటలో దాగి యుందమా? ఊరిబయటకు వెళ్ళి యుద్ధమును చేయుదుమా? లేక పారిపోవుట మంచిదా? మీరందరు బుద్ధిమంతులు సర్వశాస్త్ర విశారదులు మనము కార్యసిద్ధికై రహస్యముగా ఆలోచింపవలెను. మంత్రులు దేశకాలాను సారముగా ఆలోచించి నిర్ణయించండి. ఈ వచ్చిన స్త్రీ దేవతలచే నిర్మింపబడినది. బలవంతురాలు ఒంటరిగా వచ్చినది. పైగా యుద్ధమును కోరుచున్నది. ఇంతకంటె ఆశ్చర్య మేముండును? యుద్ధములో జయపరాజయములు దైవాధీనములు. దైవముపై ఆధారపడువాడు అసమర్థుడు. శూరుడు తనశక్తిపై ఆధారపడి ప్రయత్ని స్తాడు. ఇప్పుడు చక్కగా ఆలోచించి మనము పనిచేయాలి. అని రాజు మాట్లాడెను.

బిడాలుడనువాడు చేతులు జోడించియిట్లు పలికెను:- రాజా! ఈమెను గూర్చి యింకను బాగా తెలిసికొనవలెను. ఈమె ఎందుకిక్కడకు వచ్చెను? ఎక్కడ నుండి వచ్చెను? ఈమె ఎవరి భార్య. దేవతలు నీకు స్త్రీవలన మరణమున్నది కనుక వారీమెను సృష్టించి పంపినారా? ఆదేవతలు కూడ ఎక్కడనో యుద్ధమును చూచు టకు దాగియుందురు. అవసర మైనప్పుడు వారుకూడ ఈమెకు సహాయముగా వచ్చి యుద్ధము చేయవచ్చును. విష్ణువును ముందు పెట్టుకొని దేవతలు తక్కిన రాక్షసులను చంపితే ఆమె నిన్ను చంపుతుంది. దేవతలు చేయదలచిన పనియిది. యుద్ధము చేయవద్దని నేను నీకు చెప్పజాలను. నీకు తోచినట్లు చేయుము. నీతోపాటు మేము యుద్ధమునకు కూడ సిద్ధమే. ఒంటరిగా వచ్చిన స్త్రీ ఇంతటి

బలదర్పములుగల సైన్యమును యుద్ధమునకై పురికొల్పుట బాగుగా విచారింప వలసిన విషయము. అని పలికెను ! పిమ్మట దుర్ముఖుడను వాడిట్లు పలికెను:-

"రాజా! యుద్ధములో మనము గెలువమని నాకు తెలియును. ఐనను లోకములో అపకీర్తి వాటిల్లునట్లు పారిపోవుటయు తగదు. ఒక్క ఆడుదానికి భయపడి పారి పోజూచు వాడెవడు? జయమో అపజయమో యేదైనను యుద్ధము చేసి తీరవలసి నదే ఏదికానున్నదో అది కాకమానదు అని యుత్సాహపరచెను" దుర్ముఖుని మాటలువిని బాష్కలు డిట్లుమాట్లాడెను.:-"

రాజా! మీరు చింతింపకుడు. నేను ఇక్కడనే ఆ చండిని చంపెదను. నేను దేవతలలో యెవరికినీ భయపడను. ఒంటరిగా వచ్చినట్టి మదగర్వితయగు ఆమెను నా నిశితములైన బాణములతో చంపివైచెదను. మీరు యుద్ధానికి వెళ్ళ వద్దు. ఈనాడు నా భుజబలమును చూడుడు అని పలికెను." అని పలుకగా దుర్ధరుడు ఓమహిషాసురా! దేవతలు తయారుచేసి పంపిన యీ దేవిని నేను జయింతును. రాజా! నిన్ను భయపెట్టుటకు దేవతలీ మాయను పన్నినారు. బెదించుటకే కాని అంతకంటే వేరేమియులేదు. కనుక మనస్సులోని మోహమును విడువుము. ఇదియంతయు రాజనీతి. ఇతరుల మాటలు మీరు నమ్మవద్దు. నేను యుద్ధరంగమునకు పోయి దుష్టమైన నడువడిగల యామెను తీసికొని వచ్చెదను. నేడు నాబలమును ధైర్యమును ప్రభుభక్తిని స్వశక్తిని చూడుడు" అని పలికెను.

దేవి బాష్కల దుర్ముఖుల సంహరించుట

ఇట్లు పలికి బాష్కల దుర్ముఖులు సర్వశస్త్రాస్త్రములతో యుద్ధ రంగమునకు చేరి మేఘగంభీరమగు వాక్కులతో నిట్లు పలికిరి:- "దేవి! మహిషాసురుడు దేవతలను జయించినవాడు. సర్వరాక్షసులకురాజైన అతనిని వరించుము. అతడు సర్వశుభలక్షణములతో కూడిన మానవ రూపము ధరించి దివ్యాభరణభూషితుడై నీ చెంతకువచ్చును. నీవు ముల్లోకముల వైభవమును పొందగలవు. మహిషాసురుని ప్రేమించుము. అద్భుతమైన సంసారసుఖము ననుభవింపుము. స్త్రీలు కోరు కోరికలనన్నిటిని తీర్చుకొనగలవు" అని పలికెను.

ఆ మాటలు విని దేవి యిట్లు పలికినది:- నేను కామమోహితు రాలనుకానని నీకు తెలియుటలేదా? మందబుద్ధియైన మహిషునెట్లు సేవింతును? దేవతా రూపము గలస్త్రీ పశువులలో అధమమైన దున్నపోతు రూపముగల వానిని యెట్లు కోరును? ఓ బాష్కల దుర్ముఖులారా! మీరు త్వరగా వెళ్ళి మీ రాజునకు నామాటగా చెప్పుడు:- నీవు పాతాళమునకు పోవలెను. లేదా నాతో యుద్ధము చేయవల

యును. యుద్ధము జరిగినచో దేవేంద్రుడు తప్పక నిర్భయుడు కాగలడు. నిన్ను చంపనిదే నేనిక్కడ నుండి వెళ్ళను. ఓరి దుర్బుద్ధీ! ఈ విషయము తెలిసికొని చేయవలసిన పనిని నిర్ణయించు కొనుము. నన్ను జయించనిదే భూమిపై నెక్కడను నీకు స్థానముండదు"అని దేవి తన యభిప్రాయమును చెప్పెను.

దేవి మాటలువిని దైత్యమంత్రులు కోపముచే ఎఱ్ఱబారిననేత్రములతో ధనుర్బాణము లను ధరించి యుద్ధమునకు సిద్ధపడిరి. పరదేవత గొప్ప ధ్వనిచేసి నిర్భయముగా నిలిచినది. రాక్షసులిద్దరును తీవ్రమైన బాణవర్షము నామెపై కురిపించిరి. దేవియు రాక్షసులిరువురిపై బాణ సమూహములను ప్రయోగిం చెను. బాష్కలుడు వెంటనే యుద్ధమునకురాగా దుర్ముఖుడు ఆమెకెదురుగా చూచుచు నిలబడెను. దేవికి బాష్కలునికి ఘోరమైన యుద్ధము జరిగెను. అంతట జగన్మాత అతనిని చూచి కోపముతో తీవ్రములైన ఐదుబాణములు ప్రయోగించెను. రాక్షసు డామె బాణములను ఖండించెను. మరియు సింహమందున్న దేవిపై ఏడుబాణ ములు ప్రయోగించెను. దేవియు అతని బాణములను ఖండించి తీక్ష్ణములైన ఏడు బాణములు ప్రయోగించెను. మరియు మాటిమాటికి నవ్వుచు అర్ధచంద్రా కారబాణముతో రాక్షసుని ధనుస్సును ఖండించెను. బాష్కలుడు చేత గదబూని దేవిని చంపుటకు బయలుదేరెను. అతనిని చండిక తన గదాప్రహారములచే నేలపై పడ గొట్టెను. బాష్కలుడు భూమిపైపడి మరల లేచి చండిక పై గదను విసిరెను. దేవి దానిని లెక్కచేయక శూలమును వాని వక్షస్థలమున నాటగా అతడు క్రిందపడి మరణించెను.

బాష్కలుని మరణమును చూచివాని సైనికులె ల్లరు పారిపోయిరి. ఆకాశ మందు దేవతలు జయజయ ధ్వానములు చేసిరి. బాష్కలుడు చనిపోయిన పిమ్మట గొప్పబలవంతుడైన దుర్ముఖుడు కోపముచే నెఱ్ఱ బారిన కన్నులు కలవాడై దేవితో యుద్ధమునకై వచ్చెను. మరియు బాలా! నిలునిలు అని మాట్లాడుచు రథముపై కూర్చొని ధనుర్బాణములు ధరించి దేవికి యెదురయ్యెను. దేవి యాతనిని చూచి శంఖమును పూరించెను. మరియు ధనుష్టంకారము కూడ చేసెను. అతడును సర్పములవంటి బాణముల నామెపై ప్రయోగించెను. దేవి యాబాణములను తన బాణము లతో ఖండించి గర్జించెను. వారిరువురకును ఘోరమైన పోరుజరిగెను. పరస్పరమనేకాయుధములను ప్రయోగించిరి. యుద్ధభూమిలో నేలపై బడిన సైనిక శిరస్సులతో ఘోరమైన దృశ్యమేర్పడినది. గ్రద్దలు డేగలు నక్కలు సైనిక శరీరము లను గుంపులుగా వచ్చి తినుచుండెను. దుష్టుడైన దుర్ముఖుడు దేవిపై కోపించి చేయినెత్తి నేడే నిన్ను చంపెదను. లేదా మహిషుని సేవింపుము అని పలికెను.

అంతట దేవి "మరణము సమీపించుటచే నీవిట్లు మాట్లాడుచున్నావు. బాష్కలుడు వచ్చినట్లు నీవును చావగలవు. నిన్ను చంపి తరువాత మహిషుని చంపెదను" అని పలికెను. మరణమునకు వెనుదీయక దుర్ముఖు డామెపై దారుణముగా బాణవర్షమును కురిపించెను. దేవి యా బాణసమూహమును ఖండించి కోపముతో కూడినదై వృత్రాసురునిపై నింద్రుని వలె బాణములను వర్షించెను. వారిరువురకు ఘోరమైన యుద్ధము జరిగినది. అంతదేవి రాక్షసుని చేతియందలి ధనుస్సును ఖండించెను. మరియు ఐదు బాణములతో వాని రథమును నాశమొనర్చెను. అంతట పాదచారియై దుర్ముఖుడు గదను చేతబట్టి చండిక కెదురుగా నడిచి సింహము తలపై మోదెను. ఆ సింహము దెబ్బతిన్నను చలించలేదు. గదను ధరించిన రాక్షసుని శిరస్సును పదునైన ఖడ్గముతో దేవి ఖండించెను. తలతెగి దుర్ముఖుడు నేలపై వ్రాలెను. అంత దేవతలు మిక్కిలి సంతోష ముతో జయ జయధ్వను లొనర్చిరి. మరియు పరదేవతను స్తుతించిరి. పుష్పవర్షము కురిపించిరి. రణభూమిలో మరణించిన రాక్షసుని చూచి ఋషులు సిద్ధులు గంధర్వులు విద్యాధరులు కిన్నరులును పరమానంద భరితులైరి.

దుర్ముఖుని చావువిని కోపించినవాడై మహిషుడు రాక్షసులారా! దుర్ముఖ బాష్కలు లిద్దరు యుద్ధమున మరణించిన యీ సందర్భములో మనమేమి చేయ వలసినదియు మీరందరాలోచించి చెప్పుడు. కాలము బలవత్తరమైనది. అని పలుకగా "చిక్షురు"డనువాడు రాజా! నేనీమెను సంహరించెదను స్త్రీని చంపుటకు పెద్దగా చింతింపపనిలేదు అని తన సైన్యముతో రథమునెక్కి యుద్ధ భూమికి నడచెను/ అంగరక్షకుడగు తామ్రుడు, వెంటరాగా గొప్ప సైన్య ఘోషముతో దిక్కులు పిక్కటిల్లదేవి నెదుర్కొనెను.

అతనిని చూచి దేవి శంఖ ధ్వనిని ఘంటా నాదమును ధనుష్టంకార మును చేసినది. రాక్షసులందరు ఆ ధ్వనికి భయపడి పారిపోయిరి. పారిపోవుచున్న సైనికులను చూచి చిక్షురుడు మీకేమి భయము వచ్చినది? మదించిన యీ బాలను నేడే నేను బాణములతో చంపివైచెదను. యుద్ధ భూమిని విడిచిపోకుడు అని సైనికుల హెచ్చరించి ధనుస్సు ధరించినవాడై దేవితో "ఓ విశాలాక్షి ఎందుకు గర్జించుచున్నావు? నేను భయపడను స్త్రీవధ దోషమనియు అపకీర్తికరమనియు నామనస్సు నిన్ను పేక్షించుచున్నది. ఓ సుందరీ! సుఖమును విడిచి యుద్ధమును నీవు కోరుటవట్టి యజ్ఞానము యుద్ధరంగమున చచ్చినవారికి స్వర్గము లభించు నను మాట కేవలము అర్థవాదము (స్తుతివాక్యము) కనుక నీ మనస్సున కిష్టమైన

చోటికి వెళ్ళుము. లేదా మహిషాసురుని సేవింపుము". అని పలుకుచున్న యాతనితో దేవి ఇట్లు మాట్లాడినది:-

ఓరి మూఢుడా! నీవు బుద్ధిమంతునివలె ప్రజ్ఞా వాదములు పలుకుచున్నావు. నీతిశాస్త్రమును నీవెరుగవు. నీవు పెద్దలను సేవింపలేదు. నీ బుద్ధి ధర్మమార్గము ననుసరించుటలేదు. రాజధర్మ మెరుగవు నా దగ్గర నెందుకు మాట్లాడుదువు? యుద్ధభూమిలో మహిషుని చంపి కీర్తి స్తంభమును నిలిపి నేను సుఖముగా వెళ్ళెదను. దేవతలకు దుఃఖము కలిగించు నట్టియు గర్వించినట్టి ఆరాక్షసుని యుద్ధమున సంహరింతును. యుద్ధమునకు సిద్ధపడుము. నీవు మహిషుడు తక్కిన రాక్షసులును జీవించదలుచుకొన్నచో పాతాళమునకు పొండు. లేక చావదలచినచో యుద్ధము నకు రండు. అందరను చంపివైచెదను. ఇదియే నా నిశ్చయము అని పలికెను.

ఈ మాటలు విని బలదర్పితుడైన రాక్షసుడు దేవి పై బాణవర్షమును కురిపించెను. దేవి అతని బాణములను తన బాణములతో ఖండించెను. ఇరువురకును ఆశ్చర్యకరమైన యుద్ధము జరిగెను. పరదేవత గదతో కొట్టగా రాక్షసుడు మూర్ఛ పోయెను. అతడట్లు మూర్ఛపోగా అతని అంగరక్షకుడుగా వచ్చిన తామ్రుడామెతో యుద్ధమునకు తలపడెను. అతనిని చూచి దేవి రాక్షసశ్రేష్ఠా! రమ్ము రమ్ము యమ లోకమునకు పంపుదును. ఐనా బలహీనులైన మీరు యుద్ధమున కెందుకు వచ్చు చున్నారు? మూఢుడైన మహిషుడు తన బ్రతుకును మాత్రమే చూచుకొనుచు న్నాడు. బలహీనులగు మిమ్ము చంపిన ప్రయోజనమే మున్నది? మీరలింటికి వెళ్ళి మహిషు నిక్కడకు పంపుడు అతడు కూడ నన్ను చూడగలడు" అని గర్జించెను.

శ్రీ దేవి తామ్రచిక్షురలను సంహరించుట

తామ్రుడా మాటలను విని దేవిపై బాణవర్షమును కురిపించెను. పరదేవతయు దేవతలకు శత్రువైన వానిని చంపగోరినదై వెంటనే బాణములను ప్రయోగించెను. ఇంతలో చిక్షురుడు మూర్ఛనుండి తెప్పరిల్లి మరల ధనుస్సు తీసుకొని ఆమె యెదుట నిలచెను. చిక్షుర తామ్రులిరువును దేవితో యుద్ధము చేయనారంభించిరి. అంతట కోపించి దేవి తన బాణములచే రాక్షసులందరి కవచములను ఛేదించెను. రాక్షసులందరు రక్తముతో తడిసిన శరీరములు కలవారైరి. ప్రేక్షకులైన దేవతలు ఆశ్చర్యపడునట్లు యుద్ధము జరిగినది. తామ్రుడు ఇనుపరోకలితో సింహము నెత్తిపై మోదెను. మరియు నవ్వుచు గొప్పధ్వని చేసెను. దేవి గర్జించు చున్న వానిని చూచిపదునైన తనకత్తితో అతని శిరస్సును ఖండించెను. అతడు

తిరుగుచు భూమిపై పడిపోయెను. పడిపోయిన తామ్రుని చూచి చిక్షురుడు కత్తి పట్టుకొని దేవివైపు పరువెత్తెను. దేవి అతనిని చూచి ఐదుబాణములు ప్రయోగించెను. ఒక బాణముతో ఖడ్గము, రెండవ బాణముతో వాని చేయి తక్కిన మూడు బాణములతో అతని తల నరకబడెను. యుద్ధ దుర్ముఖులను యారాక్షసు లిరువురును చంపబడిరి. అంతట వారి సైన్యము శీఘ్రముగా దిక్కులకు పారిపోయెను. దేవతలు మిగుల సంతసించి పుష్ప వృష్టికురిపించి జయజయ ధ్వానము లొనర్చిరి. మహిషుడు వారి మరణమున కాశ్చర్యపడి మహాబల శాలులైన అసిలో మబిడాల ప్రముఖులను గొప్ప సైన్యముతో యుద్ధభూమికి పంపెను. అచట వారు పదునెనిమిది భుజములతో వివిధ దివ్యాయుధములు ధరించి యున్న దేవిని చూచిరి. ముందుగా అసిలోముడు వినయముతో నవ్వుచు శాంతి యుతముగా దేవితో నిట్లు మాట్లాడెను?

సౌందర్యవతివగు ఓ దేవి! యథార్థము చెప్పుము. నీవెందులకిక్కడకు వచ్చితివి? నిరపరాధులైన రాక్షసులనెందుకు చంపుచున్నావు? కారణము చెప్పవలసినదిగా కోరుచున్నాను. నేను నీతో ఇప్పుడు సంధి చేసికొన గోరుచున్నాను. నీకు కావలసిన బంగారమును రత్నములను శ్రేష్ఠములైన పాత్రలను కావలసినవాటిని తీసికొని వెళ్ళిపొమ్ము. దుఃఖమును సంతాపమును కలిగించు యుద్ధమెందులకు? దుఃఖకరమైన సంగ్రామమును విడిచి సంసారసుఖముల ననుభవింపుము. సుఖము రెండు విధములు. ఆత్మ జ్ఞానమువలన కలుగు సుఖ మొకటి రెండవది భోగముల ననుభవించుట వలన లభించునది. మొదటిది నిత్యము రెండవది అనిత్యము. యౌవన దశలో నున్న నీవు గొప్ప భోగముల ననుభవించి సుఖపడుము. నీవు ధర్మబుద్ధివిగా నుండుట యుక్తము. అపరాధము లేకుండా రాక్షసుల నెందుకు చంపుచున్నావు? అని యడిగెను.

శ్రీ దేవి అసిలోమ బిడాలులను చంపుట

రాక్షసుని ప్రశ్నలకు దేవి సమాధానము :-

"నేనిక్కడకు వచ్చుటకు కారణమేమని యడిగితివిగదా? ధర్మము కొఱకే నేనుసంచరింతును. ప్రాణుల న్యాయాన్యాయ ప్రవర్తనలకు సాక్షిరూపిణిని. సజ్జనుల రక్షించుట నాకు వ్రతము అట్లే దుర్మార్గులు నాకు చంపదగినవారు. అవతారములలో వేదముల సంరక్షణము నాకర్తవ్యము. ప్రతియుగమందును అవతారములను ధరించుచుందును. మహిషుడు చెడు నడువడిక కలవాడై దేవతలను చంపు

టకు ప్రయత్నించెను. ఓ రాక్షసా అతనిని చంపుటకే నేనిప్పుడు వచ్చినాను. దేవతలకు శత్రువైనట్టియు మహాబలిశాలియగు నాతనిని చంపెదను. నీవిక్కడనుండి వెళ్ళి దుర్మార్గుడగు మహిషునకీ విషయము తెలుపుము. అతనినే స్వయముగా యుద్ధమునకు రమ్మని చెప్పుము. నాతో సంధి చేయదలచుకొనినచో వైరమును విడిచి రాక్షసులందరును పాతాళమునకు పొండు. అపహరించిన దేవతల సొమ్మును తిరిగి యిచ్చివేసి ప్రహ్లాదుడు నివసించు పాతాళమునకు పొండు" అని పలికెను. అసిలోముడు మహావీరుడైన బిడాలునితో వింటివా? ఇప్పుడీమెతో యుద్ధము చేయ వలయునా? లేక సంధి చేసికొనవలయునా? అని పలికెను. బిడాలుడిట్లు పలికెను.

అభిమానవంతుడైన మనరాజు యుద్ధములో చావు తప్పదని తెలిసి కూడ సంధి కిష్టపడుటలేదు. యుద్ధములో చనిపోవుచున్న రాక్షసులను చూచుచునే మరల యుద్ధమునకు రాక్షసులను ప్రేరేపించుచున్నాడు. దైవమునెవడ తిక్రమింపగలడు? సేవకులు అభిమానము లేనివారు ఆజ్ఞాపించు యజమానులచేతిలో కీలుబొమ్మలు కఠినమైన ఈమాట నెట్లు రాజు వద్ద చెప్పగలము? పాతాళమునకు వెళ్ళుచూ దేవతల ధనరత్నాదుల నిచ్చివెళ్ళినా సరే లేక యుద్ధములో చచ్చుటకు సిద్ధమైనను సరే అను ఇట్టి కఠోరవచనమును రాజువద్ద నెట్లు పలుకగలము? అసత్యము చెప్పకూడదు. కనుక బుద్ధిమంతుడిట్టి యెడ మౌనమవలంబించుట శ్రేయస్కరము. రాజువద్దకు వెళ్ళి మౌనముగా నుండుటయు కుదురదు. కనుక యుద్ధమే చేయదగినదని పలికెను.

వారిద్దరును ధనుర్బాణముల ధరించి రథము నెక్కిరి. బిడాలుడు దేవిపై నేడుబాణములు ప్రయోగించెను. అసిలోముడు మాత్రము ఊరకచూచుచుండెను. నిరంకుశయగు దేవి తనమీదికి వచ్చు బాణములను ఖండించి బిడాలునిపై మూడు బాణములను ప్రయోగించెను. ఆ దెబ్బకు అతడు మూర్ఛనొంది మరణించెను. తరువాత అసిలోముడు యుద్ధమునకు సిద్ధమయ్యెను. ఎడమచెతిని పైకెత్తి యా రాక్షసుడు దేవీ! దుష్ట రాక్షసులు చచ్చుట నాకు తెలియును. మా మహిషుడు మందబుద్ధి. మంచిచెడ్డ లెరుగడు. నేను సేవకుడను కనుక నాకు యుద్ధము చేయుట తప్పుటలేదు. రాజువద్ద ఇష్టము కాని మాట చెప్పలేము. మేలోకీడో వీరమరణము నందుట నాధర్మము. నీ బాణములకు దానవులెల్లరు మరణించుచున్నారు. దైవమే గొప్పది పౌరుషము పనికి మాలినదని తలచుచున్నారు. అని మాట్లాడి అసిలోముడు దేవిపై బాణములు ప్రయోగించెను. మాయా

స్వరూపిణియగు దేవి ఆ బాణములు తనను చేరక ముందే ఆ బాణములను ఖండించెను. మరికొన్ని బాణములు ప్రయోగించి దేవి అసిలో ముని బాధించెను. ఆ బాణములు రాక్షసుని శరీరమునకు చిల్లులు చేయగా రక్తధారలు స్రవించెను. అంత నతడు గద తీసికొని పరుగెత్తి వెళ్ళి సింహమునెత్తిపై కొట్టెను. సింహము కూడా గోళ్ళతో వాని వక్షస్థలమును చీల్చెను. అదిలెక్కచేయక రాక్షసుడు సింహము తలపైనెక్కి గదతో దేవిని కొట్టెను. ఆదెబ్బను తప్పుకొని దేవి వాడియైన తన ఖడ్గముతో రాక్షసుని శిరస్సును ఛేదించెను. శిరసు తెగిపోగా రాక్షసుడు నేలపైబడెను. రాక్షసులు హాహాకారమును చేసిరి. దేవతలు జగదంబను జయజయ ధ్వనులతో స్తుతించిరి. ఇరువురు రాక్షసవీరులును మరణించగనే సింహము సైనికులను కొందరిని చంపినది. మరికొందరిని తిన్నది. పారిపోయిన కొందరు సైనికులు దుఃఖముతో మహిషునకు బిడాలాసి-లోములు చనిపోయిరని చెప్పిరి. ఆ మాటలు విని మహిషుడు చింతతో వ్యాకులమైన మనస్సు కలవాడయ్యెను.

మహిషుడు శ్రీ దేవిని కని మోహవశుడగుట

తరువాత మహిషుడు కోపముతో తనకు మంచి రథమును తెమ్మని దారుకుడను వానిని పంపెను. సారథి త్వరగా వెళ్ళి రథమును తెచ్చెను. ఆరథము వేయి గాడిదలుకలది. ధ్వజముతో అలంకరింపబడి మంచి చక్రములు కలిగి యుండెను. మరియు రాజా! సమస్తాయుధములతో కూడిన రథము ద్వారమందున్నదని మనవి చేసెను. అంతట మహాబలశాలి మహిషుడు మానవ శరీరమును ధరించి యుద్ధమునకు బయలుదేరెను. సర్వాభరణములతో అలంకరింపబడిన తన మానవ శరీరమునుచూచి ప్రేమించునని తలచెను. దివ్యములైన వస్త్రములు ధరించి రెండవ మన్మధుడా అన్నట్లు సైన్యముతో దేవివద్దకు వెళ్ళెను. అనేకవీరు లతో-యుద్ధము చేయవచ్చిన మహిషుని చూచి దేవి శంఖమును పూరించెను.

జనులకాశ్చర్యము కలిగించు శంఖధ్వనిని విని మహిషుడు దేవివద్దకు వెళ్ళి నవ్వుచు ఆమెతో ఇట్లు పలికెను:- దేవి! ఈ ప్రపంచములో స్త్రీగాని పురుషుడుగాని సుఖంకావలెనని కోరుదురు. సుఖము సంయోగములోనే సంభవించునుగాని వియోగమునందు కాదు. లోకములో సంయోగమువలన కలిగే సుఖము అత్యుత్తమము. ఈడుజోడు గల యువతీయువకుల మేలుకలయిక మహత్తరసుఖము నిచ్చును. నేను అన్ని విధములైన సద్గుణములు గల యువకుడను. వీరుడనుకూడ. నామూలమున నీకు నిస్సంశయముగా అత్యుత్తమ సుఖము కలుగును.

ప్రియు రాలా! నేను అనేక రూపముల ధరింపగల మొనగాడను. ఇంద్రాది దేవతలు నాతో పోరాడలేక పారిపోయిరి. వారి అమూల్యరత్నములను నావద్దనే పదిలముగా నుంచితిని. వాటిని అన్నిటిని నీయిష్టము వచ్చినట్లు అనుభవింపుము. లేక దానమైనను చేసికొనవచ్చును. నాకు నీవు పట్టమహిషివికమ్ము. నేను నీ పాదదా సుడను. నీ మాట ననుసరించి దేవతలతో విరోధమును వదలు కొందుము. నీవు సుఖపడునట్లు నేను సర్వదా ప్రయత్నింతును. విశాలాక్షీ! ఆజ్ఞాపించుము. నీవు చెప్పినట్లు నడచెదను. నీ సౌందర్యమును చూచి నామనస్సు మోహించినది. మన్మథ బాణములచే బాధింపబడుచున్న నన్ను కాపాడుము. శరణాగత రక్షణము పరమధర్మముగదా! నేను నీ సేవకుడను. ప్రాణమున్నంతవరకు ఆడినమాట తప్పను. నీ పాదములకు నమస్కరించుచున్నాను. ఓ విశాలాక్షి! నాపై దయ చూపుము. పుట్టినది మొదలు యెన్నడును దైన్యమెరుగను. బ్రహ్మాదిదేవతలకు నాచరిత్ర తెలియును. నీకు దాసుడను. ఒక్కమారు నావైపు చూడుము అని పలికెను.

యిట్లు మాట్లాడుచున్న మహిషునితో దేవి యిట్లు పలికెను:- నేను పరమ పురుషుని తప్ప వేరొకనిని కోరను. నేనాతని యిచ్ఛాశక్తిని. సమస్త జగత్తులను నేనే సృష్టింతును. నేనా పరమపరుషుని సంయోగమున చైతన్యవంతురాల నగు దును. నాకుతుచ్ఛమైన గ్రామ్యసుఖ వాంఛ లేదు. నీవు వట్టి మూఢుడవు. పరస్త్రీ సాంగత్యమును కోరుచున్నావు. స్త్రీ యనగా పురుషుని బంధించు గొలుసు. నీవు మనో నిగ్రహముచే సుఖమును పొందుటకు ప్రయత్నింపుము. నీవు దేవతలతో విరోధము మాని యిష్టము వచ్చినట్లు సంచరించుము. నీకు జీవించవలయునను కోరిక యున్నచో పాతాళమునకు పొమ్ము లేదా యుద్ధమును చేయుము. దేవతలు నిన్ను వశింపజేయుటకు నన్ను పంపించిరి. నీవు చూపిన మాటలలోని స్నేహము నకు సంతోషించితిని. నిన్ను విడిచి పెట్టుచున్నాను వెళ్ళుము. చావదలచి నచో యుద్ధము చేయుము. తప్పక నిన్ను చంపెదను యిందులో సందేహము లేదు.

ఈ విధమైన ఆమె మాటలు విని కామమోహితుడైన రాక్షసుడు మధురముగా నిట్లు పలికెను - హరిహరాదులను లోకపాలకులను జయించిన నేను నీతో యుద్ధము చేయుట తగినదిగాదు. నీకిష్టమైనచో నన్ను వివాహము చేసుకొమ్ము నన్ను సేవించుము. అట్లు కానిచో నీవెక్కడనుండి వచ్చితివో అక్కడకు వెళ్ళుము. నేను నీతో స్నేహము కలిగిఉన్నాను గనుక నీతో యుద్ధము చేయను. మేలు చేయునట్టియు శుభమైన మాట చెప్పితిని.

నీచోటికి నీవు పొమ్ము. నిన్ను చంపినచో నాకేమి లాభము? స్త్రీహత్య, బాల హత్య, బ్రహ్మహత్య, ఇవి చాలచెడ్డవి. కనుక నిన్ను తీసుకొని ఇంటికి వెళ్ళుదును. బలాత్కారము వలన సుఖభోగములుండవు. కనుక వినయముతో చెప్పుచున్నాను. పురుషునకు యువతివలననే సుఖము కలుగును. నీవు అందమైనదానవు. సమస్తా భరణములను అలంకరించుకొంటివి. నీవు నన్ను సేవించుట కిష్టపడుటలేదు. సుఖభోగములను విడువుమని నీకెవరు బోధించిరో కదా! నీశత్రువు బోధించి యున్నచో నీవు మోసగింపబడితివన్నమాట. మనమిరువురము వివాహము చేసికొని సుఖము ననుభవించుదము. నన్ను వదిలి వెళ్ళి పిమ్మట పశ్చాత్తాపపడుదువు.

మహిషుడు శ్రీదేవికి మండోదరి కథ చెప్పుట

పూర్వము మందోదరియను స్త్రీ తనకను కూలుడైన గొప్పరాజును కాదని ఒక మూర్ఖుని వరించి వివాహమాడెను. పిమ్మట మోహ పారవశ్యముచే కామార్తయై పశ్చాత్తాపము నందినది. అని పలుకగాదేవి ఆమందోదరి కథను వాని ద్వారానే విని ఓరి మందబుద్ధీ! పాతాళమునకు పొమ్ము లేదా యుద్ధము చేయుము. నిన్ను తక్కిన రాక్షసులను చంపి నేను సుఖముగా వెళ్ళెదను. సజ్జనులకు దుఃఖము తొలగించి వారిని కాపాడుటకై శరీరమును ధరించుచుందును. రూపము జన్మలేని నాకు జన్మ- దేవతలను రక్షించుటకొరకేనని తెలిసికొనుము. నేను నిజము చెప్పుచున్నాను. నిన్ను చంపుటకై దేవతలు నన్ను ప్రార్థించినారు. నిన్ను చంపి నేను నిశ్చలముగా నుందును. కనుక యుద్ధము చేయుము లేదా పాతాళమునకు పొమ్ము. ఈ దేవి మాటలువిని యా రాక్షసుడు ధనుస్సును తీసికొని యుద్ధము చేయుటకు సిద్ధమయ్యెను. వెంటనే దేవిపై బాణములు ప్రయోగింపగా దేవి వాటిని ఖండించినది. వారిరువురకు భయంకరమైన యుద్ధము జరిగెను.

అంతలో దుర్ధరుడనువాడు వచ్చి దేవిపై అతిదారుణములైన బాణము లను ప్రయోగించెను. అంతట దేవి కోపించివాడియైన బాణములతో దుర్ధరుని నేలకూల్చినది. అదిచూచి త్రినేత్రుడను వాడు వచ్చి యేడు బాణములను దేవిపై ప్రయోగించెను. తన దగ్గరకు రాకముందే దేవి ఆ బాణములను ఖండించెను. త్రిశూలముతో దేవి త్రినేత్రుని బాధించెను. సంహరించెనుకూడ. తరువాత అంధ కుడనువాడు ఇనుపగదతో సింహమును తలపై మోదెను. సింహము కోపించి గోళ్ళతో అతనిని చంపివేసినది. మరియు రోషముతో వాని మాంసమును తిని వైచెను. తన రాక్షసులట్లు దేవిచేతులలో చచ్చుటచూచి మహిషుడత్యాశ్చర్య భరితు

డయ్యెను. మరియు మహిషుడు ప్రయోగించిన బాణమును ఖండించి దేవి గదతో వాని గుండె బ్రద్దలగొట్టెను. మహిషుడు సింహ రూపము ధరించి దేవి సింహమును తనగోళ్ళతో చీల్చెను. వెంటనే రాక్షసుడు గజరూపముదాల్చి తొండముతో పర్వతశిఖరములు పెకలించి దేవిపై విసిరెను.

శ్రీదేవి మహిషుని సంహరించుట

దేవి తనవాడి బాణములతో కొండశిఖరములను నుగ్గునుగ్గు చేసెను. మరియు పెద్దగా నవ్వినది. మరియు బంగారుపాత్రతో మద్యము త్రాగి క్రోధము తో మహిషుని చంపగోరినదై శూలము చేతబట్టి రాక్షసునిపైకి వురికెను. దేవతా గణములామెను స్తుతించి పుష్పవర్షమును కురిపించెను. ఆ రాక్షసుడు అనేక మాయారూపములు దాల్చి దేవితో యుద్ధము చేసెను. చండికరోషా రుణ నేత్రములతో కూడి త్రిశూలముతో బలముకొలది వాని రొమ్ముపై పొడిచెను. అంతటవాడు మూర్ఛనొందెను. వెంటనే లేచి కాళ్ళతో దేవిని తన్నెను. మరియు వికటముగానవ్వెను. ఆ ధ్వనికి దేవతాలాశ్చర్యము నుందిరి. అంతట దేవి వేయి అంచులు గల సునాభమను చక్రమునుచేత పట్టుకొని మహిషునితో నిట్లనెను:-

ఓరీ మదాంధా ఇపుడే యీ చక్రము నీకుత్తు కనుత్త రింపగలదు. నీవు యమపురికే గుదువు. అని చక్రమును వానిపై విసెరెను. మహిషాసురుని శిరస్సు తెగి నేలపై బడెను. ఆకాశమున దేవతలు జయజయ ధ్వనులొనర్చిరి. తక్కిన రాక్షసులు పారిపోవుచుండిరి. వారి మరణవార్త విని భూమిపై గలమునులు సాధుజనులు చాలా సంతసించిరి. అప్పుడు దేవి యుద్ధరంగము వదలి ఒక పవిత్ర ప్రదేశమున కూర్చుండెను. దేవతలెల్లరు సుఖప్రదాయినియగు శ్రీదేవిని స్తుతించుట కామె సమీపమునకు వెళ్ళిరి. ఇంద్రాది దేవతలు మహిషుని మరణము నకు పరమానంద భరితులై జగదంబనిట్లు స్తుతించిరి.

దేవతలు శ్రీదేవిని స్తుతించుట

శ్లో॥ బ్రహ్మా సృజత్యవతి విష్ణురిదం మహేశ
శ్శక్త్యాతవ హరతే నను చాంతకాలే।
ఈ శానతే౽పిచభవంతి తయావిహీనా
స్తస్మా త్త్వ మేవ జగతస్థితి నాశకర్త్రీ।
కీర్తిర్మతిః స్మృతి గతీ కరుణాదయాత్వమ్

శ్రద్ధాధృతిశ్చ వసుధాకమలా జపాచ ।
పుష్టిః కలాऽథ విజయాగిరిజా జయాత్వం
తుష్టిః ప్రమాత్వమసి బుద్ధి రుమారమాచ
విద్యాక్షమా జగతి కాంతి రహీనమేధా
సర్వం త్వమేవవిదితా భువనత్రయే ऽస్మిన్ ॥
అభిర్వినా తవతు శక్తిభిరాశుకర్తుం
కోవాక్షమః సకలలోక నివాసభూమే ।
త్వంధారణా ననున చేదసి కూర్మ నాగౌ।
ధర్తుంక్షమౌ కథమిలా మపితౌ భవేతామ్।
పృథ్వీన చేత్త్వ మసి వాగగనే కథం స్థా
స్యత్యే తదంబ నిఖిలం బహుభారయుక్తమ్
యే వాస్తువంతి మనుజా అమరాన్ విమూఢా
మాయాగుణైస్తవ చతుర్ముఖ విష్ణురుద్రాన్ ।
శుభ్రాంశువహ్ని యమవాయు గణేశముఖ్యాన్
కింత్వామృతే జననితే ప్రభవంతికార్యే
యేజుహ్వతి ప్రవితతే కల్పధియోంబ యజ్ఞ
వహ్నౌ సురాన్ సమధికృత్య హవిస్సమృద్ధమ్ ।
స్వాహాన చేత్త్వ మసితే కథ మాపురద్ధా
త్వామేవ కింనహి యజంతితతోహిమూఢాః॥
భోగప్రదాసి భవతీహ చరాచరాణాం
స్వాంశైర్దదాసిఖలు జీవన మేవ నిత్యమ్ ।
స్వీయాన్సురాన్ జనని పోషయసేచ యద్వత్
తద్వత్పరాన పిచపాలయసీతిహీతోః ।
మాతస్స్వయం విరచితాన్ విపినే వినోదా
ద్వం ధ్యాన్ పలాశ రహితాంశ్చ కటూంశ్చవృక్షాన్ ॥
నోచ్ఛేదయంతి పురుషా నిపుణాః కథంచిత్
తస్మాత్త్వ మప్యతితథాం పరిపాసి దైత్యాన్ ॥
యత్త్వంతు హంసిరణమూర్ధ్ని శరైరరాతీన్
దేవాంగ నాసురతికేళి మతీన్ విదిత్వా
దేహాంతరేపి కరుణారస మాదదానా

దత్తే చరిత్ర మిదమీప్సితపూరణాయ ।
చిత్రంత్వ మీ యదసుభీ రహితానసంతి
త్వచ్చింతితేన దనుజాః ప్రథిత ప్రభావాః ।
యేషాంకృతే జనని దేహ నిబంధనంతే
క్రీడారసస్తవనచాన్య తరోఽత్రహేతుః॥
ప్రాప్తేకలావహ మాదుష్టతరేచకాలే
నత్వాంభజంతి మనుజాననువంచితాస్తే
ధూర్తైఃపురాణ చతురైర్హరి శంకరాణాం
సేవా పరాశ్చ విహితాస్తవ నిర్మితానామ్ ॥
జ్ఞాత్వాసురాంస్తవ వశానసురార్దితాంశ్చ
యే వైభజంతి భువిభావయు తా విభగ్నాన్
ధృత్వాకరే సువిమలంఖలు దీపకం తే
కూపే పతంతి మనుజా విజలేఽతిఘోరే
విద్యాత్వమేవ సుఖదాఽసుఖదావ్య విద్యా
మాతస్వ మేవ జనవార్తిహరా నరాణామ్ ।
మోక్షార్థి భిస్తుకలితా కిలమందధీభి
ర్నారాధితా జనని భోగపరైస్తథాజ్ఞైః॥

స్తోత్ర భావము:- ఓ భగవతీ! దేవీ! నీ దివ్యశక్తి ప్రభావముచేతనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టిస్థితి సంహార కార్యముల ననుసరింపగలుగు చున్నారు. కనుక వాస్తవముగ సృష్టిస్థితి సంహారకారిణివి నీవే. శ్రీమాతా! నీవు సత్యముగ కీర్తి, ధృతిమతి విశ్వగతి స్వరూపురాలవు. కరుణశ్రద్ధ దయ నీ స్వరూపములే. గిరిజ, కమల, జయ మొదలగు పేర్లు కలదానవు. తుష్టి, పుష్టి, ప్రమ, బుద్ధి, ఉమ, మొదలగు రూపములు నీవే. విద్యా, క్షమ, మేధ, కాంతులు నీవే. నీ సహాయము లేనిదే శేషుడు భూమిని మోయగలడా? అమ్మా! నిజమునకు నీవే భూమాతవు. కానిచో మహా భారముగల భూమి నిరాధారముగ నాకాశమందెట్లు నిలువగలదు? ఈ జనులు నీమాయచే మోహితులై హరిహరాది దేవతల నారాధించి స్తుతించు చున్నారు.

దేవతలు నీ సహాయములేనిదే యే పనియు చేయజాలరు. ఇక తక్కిన ప్రాణుల విషయము చెప్పనేల? నీవు చరాచరప్రాణులకు వారివారి కర్మాను

సారముగ సుఖదుఃఖము లొసగుచుందువు. నీదయా మృతము వర్ణనాతీతము. నీవు రాక్షసులను సంహరించివారికి స్వర్గమందు గొప్పగొప్ప సుఖముల సమకూర్చు చున్నావు. నీ పవిత్ర చరిత్ర భక్తులకు సకల సంపదల నొసంగును. అన్ని కోరికలను తీర్చును. నీవు శరీరము ధరించుట ధర్మరక్షణము నకు అధర్మనాశమునకు మాత్రమే. మానవులీ లోకమున నిన్ను విడిచి యితర దేవతల నారాధించుట చేతిలో దీప మున్నను చీకటి నూతిలో కూలుటవంటిది. నీవు సుఖశాంతులనొసగు విద్యాస్వరూపవు ఘోరసంసార దుఃఖముల కలిగించు అవిద్యవు నీవు. నిన్నారా ధించు మోక్షకాములకు శాశ్వత సుఖము నిచ్చు తల్లివినీవే. అజ్ఞానులు మంద బుద్ధులు నిన్ను సేవింపజాలరు.

దేవతలు శ్రీదేవిని స్తుతించుట

దేవతలు దేవినిట్లు స్తుతించిరి :-

శ్లో॥ బ్రహ్మా హరశ్చహరి రప్యనిశంశరణ్యాం
పాదాంబుజంతవ భజంతి సురాస్తథాన్యే ।
తద్వైనయేఽల్ప మతయో మనసాభజంతి
భ్రాంతాః పతంతి సతతం భవసాగరేతే ॥
చండిత్వదం ఘ్రిజలజోత్థరజః ప్రసాదై
ర్బ్రహ్మాకరోతి సకలం భువనం భవాదౌ।
శౌరిశ్చ పాతిఖలు సంహరతేహరస్తు
త్వాం సేవతే నమనుజస్త్విహ దుర్భగోఽసౌ ॥
వాగ్దేవతాత్వమసి దేవి సురాసురాణాం
వక్తుంనతేఽమరవరాః ప్రభవంతి శక్తాః ।
త్వంచేన్ముఖేవససినైవయ దైవతేషాం
యస్మాద్భవంతి మనుజానహిత ద్విహీనాః ॥
శప్తో హరిస్తు భృగుణాకుపితేనకామం
మీనోబ భూవకమఠఃఖలు సూకరస్తు ।
పశ్చాన్నృసింహ ఇతి యచ్ఛలకృద్ధరాయాం
తాన్ సేవతాం జనని మృత్యుభయంనకింస్యాత్ ॥
శంభోః పపాతభువిలింగ మిదం ప్రసిద్ధం
శాపేన తేచ భృగోర్విపినే గతస్య।

తంయేవరాభువిభజంతి కపాలినంతు
తేషాం కథం సుఖమిహాపి పరత్రమాత: ॥
యోభూద్గజాననగణాధిపతి ర్మహేశాత్
తం యేభజంతి మనుజా వితథ ప్రపన్నా: ।
జానంతితేన సకలార్థ ఫలప్రదాత్రీం
త్వాం దేవి విశ్వజననీం సుఖసేవనీయామ్ ॥
చిత్రం త్వయాఽరిజనతాపి దయార్ద్రభావాత్
దత్వారణేశితశరైర్గమితా ద్యులోకమ్॥
బ్రహ్మా హరశ్చ హరి రప్యుత గర్వభావా
జ్ఞానంతితేఽ పివిబుధానతవ ప్రభావమ్ ।
కేఽన్యే భవంతి మనుజా విదితుం సమర్థా
స్సమ్మోహితాస్తవ గుణైరమిత ప్రభావై: ॥
క్లిశ్యంతితేఽపి మునయస్తవ దుర్విభావ్యం
పాదాంబుజం నహిభజంతివిమూఢచిత్తా: ।
సూర్యాగ్నిసేవన పరా: పరమార్థ తత్త్వం
జ్ఞాతంనతై: శ్రుతిశతైరపి వేదసారమ్ ॥
మన్యేగుణాస్తవ భువిప్రథిత ప్రభావా:
కుర్వంతి యేహి విముఖా స్సమభక్తి భావాత్ ।
లోకాన్ స్వబుద్ధిర చితై ర్వివిధాగమైశ్చ
విష్ణీశ భాస్కర గణేశ పరానిధాయ
కుర్వంతియే తవపదా ద్విముఖాన్నరాగ్ర్యాన్
స్వేక్తాగ మైర్హరి హరార్చన భక్తియోగై:
తేషాంనకుప్యసి దయాంకురుషేఽంబికేత్వం
తాన్ మోహమంత్రనిపుణాన్ ప్రథయస్యలంచ
తుర్యేయుగే భవతి చాతిబలం గుణస్య
తుర్యస్యతే నమథితాన్యపి దాగమాని॥

స్తోత్రభావము:- ఓ పరదేవతా! నీ పాదపద్మములను హరిహర బ్రహ్మాది దేవతలు నిత్యము కొలుచుచుందురు. అల్పబుద్ధులు మాత్రము నిన్ను సేవింపక సంసార సముద్రములో కూలుచుందురు. నీవు వాగ్దేవతవు. భృగుమహర్షి కోపించి విష్ణువును

శపించెను. అందుచే హరి మీనకూర్మ వరాహ నారసింహవామనాది రూపములు తాల్చవలసి వచ్చెను. అట్టి పరాధీనుని సేవించినచో మృత్యుభయ మెట్లుతప్పును? దయాకల్పవల్లీ! తల్లీ! పూర్వము శివుడు వనమందు సంచరించునప్పుడు భృగు మహర్షి వానిని శపించెను. అందువలన శివుని లింగము నేలపైబడెను. ఇది అందరకు తెలిసిన విషయమే. అట్టి శివుని కొలిచినవారికి శాశ్వత సుఖమెట్లు లభించును? అమ్మా! శివుని కుమారుడు గణపతి అతినిని కూడ అజ్ఞానులు పూజించుదురు. అన్ని ప్రయోజనములను సమకూర్చు నీశక్తి నెరుగక మానవులా యాదేవతలనారాధించుచున్నారు. హరిహరబ్రహ్మలు కూడ గర్వమోహముచే నీ దివ్య ప్రభావము నెరుగజాలకున్నారు. ఇక మానవు లెట్లెరుగగలరు? నీ పాద పద్మములను సేవింపనివారు అనేక కష్టములు ననుభవించుచున్నారు. తల్లీ! ఆగమశాస్త్రములను రచించిన బ్రాహ్మణులు భక్తితో శివకేశవులను పూజింతురు. కవులు, పండితులు నీ నిత్యసత్యో పాసనకు స్వస్తి చెప్పి నీవు కల్పించిన దేవతలను పూజించుచున్నారు. నిన్ను ధ్యానించువారు గర్భనరకము లోపడరు. హృదయములో నీ స్పందన లేనిదే ప్రాణులకు శక్తి యెక్కడిది? నీ శక్తిలేని మానవుడు తిరుగుటకు పనిచేయుటకు యెట్లు సమర్థుడగును? ఇట్లు స్తుతింపగా పరదేవత అంతర్ధానము చెందెను. దేవి కనబడకపోవుటవలన దేవతలు అందరు మిక్కిలి యాశ్చర్యపడిరి.

జనమేజయుడు వ్యాసునితో యిట్లనుచున్నాడు:- ఓ మహర్షీ శ్రీదేవి దివ్య చరిత కథామృతము శాంతిప్రదము హితకరము మహాద్భుతమునై యున్నది. నీ ముఖకమలము నుండి యాకథామృతము నెంతగ్రోలినను తనివి తీరుటలేదు. శ్రీదేవి పరమ పావనచరిత్ర అల్పపుణ్యము కలవారికి లభ్యముకాదు. జగదంబ చరిత్రను దేవతలకు మునులకును శ్రీరామరక్ష. సంసారసాగరమును దాటించు నావ. అట్టి దానిని తెలిసిన వారేల విడిచి పెట్టెదరు? పూర్వజన్మమున జగదంబ నెవరు కుంద చంపక బిల్వసుమదళములతో పూజించిరో వారీ జన్మమున రాజ భోగములనుభవింతురు. జగదంబనర్చింపని మానవుడు ధనధాన్యసంతాన హీనుడై రోగియై బాధపడుచుండును. కుంటి గ్రుడ్డి నిత్యదరిద్రుడు మొదలగువారు పూర్వ జన్మమున దేవిని సేవించినవారుకారని గ్రహింపవలయును. ఈ జన్మలో సకల సంపదలు గలిగి సర్వసుఖముల ననుభవించుచున్నవారు.

పూర్వ జన్మమున జగదంబను శ్రద్ధాభక్తులతో సేవించినవారని తెలియవలెను. వ్యాసమహర్షీ! త్రిభువనేశ్వరి అంతర్ధానమై యెక్కడకు వెళ్ళెనో తెలియజేయవలసినదిగా ప్రార్థించుచున్నాను"అని జనమేజయు డడుగగా వ్యాసుడు పూర్వము నీకు

చెప్పిన మణిద్వీపమే ఆమెకిష్టమైన క్రీడాస్థానము. పూర్వమక్కడనే హరిహర బ్రహ్మలు స్త్రీస్వరూపమును పొందిరి. ఆ దేవి దయవలన మరల పురుషులై తమ పనులను నిర్వహించుచున్నారు. ఆ మణిద్వీపము అమృతసముద్రము మధ్య భాగమందున్నది. అచ్చట దేవి పలురూపముల విహరించుచుండును. దేవతల పూజాస్తుతుల నందుకొని మహిషాసురమర్దిని ఆ మణిద్వీపమునకే వెళ్ళెనని చెప్పెను.

శుంభ నిశుంభుల వరగర్వము

పూర్వము శుంభ నిశంభులను రాక్షసులు బ్రహ్మను తపస్సుచే సంతోష పెట్టి అనేక వరములు పొందిరి. మహాబలవంతులైన ఆరాక్షసులు దేవతల నోడించి స్వర్గమ్మును చేజక్కించుకొనిరి. శుంభుడు చిరకాలము స్వర్గరాజ్యమును పాలించు చుండగా రాజ్యమును కోల్పోయిన దేవతలు గొప్ప దుఃఖముపొంది బృహస్పతినిట్లు ప్రశ్నించిరి. గురుదేవా! నీవు సర్వము తెలిసినవాడవు. మహా మునివి. మా దుఃఖముపోవుటకుపాయమును తెలియజేయవేడుచున్నాము. వేద మంత్రములన్ని కోరికలను తీర్పగలవు కద! యజ్ఞములు కోరికలను తీర్ప గలవు కదా! శత్రునాశము కొరకు యేవిధానము వేదములందుగలదో దానిని తెలియ జేయుమని ప్రార్థించిరి.

అప్పుడు బృహస్పతి ఓదేవతలారా! వేదములలో యజ్ఞములందు పూజింప దగినవారుగా శ్రీఇంద్రాగ్నివరుణాది దేవతలు చెప్పబడుచున్నారు. వారి యను గ్రహముచే శత్రుజయాదికార్యములు సాధింపవచ్చును. కాని ఆ ఇంద్రాగ్ని వరుణాది దేవతలే ఆపదలలో చిక్కుకొని యుండగా నేమి చేయగలము. దైవ సంకల్పానుసారము జరుగెడు పనులకు ప్రతిక్రియ లెవ్వరును జరుపలేరు. కాని ఆలోచించి ఉపాయమును తెలిపెదను, మహిషాసుర సంహారానన్తరము దేవిని స్తుతింపగా ఆమె ఆపదలు వచ్చినప్పుడు నన్ను స్మరించినచో మీ యాపదలు తొలగగలవని చెప్పినదిగదా!

కనుక మీరిప్పుడు హిమాలయ పర్వతమునకు వెళ్ళి శ్రీచండికాదేవిని భక్తిశ్రద్ధలతో సేవించండి. మీరు మాయా బీజవిధానమెరిగి దానిని పునశ్చరణ చేయండి. ఆమె మీయెడల దయగలది యగునని నేను యోగబలముచే తెలిసికొన్నాను. దానిచే మీకష్టములు గట్టెక్కునని చెప్పెను. బృహస్పతి మాటల ప్రకారము దేవతలు హిమాలయమున కేగి అచట మాయా బీజమును తమ హృదయమందు నిల్పుకొని యా తల్లిని ధ్యానించి మహామాయను పరమభక్తి నమస్కరించి యిట్లు స్తోత్రము చేసిరి.

దేవతలు శ్రీదేవిని స్తుతించుట

నమో దేవి విశ్వేశ్వరి! ప్రాణనాథే! మదానందరూపే సురానందదేతే
నమో దానవాంతప్రదే మానవానా మనేకార్థదే భక్తిగమ్య స్వరూపే
నతే నామసంఖ్యా నతే రూపమీదృక్త థా కోపివేదాది దేవస్వరూపే
త్వమేవాసి సర్వేషుశక్తి స్వరూపా ప్రజాసృష్టి సంహారకాలే సదైవ
స్మృతిస్త్వంధృతిస్త్వంత్వమేవాసిబుద్ధిర్జరా పుష్టితుష్టీ ధృతి: కాంతిశాంతీ
సువిద్యా సులక్ష్మీర్గతి: కీర్తి మేధే త్వమేవాసి విశ్వస్య బీజంపురాణమ్
యదాయై: స్వరూపై: కరోషీహకార్యం సురాణాంచ తేభ్యో నమామోద్య శాంత్యై
క్షమాయోగనిద్రాదయాత్వం వివక్షాస్థితా సర్వభూతేషుశస్తై: స్వరూపై: ।
కృతం కార్యమాదౌత్వయా యత్సురాణాం హతోఽసౌ మహారిర్మదాంధో హయారి:
దయాతే సదాసర్వదేవేషు దేవి! ప్రసిద్ధా పురాణే వేదేషుగీతా:
కిమత్రాస్తి చిత్రం యదంబాసు తేస్వంముదాపాలయేత్పోషయేత్సమ్యగేవ
యత్త్వం జనిత్రీసురాణాం సహాయా కురుష్వైకచిత్తే నకార్యం సమగ్రమ్
నవా తేగుణానామియత్తాం స్వరూపం వయం దేవి జానీమహే విశ్వవంద్యే ॥
కృపాపాత్రమి త్యేవ మత్వాతథా స్మాన్భయేభ్య స్సదాపాహిపాతుంసమర్థే!
వినా బాణపాతైర్వినా ముష్టిఘా తైర్వినాశూలశంఖైర్వి నాశక్తిదండై:
రిపూన్హన్తు మే వాసిశక్తావినో దాత్తథాపీహ లోకోపకారాయలీలా ।
ఇదం శాశ్వతం నైవజానంతి మూఢానకార్యం వినాకారణం సంభవేద్వా
వయం తర్కయామోఽనుమానం ప్రమాణం త్వమేవాసికర్త్రాస్య విశ్వస్యచేతి
అజ:సృష్టికర్తా ముకుందోఽవితా యంహరో నాశకృద్వైపురాణే ప్రసిద్ధ:
నకింత్వత్ప్ర సూతాస్త్రయస్తే యుగాదౌత్వమేవాసిసర్వస్యతే నైవమాతా ।
త్రిభిస్త్వం పురారాధితా దేవి దత్తాత్వయాశక్తి రుగ్రా చతేభ్య: సమగ్రా ।
త్వయాసంయు తాస్తే ప్రకుర్వంతి కామం జగత్పాలనోత్పత్తి సంహారమేవ
తేకిం నమందమతయోయత యోవిమూఢాస్త్వాంయేవ విశ్వజననీం సముపాశ్రయంతి
విద్యాం పరాం సకలకామ ఫలప్రదాంతాం ముక్తిప్రదాం విబుధ బృంద సువంది తాంప్రీమ్
యే వైష్ణవా: పాశుపతాశ్చ సౌరాదంభాస్తఏవ ప్రతిభాంతినూనం
ధ్యాయంతి నత్వాం కమలాంచలజ్జాం కాంతింస్థితిం కీర్తి మధాపి పుష్టిమ్ ॥
హరిహరాదిభిరప్యథ సేవితాత్వమిహా దేవవరై రసురైస్తథా ।
భవిభజంతిన యేఽ ల్పధియోనరాజననితే విధినాఖిలు వంచితా: ।

జలధిజాపద పంకజరంజనం జతురసేన కరోతిహరిః స్వయమ్ ।
త్రినయనోపిధరాధరజాంఘ్రి పంకజపరాగ నిషేవణతత్పరః ॥

స్తోత్రభావము:- విశ్వేశ్వరీ! సచ్చిదానంద స్వరూపిణీ! నీకు నమస్కారము. ఆది దేవీ! నీయనంత నామరూపము లెవ్వడు నెరుగజాలడు. సృష్టి సంహారాది కార్యము లన్నిటిలో నీవు సర్వక్రియాశక్తి స్వరూపిణివి. ఓ సర్వేశ్వరీ! స్మృతి, ధృతి, బుద్ధి, జర, తుష్టి మొదలగునవన్నియు నీ స్వరూపములే. నీవు యేయే దివ్యరూపములతో దేవతలకార్యముల నిర్వహింతువో ఆయద్భుతరూపములకు నమస్కరించు చున్నాము. నీవు శాంతిక్షమ యోగనిద్ర మొదలగు స్వరూపములతో జీవుల యందు నివసించెదవు. నీవు దయామతల్లివని వేదములు ఘోషించుచున్నవి. నీవు దేవత లందరకు సహాయము చేయుదానవు. తల్లి తనయుని గారాబముతో లాలించి పాలించిపెంచుటలో ఆశ్చర్యమేమున్నది?

ఇప్పుడు ఆపదలోనున్న మా పనులనన్నిటిని చక్కబరచుము. నీయనంత గుణరూపములద్భుతములు. మేము వానినెరుగజాలము. మాభయమును తొలగిం పుము. మమ్ము రక్షించుటకు నీవే సమర్థురాలవు. శత్రుసంహారమునకై నీకు ఆయుధము లక్కరలేదు. నీవులో కోపకారమునకే యుద్ధము చేయుదువు. ఈ సర్వప్రపంచమునకు నీవే మూలకారణము. ప్రమాణముకూడా నీవే. సృష్టికి ముందు త్రిమూర్తులను కన్నతల్లివి నీవేకదా? కనుక నీ జగత్తు లన్నిటికిని జననివినీవే. నీవు పూర్వము త్రిమూర్తులచే పూజింపబడివారికి దివ్యశక్తుల నిచ్చినదానవు. నీవులజ్జా కీర్తి పుష్టికాంత్యాది రూపమైనదానవు. అని యీవిధముగ దేవతలెల్లరును పరదేవతను స్తుతించిరి.

అంతట ఆ దేవి శరీరమునుండి ఒక దివ్యతేజోరూపము వెలువడెను. ఆ మహోజ్జ్వలరూపము పార్వతి శరీరము నుండి వెలువడినది. అందుచేతనే ఆమెకు కాళిక యని పేరు వచ్చినది. తరువాత పార్వతి నలుపురంగును ధరించి కౌశికి యనుపేరు పొందెను. కాళికాదేవి నల్లని వర్ణముతో ఘోరరూపముతో భయం కరముగానుండెను. రాక్షసులకు భయమును కలిగించుచు భక్తులకోరికలను నెరవేర్చుచు కాళరాత్రి యనుపేరుతో ప్రసిద్ధి చెందినది. ఆ కాళికాంబా రూపము లావణ్య పరిపూర్ణమై సుమనో హరమై సమస్త భూషణములతో వెలుగొందెను. అప్పుడామె దేవతలతో నిట్లనెను:-

దేవతలారా! మీరు భయపడ వలదు. విచారింప పనిలేదు. నేను మీ శత్రువుల నిప్పుడే సంహరింతును. మీ కార్యమును తప్పక నెరవేర్తును. మీ క్షేమముకొఅకు

యుద్ధము చేసి శుంభ నిశుంభులను సంహరించెదను. అని దేవతలనూరడించి యాజగదేకమాత మధురకంఠ స్వరముతో అమర గాన మొనర్చెను. ఆ గానమాధుర్యమునకు పశుపక్ష్యాదులు సైతము పారవశ్యము నొందినవి. దేవతలు పరమానందము నొందిరి. అప్పుడు శుంభునిసేవకులు చండముండులను రాక్షసులు స్వేచ్ఛగా తిరుగుచుండిరి. వారు గానముచేయు అంబికా రూపమును ఆ దేవి సమీపమందున్న కాళికను సందర్శించిరి. వారు ఆమె రూపలావణ్యముల కాశ్చర్యపడి శుంభునివద్దకు వెళ్ళి రాక్షసరాజువద్ద తల యొగ్గి దోసిలించి యిట్లు పలికిరి:-

రాజా! ఒక కామిని దివ్యసౌందర్యవతిగా కనిపించు చున్నది. ఆమె పవిత్ర హిమాలయము నుండి దిగి వచ్చినది. సర్వశుభ లక్షణము లతో వెలగొందుచు సింహముపై కూర్చొనియున్నది. ఆమె మధురగానమునకు పరవశములై మృగములుకూడ ఆమె సమీపమున నిలిచియున్నవి. ఆమె యెవరి కూతురో ఎందుకు వచ్చినదో తెలియదు. నీవామెను భార్యగా చేసికొనుము. ఆమె నీకన్నివిధముల తగిన యువతి. అట్టి స్త్రీలోకమందెచ్చటనులేదు. నీవు దేవతల నందరను జయించి వారి అమూల్యవస్తువులను తెచ్చుకొంటివి. ఈ కాంతా రత్నము నీ గృహమందున్ననాడే తక్కిన వస్తువులకు విలువ యుండును. ఈమెను నీ దానిగ చేసికొనుట యెంతేని యావశ్యకము. అను యీ మాటలు విని శుంభుడు సమీపమందున్న సుగ్రీవుడనువానితో ఇట్లు పలికెను.

దేవి వద్దకు సుగ్రీవుని రాయబారము

సుగ్రీవా! నీవు నాకు దూతగావెళ్ళి ఆమె నన్ను ప్రేమించునట్లు వ్యవ హారము నడుపుము. స్త్రీల విషయమున సామదానోపాయములు రెండును ప్రయోగింప దగినవి. భేదోపాయమువలన రసాభాసము దండోపాయము వలన రసభంగమును కలుగును కనుక నవిప్రయోగింపదగినవికావని పండితులనుచున్నారు. అని పలికెను! శుంభుని యీ మాటలను విని సుగ్రీవుడు అంబిక యున్నచోటికి వెళ్ళెను. సింహవాహనముపై కూర్చొనియున్న జగదంబికకు దోసిలొగ్గి యిట్లు పలికెను.

సుందరీ! శుంభుడను రాక్షసరాజు అందగాడు. నీయందచందాలు విని ఆ మహాత్ముడిపుడు నన్ను నీవద్దకు పంపినాడు. అతడు నమస్కరించి నీతో చెప్పుమనిన మాటల నాలకింపుము నేను దేవతలనందరను జయించితిని. ముల్లో కములకును ప్రస్తుతము రాజును నేనే. నేనిక్కడనే యుండి దేవతలకు సమర్పించు

హవిర్భాగములను స్వీకరించుచున్నాను. స్వర్గమందలి రత్నములన్నియు నావద్దనే యున్నవి. దేవతలు రాక్షసులు అందరు నాయాజ్ఞకు బద్ధులే. నీయంద చందాలను విని నీకుదాసుడనైతిని. నీకు వశుడనై నీవాజ్ఞాపించినట్లు నడిచెదను.

ఓ సుందరీ! మన్మథ బాణములకోర్వలేని నన్ను రక్షింపుము. నన్ను సేవించి నీవు ముల్లోకములకు యజమానురాలవగుము. సమస్తభోగములను అనుభవింపుము. నేను దేవతలవలన కాని, రాక్షసులవలనకాని, మనుష్యులవలన కాని చచ్చువాడనుకాను. నీకిష్ట మైనచోట విహరించుము. ఇవి మా రాజు మాటలు ఓ తరుణీ! యీ మాటలను విచారించి నీవు ప్రేమతో మధురమైన మాటలను పలుకుము. ఆ మాటను వెంటనే మారాజునకు తెలియజేయుదును.

అని పలుకగా దూతమాటలకు చిరునవ్వుతో దేవి దేవతల పని సాధించుటకై మధురముగా ఇట్లు పలికెను. శుంభుని రాక్షసులకు రాజుగాను, దేవతలను బలవంతుడగు నిశుంభుని జయించిన వానిగాను విని యున్నాను అట్టి మహా రాక్షసుని చూడదలచియే వచ్చినాను. రత్నము తనశోభను పెంచుకొనుటకై బంగారమును చేరునుగదా అట్లే నాకు తగినవానిగా శుంభుని భావించి యిక్కడకు వచ్చితిని. లోకములో దేవగంధర్వ రాక్షసాదులనందరినీ చూచి, వారందరినీ జయించిన వాడగుటచే శుంభుడు తగినవాడని యిక్కడకు వచ్చితిని. అయితే నా వివాహమునకు ఒక నియమమున్నది. చిన్నతనములో చెలికత్తెలతో ఆడుకొనుచు నా శరీర బలమును బట్టి గర్వముతో నన్ను యుద్ధ ములో జయించిన వానినే నేను వివాహమాడెదనని ప్రతిజ్ఞచేసితిని. కనుక శుంభుని బలాబలముల చూచి వరించెదను. కనుక శుంభుడు కాని అతని సోదరుడు కాని నన్ను జయించి వివాహము చేసికొనవచ్చునని ఆ సుంద రునకు తెలియజేయుము. దేవి పలికిన మాటలు విని దూత ఆశ్చర్యపడి స్త్రీ స్వభావమైన సాహసమువలన పలుకుచున్నావు కాని ఇంద్రాది దేవతల నవలీలగా జయించినవానితో యుద్ధము చేయగోరుచున్నావా? మూడు లోకములలోను శుంభుని జయించు వీరుడులేడు.

ఓ సుందరీ! ఆలోచించ కుండ మాట్లాడకూడదు. తనబలమును ప్రతి యోధుని బలమును తెలిసికొని సమయోచితముగా మాట్లాడవలెను. మూడు లోకములకు అధిపతి యైన శుంభుడు నీ రూపమును విని మోహముతో నున్నాడు. నిన్ను ప్రార్థిస్తున్నాడు. కనుక నీవు మూర్ఖ స్వభావమును విడిచి నామాటమన్నించి శుంభునిగాని నిశుంభునిగాని సేవించుము. ఒకవేళ నీవు అతని వద్దకు రానియెడల అతడు కోపించి సేవకులను పంపి బలాత్కారముగా నిన్ను తనవద్దకు రప్పించు

కొనునను. ఆసేవకులు నిన్ను జుట్టు పట్టుకొని లాగుకొని పోయి రాజు ముందుంచె దరు. నీవభిమానవతివి సాహసము చేయవలదు నీవు సగౌరవముగా వానివద్దకు వెళ్ళుము. వాడి బాణాలతో యుద్ధమెక్కడ? రతిక్రీడాసుఖమెక్కడ? ఈ రెండింటిలోని మంచిచెడ్డల నెరిగి నా మాటను కొంచెము వినుము.

శుంభ నిశుంభులలో నెవనిని సేవించినను నీకు సుఖము కల్గును. అని పలుకగా శ్రీదేవి యిట్లనెను. అమాత్యా! నీవు మంచివక్తవు. మిక్కిలి నేర్పరివి. చిన్నతనమున చేసిన ప్రతిజ్ఞను విడువజాలను. శుంభ నిశుంభులకిట్లు చెప్పుము. యుద్ధములో నన్ను గెల్వనిచో నెవ్వడైననుభర్తకాజాలడని చెప్పుము. నేను యుద్ధము చేయుటకే యిక్కడకు వచ్చితిని. నన్ను గెలిచి వివాహము చేసికొనుమని తెలుపుము" రాజా! నీవు సమర్థుడవు గనుక వీరధర్మము ననుసరించి నాతో యుద్ధము చేయుము. ఒకవేళ నాశూలము చూచి భయపడి యుద్ధము చేయనిచో పాతాళమునకు శీఘ్రముగా పొమ్ము. నీవు బ్రతుకుపై ఆశగలవాడ వైనచో స్వర్గ మును భూలోకమును విడిచి వెళ్ళి పాతాళ లోకమున నివసించుము" అని ఓయీ నీవీ మాటలను శీఘ్రముగా వెళ్ళి మీ రాజునకు చెప్పుమనెను.

అంతట దూత శుంభునివద్దకు వెళ్ళి నమస్కరించి రాజా! ఆమె గర్వముతో యుద్ధము చేయగోరుచున్నది. చిన్నతనములో చెలికత్తెలవద్ద యుద్ధములో నన్ను జయించినవానినే నేను వివాహము చేసికొందునని ఆమె ప్రతిజ్ఞ చేసినందున యుద్ధములో నన్ను ఓడించినవానినే పెండ్లి చేసికొందును. కనుక మీ రాజునాతో యుద్ధము చేసి నన్ను జయింపవలెను. అని చెప్పగా శుంభుడు ప్రక్కనున్న మహాబలశాలియైన సోదరునితో ఒక స్త్రీతో యుద్ధము చేయవలసి యున్నదనగా నిశుంభుడు ఓ మహావీరా! నీవు గాని నేనుగాని ఆమెతో యుద్ధమునకు వెళ్ళవద్దు. త్వరగా ధూమ్రలోచనుడను వానిని పంపుము. అతడు యుద్ధములో ఆమెను జయించి యిక్కడకు తీసుకొనివచ్చును. అని చెప్పగా తన ప్రక్కనున్న ధూమ్ర లోచనుని సైన్యముతో వెళ్ళి యుద్ధమందామెను జయించి యిక్కడకు తీసికొని రమ్మనియు ఆమెకు సహాయముగా ఎవరు వచ్చినా వారిని సంహరించి ఆమె ప్రక్కనున్న 'కాళి'ని కూడ చంపి శీఘ్రముగా యిక్కడకు రమ్ము. ఆమెను మాత్రము చంపవద్దు. ఆమెలోకోత్తర సౌందర్యవతిగదా! ఎట్లైనను ఆమెను రక్షించి యిక్కడకు తీసికొని రమ్ము అని పంపెను. అంతట ధూమ్రలోచనుడు రాజునకు నమస్కరించి యుద్ధమునకేగెను.

ధూమ్రలోచనుని రాయ బారము

ధూమ్రలోచనుడు సైన్యసహితముగా యుద్ధమునకు వెళ్ళెను. అచట అందమైన ఉద్యానవనములోనున్న శ్రీదేవిని చూచి వినయముతో ఇట్లు పలికెను:- దేవి! శుంభుడు నీ విరహముచే మిక్కిలి పరితపించుచున్నాడు నీవద్దకు వచ్చిన దూత చెప్పిన విపరీతవచనములకు మిక్కిలి చింతతో కూడినవాడై యున్నాడు. ఒక స్త్రీ మనతో యుద్ధమునకు సిద్ధమై మనలను పురికొలుపు చున్నది. నీవు సేనతో వెళ్ళెదవా? లేక నేనే ముందువెళ్ళనా? అని ప్రశ్నింపగా ఈ పరిస్థితిలో నీవుగాని నేనుగాని యుద్ధానికి వెళ్ళుట తగదు. ధూమ్రలోచ నుని పంపినచో అతడామెను ఓడించి తీసుకొని రాగలడు తరువాత ఆమెను పెండ్లి యాడవచ్చునని నిశుంభుడనగా నన్ను పంపినాడు శుంభుడు. కనుక ఓ లతాంగీ! దేవతలను జయించిన శుంభునికి నీవు పట్టమహిషివై అనేక భోగముల ననుభవింపుము. అతడు నిన్ను మదనకదనమున జయింపగలడు. నిన్ను చూచినంతనే అతడు నీకు వశుడగును. అంతేకాక అందరకును నీవు గౌరవింప దగిన దానవగుదువు. నీ పాద తాడనము చేతను నీ ముఖమదిరాపానముచేతను మా రాజును పరమానందభరితుని చేయుము అని పలికెను.

కాళికాదేవి ధూమ్రలోచనుని సంహరించుట

ధూమ్రలోచనుని మాటలు విని కాళికాదేవి పకపక నవ్వి గంభీరముగా నిట్లు పలికెను:- ఓరి మూర్ఖుడా! నీవు వదరుబోతువు ఆ దుర్మదాంధుడు పంపగా వచ్చితివి కనుక వట్టి మాటలు కట్టిపెట్టి నాతో యుద్ధము చేయుము. ఈ శ్రీదేవి వాడియైన బాణములతో నిన్ను శుంభ నిశుంభులను తక్కిన వీరులను హతమార్చి కాని యింటికి వెళ్ళదు. ఈ విశ్వమోహిని యెక్కడ? ఆ మందమతి శుంభు డెక్కడ? వీరికి వివాహమా! ఆడు ఏనుగు గాడిదను కామించునటరా? కామ ధేనువు కుందేలును వలచునా? ఇకనీవు శుంభనిశుంభుల వద్దకు వెళ్ళవచ్చును. నాతో యుద్ధము చేయుటయో లేక పాతాళమునకేగి నివసించుటయో చేయుడని వారితో నా మాటగా చెప్పుము. అనగా కాళిదేవి మాటలు విని ధూమ్రాక్షుడు కన్నులను ఎఱ్ఱచేసి దేవితో యిట్లనెను. ఓకుత్సిత శరీరా! నేనిప్పుడే నిన్ను నీ మదగర్విత సింహమును చంపి దేవిని మారాజువద్దకు కొనిపోదును. ఓకలహప్రియా! రసభంగమగునని యింతవరకు నిన్ను చంపకుంటిని లేనిచో ఎన్నడో నిన్ను చంపి యుండెడివాడను అని ఆవేశముగ బలికెను.

అనగా కాళిక యిట్లనెను:- ఓ మూఢమతీ! ఆత్మస్తుతినేల చేసుకొందువు? నీ శక్తికొలది బాణములను ప్రయోగింపుము. మరియు యమాలయమునకు కూడనడువుము. అని పలుకగా ధూమ్రాక్షుడు ధనుస్సు నెక్కుపెట్టి కాళిపై బాణవర్షమును కురిపించెను. అప్పుడింద్రాదులు విమానముల నుండి చూచుచు శ్రీదేవిని స్తుతించి జయజయధ్వను లొనర్చిరి. అంతట వారిరువురకును బాణ ఖడ్గశక్తి ముసలాయుధములతో భయంకరమైన యుద్ధము జరిగెను. శ్రీకాళి రాక్షసుని రథమును మోయు గాడిదలను రథమునునుగ్గు చేసి వికటాట్టహాసము చేసెను. అతడు మరియొక రథమెక్కి కోపముతో మండి పడుచు కాళీదేవిపై బాణవర్షము కురిసెను. కాళివాని బాణములను నడుమనే ఖండించి తీవ్రవేగ ముతో బాణములను ప్రయోగించెను. ఆ కాళిబాణ ప్రయోగమున రాక్షసుని యంగరక్షకులు మరణించిరి. రథము కూడ నుగ్గయ్యెను. గాడిదలు నేలగూలినవి. వెంటనే నాగబాణముతో వాని ధనుస్సును రెండు ముక్కలు చేసెను. మరియు దేవతలా నందించునట్లు విజయశంఖమును పూరించెను. అంతట ధూమ్రలోచ నుడు రథము లేనివాడై కోపించి ఇనుప పరిఘయను ఆయుధమును చేత పట్టి నేడే నిన్ను చంపెదనని కాళిని బెదిరించుచు ఆ పరిఘను దేవిపై విసిరెను. ఆమెయు హుంకారముతో వానిని భస్మమొనర్చెను. భస్మమైన రాక్షసుని చూచి సైనికులు భయపడి పారిపోయిరి. ధూమ్రలోచనుని మరణమునకు సంతోషించుచు దేవతలు పుష్పవృష్టి కురిపించిరి.

అంబిక భయంకరమైన శంఖనాదము చేసెను. ఆ శంఖధ్వని విని యుద్ధభూమి నుండి పారిపోయి వచ్చిన సైనికులను చూచి శుంభని శుంభులు ధూమ్రాక్షుడేమై నాడు? ఈ భయంకర శంఖనాదమెవరిది? అని అడుగగా ధూమ్రుడే మరణించి నాడని సైనికులు చెప్పిరి. ఈ శంఖనాదమంబికదనియు తెలిపెను. మరియు సైనికులు మహారాజా! మనకు జయము అసంభవమని నిశ్చయముగా తెలియు చున్నది. మంత్రులతో ఆలోచింపుము. దేవతలామెకు పార్శ్వరక్షకు లుగా నున్నారు. శివకేశవులు సమయమెరిగి ఆమెకు సహాయమును చేయుదురు. ఎవరి సహాయ మక్కరలేకయే అందరను చంపగలశక్తి ఆమెకు కలదు. కనుక ఆలోచించి చేయ దగిన పనిని నిర్ణయించుము అనిపలికిరి. ఆ మాటలు విని శుంభుడు తన తమ్ముని పిలిచి ఏకాంతమున ధూమ్రలోచనుడు మరణించాడు. సేనలు భయముతో పారిపోయి వచ్చినవి. ఆమె మదగర్వముతో శంఖము పూరించినది. ఆమెతో పోరియెవడును నెగ్గలేడు. దైవగతి యిట్లున్నది. ఆయంబిక భోగింపరానిదిగా

తెలియు చున్నది. మనము పారిపోవుట తగినదా? అని యడుగగా నిశుంభుడు అన్నా మనమిప్పుడు పారిపోవుటగాని దాగికొనుట గాని తగదు. ఆమెతో మనము యుద్ధము చేయుటే మంచిది. నేను వీరసైనికులతో వెళ్ళి ఆ స్త్రీని చంపి తిరిగి వచ్చెదను. ఒకవేళ నేను మరణించినచో నీవు బాగా ఆలోచించి పని చేయుము అని పలుకగా శుంభుడు తన తమ్మునితో మరల యిట్లనెను:- చండముండు లిరువురును సైన్యముతో వెళ్ళి యుద్ధము చేసి జయించిరాగలరు. కుందేలును పట్టుటకు ఏనుగును పంపుట యుక్తము కాదని చండముండులను చూచియిట్లు పలికెను.

కాళికదేవి చండముండుల హతమార్చుట

మరియు వికటాట్టహాసము చేయుచున్నది. శ్రీభద్రకాళి మహాభీకరముగా ఒంటెలను గుఱ్ఱములను సారథులను కూడ పండ్లతో కరకర నమలి వేయు చుండెను. చండముండ మహాసురులు తమ సైన్యము నశింపగా యెడతెగని బాణవర్షముతో దేవిని కప్పివైచిరి. మరియు చండుడు చక్ర మును దేవిపై విసిరెను. దేవి యాచక్రమును బాణముతో ముక్కలు చేసెను. అప్పుడు చండిక వాడియైన బాణములను చండునిపై ప్రయోగింపగా ఆతడు నేలపైపడి మూర్ఛిల్లెను. అంత ముండుడు దుఃఖించి కోపముతో కాళికపై బాణములు ప్రయోగించెను. ముండుడు ప్రయోగించిన బాణములను దేవి ముక్కలు చేసినది.

తరువాత అర్ధ చంద్రాకారపు బాణముతో వాడు నేలకొరగెను. అంతట రాక్షస సైన్యముతో హాహా కారములు మిన్ను ముట్టినవి. దేవతలు పరమానంద భరితులైరి. ఇట్లుండగా చండుడు మూర్ఛనుండి తెప్పరిల్లి గదను కాళి కుడి భుజముపై విసిరెను. ఆగదా పాతమును వ్యర్థముచేసి మంత్రించిన బాణపాశము తో ఆ రాక్షసుని కట్టివైచెను. తరువాత ముండుడు గూడ తెప్పరిల్లి తనయన్న బంధింపబడి నందుకు కోపించి శక్తియను ఆయుధమును ప్రయోగింప బయలుదేరెను. అప్పుడు కాళిక వానిని కూడా బంధించెను. భద్రకాళి చండముండులను కుందేలు పిల్లలనువలె పట్టుకొని పకపకనవ్వుచు జగదంబ వద్దకు వెళ్ళెను. మరియు రణయాగమునకు రాక్షస పశువు లను తెచ్చితిననెను. అప్పుడు జగన్మాత మధురవాక్కులతో వీరిని వదలక వధింపుడు. దేవతల కార్యమును త్వరగా పూర్తి చేయుమని కాళికతో పలికెను. మరియు వీరిని చంపుట హింసకాదు అని పలికి వెంటనే ఖడ్గముతో వారి తలలను ఖండించెను.

చండముండులను వధించి దేవి భద్రకాళికి చాముండయను బిరుదు నిచ్చెను. చండముండులు చావగనే సైనికులు శుంభుని వద్దకు పరుగెత్తి పోయిరి. వారందరును రాజా! మహాకాళి నేడు మమ్ముమిలి వేయుచున్నది. కాళికాదేవి నిస్సంశయముగా మనలనందరను మట్టుపెట్టగలదు. కనుక మహారాజా! నీవు పాతాళమునకు పోయి నీ వంశమును నిలువబెట్టు కొనుము. పూర్వము నీవు పురుషుని వలన చావు లేకుండునట్లు బ్రహ్మ నుండి వరమును పొందితివి. కనుక మృత్యు వీమె రూపములో నిన్ను కబళించుటకు వచ్చినది. కనుక యుద్ధము నికనైన మానుము. ఆమెను శరణువేడి మిగిలిన వారినైన కాపాడుకొనుమని హితము చెప్పిరి. శుంభా సురుడు వారి మాటల లెక్క చేయక ఓ మూఢులారా! మీరు బ్రతుకుపై ఆశతో పారిపోయి వచ్చితిరి. మీరు పాతాళమునకు పోందు కానున్నదికాక మానదు. నేను నా స్వధర్మము నెరవేర్చు కొని జయమో నాశమో పొందగలను. తప్పక యుద్ధము చేసెదను. మరణమో గెలుపో యేది యైనను గ్రహించెదను. ప్రయత్నము లేక యే పనియు నెరవేరదు అని పలికి మహావీరా! రక్తబీజా! నీవు బలముకొలది యుద్ధము చేయుము. అని పలికెను!

రక్త బీజుడు దేవితో పోరుట

అనగా రక్త బీజుడిట్లనెను:- మహారాజా! ఈ కొద్ది దానికింత చింతిప నేల? నేనామెను చంపగలను లేదా నీకు వశురాలనుగా చేయగలను. నేడు నాయుద్ధ కౌశలము చూతురుగాక. ఆమె నాముందెంత? అని పలికి తన సేనతో రక్తబీజుడు యుద్ధము చేయబోయెను. పరదేవత వచ్చుచున్న రాక్షసునిచూచి దేవతలకా నందము రాక్షసులకు భయము కలుగునట్లు శంఖము పూరించెను. అంతట రక్తబీజుడు దేవిని సమీపించి బాలా! ధూమ్రలోచనుని వలెనన్నును నీ శంఖ ధ్వనిచే భయపెట్టుచున్నావా? నేను రక్తబీజుడను నిర్భయముగ నీతో యుద్ధము చేయవచ్చితిని. నేడు నా బలమును చూడుము. నీవు ఇంతకు ముందు చూచిన వీరులవంటి వాడనుకాను. నీయిష్టము వచ్చినట్లు యుద్ధము చేయుము. కాని, ఓ సుందరీ! దేవతలందరను జయించిన శుంభునిగాని నిశుంభునిగాని వరించి సర్వసౌఖ్యముల ననుభవింపుము. అని పలుకగా జగదంబయు కాళియు తమలో తాము నవ్వుకొనిరి.

శ్రీదేవి రక్తబీజునితో మూఢాత్మా! నన్ను వివాహము చేసికొనవలె నన్నచో నన్ను మొదట జయించి తీరవలయునని శుంభ నిశుంభలకిది వరకే దూత ద్వారా

తెలిపియున్నాను. కనుక నన్ను యుద్ధములో జయించి పిమ్మట వివాహము చేసికొనుమని చెప్పుము. నీకు శక్తియున్నచో నాతో పోరుము. కానిచో నీవతనితో గూడ పాతాళమునకు పొమ్ము అని పలికెను.

అంత నా రాక్షసుడలిగి ఆమెపై బాణములు ప్రయోగించెను. అవి పాముల వలె వచ్చుచుండ దేవి వాటిని దూరము నుండియే ఖండించివైచెను. మరియు దేవి తీవ్రమగు మరియొక బాణముచే రక్తబీజుని బాధించెను. అతడు రథముపై మూర్ఛిల్లెను. సేనలో కలకలము బయలుదేరెను. సైనికులు కేకలు వేయుచు బిగ్గరగా నేడ్వసాగిరి. ఆ యేడ్పు ధ్వని శుంభుని చెవులబడెను. రాక్షససేనలను కాంభోజకాలకేయాది శూరులనందరను యుద్ధమున బయలుదేరుడని శుంభు డాజ్ఞాపించెను. వారందఱు గర్వముతో శ్రీదేవి వద్దకు వెళ్ళిరి. జగదంబ శంఖమును పూరించి నారి సారించెను. కాళిక కూడ తన పెద్దనోరుతెరచి భీకరముగా అరచెను. ఆఘోర ధ్వనులను విని సింహము కూడ భీకరముగా గర్జించెను. ఆ ధ్వనులకు చాలమంది రాక్షసులు మూర్ఛిల్లిరి. వారిలో మహాబలవంతులైన రాక్షసులు ఒక్కుమ్మడిగ దేవి పై బాణవర్షము కురిపించిరి. అప్పుడు భీకరమైన సమరము ప్రవర్తిల్లెను. దేవతలందరు తమతమ శక్తులతో యుద్ధభూమికి వచ్చిరి. వారిలో బ్రహ్మ శక్తి కమండలువుతో హంసనెక్కి బ్రహ్మాణియను పేర యుద్ధమునకు వచ్చెను. వైష్ణవశక్తి పీతాంబర శంఖాచక్రగదా పద్మముల ధరించి కాంతులచిమ్ముచు గరుడ వాహనమెక్కి వచ్చెను. శాంకరీదేవి వృషభవాహన మెక్కి త్రిశూలమును ధరించి యుండెను.

ఆమె నొసట చంద్రరేఖ వెలుగుచుండెను. శ్రీ షష్ఠీదేవి నెమలివాహన మెక్కి శక్తియనే ఆయుధము ధరించి కౌమారి రూపమున వచ్చెను. ఇంద్రాణీదేవి ఐరావతమునెక్కి వజ్రాయుధమును పట్టుకొని యుద్ధము చేయవచ్చెను. వారాహీదేవి ప్రేతాసనయై వరాహరూపముతో వచ్చెను. నారసింహీదేవి నరసింహరూపముతో వచ్చినది. యామ్యాదేవి మహిష వాహనయై భయంకరముగ నవ్వుచు యమ రూపముతో యుద్ధరంగము చేరెను. అట్లే వారుణీఖేచర శక్తులు కూడా యుద్ధము చేయసిద్ధమై వచ్చినవి. వచ్చిన యాశక్తులను చూచి దేవి సంతోషము నొందినది. ఆశక్తులన్నిటితో కూడి శంకరుడు యుద్ధరంగమునకు వచ్చిచండికతో ఇట్లనెను-

దేవతల పనిపూర్తియగుటకు త్వరగా రాక్షసులను చంపుడు. శుంభని శుంభులను ఇతర రాక్షసులను సంహరించిలోకమునకు నిర్భయము కలిగించి ఓ శక్తు

లారా! మీమీ నివాసములకు తిరిగిరండు. దేవతలు యజ్ఞభాగములను స్వీకరింతురుగాక బ్రాహ్మణులు యజ్ఞములను చేయుచుందురుగాక సమస్త స్థావర జంగమ ప్రాణులను సంతోషించుగాక ఉత్పాతములు ఈతి బాధలు శాంతించుగాక. మేఘములు తగిన సమయమున వర్షించుగాక పంట పొలములు పచ్చని పైరుతో కనువిందు చేయుగాక. అని పలికెను. అంతట చండికాదేవి శరీరము నుండి ఒక మహాద్భుత శక్తి వెలువడెను. ఆమె భయంకరముగ ధ్వని చేయుచు ఘోరరూపముతో నుండెను. ఆమె మందహాసము చేయుచు నిట్లు శివునితో పలికెను:-

ఓ దేవదేవా! నీవు రాక్షసరాజువద్దకు దూతగా వెళ్ళుము. మదాంధులగు శుంభ నిశుంభులతో నామాట గానిట్లు చెప్పుము. మీరు స్వర్గము విడిచి పాతాళమునకు వెళ్లుడు. ఇంద్రు డింద్రాసనము నధిష్ఠించి దేవతలతో స్వర్గములో మరల సుఖముగా నుండవలెను. యజ్ఞభాగములు మరల వారే యనుభవింతురు గాక. మీరందరు జీవింపదలచి నచో రాక్షసులుండు పాతాళమునకు పొండు. లేక మీ బలముతో కలిసి పోరి చావదలచినచో రండు. నా పరివారమైన నక్కలు మీ మాంసముతో తృప్తిచెందు గాక. అని పలుకగా శూలపాణి త్వరగా కొలువున్న శుంభుని చేరి రాజా! నేను జగదంబ దూతను నీ క్షేమముకోరి యిక్కడకు వచ్చితిని. నీవు స్వర్గమును విడిచి త్వరగా వెళ్ళవలెను. ప్రహ్లాదుడు నివసించు పాతాళమునకు మీరందరు వెళ్ళండి. లేక చావదలచినచో యుద్ధమునకు సిద్ధపడండి మీ యందరినీ యుద్ధములో చంపివేయగలము అని పలికెను.

శ్రీదేవికి దేవతలు తోడ్పడుట

ఈ విధముగా శివుని దూతగా పంపుటచేత దేవికి "శివదూతి" యను పేరువచ్చినది. శివుని మాటలువిన్న రాక్షసులు కవచములు ధరించి యుద్ధమునకు సిద్ధపడిరి. యుద్ధరంగమును చేరినారు. ఆ కర్ణాంతము లాగిన బాణములను చండిక పై ప్రయోగించిరి. అప్పుడు భద్రకాళీశక్తి కొందరిని శూలముతో పొడిచి, మరి కొందరిని గదాశక్తులతో మోది, కొందిరిని నోటితో కరకరనములుచుండెను. బ్రహ్మాణీదేవి యుద్ధములో రాక్షసవీరులపై తన కమండలు జలము మంత్రించి చల్లుచు వారి ప్రాణములను హరించెను. మహేశ్వరీదేవి వృషభము నెక్కి రాక్షసులను తన శూలముతో పొడిచి చంపుచుండెను. శ్రీవైష్ణవీదేవి తనగదా చక్రములతో కొట్టి రాక్షసుల కంఠములు ఛేదించుచుండెను. ఐరావతము తన తొండముతో

రాక్షసవీరులను బాధించుచుండెను. ఇంద్రాణీదేవి వజ్రాయుధముతో రాక్షసులను నేలకూల్చుచుండెను. వారాహీదేవి తనముట్టెతోను కోరలతోను పెక్కుమంది రాక్షసులను పడగొట్టి చంపెను. శ్రీనారసింహీదేవి తనవాడి గోళ్ళతో రాక్షసులను చీల్చి తినుచుండెను. శివదూతి అట్టహాసముతో నేలకూల నేసిన రాక్షసుల నెల్ల చాముండాకాళికలు తినుచుండిరి. కౌమారీదేవి చెవుల వరకు నారినిలాగి విసిరిన బాణములు రాక్షసులను చీకాకు పరచుచుండెను. శ్రీవారుణీ దేవి రాక్షసులను బంధించి వారిని మరణింప చేయుచుండెను. ఇట్లు మాతృకాగణము వీరవిహారము చేయగా రాక్షస సైనికులు పరాజయము నొందిపారి పోయిరి. రాక్షససైన్యములో ఏడ్పులు చెలరేగెను. దేవతలు మాతృకాగణములపై పూలవాన గురిపించిరి దానవులు పలాయనము చిత్తగించిరి. అంతట రక్తబీజుడు దేవతల ఉత్సాహమును చూచి సహింపలేక యుద్ధమునకు దిగెను. అతడా యుధమును ధరించి రథమెక్కి నారి మ్రోగించుచు శ్రీదేవివద్దకు వచ్చెను.

రక్తబీజుని మరణము

వ్యాసుడు జనమేజయునకు రక్తబీజుని వృత్తాంతమిట్లు చెప్పెను:- రాజా! పూర్వము పరమశివుడు రక్తబీజునకద్భుతమైన వరమునొసగెను. అదియేమనగా రక్తబీజుని శరీరము నుండి యెన్ని రక్తబిందువులు నేలబడునో అంతమంది అతని వంటి పరాక్రమము గల వీరులు వెంటనే జన్మించెదరు. అతడా వర గర్వముతో కాళికాదేవిని సంహరించుటకు యుద్ధభూమికి వచ్చెను. వాడు గరుడవాహన మందు వెలుగొందు శ్రీవైష్ణవీదేవిని చూచి ఆమెపై 'శక్తి' అను ఆయుధమును ప్రయోగించెను. ఆమె తన గదతోవాని శక్తిని అడ్డుకొని రక్తబీజుని పై చక్రమును విసిరెను. అతని శరీరము నుండి రక్తము ప్రవహించి కాలువలయ్యెను. వేలకొలది వానివంటి వారు వెంటనే ప్రత్యక్షమైరి. బ్రహ్మాణి బ్రహ్మ దండముతో వారిని బాధించుచుండెను. శ్రీనారసింహి తన గోళ్ళతో వానిని చీల్చుచుండి వారాహి తనముట్టెతో వానిని పొడుచుచుండెను. రక్తబీజుని శస్త్రములను బాణములతో ఖండించి దేవి అనేక బాణములలతో నాతని బాధించెను. అతని శరీరము నుండి రక్తము స్రవింపగా మరల అతని వంటి శూరులు వేలకొలది పుట్టుకొని వచ్చిరి.

అప్పుడు అంబిక కాళితో నీవు నోటిని విశాలము చేసి రక్తబీజుని శరీరము నుండి పడిన రక్తమును వెంటవెంటనే త్రాగి వేయుము. రాక్షసులను యిచ్చవచ్చి నట్లు తినివేయుము. గదాఖడ్గ ముసలములతో నేను రాక్షసులను చంపెదను.

భూమిపై రక్తబిందువు పడకుండా రక్తమునంతను త్రాగుము. అప్పుడు మరల రాక్షసులు పుట్టరు. అని చెప్పగా కాళి అట్లే చేసెను.

దేవికృత్రిమ రక్తబీజాసురులను చంపి చివరకు స్వాభావిక రక్తబీజుని కూడ దేవి ఖడ్గముతో నరికి సంహరించెను. రక్తబీజుడు చనిపోగా ఇతర రాక్షసులు భయముతో హాహాకారములు చేయుచు రాజునకు రక్తబీజుని మరణమును వివరముగా చెప్పిరి. దేవి ఒక్కతెయే అందరను సంహరించుచున్నది. ఎవరి సహాయమును కోరుటలేదు. ఆమె వాహనమైన సింహము కూడా రాక్షసులను నమిలి వేయుచున్నది. చాముండ రాక్షసుల మాంసమును తినుచున్నది. మహా రాజా! మనమందరము పాతాళమునకు వెళ్ళుట మంచిది. లేదా ఆమెకు సేవకుల మైనా కావలయును. అంబికతో యుద్ధము మాత్రము చేయవద్దు. ఆమె సామాన్య స్త్రీకాదు. దేవతల పనిని సాధించుటకు మహామాయ యిట్లు వచ్చినది. రాక్షసుల నందరను మట్టుపెట్టుచున్నది. ఈ మాటలు విని శుంభుడు కోపముతో పెదవులదర దేవతల నందరను జయించిన నేనొక స్త్రీకి భయపడి పాతాళమున కెట్లుపోదును? రక్తబీజుడు మొదలగు తోటి రాక్షసులు మరణించగా నాప్రాణము లను కాపాడుకొనుటకు నేనెట్లు పోగలను?

ఓ నిశుంభా! రథమునెక్కి నేను యుద్ధభూమికి వెళ్ళి యామెను చంపి వచ్చెదను. లేదా యికరానేరాను. నీవు సేనతో నా ప్రక్కన నిలువుము. ఆమెను నీ బాణములతో యముని వద్దకు పంపుము అని చెప్పగా నిశుంభుడు నేను దుర్మార్గురాలగు కాళికను చంపివైచెదను. మరియు త్వరగా అంబికనిక్కడకు తీసుకువత్తును రాజా! చింతింపకుము. ఆ బాలిక యెక్కడ? సమస్తలోకమును వశమొనర్చుకొన్న నా పరాక్రమమెక్కడ? నీవు నేనుండగా యుద్ధమునకు వెళ్ళన వసరములేదు. తప్పక నేనామెను తీసికొని వచ్చెదను. నీవు విచారము మాని భోగములను యధేచ్ఛగా న[illegible]భవింపుము. అని సోదరునితో చెప్పి నిశుంభుడు రథమెక్కి సైన్యముతో కూడి [illegible]వాడై ఆయుధములతో త్వరగా యుద్ధభూమికి వెళ్ళెను.

నిశుంభుడు మరణించుట

నిశుంభుడు విజయమో మరణమో నిశ్చయించుకొనదలచి దేవివద్దకు వచ్చెను. శుంభుడు కూడ సైన్యసమేతుడై తమ్మునికి సహాయముగా వెళ్ళి వారిద్దరి యుద్ధమును చూచుచుండెను. దేవగణములు కూడ మేఘముల చాటున నిలిచి

వారి యుద్ధమును చూడవచ్చిరి. నిశుంభుడు జగన్మాతను బెదిరించుచు ఆమెపై బాణవర్షము కురిపించెను. అతని చూచి చండికాదేవి పలుమార్లు పకపకనవ్వెను. దేవి కాళికతో నిట్లు పలికెను:-

ఓ కాళీ! వీరు చావుకోరుకొని నాయెదుటకు వచ్చి నిలిచిరి. రక్తబీజాది రాక్షసుల సంహారము చూచియు నామాయచేత జయాశను విడువకున్నారు చూడుము. వీరినిప్పుడే అంతమొందించెదను అని పలుకుచు తన ముందున్న నిశుంభుని బాణప్రయోగముచే నొప్పించెను. అతడు తన వాడి బాణములతో ఆమె బాణములను ఖండించివైచెను. ఇట్లు వారిరిరువురకును ఘోరముగ పోరు సాగెను అంతట దేవి సింహము జూలు విదలించి రాక్షససేనలో దుమికెను. మరియు తనముందున్న శత్రు సైనికులను మదపుటే నుగులను చీల్చినట్లు చీల్చి చెండాడి తినుచుండెను. అదిచూచిన శుంభుడు ధనుస్సుతో విజృంభించెను. అంత ఇతర రాక్షసులు కళ్ళెఱ్ఱ చేసి పండ్లు పటపట కొరుకుచు దేవిని చంపబయలు దేరిరి. అప్పుడు శుంభుడు కూడ కాళిని చంపి దేవిని పట్టుకొన వలెనని కోపముతో అక్కడకు వచ్చెను. అతడు దేవిని చూచి పెండ్లి మీద జయము మీదను ఆశ వదలుకొని చావునకు నిశ్చయించుకొని ధనుస్సును పట్టుకొని నిలుచుండెను. వానిని చూచి శ్రీదేవి రాక్షసులందరు వినునట్లు చిరునవ్వుతో యిట్లు పలికెను.

"ఓ మూఢులారా! మీకు జీవితాశయున్నచో పాతాళమునకు పొండు లేనిచో నాబాణములచే చచ్చి స్వర్గసుఖమను భవింపుడు. లేదా మీకు నచ్చినచోటికి వెళ్లుడు" అని ఆ మాటలు విని నిశుంభుడు ఖడ్గమును పట్టుకొని మొదట సింహము మీద, తరువాత, దేవిమీదను విసిరెను. శ్రీదేవి తనగదతో కత్తి దెబ్బను తప్పుకొని గొడ్డలితో రాక్షసుని బాహుమూలమున కొట్టెను. ఆ దెబ్బను సహించి దేవిపై మరల కత్తిని విసిరెను. తరువాత ఆమె తప్పుకొని ఘంటానాదము చేసి, నిశుంభుని చంపదలచి మాటిమాటికి మద్యపానము చేసెను.

నిశుంభుడప్పుడు రోషముతో గదపట్టుకొని చండికపై ఉరికెను. మరియు సింహము తలపై గదతో మోది వికవిక నవ్వి దేవిని గూడ గదతో కొట్టెను. అంతట చండికాదేవి వాడియైన కత్తితో నేర్పుగా నిశుంభుని తల నరికెను. అతడు మరణించి నేలకూలెను. సైనికులు దుఃఖించుచు శుంభుని రాజమం దిరము చేరిరి. అంత శుంభుడు నిశుంభుడేమాయెనని ప్రశ్నించెను. వారు రాజా! నీ సోదరుడు యుద్ధమున మరణించి నేలపై కూలినాడు. అతని అనుచరులను దేవి సంహ

రించినది. మిగిలిన మేము నీకీ విషయమును తెలుప వచ్చితిమని మన కనుకూల మైన సమయమిది కాదు. ఈ దేవి కేవలము స్త్రీగాదు. రాక్షసుల నశింప జేయవచ్చిన మహాశక్తి. ఈమె అనేకరూపములను ధరింపగలదు. సర్వాయధములను ధరించి యున్నది. కనుక త్వరగా పాతాళమునకుపోయి ప్రాణములను దక్కించుకొనుము. అని పలుకగా శుంభుడు నేను జీవించినా మరణించినా చింతలేదు. దైవము బలవత్తరమైనది. నావారందరు చనిపోగా నేను కీర్తిని విడిచి జీవితాశతో యుద్ధ మును విరమింతునా? పుట్టిన వానికి చావు చచ్చిన వానికి పుట్టుక తప్పదు. స్థిరముగాని శరీరముతో స్థిరమైన కీర్తిని పొందవలయును. కనుక రథమును సిద్ధము చేయుడు. త్వరగా యుద్ధమునకు పోవుదును. ఈనాడే జయమో మరణమో దైవము తలచినట్లు జరుగగలదు. అని సైనికులతో అంబిక యున్న హిమాల యము వద్దకు వెళ్ళెను. అచట కొండపై సింహవాహనముపై త్రైలోక్యమోహినియగు స్త్రీని చూచెను.

ఆమెను దేవతలు గంధర్వులు కిన్నరులు మొదలగువారు స్తోత్రము చేయు చున్నారు. కల్పవృక్ష పుష్పములతో పూజించుచుండిరి. ఆమెశంఖ మును ఘంటను మనోహరముగా మ్రోగించుచుండెను. ఆమెను చూచి శుంభుడు కామమోహితు డయ్యెను. ఈమె సుకుమారి ప్రౌఢయౌవనవతి యయ్యును కామభావము లేకుండుట ఆశ్చర్యకరముగానున్నది. మహాబలశాలులైన రాక్షసుల నందరను శ్రమలేకుండా సంహరించుచున్నది. ఈమె సామదానములకు లొంగదు. భేదము నకు పనికిరాదు యుద్ధమే శరణ్యము. పారిపోవుట తగదు. చావో గెలుపో విధివిధాన మెట్లున్న అట్లుకా గలదు. అని ఆలోచించి యుద్ధమునకు సిద్ధమయ్యెను. తన యెదుటనున్న దేవితో ఇట్లు పలికెను?

ఓ శ్రీదేవీ! స్త్రీ ధర్మము యుద్ధము చేయుట కాదు. స్త్రీకి సిగ్గుపెట్టని యాభర ణము. నేను నీవంటి సుందరాంగిపై చేయిచేసికొన జాలకున్నాను. నీవు పరుష వచనములు పలికినచో నేను నీతో యుద్ధము చేయుదును. నీవు రతిదేవివలె ఉన్నావుగాని నెట్లు చంపగలను"? అని పలికెను

శుంభాసురుని మరణము

అని అప్పుడు దేవి శుంభుని కామార్తునిగా తెలిసికొని చిరునవ్వుతో ఓరీ మందమతీ! కామ పీడితుడవై యేల దుఃఖింతువు? నాతో యుద్ధము చేయుట కుత్సాహపడనిచో కాళికతోగాని చండికతోగాని యుద్ధమును చేయుము. వారు

నీకు తగినవారే. వారితో నేనీవు యుద్ధము చేయుము. నేను నీతో యుద్ధము చేయను. అని పలికి కాళికతో ఇట్లనెను:- కాళికా! నీవే యితనిని సంహరింపుము. అనినంతనే ఆమె వెంటనే గదచేత ధరించి యుద్ధమునకు సిద్దమయ్యెను. అప్పుడు కాళీ శుంభులకు భీకరపోరాటము జరిగెను. దేవతలందరు చూచుచుండ శుంభుడు గదను కాళిపై విసిరెను. కాళియు గదతో రాక్షసుని చావమోదెను. మరియు గదతో అతని రథమును విరుగగొట్టెను. మరియు సారిథిని చంపెను. అంత నాతడు కాళిపై గద విసిరి నవ్వెను. కాళిక అతని గదను తప్పించుకొని ఖడ్గముతో ఆతని బాహువును నరికెను. అతడు నెత్తురు కారుచున్నను గదతో కాళికను మోదెను. కాళీదేవి అతని రెండవ చేతిని కూడ కత్తితో నరికివైచెను. వాడామెను తన్నబోయెను. ఆమె వెంటనే వాని కాళ్ళను రెంటిని ఖండించెను. పిదప వాని తలగూడ నరికి వైచెను. చచ్చి నేలపైబడిన ఆ రాక్షసుని చూచి ఇంద్రాదులు గంతులు వేసిరి.

అప్పుడు వాయువు చల్లగా వీచెను. దిక్కులు నిర్మలములాయెను. అగ్ని ప్రదక్షిణ జ్వాలలతో తేజరిల్లెను. తక్కిన రాక్షసులు జగనాత్మకుకై మోడ్పు లందించిరి. ఈ శుంభాదుల వధను దేవతా సంరక్షణమును చదివినవారు పరమ భక్తులగుదురు. దీనిని విన్నవారు పరమభాగవతులు కాగలరు. శ్రీదేవీ చరిత్రవలన సంతానహీనులకు సంతానము ధనహీనులకు ధనము కలుగును. రోగులా రోగ్యమును పొందెదరు. మహాకాళీశక్తి శుభపవిత్ర చరిత్ర విన్నను చదివినను శత్రుభయము మృత్యు భయము తొలగిపోవును. మోక్షమును కూడ పొందగలరు.

సురథోపాఖ్యానము

జనమేజయుడు పూర్వము దేవినారాధించి యెవడు గొప్పవులము పొందెను? ఆ తల్లి యెవని యెడల సుప్రసన్నయయ్యెను? నాకు తెలుపుమనగా వ్యాసుడిట్లు చెప్పెను. పూర్వము స్వారోచిష మన్వంతరము నందొక రాజు కలడు. అతని పేరు సురథుడు. అతడు ప్రజాపాలనతత్పరుడు మహోదారుడు. ఏక పత్నీరతుడు గురభక్తికి పరాయణుడు. పర్వతవాసులగు మ్లేచ్ఛులు ఆ రాజుతో పగబూని చతు రంగబలముతో సురథుని రాజ్యము నపహరింపతలపడిరి. సురథుడు తన సేన లతో వైరుల నెదిరించెను. దారుణమగు రణము జరిగెను. మ్లేచ్ఛులబలము కొంచమేయైనను దైవమనుకూలింపనందున రాజు ఓడియెను.

అతడు దుర్గముచే రక్షింపబడిన తన పట్టణము చేరెను. తన మంత్రులు తనను విడిచి శత్రుపక్షములో చేరుటచే తానేమి చేయవలెనని విచారించెను.

పట్టము దుర్గరక్షితమగుటచే శత్రువులు అందు ప్రవేశింపలేరు. పాపాత్ములైన నా మంత్రులు నన్ను శత్రువులకు పట్టించిననేమి చేయవలెను? లోభులెంతటి పనినైన చేయుదురు. అని విచారించి గుఱ్ఱము నెక్కి ఒంటరిగా అరణ్యములో ప్రవేశించెను. అక్కడకు మూడు యోజనములు దూరమున నొక మహర్షి యాశ్రమము కలదు. ఆ యాశ్రమమునకేగి అచటి వాతావరణమునకు పరమానంద భరితుడయ్యెను. తన గుఱ్ఱము నొక చెట్టునకు కట్టి సవినయముగ ముని వద్దకేగి యాతని దర్శించెను. ముని యాతని నాదరించి నీరాకకు కారణమేమి? నీవెవ్వడవు? అని ప్రశ్నింపగా వేనొకరాజును - నా పేరు సురథుడు. నేను శత్రువులకు ఓడిపోయి వచ్చితిని. నిన్ను శరణు జొచ్చితినవెను. అంతట ముని నీవిచట నిర్భయముగా నుండుము. ఇచట దొరికిన యాహారముతో కాలము గడుపుము. నీ శత్రువులిక్కడకురాజాలరు. అనగా రాజు నిశ్చింతగా నచట నివసించుచుండెను.

ఒకనాడు చెట్టు క్రింద కూర్చొని తన రాజ్యము గూర్చి విచారించుచుండగా ఒక కోమటి యచటికి వచ్చెను. అతనిని రాజు నీవేల యిక్కడకు వచ్చితివని ప్రశ్నింపగా నాతడు ధనాశావరులైన నా భార్యాపుత్రులు ఇంటి నుండి నన్ను వెడలగొట్టిరని చెప్పెను. రాజు వైశ్యుడు ఇరువురును ముని వద్దకు వెళ్ళి తమ విచారమును వెల్లడించి దుఃఖశాంతికి ఉపాయము తెలుపుమని ప్రార్థించిరి.

మహా మాయకు దేవతలు సైతము మోహితులగుట

వ్యాసుడు జనమేజయునకు చెప్పుచున్నాడు. రాజా పూర్వము విష్ణువు బ్రహ్మ విద్యాప్రాప్తికై పదివేల సంవత్సరములు తపస్సు చేసెను. అట్లే అజ్ఞానము తొలగుటకై బ్రహ్మకూడ తపస్సు చేసెను. ఒకనాడు విష్ణువు బ్రహ్మయు ఒకచోట కలుసుకొనిరి. వారి రువురును పరస్పరము ప్రశ్నించుకొనుటలో నేను సృష్టికర్తనని బ్రహ్మ నేను సృష్టికర్తనని విష్ణువు వాదించుకొనుచుండగా వారిరువురి నడమ తెల్లని పొడవు లావుగల అద్భుతమైన లింగముద్భవించెను. మరియు ఆకాశవాణి యిట్లు విని పించెను.

'ఓ మహానుభావులారా! మీరు వివాదమునకు దిగవద్దు. ఈ లింగము యొక్క చివరనుగాని మొదలునుగాని యెవరు చూచి వత్తురో వారు గొప్పవారని' ఆకాశవాణి పలికెను. ఆ మాటవిని బ్రహ్మ చివరను విష్ణువు మొదలును చూచి వచ్చుటకు బయలుదేరిరి. విష్ణు చాలశ్రమపడివను మొదలు చూడలేక వెనుకటి చోటికి వచ్చెను. బ్రహ్మ చివర చూడలేక శివుని శిరస్సు నుండి పడిన మొగలి

పువ్వును చేత పట్టుకొని సంతోషముతో తిరిగి వచ్చి విష్ణువునకా మొగలిపువ్వును చూపించి శివుని తలను జూచిన గుర్తుగా శివుని తలనున్న మొగలిపువ్వును తెచ్చి తిని. నేను చివర చూచినట్లిది యేగుర్తని బ్రహ్మ పలికెను. సాక్ష్యమున్ననే గాని నేనంగీకరింపనని విష్ణువనగా ఈ మొగలిపువ్వే నీకు సాక్ష్యము చెప్పునని బ్రహ్మ పలికెను. ఆ పువ్వు బ్రహ్మ శివుని తలను చూచిన మాటనిజమే అని పలికెను.

శివుడు నీమాట నిజమనినచో నేను నమ్మెదనని విష్ణువు పలుకగా శివుడు కోపించి నాశిరస్సు నుండి జారిపడుచుండగా మధ్యలో బ్రహ్మకు దొరికినదికాని యితడు లింగము తలను చూడలేదు. నీవు అసత్యము చెప్పితివి కనుక పూజకు నీవు పనికిరావు నిన్ను విడిచిపెట్టుచున్నానని శివుడు పలికెను. అప్పటి నుండి మొగలి పువ్వు శివపూజకు పనికిరాదయ్యెను. ఇట్లు మహామాయజ్ఞానులను కూడ మోహ భ్రాంతులకు వశులనొనర్చుచున్నది. ఇక సామాన్యుల మాట చెప్పిడిదేమి? అని పలికెను."

శ్రీమద్దేవీ నవరాత్రవ్రత విధానము

జనమేజయుడు శ్రీదేవి యొక్క పూజా విధానము ఆరాధన మంత్రజప హోమముల విధానము తెలుపుమని కోరగా వ్యాసుడిట్లు చెప్పెను. మొదట శుచిగ స్నానము చేయవలె. తెల్లని వస్త్రములు ధరింపవలెను. అలికినచోట ఉత్తమాస నముపై కూర్చొని అచమనములు చేయవలెను. పూజా ద్రవ్యములు సమకూర్చు కొనవలెను. ప్రాణాయామ మొనర్చి మాతృకాన్యాసము చేయవలె.

పిమ్మట సంకల్పము చేసి ప్రాణప్రతిష్ఠ జరుపవలెను. తరువాత యధావిధిగ న్యాసములు చేయవలెను. ఒక రాగిరేకుపై మంచి గంధముతో ఆరుకోణముల యంత్రము వ్రాయవలెను. ఇట్లు వేదోక్తముగ శ్రీదేవిని పూజింపవలెను. నవాక్షర మంత్రమును నిరంతరము జపించవలయును. దశాంశహోమము దానిలో దశాంశము తర్పణము, దానిలో దశాంశము బ్రాహ్మణ భోజనము నిష్ఠతో జరుప వలెను. నిత్యము శ్రీదేవీ చరిత్రత్రయము పఠించి దేవీ విసర్జనము చేయవలెను.

ఈ విధముగా దేవీ నవరాత్రములందు దేవీవ్రతమును ఆచరింపవలెను. శుభమును కోరువాడు చైత్రాశ్వయుజ మాసములలోని నవరాత్రములందు విధిగా ఉపవాసము చేయవలెను. పంచదార, నేయి, తేనె కలిపిన పాయసమును దేవీ మంత్రము నుచ్చరించుచు హోమము చేయవలెను. అష్టమీ, నవమీ, చతుర్దశుల్ల యందు బ్రాహ్మణ సంతర్పణము చేయవలెను. ఈ విధానముతో శ్రీదేవీ

వ్రతమాచరించి నచో పేదవాడు ధనికుడగును. రోగిస్వస్థుడగును. అ పుత్రుడు సంతానవంతుడగును. ఇక నవరాత్రి విధానము వినుము. మొదట మండలా కారముగ శుద్ధి చేసినచోట పూజా స్థానమేర్పరచుకొనవలెను- కలశస్థాపనము చేయవలెను - దానిపై దేవీ యంత్రముంచవలెను- కలశము క్రింద బియ్యము పోయవలెను- శ్రీదేవిని పూలమాలలతో అలంకరింపవలెను. ధూపదీపములు సమర్పింపవలెను. త్రికాలములందును పూజ చేయవలెను. స్తోత్ర పాఠ గీతవాద్యా దులతో దేవిని సేవింపవలెను. ఒక కన్యను యథావిధిగ పూజింపవలెను. చందన వస్త్రభూషణ భోజనములతో ఆమెను తృప్తిపరచవలెను. అష్టమినాడుకాని, నవమినాడు కాని యథావిధిగ హోమ మొనర్చి బ్రాహ్మణ సంతర్పణమొనర్పవలెను.

శ్రీదేవి రాజ వైశ్యులకు వరము లిచ్చుట

సురథుడును రాజు వైశ్యుడును మునివలన దేవి యొక్క ప్రభావమును విని భక్తితో కూడిన మనస్సు కలవారై శాంతిని పొందిరి. వారు మునికి నమస్కరించి మహాత్మా! మా పూర్వ పుణ్యమువలన ఈ యాశ్రమమునకు చేరగలిగితిమి. నీ దర్శనభాగ్యముచే మా దుఃఖము పటాపంచలైనది. మేము ధన్యులము- కృతార్థులము - పవిత్రులమునైతిమి. మాకు మంత్రోపదేశమొనర్పుము. మేమిపుడు తీవ్రమగు తపస్సు చేయుదుము. భగవతినికొల్చి ఆమె దర్శనభాగ్యము నొందెదము. అని పలుకగా సుమేధోముని ప్రీతుడై వారికి మంత్రోపదేశము చేసెను. వారొక నదీతీరమున జపధ్యాన తత్పరులై శాంతచిత్తులై శ్రీదేవి చరిత్ర చదువుచు తీవ్రమైన తపస్సు చేయుగా రెండేండ్లు గడచిన పిమ్మట స్వప్నములో దేవిని దర్శించిరి. శ్రీదేవి రాజును నీ కోరిక ఏమియని ప్రశ్నించెను. అట్లే కోమటిని కూడ వరము కోరుకొనుమనెను. రాజు నాశత్రువులు నశించునట్లు నా రాజ్యము నాకు లభించునట్లు వరమిమ్మనెను. దేవి యట్లే యగును. నీవింటికి వెళ్ళుమనెను. పిమ్మట కోమటి నాకు సంసారబంధము తొలగి బ్రహ్మజ్ఞానము పొందునట్లు వరమిమ్మనెను. దేవి నీకు తప్పక బ్రహ్మజ్ఞానము కలుగుననెను. ఇట్లు వారిరువరకు వరములిచ్చి దేవి యంతర్ధానమొందెను. అంతట రాజు మునికి నమస్కరించి ఆయన యనుమతితో గుఱ్ఱమెక్కి బయలుదేరెను. అప్పుడే యాతని మంత్రులు ప్రజలు వచ్చి నీ రాజ్యము తిరుగుబాటు చేయువార్వెరును లేరు. నీ రాజ్యమును నీవు పాలింపుము అని పలికిరి. రాజు తన పట్టణమునకు వెళ్ళి చక్కగా రాజ్యపాలన మొనర్చు నానందించెను. కోమటి జ్ఞానమును పొంది ముక్తసంగుడాయెను. అని సూతుడు శౌనకాది మునులకు చెప్పినని వ్యాసుడు జనమేజయునకు తెలిపెను.

షష్ఠ స్కంధము

త్రిశిరసుని తపశ్చరణము

సూతుడు ఇంద్ర వృత్రాసురులకు వైరకారణమును తెలుపుదునని యిట్లు చెప్పనారంభించెను. త్వష్ట ప్రజాపతి మహాతపస్వి సురశ్రేష్ఠుడు దేవకార్య నిర్వాహకుడు అతడు నేర్పరియైన అమరశిల్పి. ఆతడింద్రునిపై గల పగవలన త్రిశిరసుడు విశ్వరూపుడును పేర్లు కుమారులను కనెను. త్రిశిరసుడు తన మూడు ముఖములలో నొకముఖముతో వేద పఠనము, వేరొక ముఖముతో సురాపానము, మరొక ముఖముతో దిక్కులతో పరికించుటను చేయుచుండెను. అతడు భోగములు వదలి తీవ్రమైన తపస్సు చేయసాగెను. ఇంద్రుడతని ఘోరతపమును చూచి తన పదవిని కోరునేమో యని దుఃఖింతుడియ్యెను. మరియు నీ త్రిశిరసుడు పెరిగి పెరిగి నన్ను చంపవచ్చునని యాతని తపస్సునకు భంగము కలిగింప ప్రయత్నించెను. అతనిని కామమోహితుని చేయుటకు ఊర్వశి, రంభ, ఘృతాచి, తిలోత్తమలను పిలిచి నా శత్రువు ఇంద్ర పదవిని కోరి తపస్సు చేయుచున్నాడు. మీరతని వద్దకు వెళ్ళి తపోభంగమొనర్పవలెనని యాదేశించెను.

అంతట నాదేవ వేశ్యలు త్రిశిరుని వద్దకు వెళ్ళి తమ నృత్యగీత విలాసాదులతో నాతని నాకర్షింపయత్నిం చిరి. కాని యాతడు కన్నెత్తి చూడలేదు. కొన్ని దినములు ప్రయత్నించి తమ ప్రయత్నము నెరవేరక తిరిగి స్వర్గమునక్కు పోయిరి. వారు చేతులు జోడించి మహారాజా! మాశక్తి కొలది ప్రయత్నించితిమి కాని యాతవిని చలింప చేయలేక పోతిమి. అతడు శపించకుండుట మా యదృష్టమని విన్నవించిరి. ఇంద్రుడు వారిని పంపి త్రిశిరసుని చంపుటకు ఉపాయము ఆలోచించెను. ఇంద్రుడు ఐరా వతము నెక్కి త్రిశిరోముని వద్దకు వచ్చెను. ముని ధ్యాననిమగ్నుడై యుండెను.

ఇంద్రుడు తన వజ్రాయుధమును వానిపై ప్రయోగించెను. ముని క్రిందపడి మరణించెను. ఇంద్రుడు మునిని చంపి స్వర్గమునకు వెళ్ళెను. చనిపోయినను తేజశ్శాలిగా కనబడుచున్న మునిని చూచి యింద్రుడు వడ్రంగిని పిలిచి ఆ ముని తల తెగగొట్టుమని పలికెను. అతడందులకంగీకరిపలేదు. అంతట నీకు యజ్ఞ భాగము నిచ్చెదనని యాశ చూపినందున వడ్రంగి ఆ ముని మూడు తలలను నరికివైచెను. వడ్రంగి యజ్ఞ భాగము నందుకొనెను.

వృత్రాసుర జననము

విశ్వకర్మ ధార్మికుడై తన పుత్రుని చంపినందుకు ఇంద్రుని పై కోపించి ఇంద్రుని చంపదగిన మరియొక పుత్రుని పొందగలనని త్వష్టమహా క్రోధముతో అధర్వవేద మంత్రములచే పుత్రప్రాప్తికై హోమము చేసెను. ఎనిమిదిరాత్రులు హోమము చేయగా అగ్నిజ్వాల నుండి అగ్నివంటి పురుషుడొకడు పుట్టెను. కాంతుల వెదజల్లు నా కుమారుని చూచి ఓ యింద్రశత్రూ నా తపోబలముచే వర్ధిల్లుము. అని త్వష్ట కోపముతో పలుకగనే ఆ మునిబాలుడు ఎంతో ఎత్తు పెరిగెను. పర్వతాకారమంతగా పెరిగిన ఆ కుమారుడు తండ్రిని చూచి నేనేమి చేయవలెను. నాకు పేరు పెట్టుము. నీవెందుకు దుఃఖించుచుంటివో తెలిపి చేయవలసిన పనిని తెలుపుమనెను. అంతట త్వష్ట నీకు వృత్రుడని పేరు పెట్టుచున్నాను. నీసోదరుడు త్రిశిరసుడు గొప్ప తపస్వి. యింద్రుడతనిని సంహరించెను. నీవు యింద్రుని సంహరింపవలెను. అని పలికి యుద్ధమునకు కావలసిన సర్వసాధనములను సిద్ధము చేసెను. మరియు యింద్రునితో యుద్ధమునకు కుమారుని ప్రోత్సహించెను.

వృత్రుడు దేవతల నోడించుట

వృత్రుడు వేదపండితులైన బ్రాహ్మణు స్వస్తివాచనముతో రధము నెక్కి ఇంద్రుని చంపుటకు బయలుదేరెను. దేవతలచే జయింపబడిన రాక్షసులెల్లరు వృత్రుని మహాబలవంతునిగా తెలిసికొని యతనిని సేవింపవచ్చిరి. ఇంద్రుని చారులు స్వామీ! నీకు శత్రువైన వృత్రుడు త్వష్ట పేరేపింపగా నీతో యుద్ధమునకు వచ్చుచున్నాడని తెలియజేసిరి. నీవు త్రిశిరసుని చంపుటచే కోపించి త్వష్ట నీ చావునకీతని సృష్టించెనని కూడ తెలిపిరి. దేవతలు భయపడినవారై దేవేంద్రున కిట్లనిరి.

ఓ దేవరాజా! స్వర్గములో చెడు శకునములు చాల కనబడుచున్నవి. అని మొరబెట్టగా బృహస్పతిని రావించి ఓ మహాత్మా ఘోరములైన దుర్నిమిత్తములు కనబడుచున్నవి. నీవు ధీశాలివి. శాస్త్రవేత్తవు. నీవు నా శత్రునాశమునకు ఉపాయమాలోచించి చెప్పి నా మనస్సునకు శాంతిని కలుగజేయుమని ప్రార్థించెను. బృహస్పతి సహస్రాక్షా! నేనేమి చేయను? నీవు నిరపరాధియైన మునిశిరస్సును నరికి దుష్కార్యమొనర్చితివి. వృత్రుడు నీవజ్రముకంటె గొప్పవగు ఆయుధములతో అసురులను వెంటబెట్టుకొని నీపై యుద్ధమునకు వచ్చుచున్నాడు. అని యిట్లు గురుడు చెప్పుచుండగనే గంధర్వ యక్షకిన్నర తాపసులు దేవతలు తమతమ

నివాసములు విడిచి పారిపోయిరి. అది చూచి యింద్రుడు విచారగ్రస్తుడయ్యెను. అతడు తన సైన్యమును యుద్ధమునకు సిద్ధము కమ్మని చెప్పి తానైరావతముపై కూర్చొని బృహస్పతిని ముందుంచుకొని బయలుదేరెను. సైనికులు శస్త్రాస్త్రధారులై యుద్ధసన్నద్ధులైరి.

అప్పుడు వృత్రుడు దానవులతో కూడి మానస సరస్సునకు ఉత్తరమున విడిసెను. అచట నొక పర్వతము కలదు. ఇంద్రుడక్కడకు వచ్చి యుద్ధమునకు పూనుకొనెను. అంతట వృత్రవాసవులకు ఘోరమగు పోరు సంఘటిల్లెను. యమ వరుణాగ్ని వాయుదేవులు యుద్ధము విడిచి పారిపోయిరి. సింహమును చూచిన మృగముల వలె వృత్రునినున్న చూచి ఇంద్రాది దేవతలు పారిపోయిరి. జరిగిన దానిని తన తండ్రికి వృత్రుడు చెప్పగా ఆ మాటలు విని త్వష్టనేనిప్పుడు పుత్ర వంతుడను నా జీవితము ధన్యమైనది. నా మనోవ్యాధి నశించినది. మనస్సు శాంతి నొందినది. ఇప్పుడు నీకు మేలుకలుగు మార్గము చెప్పెదను. నీవు స్థిరా సనమున నుండి తపస్సు చేయుము. ఇంద్రుడు మోసము చేయుటలో నేర్పరి. వానిని నమ్మవద్దు. బ్రహ్మను గూర్చి తపమొనర్పుము. పాపియగు ఇంద్రుని సంహ రింపుము. అని పలుకగా వృత్రుడు గంధమాదన పర్వతమున కలిగి గంగలో స్నానమొనర్చి దర్భాసనముపై స్థిరాసనమున కూర్చొని ప్రజాపతిని మనస్సునందు ధ్యానించుచుండెను. ఇంద్రుడాతని తపస్సును భగ్నము చేయుటకు ప్రయత్నించెను కాని కృతార్థుడుకాలేదు.

వృత్రుడు స్వర్గమలంకరించుట

నూరేండ్లు గడచిన పిదప పితామహుడు ప్రత్యక్షమై నీ కోరిక ఏమి? యని ప్రశ్నించెను. అప్పుడు వృత్రుడు ఓ కమలాసనా! నాకు తడిసిన, ఎండిన వస్తువులచే గాని లోహకాష్ఠశస్త్రములచే గాని చావులేకుండునట్లు వరమిమ్మనెను. హిరణ్యా గర్భుడట్లే యని వెళ్ళి పోయెను. వృత్రుడు తన తండ్రితో బ్రహ్మ వరదానమును చెప్పగా సంతసించి నీవు ఇంద్రుని చంపి నా మనస్సునకు శాంతిచే కూర్పుమనెను. వృత్రుడట్లే యని రథమెక్కి తండ్రి యింటి నుండి వెడలెను. రణభేరి శంఖనాద ములు పిక్కటిల్లెను. వృత్రుడు సేవకులకు నేడు ఇంద్రుని చంపి స్వర్గమును స్వాధీనము చేసికొందునని చెప్పెను. వృత్రుని రాక నెరిగి ఇంద్రుడు కూడ సేనలను యుద్ధమునకు సిద్ధము చేసెను. లోకపాలురనందరను యుద్ధమునకు గావించెను. ఇంద్ర వృత్రులును దేవదానవులును ఘోరమగు రణమొనర్చిరి. అట్లు యుద్ధము

జరుగుచుండగా వృత్రుడు ఇంద్రుని పట్టుకొని అతని కనచాదులు తొలగించి సంతోషముతో నాతని నోటిలో వేసికొనెను. దేవతలు హాహాకారమొనర్చుచు విల పించిరి.

అప్పుడు దేవతలు బృహస్పతి వద్దకు వెళ్ళి మారాజును వృత్రుడు మ్రింగి వైచెను. మేమిప్పుడేమి చేయవలెనని ప్రార్థించిరి. అంత బృహస్పతి ఇంద్రుడు వృత్రుని నోటిలో నున్నాడు చావలేదు. చావకముందే బయటకు వచ్చు నుపాయ మాలోచింపవలెను. అని చెప్పి వృత్రునకు ఆవులింత కలుగునట్లు చేసిరి. అప్పు డతడు నోరు తెరువగా ఇంద్రుడాతని నోటినుండి యెట్లో బయటపడెను. దేవతలు సంతోషించిరి. మరల యుద్ధము కొనసాగెను. దేవేంద్రుడు ఓడిపోయెను. దేవతలు యుద్ధము వదలి పరుగెత్తిరి. వృత్రుడు వెంటనే స్వర్గమును స్వాధీనము చేసికొనెను. ఐరావతమును తనదిగా చేసికొనెను. నందన వనమందు విహరింపజొచ్చెను. ఉచ్చైశ్రవమును సకలవిమానములను స్వాధీనము చేసికొనెను. దేవతలు స్వర్గ భ్రష్టులై హవిర్భాగములు కోల్పోయి గిరిదుర్గములందు తిరుగుచు బాధపడు చుండిరి.

శ్రీ దేవి దేవతలకు ప్రత్యక్షమగుట

పూర్వము వృత్రాసురుడు మదగర్వితుడై దేవలోకమును మదగర్వితుడై స్వాధీనము చేసికొని దేవతలనందరను బాధింపగా శివునితో సహదేవతలు విష్ణుమూర్తిని ఉపాయమడుగబోయిరి. అయన దేవిని శరణువేడినచో ఆమె మీకు సహాయము చేయగలదు. ఇంద్రుడుకూడ ఆమె నారాధించి యుద్ధములో శత్రు వును సంహరింపగలడు. పరాంబిక ప్రసన్నురాలైనచో సమస్తమును సాధ్యమగును. ఆమె యనుగ్రహములేనిదే ఎవ్వనికినీ యే కోరికయు తీరదు. ఆమె అంతర్యామి. స్వరూపములు అన్నిటికిని మూలకారణమైనది. లోకజననియైన యామెను శత్రు నాశము కొరకు సేవించుడు. పూర్వము నేనుకూడ ఆమె యనుగ్రహము చేతనే మధుకైటభులను రాక్షసులను చంపగలిగితిని. కనుక మీరుకూడ ప్రకృతి స్వరూప యైన దేవిని సేవించి కార్యసిద్ధిని పొందండి యని చెప్పగా దేవతలు మేరుపర్వత శిఖరమునకు వెళ్ళి యేకాంతమందు ఆమెను ధ్యానించి ఆమె మంత్రమును జపించి సృష్టిస్థితి సంహారకారణియగు పరదేవతను ఈవిధముగా స్తోత్రము చేసిరి.

శ్లో॥ దేవి ప్రసీద పరిపాహి సురాన్ప్రతప్తాన్ వృత్రాసురేణ సమరే పరిపీడి తాంశ్చ ।
దీనార్తి నాశనపరే! పరమార్థతత్త్వే । ప్రాప్తాంస్త్వ దంఘ్రిక మలం శరణం సదైవ ॥

త్వం సర్వ విశ్వజననీ పరిపాలయాస్మాన్ పుత్రానివాతి పతితాన్ రిపుసంకటేఽస్మిన్॥
మాతర్నతేఽస్త్య విదితం భువనత్రయేఽపి కస్మాదుపేక్షసి సురానసురప్రతప్తాన్
త్రైలోక్య మేత దఖిలం విహితంత్వయైవ బ్రహ్మా హరిః పశుపతిస్తవవానవోత్థాః ॥
కుర్వంతి కార్య మఖిలం స్వవశానతే తే భ్రూ భంగచాలన వశాద్వి హరంతికామమ్ ।
మాతాసుతాన్ పరిభవాత్పరిపాతిహీనాన్ రీతిస్త్వయైవ రచితా ప్రకటాపరాధాన్ ॥
కస్మాన్నపాలయసి వినాపరాధాన్ అస్మాంస్త్వ దంఘ్రి శరణాన్ కరుణారసాబ్ధే
నూనం మదంఘ్రి భజ నాప్తపదాః కిలైతే భక్తిం విహాయ విభవే సుఖభోగలుబ్ధాః
నేమే కటాక్ష విషయా ఇతి చేన్నచైషా రీతిస్సుతే నోఽత్రజనని కర్తరిచాపిదృష్టా
దోషేనవోఽత్రజనని ప్రతిభాతి చిత్తే వ్యాసాదితో మహిషరూపధవః కిలాజౌ
అస్మత్కృతే సకలలోక భయావహోఽసౌ వృత్రం కథంన భయదం విధునోషిమాతః॥
శుంభస్తథాతి బలవాన నుజోనిశుంభః తౌ భ్రాతరౌ తదనుగా నిహతా హతౌచ
వృత్రంతథాజ హిఖలం ప్రబలం దయార్ద్రే మత్తం విమోహయ తథానభవేద్యథాసౌ
త్వం పాలయాద్య విబుధానసురేణమాతః సంతాపితానతితరాంభయవిహ్వలాంశ్చ
నాన్యోస్తికోపి భువనేషుసురారి హంతా యఃక్లేశ జాలమఖిలం విదహేత్స్వ శక్త్యా
వృత్రే దయా తవయది ప్రథితా తథాపి జహ్యేన మాశుజన దుఃఖకరం ఖలంచ
పాపాత్స ముద్ధరభవాని శరైః పునానా నో చేత్ప్రయాస్యతి తమోనను దుష్టబుద్ధిః
తేప్రాపితాః సురవనం విబుధారయోయే హత్వారణేఽపి విశిఖైః కిలపావితాస్తే
త్రాతానకిం నిరయపాతభయాద్దయార్ద్రే । యచ్ఛత్ర వోపినహికిం వినిహంసి వృత్రమ్
జానీమహేరిపురసౌతన సేవకోనప్రాయేణ పీడయతి నః కిల పాపబుద్ధిః॥
యస్త్వావక స్త్విహాభ వేదమరానసౌ కింత్వత్పాద పంకజరతాన్ననుపీడయేద్వా
కుర్మః కథం జనని పూజన మద్యతేంబ! పుష్పాదికంతవ వినిర్మితమేవయస్మాత్
మంత్రావయంచ సకలం పరశక్తిరూపం తస్మాద్భవాని! చరణౌ ప్రణతాఃస్మనూనమ్ ।
ధన్యాస్త ఏవమను జాహి భజంతి భక్త్యాపాదాంబుజంతవ భవాబ్ధి జలేషుపోతం
యం యోగినోపి మనసా సతతంస్మరంతి మోక్షార్థినో విగతరాగ వికారమోహాః ॥
యే యాజ్ఞికాః సకల వేదవిదోపినూనం త్వాం సంస్మరంతి సతతం కిలహోమకాలే।
స్వాహాంతు తృప్తిజననీమమరేశ్వరాణాం భూయః స్వధాంపితృగణ స్యచతృప్తిహేతుం
మేధాసికాంతిరపిశాంతిరపి ప్రసిద్ధా బుద్ధిస్త్వమేవ విశదార్థకరీనరాణామ్
సర్వం త్వమేవవిభవం భువనత్రయేఽస్మిన్ కృత్వాదదాసిభజతాం కృపయాసదైవ
ఏవంస్తుతా సురైర్దేవీ ప్రత్యక్షా సాభవత్తదా చారురూప ధరాతన్వీ సర్వాభరణభూషితా
సర్వవేదాంత సంసేవ్యా సచ్చిదానందరూపిణీ ప్రణేముస్తాం సమాలోక్య సురాదేవీం పురస్థితామ్

తానాహప్రణతాన్ దేవీకింవః కార్యం బ్రువంతుమామ్
దేవాః- మోహయైనంరిపు వృత్రం దేవానామతి దుఃఖదమ్ ।
యథా విశ్వసతేదేవాన్ తథాకురు విమోహితం ఆయుధేచ బలం దేహి హతః స్యాద్యేనవారిపుః ॥
తథేత్యుక్త్వా భగవతీ తత్రై వాంతర ధీయత । స్వానిస్వాని నికేతాని జగ్ముర్దే వాముదాన్వితాః ॥

స్తోత్రభావము:- ఓ దేవదేవీ! యుద్ధములో మేము వృత్రాసురునిచే పీడింప బడి సంతాపము పొందుచున్నాము. మమ్మూదయజూచి కాపాడుము. నీ పాదపద్మము లపై మాతలలు మోపి శరణువేడుచున్నాము. సర్వజననీ! ఈ ముల్లోకము లందును నీకు తెలియనిదిలేదు. రాక్షసులచే బాధింపబడుచున్న మమ్మెందుకు నీవుపేక్షించుచున్నావు. మేము నీకన్న బిడ్డలము. భయంకరులగు శత్రువులకు చిక్కి బాధపడుచున్నాము. నీవు దేవతలకు తల్లివి. హరిహర బ్రహ్మలు నీవల్లననే జన్మించి నీకటాక్షముచేత అన్ని పనులను నెరవేర్చగలుగుచున్నారు. పుత్రులేవైన అపరాధములు చేసినను వారిని తల్లి దయతో కాపాడునుగదా! మేము నిన్ను సేవింపక సంపదలందు ఆసక్తి కలవారమగుటను దోషముగానెన్నకుము. నీవే మాయచే మమ్ము మోహింప జేయుచున్నావు. తల్లీ! నీవు పూర్వము మహిషా సురుని చంపి మాకు మేలుచేసితివి. అట్లే మదించిదుష్టుడైన యీ వృత్రాసురుని మాయచే మోహింపజేసి సంహరింపుము.

ఓదయామయి! నీవు పూర్వము శుంభ నిశుంభులను రాక్షసులను వారి యనుచరులను చంపి మమ్మ కాపాడితివి గదా! అట్లే యిప్పుడు వృత్రాసురుని సంహరించి మాకు మేలుచేయుమని ప్రార్థించుచున్నాము. మేము రాక్షసుల వలన బాధలు పడలేకున్నాము. నీకు వృత్రాసురుని పై దయ ఉన్నయెడల లోకములను పీడించు నతడు నరకములో పడకుండ సంహరించి యుద్ధరించుము. జగన్మాతా! ఇక మాకు నీశుభచరణములే శరణము. వృత్రాసురుడు నిన్ను సేవింపక మమ్ము బాధించుచున్నాడు. ఓ సచ్చిదానంద స్వరూపిణీ! మేము నీకు నమస్కరిస్తున్నాము. అని స్తుతింపగా నమస్కరించుచున్న దేవతలను గూర్చి మీ కోరికలను తీర్చెదనని చెప్పి దేవి అంతర్ధానము చెందెను. దేవతలు ఆనంద ముతో తమతమ యిండ్లకేగిరి. వృత్రాసురునితో స్నేహమును నటించి అవకాశమునుబట్టి వానిని సంహ రింపవలయునని నిశ్చయించు కొనిరి.

దేవతలు-వృత్రునివద్దకు పోయి మైత్రీ భావమును ప్రకటించిరి. వృత్రుడును దేవతల మాటలను నమ్మలేదు. శత్రువులగు మిమ్ములను యెట్లు నమ్మవచ్చునని తన సందేహమును ప్రకటించెను. దేవతలు ప్రమాణము చేసిరి. దేవీమాయకు

లోబడిన వృత్రుడును యింద్రాదులతోడి మైత్రిని అంగీకరించెను. అటుతరువాత నింద్రుడు వానితో స్నేహమును నటించి తరువాత వానిని సంహరించెను. ఈ విధముగ నింద్రాదులు వృత్రునికూల్చి తమ స్థానములకు పోయిరి. కాని ఇంద్రుడు ధర్మమును తప్పుటవలన వృత్రహత్యచే కలిగిన బ్రహ్మహత్యా దోషము వలన మానసికముగ బలహీనుడయ్యెను. అశాంతుడై బ్రహ్మహత్యా దోషమునకు లోకాపవాదమునకు భయపడి యెచటనో దాగుకొనెను.

ఇంద్రుడు లేకపోవుటచే- లోకపరిపాలన గాడి తప్పెను. అప్పుడు దేవతలు విచారించి నహుషుడను రాజర్షిని యింద్రునిగావించిరి. రజో గుణమెక్కువగ నున్న నహుషుడు భోగలాలసుడయ్యెను. శచీదేవి యింద్రుని భార్య. ప్రస్తుతము నేనే యింద్రుడను. ఆమె నాకేల భార్యకాదు. ఆమెను నా పొందునకు తీసికొనిరండని అప్సరసలను దేవతలను ఆజ్ఞాపించెను. బృహస్పతి మున్నగువారు చెప్పినను వినలేదు. శచీదేవి శక్తి స్వరూపిణియగు దేవిని ప్రార్థించి ఆమె యనుగ్రహమున తన భర్తను చేరి దురవస్థను తెలిపెను. ఇంద్రుడు మాత్రమేమి చేయును. అతడే శక్తిహీనుడై ధర్మ లోపమునంది దాగి యుండెను. వారు దేవిని ప్రార్థించిరి. దేవి దయవలన వారికొక ఉపాయము తోచినది.

శచీదేవి - నహుషునివద్దకు పోయెను. నీవు మునివాహనుడవై నా వద్దకు రమ్ము. అప్పుడు నేను మహావైభవమున వచ్చిన నీ పొందును అంగీకరింతు ననెను. కామ పీడితుడగు నహుషుడందులకంగీకరించెను. అగస్త్యుడు మున్నగు మునులు పల్లకిని మోయుచుండగా నహుషుడు ఆ పల్లకినెక్కి మునివాహనుడై శచీదేవి వద్దకు ప్రయాణమయ్యెను. కామాతురుడై యున్న నహుషుడు త్వరగా సరిగా నడువుమని మహాముని యగు అగస్త్యుని కాలితో తన్నెను. కోపించిన అగస్త్యుడు నహుషుని సర్పమగుమని శపించెను. ఈ విధముగా శచీదేవికి నహుషుని వలన బాధ దేవి యనుగ్రహము వలన పోయినది. వ్యాసుడీవిధముగ జనమే జయునకు కర్మగతిని, హరిశ్చంద్ర కథను, వశిష్ఠుడు మున్నగువారి వృత్తాంత ములను విక్షేపశక్తి మాయ మున్నగువానిని వివరించెను.

శ్రీదేవి వృత్రుని సంహరించుట - నహుడింద్రుడగుట

ఋషులు దేవతలును శ్రీదేవి దయచే వరములను పొంది వృత్రుని ఆశ్రమము చేరిరి. అతడు ముల్లోకములను భస్మము చేయువానివలె కన్పట్టెను.

ఋషులు సామవచనములతో మహానుభావా! వృత్రా! ఇంద్రుడు నీవును పరస్పర విరోధముచే శాంతి లేనివారై యున్నారు. మీ యిరువురి వైరమువలన దేవసైన్యము రాక్షససైన్యము నశించుచున్నది. కనుక మీరిరువురు స్నేహము మెలగినట్లైన యిరువురుకు మనశ్శాంతి యేర్పడును. ఉభయ సైన్యముముల క్షేమముతో నుండ గలవని పలికిరి.

వృత్రుడు ఆర్యులారా! మీ మాటలు బాగుగనే యున్నవి. కాని యింద్రుడు వంచకుడు పాపి అతనితో నాకు స్నేహమెట్లు కుదురునని ప్రశ్నించెను. అంతట ఋషులు అతనిచే ప్రమాణము చేయించుదుము. కనుక నీకు నమ్మకము కలుగ వచ్చునని యింద్రునిచే ప్రమాణము చేయించిరి. ఇంద్ర వృత్రులిరు నగ్నిసాక్షిక ముగ మిత్రత్వము నొంది మసలజొచ్చిరి. ఇంద్రుడు మాత్రము లోలోన వృత్రు నెట్లైన చంపవలెనని యాలోచించుచు పైకి మిత్రుని వలె వ్యవహరించుచుండెను. ఒకనాడు సంధ్యాసమయమున ఇంద్రుడు విష్ణువును ప్రార్థింపగా నాతడు వజ్రాయుధములో ప్రవేశించెను.

బ్రహ్మవరమును స్మరించి ఈ సమయమున నాబలముచే నింద్రుడు చంప బడునని. సముద్రములో నురుగు తడిసినదిగాదు, ఎండినదిగాదు శస్త్రముగాదు అని భవానీ దేవిని స్మరించగా ఆమె నురుగులో చేరినది. వజ్రాయుధము హరి బలముచే నురుగుతో కప్పబడెను. అట్టి వజ్రాయుధము చేతబూని వృత్రుని పైవేటు వేసెను. దానితో వృత్రుడు కొండవలె నేలకూలెను. ఇంద్రుడు సంతోషించెను. పిదప ఇంద్రుడు సేనలతో కూడి సంతుష్టుడాయెను.

పరదేవత నురుగు నందుండి వృత్రుని మోహితుని చేయుట చేతనే ఇంద్రుడు వృత్రాసురుని చంప గలిగెను. ఇంద్రుడు బ్రహ్మహత్యా పాపముచే భయపడుచు తన భవనమునందు దుఃఖపడుచు తేజోహీనుడయ్యెను. తీరని దుఃఖముచే విల్లు విడిచి యింద్రుడు మానస సరోవరమందలి తామరతూడులో దాగియుండెను. ఇంద్రుడు ఇల్లు విడిచి వెళ్ళుట తెలిసి చింతాక్రాంతులై దేవతలున్న సమయమున అనేకములైన ఉపద్రవములు కలుగుచున్నవని మునులు దేవతలును ఆలోచించి నహుషుని ఇంద్రునిగా చేసిరి. నహుషు ధర్మిష్ఠుడైయును రజోగుణముచే మదన పీడితుడై శచీదేవిని నహుషుని ఆజ్ఞ తెలియజేసిరి. అంతట నామె బృహస్పతితో బ్రాహ్మ ణోత్తమా! నిన్ను శరణు వేడుచున్నాను. నన్ను నహుషుని బారినుండి కాపాడుము అని వేడుకొనెను. అప్పుడు బృహస్పతి యిట్లనెను. దేవి! నహుషుడు పాపి కామమోహితుడు అతనికి భయపడకుము అని పలికెను.

ఇంద్రాణి శ్రీదేవిని సందర్శించుట

శచీదేవి బృహస్పతిని శరణువేడెను. నహుడు మదనబాధచే బృహస్పతిపై కోపించెను. దేవతలు చెప్పిన మాటలు వినక శచీదేవిని తీసికొనిరండని నహుడు ఆజ్ఞాపించెను. దేవతలు ఇంద్రాణికి రక్షణ మిచ్చిన బృహస్పతిని సమీపించి ఆమెను నహుషున కీయవలెనని పలికిరి. బృహస్పతి యిట్లనెను.

శచీదేవి నహుషుని వద్ద కేగి నాభర్త మరణించినచో నిన్ను సేవింపగలనని పలికి ఇంద్రుని రప్పింపుడు అని. శచీదేవి నహుషుని చేరి రాజా! ఇంద్రుడు బ్రతికియుండెనా? చచ్చెనా? అని చెప్పగా శచీదేవి నహుషుని చేరి యట్లే చెప్పెను. నహుషుడు నీమాటను తప్పక నెరవేర్తును సప్తర్షులు నన్ను మోయుదురు అని పలికి మునులనుచిలిచి తన వాహనమును మోయుడనెను. జరుగనున్నది తెలిసిన మహర్షులట్లేయని యంగీకరించిరి. అంతట పల్లకిలో కూర్చొని నహుషుడు అగస్త్యుని కాలుపెట్టెను. మరియు త్వరగా నడువుమని కొరడాతో కొట్టెను. అంతట బృహస్పతి మానససరస్సునకు వెళ్ళెను. అతడింద్రునకు జరిగినదంతయు వినిపించెను. ఇంద్రుడు విని యానందిం చెను. పిదప దేవతలు బృహస్పతియు యింద్రుని తీసికొని వచ్చి సింహాసనము నందభిషేకమొనర్చిరి. ఆ విధముగా యింద్రుడు మరల రాజ్యమును పొంది శచీ సహితుడయ్యెను.

కర్మగతి

జనమేజయుడు మహానుభావా! ఇంద్రుడు కష్టములు పడుటకు కారణమేమి? తెలియజేయుమని యడుగగా వ్యాసుడిట్లు చెప్పసాగెను. తత్త్వవిదులు కర్మలు మూడు విధములుగ నుండును. అవి సంచిత వర్తమాన ప్రారబ్ధములు. ఇవి మరల సాత్వికరాజసిక తామసభేదముచే మూడువిధములు అనేక పూర్వజన్మలందు చేసినది సంచితము. ఇప్పుడిక్కడ చేయుచున్నవి. వర్తమానములు. జీవుడు సంచితములోని కొంతభాగమనుభవించుటకు ప్రేరేపింపబడును. అది ప్రారబ్దము. ప్రారబ్ధమనుభవించిన గాని తీరదు. జీవులు తాము మునుపు చేసిన మంచిచెడ్డలను తప్పక అనుభవింపవలెను. దేవగంధర్వమానవాది శరీరముల దాల్చుటకీ కర్మమే మూలకారణము. కర్మము నశించినచో ప్రాణికి జన్మముండదు. జీవులు సుఖదుఃఖముల ననుభవించిచుటకీ కర్మలే కారణములు. ఈ శరీరము ఇంద్రాగ్నియమవిష్ణు కుబేరులవలన కలిగినది. ప్రాణుల సుఖదుఃఖములకు శరీరము నిలయము. సుఖదుఃఖములు ఒకదాని వెంటనొకటి వచ్చుచుండును. జీవికి

స్వాతంత్ర్య మెప్పుడు నుండదు. దేవతలు అవతార పురుషులును అనేక కష్టములు ననుభవిం చినట్లు వినుచుంటిమి కదా! కర్మగతి అడ్డులేనిది.

శ్రీదేవీ నామమాహాత్మ్యము

జనమేజయుడు వ్యాసమహర్షి నిట్లడిగెను మహర్షీ నీవు సమస్త ధర్మములు తెలిసినవాడవు. అన్ని శాస్త్రములలో పండితుడవు. అధర్మ మధికముగా నుండు కలియుగములో మానవులు తరించు మార్గమును చెప్పుమనగా వ్యాసుడీ రీతిగా పలికెను:- రాజా! ఒకే ఒక ఉపాయము కలదు. రెండవ ఉపాయములేనే లేదు. అది యేమనగా శ్రీదేవినామమును స్మరించుట. అదియే సర్వపాపములను నశింప జేయును. కనుక కలియుగమును తలచుకొని భయపడనేల? బుద్ధి పూర్వకముగాక మనస్సు స్వాధీనములో లేక పోయినను విలాసముగా పలికినను శ్రీదేవీ నామము యెట్టి ఫలము నిచ్చునో అట్టి ఫలమును తెలిసికొనుటకు శివుడు మొదలగు వారును సమర్థులుకారు. సమస్తపాపములకు ప్రాయశ్చిత్త మొక్క దేవీ నామ స్మరణమే. దేవీ నామమును స్మరించినచో అన్ని పాపములకును ప్రాయశ్చి త్తము చేసికొనినట్లే యగును. ఇదియే అన్ని శాస్త్రములలోని రహస్యము. ఈ విషయ మును గమనించి దేవీపాదపద్మములను సేవించుము. జనులు మాయ యొక్క మహిమను గాని వైభవ మునుగాని యెరుగరు. లోకములో అన్నివిధములైన పాపములను శ్రీదేవీ నామ జపస్మరణములచే పోగొట్టుకొని మనశ్శాంతి నొంద వచ్చును అని వివరించెను.

ఆడీ బక యుద్ధ కథారంభము - హరిశ్చంద్ర కథ

విశ్వామిత్రుడు పూర్వము హరిశ్చంద్రుని కారణమున శపింపబడి కొంగ యయ్యెను. వసిష్ఠుడు విశ్వామిత్ర శాపముచే ఆడీరూపము ధరించెను. ఆ రెండు పక్షులును మానస సరోవరతీ మున జీవించుచుండెను. గోళ్ళతో, ముక్కులతో అవి తీవ్రముగ పోట్లాడుకొనుచుండెను. వారిరువురు మునివర్యులు గదా! వారికి పరస్పరము వైరమేల కలిగెను? ఒకరినొకరేల శపించుకొనిరి? అని జనమేజయుడ డుగగా వ్యాసుడిట్లు చెప్పెను. పూర్వము త్రిశంకుని కుమారుడు హరిశ్చంద్రుడు ప్రసిద్ధుడు. అతడు సూరవంశపురాజు. అతనికి సంతానము లేదు. పుత్రప్రాప్తి కలిగినచో వరుణప్రీతికి తన పుత్రుని బలిపశువుగా నిత్తునని ప్రతిజ్ఞ చేసెను. వరుణుడు సంతసించి సంతానము ననుగ్రహించెను. హరిశ్చంద్రుని భార్య గర్భ

వతియయ్యెను. సర్వలక్షణ సంపన్నుడగు కుమారుని కనెను. రాజు పరమానంద భరితుడయ్యెను. పుత్ర జన్మమహోత్సవము జరుగుచుండగా వరుణుడు రాజు వద్దకు నీ కుమారుని బలిపశువుగ చేసి యజ్ఞమొనర్పుమనెను. రాజు నిశ్చేష్టుడై నిబ్బరించుకొని స్వామీ! నీ కుమాలును యిచ్చినది నిజమే నాభార్య ఒక నెలకు పరిశుద్ధురాలగును.

అప్పుడు నరమేధమొనర్తుననెను. వరుణుడు వెళ్ళిపోయెను. నెల గడచిన పిమ్మట వరుణుడు వచ్చి మరల తన కోర్కెను వెలిబుచ్చెను. స్వామి! నా కుమారునకే సంస్కారమును జరుగలేదు. సంస్కారహీనుడర్హుడు కాడని చెప్పగా వరుణుడు రాజా! నన్ను మోసగించి మాటిమాటికీ రమ్మనుచున్నావు. సరే కొంత కాలమునకు మరల వచ్చెదనని వెళ్ళిపోయెను. సమావర్తన సంస్కారము వరకు నీ బాలుని పోషించి తదుపరి నీకర్పింతుననెను. అట్లే నిమ్మని వరుణుడు వెడలి పోయెను. కుమారుడు రోహితుడను పేరుతో పెరిగి ఎల్లవిద్యల విశారదుడయ్యెను. అతడు యాగవిషయము విని భయపడెను. తండ్రిని విడిచి కొండగుహలో నివ సించుచుండెను. అంత వరుణుడు నీవు వట్టిమోసగాడవు. నీ వుజలోదరవ్యాధిచే పీడింపబడుదువు గాక యని శపించి వెడలిపోయెను. రాజు వ్యాధి పీడితుడై చింతించుచుండెను. రోహితుడొక బాటసారి చెప్పగా తన తండ్రి వ్యాధిగ్రస్తుడై వట్లు వినెను.

అంతట తన తండ్రిని చూడవలెనని రోహితుడు తలచుచుండగా ఇంద్రుడు బ్రాహ్మణ వేషమున వచ్చి నీవిప్పుడు తండ్రి వద్దకు వెళ్ళినచో ఆతడు నిన్ను బలి పశువును చేయును. కనుక వెళ్ళవద్దని వారించెను. రాకుమారుడక్కడనే ఉండ నిశ్చయించుకొని తండ్రి వద్దకు వెళ్ళలేదు.

హరిశ్చంద్రుడు వ్యాధి విముక్తుడగుట

హరిశ్చంద్రుడు వ్యాధిచే బాధపడుచు గురువగు వసిష్ఠుని ప్రార్థింపగా నాతడు ధనమిచ్చి యెవని కుమారునైన తెచ్చి యాగము చేయుమనెను. రాజు మంత్రి నాపనికై యాజ్ఞాపించెను. మంత్రి అజీగర్తుడను దరిద్రునకు ధనమిచ్చి వాని కుమారుని యాగమునకు తెచ్చెను. రాజు యాగమారంభించెను. అప్పుడు విశ్వా మిత్రుడు వచ్చి బాలుని బలి చేయవద్దని కోరెను. రాజు విశ్వామిత్రుని మాట వినలేదు. అప్పుడు విశ్వామిత్రుడు ఆబాలునకు వరుణమంత్రము ఉపదేశించెను. బ్రాహ్మణ బాలుడా మంత్రమును జపించగనే వరుణుడు ప్రసన్నుడై ఆ బాలుని

బంధవిముక్తుని చేసెను. వరుణుడురాజును కూడ రోగవిముక్తుని చేసి వెడలి పోయెను. హరిశ్చంద్రుడు విశ్వామిత్రుని మాట విననందున రాజుపై ముని కోపించెను. ముని ముసలి బ్రాహ్మణవేషముతో వచ్చి మోసముతో రాజ్యమంతయు నపహరించెను. వసిష్ఠుడు తన యజమానుడు కష్టముల పాలాయెనని కోపించి విశ్వామిత్రుని కొంగవు కమ్మని శపించెను. విశ్వామిత్రుడాతని ఆడియను పక్షివగుమని ప్రతి శాపమిచ్చెను.

వసిష్ఠుని పూర్వ జన్మవృత్తాంతము

జనమేజయుడు వసిష్ఠునకు "మైత్రావరుణి" అను పేరెట్లు కలిగెనని ప్రశ్నింపగా వ్యాసుడిట్లు చెప్పెను. వసిష్ఠుడు "నిమి" శాపముచే శరీరము విడిచి మరొయొక జన్మమొందెను. మిత్రావరుణులకు జన్మించుట వల్ల మైత్రావరణీయని రెండవ జన్మమందు పేరు పొందెను. రాజు మహర్షి నేల శపించెనని మరల ప్రశ్నింపగా వ్యాసుడిట్లు చెప్పదొడగెను.

పూర్వము నిమి యను రాజు రాజసూయయాగము చేయదలచి భృగువు, అంగిరుడు, వాసుదేవ, గౌతములు మొదలగు మహర్షులను ఆహ్వానించి యాగ సామగ్రినంతయు సమకూర్చుకొని వసిష్ఠుని పూజించి యిట్లనెను. నీవు నాకు కులగురువు సర్వజ్ఞుడవుగాన నా యాగకార్యము నెరవేర్పుమని పలికి దేవిప్రీతి కొరకు దేవీ మహాయజ్ఞము యథావిధిగా నాచరించెదనని విన్నవిం చెను. అప్పుడు వసిష్ఠుడు ఇంద్రుడునన్నొక యాగమున కాహ్వానించి యున్నాడు. గనుక ఆ యజ్ఞము పూర్తియగు వరకు ఓ[illegible] పట్టుమనెను. రాజు ధనాశతో నీవు యింద్రుని యాగమునకు వెళ్ళుచున్నావు. అని పలికెను!

వసిష్ఠుడింద్రుని యాగమునకు వెళ్ళెను. అప్పుడు రాజు తన యజ్ఞమును అపింపు మని గౌతముని నియమించెను. ఇంద్రుని యాగము పూర్తియైన పిమ్మట నిమి యాగము చూడవచ్చిరాజు దర్శనమును కోరి నిల్చియుండగా సేవకులు నిద్రలో నున్న రాజును మేల్కొలుప లేదు. వసిష్ఠుడు గౌతముని ద్వారా యజ్ఞము చేయ పూనినందుకు కోపించి నీ శరీరము పడిపోయి విదేహుడవగుమని శపించెను. సేవకులా శాపము వినిరి. రాజు సేవకులవలన శాపము నుగ్రహించి. నీ శరీరము కూడ పడిపోవుగాక యని వసిష్ఠుని శపించెను.

వసిష్ఠుడు బ్రహ్మను ప్రార్థింపగా మిత్రావరుణుల తేజస్సునందు ప్రవేశింపుమని యాతడు చెప్పెను. వసిష్ఠుడట్లే చేయగా నొకప్పుడు ఊర్వశి మిత్రావరుణుల

కంటబడెను. వారిరువురు మోహితు లైరి. దైవయోగమున మిత్రా వరుణుల వీర్యమొకకుండలో పడెను. అందుండి యిరువురు సుకుమార ముని కుమారులు జన్మించిరి. వారిలో నొకడగస్త్యుడు. రెండవవాడు వసిష్ఠుడు. అగస్త్యుడు బాల్యమునందే తపస్సునకు వెళ్ళెను. వసిష్ఠుడిక్ష్వాకు మహారాజునకు పురోహితుడుగా వరింపబడెను.

నిమి చరిత్రము

జనమేజయుడు వసిష్ఠుని చరిత్ర చెప్పితివి గదా నిమి చరిత్ర కూడ చెప్పుమనగా వ్యాసుడు చెప్పనారంభించెను. రాజా! వసిష్ఠుడు వేరొక శరీరము ధరించెను. కాని నిమి మాత్రము మరొక శరీరముతాల్పలేదు. యజ్ఞము పూర్తికాకముందే రాజు శపింపబడెను. ఇప్పుడేమి చేయవలెను? అని ఆలోచించి నిమిలోని సూక్ష్మాంశమును గ్రహించి దానిని వివిధమంత్రములతో కాపాడుచుండిరి. కొంతకాలమునకు యజ్ఞము పూర్తి చెందెను. అప్పుడు ఋత్విక్కులు స్తుతింపగా దేవతలు పరమానందభరితులైరి. వారు దుఃఖితుడైన రాజును వరము కోరుకొనమనిరి. అప్పుడాతడు ఎల్ల ప్రాణుల కన్నులపై వాయురూపము దాల్చి చలించుచుండునట్లు వరమిమ్మనెను.

అప్పుడు దేవతలు రాజా! నీవు యజ్ఞేశ్వరియగు దేవిని ప్రార్థింపుము. ఆ దేవి నీ యీ జన్మమునకు సంతసించును. ఆ తల్లి నీ కోరిక తీర్పగలదు అని దేవతలు పలుకగా నిమి పరమభక్తితో పరాంబికను వివిధ దివ్యస్తోత్రములచే సవినయముగ స్తుతించెను. అంతట దేవి ప్రత్యక్షమయ్యెను. శ్రీమాత ప్రసన్నురాలు కాగా రాజిట్లు వరము వేడుకొనెను. ఓ తల్లీ! మోక్షప్రదమగు జ్ఞానము కలుగు జన్మననుగ్రహింపుము. నన్నెల్ల ప్రాణుల నేత్రములపై నివసింపనిమ్ము అని పరదేవత నీకు విమలజ్ఞానము కలుగుగాక నీ వెల్ల ప్రాణులనేత్రములపై నుండ గలవు. అని వరమొసగి దేవి యంత ర్ధానము నందెను. పిదప మునులు నిమి దేహమును మథింపగా నిమివంటి సర్వలక్షణ సంపన్నుడగు కుమారుడు జన్మించెను. అతడు "మిథి" యనియు జనకుడ నియు లోకమున పేరొందెను.

హైహయుల చరిత్ర

మునీంద్రా! హైహయులను క్షత్రియులు భార్గవులను చంపిరని వింటిని వారికి వైరమే కారణమున కలిగెనో తెలియజేయుము. అని జనమేజయుడడుగగా వ్యాసుడిట్లు చెప్పెను.

రాజా! ఈ చరిత్ర ఆశ్చర్యకరము. పూర్వము హైహయవంశ మందు కార్తవీర్యార్జునుడను రాజు కలడు. అతనికి వేయి చేతులు కలవు- గొప్ప బలశాలి. ధర్మవీరుడును. అతడు దత్తాత్రేయుని శిష్యుడు. యాగము లాచరించిన వాడు. భార్గవులకనేక దానధర్మము లొసగినవాడు. అతని దానములచే భార్గవులు ధనవంతులైరి. కొన్నాళ్ళకు కార్తవీర్యుడు స్వర్గమును చేరెను. అంతట హైహయులు దైవయోగమున మిక్కిలి బీదవారైరి.

ఒకప్పుడు హైహయులకు డబ్బుకావలసి భార్గవులను ధనమడిగిరి. వారు లేదని పలికి యేమియు నీయలేదు. కొందరు భార్గవులు హైహయులకు భయపడి తమ ధనరాసులను భూమిలో పాతిపెట్టిరి. మరికొందరు బ్రాహ్మణులకు దానమిచ్చిరి. రాజులు తమకు ధనమత్యావశ్యకము కాగా భార్గవుల ఆశ్రమములలో చొరబడిరి. భార్గవులు తమ యాశ్రమములు విడిచిపోయిరి. హైహయులు భార్గవుల యాశ్రమములను త్రవ్వి ధనమును వెలికి తీసిరి. బ్రాహ్మణులు చేయునది లేక రాజులను శరణువేడిరి. ఐనను రాజులు బ్రాహ్మణులను కొట్టి చంపిరి. పిమ్మట భార్గవులున్నచోటుకు వెళ్ళి వారిని చంపి భార్యల గర్భములు చీల్చివైచిరి. విప్రస్త్రీలు బోరున ఏడ్చిరి. లోభమువలన ప్రాణ ములను కూడ కోల్పోవుట సంభవించును. కౌరవుల నాశమునకు లోభమే కారణము. లోభబుద్ధులైన భార్గవులు హైహయుల చేత మరణించిరి.

ఔర్వుని జన్మవృత్తాంతము

హైహయులచే పీడింపబడిన భృగుస్త్రీలు భయపడి హిమవత్పర్వత గుహలకు వెళ్ళిరి. వారందరును గంగాతీరమున మట్టితో గౌరీదేవిని చేసి పూజించిరి. ఒకనాడు వారికి కలలో శ్రీలోకమాత దర్శనమొసగి మీలో ఒకతెకు తొడలనుండి ఒక దివ్య పురుషుడు జన్మించగలడు. అతడు మీ పనులన్నియు చక్కబెట్టగలడు అని పలికి అంతర్ధానమొందెను. పిమ్మట ఒక బ్రాహ్మణి తొడలో గర్భమును ధరించెను. హైహయలామెను చూచి కత్తులు చేతబట్టుకొని బాలకుడొకడు బయటపడెను. అతని తీక్ష్ణతేజస్సుచే హైహయులు గ్రుడ్డివారైరి. హైహయులు బ్రాహ్మణ స్త్రీల పాతివ్రత్యము చేతనే మనము గ్రుడ్డివారలమైతిమని తలచిరి. భయపడుచున్న బ్రాహ్మణ స్త్రీని శరణువేడిరి. మాకు చూపు ప్రసాదింపుమని వేడుకొనిరి. ఆ రాజులతో బ్రాహ్మణ స్త్రీ యిట్లనెను.

క్షత్రియులారా! మీ చూపులను నేను పోగొట్టులేదు. ఈ బ్రాహ్మణ బాలుడు మీపై కోపించెను. ఇతడేమిమ్ము గ్రుడ్డివారిని చేసెను. ఈ కుమారుడు శ్రీదేవి

వరప్రసాదముచే నాకు జన్మించినాడు. ఇతడు ఔర్వుడని ప్రసిద్ధినొందును. ఈతని వేడుకొనుడని పలికెను. పిమ్మట రాజులు బాలుని స్తోత్రము చేయగా ఔర్వుడు రాజులారా! మీరు మీమీ ఇండ్లకు వెళ్ళుడు అని పలుకగనే హైహయులకు చూపు వచ్చెను. వారు ఔర్వుని యనుమతితో ఇండ్లకేగిరి. బ్రాహ్మణకాంతయును దివ్యశక్తి గల కుమారుని వెంటబెట్టుకొని తన యాశ్రమమునకు వెళ్ళెను. ఈ విధముగ లోభులైన రాజులు చేసిన పాపకృత్యములు తెల్పితినని వ్యాసుడు ముగించెను.

హైహయ చరిత్ర

పూర్వము సూర్యపుత్రుడగు రేవంతుడనువాడు ఉచ్చైఃశ్రవమను గుఱ్ఱము నెక్కి వైకుంఠమునకు వెళ్ళెను. అతనిని లక్ష్మీదేవి చూచెను ఉచ్చైశ్రవము సముద్రము నుండి తనతో పుట్టిన దగుటచే లక్ష్మీదేవి మిక్కిలి ఆసక్తితో ఆ గుఱ్ఱమును చూచుచుండెను. విష్ణుమూర్తి అంత ఆసక్తితో చూచుచున్నావేమని లక్ష్మిని అడిగెను. ఆమె సమాధానము చెప్పక దానినే చూచుచుండెను. అంత విష్ణువు కోపించి నీవు గుఱ్ఱముగా జన్మింపుమని శపించెను. ఆమె భూలోకమున ఆడగుఱ్ఱమై జన్మించెను. భర్త శాపమునకు మిక్కిలి విచారించుచు ఈశ్వరుని ప్రార్థించెను. ఆతడు ప్రత్యక్షమై లక్ష్మీదేవి అవస్థను గుర్తించి విష్ణుమూర్తికి కబురంపి హయరూపములో నున్న లక్ష్మిని స్వీకరింపుమనెను. శ్రీమహావిష్ణువు తాను మగ గుఱ్ఱము రూపము ధరించి ఆడు గుఱ్ఱము రూపములోనున్న లక్ష్మివద్దకు వెళ్ళెను. వారిరువురి సమాగమముచే నొక పుత్రుడు కలిగెను. లక్ష్మీనారాయణులిరువు రును గుఱ్ఱము రూపము వదలి వైకుంఠమునకు వెళ్ళుచు పిల్లవానిని అచటనే విడిచి వెళ్ళిరి.

హరియశ్విని యందు పుత్రుని బడయుట

లక్ష్మీదేవి ఆ పిల్లవాని తీసికొని వెళ్ళదలచినను భర్త మాటలచే పిల్లవానిని తీసికొని వెళ్ళలేదు. లక్ష్మీనారాయణులు పిల్లవాని విడిచి వెళ్ళగా చంపకుడను విద్యాధరుడు ఆప్రదేశమునకు వచ్చెను. అతడు మదనాలస యను తన ప్రియురాలితో యథేచ్ఛగా విమానములో క్రీడలందు మునిగి తేలుచుండెను. అతడంతలో భూమి మీద సుఖముగా నాడుకొనుచు దేవతా పుత్రునివలె మనస్సు నాకర్షించు చున్న శిశువును చూచెను. చంపకుడు వెంటనే విమానము దిగి శిశువు నెత్తుకొని పేదవాడు పెన్నిధిని గావించినట్లు పరమానందమొందెను. ఆ

పిల్లవాని తన ప్రియురాలి చేతికిచ్చెను. ఆమె ప్రేమతో బాలుని మోము ముద్దాడి ఒడిలో కూర్చొనబెట్టు కొనెను.

అప్పుడు మదనాలస ప్రియతమా! ఈ బాలుడెవనివాడు. ఈ వనమున నితని నెవరు వదలిరి. అనగా చంపకుడు ప్రియా! మనము సర్వజ్ఞుడగు నింద్రుని అడిగి తెలిసికొందము. ఇంద్రుని యనుమతితో వీనిని పుత్రునిగ స్వీకరింతము అని పలికెను. యింద్రుని యీ విషయమున ప్రశ్నింపగా ఇంద్రుడిట్లు చెప్పెను. ఈతడు లక్ష్మీనారాయణుల పుత్రుడు. యయాతి కుమారుడగు తుర్వసుని కీయదలచి యీ బాలుని లక్ష్మీనారాయణులు విడిచి వెళ్ళిరి. ఆ రాజీపుత్రుని గ్రహింపగలడు కాన నీవు చూచిన చోటునే యీ బాలుని విడిచి పొమ్మనెను. చంపకుడట్లే చేసెను. అంతట లక్ష్మీనారాయణులు విమానమెక్కి రాజున్నచోటికి వెళ్ళిరి. హరి రాజును చూచి విమానము దిగెను. రాజు హరికి దండప్రణామ మాచరించెను. రాజు పుత్రసంతానమును కోరగా తమ సాకళిందీ సంగమస్థలమున నీకొరకు బాలుని ఉంచితిని. అతని నిగ్రహింపుమనెను. రాజు పరమానంద భరితుడాయెను.

ఏకవీరుని జన్మవృత్తాంతము

పిమ్మట యయాతి పుత్రుడు పుత్రుడున్నచోటికి వడిగా రథము నెక్కివెళ్ళెను. అక్కడ నాడుకొనుచున్న చిన్నారి బాలుని కన్నులార చూచెను. రాజు హరుని ప్రభావమున లక్ష్మీనారాయణులకు కలిగిన మదనసుందరుడగు పుత్రుని చూచి ఎత్తుకొని తన యింటికేగెను. రాణికి బాలుని చూపి ఏకవీరుడని వానికి నామకరణ మొనర్చెను. రాజు ఋణవిముక్తుడయ్యెను. అతని వంశము వర్థిల్లెను.

ఏకవీరుని వనవిహారము - ఏకావళి చరిత్ర

రాజు బాలునకు జాతకర్మాది సంస్కారములనొనర్చి ఋణత్రయ విము క్తునిగా తనను భావించెను. పదకొండవయేట ఉపనయనము చేసి ధనుర్వేదము నేర్పించెను. రాజాతనికి పట్టాభిషేకము చేయదలచెను. రాజు బ్రాహ్మణులను పిలిచి యథావిధిగా పట్టాభిషేకము జరిపెను. రాజ్యము కుమారునకు అప్పచెప్పి భార్యతో నాతడు వనమునకు వెళ్ళెను. ఆతడు మైనాకపర్వతముపై ఆశ్రమ మేర్పరచుకొని ఆహార నియమముతో పార్వతీ దేవిని ధ్యానించుచుండెను. రాజు రాణియు స్వర్గమలకరించిరి. హైహయుడు ఒకనాడు గుఱ్ఱము నెక్కి మంత్రి కుమారులతో గంగాతీరమున కేగెను. అచట సుందరదృశ్యముల చూచుచు పద్మ

ములకు కుడివైపున నొక యందగత్తెను తేరిపార జూచెను. ఆమె యువతి చెలి కత్తెలను విడిచి దుఃఖపడీతయై యుండెను. రాజామెను సమీపించి నీవెవరి కుమార్తెవు? నీ దుఃఖమునకు కారణమేమి? నేనెట్టి తీవ్రతర దుఃఖములనైన తొలగింపగలను. నీ కోరికను తెలిసినచో దానిని నెరవేర్చి నిన్నానందింపజేయ గలను. అనగా నామె యిట్లు పలికెను.

ఓ మహాబాహూ! రైభ్యుడను రాజు కలడు. అతని భార్య రుక్మరేఖ. ఆమె సర్వశుభ లక్షణములు గలది. ఆ పుత్రుడు లేని దైన్యలపించుచు భర్తతో సంతానము లేని నా బ్రతుకు వ్యర్థము గదా! యని పలు కగా రాజు బ్రాహ్మణులను పిలిచి యజ్ఞ మొనరించెను. అప్పుడగ్ని నుండి ఒక కన్య ఆవిర్భవించెను. హోమము చేయువారా కన్యను స్వీకరింపుమని రాజుకు చెప్పిరి. రాజా బాలికను స్వీకరించి భార్యకిచ్చెను. ఆ బాలిక ఏకావళి యను పేర దినదినాభివృద్ధి గావించుచుండెను. నేనారాజు మంత్రి కుమార్తెను. నా పేరు యశోవతి.

ఒకనాడు ఏకావళి వనవిహారమునకు గంగాతీరము చేరగా నేను ఆ వెంట నుంటిని. మేమక్కడ ఆటలలో మునిగియుండగా కాలకేతుడను రాక్షసుడక్కడకు వచ్చెను. వాడు రక్షక పరివారమును పారద్రోలి యామెను పట్టుకొనెను. కామోద్రే కముతో నామె నాతడు తీసికొని వెళ్ళెను. కాలకేతువు దుఃఖించుచున్న రాకుమార్తెను తన పట్టణమునకు కొనిపోయెను. నేనామె వెంట ఏడ్చుచు వెళ్ళితిని. కాలకేతువు నన్ను కూడ తన రథముపై నెక్కించుకొని యామె నోదార్చుమనెను. వాని పట్టణము పాతాళరంధ్రములో నున్నది. ఆ రాక్షసుడామె పై మక్కువతో తనను వివాహమాడు మని వేడుకొనెను.

అప్పుడామె మా తండ్రి హైహయునకు నన్నిచ్చియున్నాడు. నేను స్వతంత్రు రాలను కానని చెప్పెను. ఐనను వాడామెను విడువలేదు. ఆమెను గూర్చియే నేను దుఃఖించుచున్నాననగా ఏకవీరుడిట్లనెను. నీవాదుష్టుని పట్టణము నుండి యెట్లు బయటకు రాగలిగితివి? ఆమె తండ్రి యామెను హైహయున కిచ్చెనను మాట నాకు నమ్మదగినదిగా లేదు. హైహయరాజును నేనే మరియొకడు లేడు. నీసఖి నాకొరకేల యుద్దేశింపబడినదో తెలియజేయుము. నేనా రాక్షసుని చంపినీ చెలికత్తెను తేగలను. ఆమె ఉండుచోటు తెలియజేయుము. అని యడిగెను!

యశోవతి రాజా! నేను శ్రీత్రిభువనేశ్వరీదేవిని ధ్యానించితిని. నేనామెను స్మరించుచు. ఆమె మంత్రరాజమును విడువక జపింప నారంభించితిని. అంత జగదంబ నాభక్తికి మెచ్చి గంగాతీరమున హైహయుడను రాజు కలడు వాని

పేరేకవీరుడు. ఆతడు మిమ్ము ఉద్ధరింపగలడు. రాక్షసుని చంపి యా మానవతిని విడిపింపగలడని చెప్పెను. మరియు ఏకవీరుని ఏకావళి భర్తగా పొందునట్లు ప్రయత్నింపుము అని పలికి అంతర్థానము చెందెను. నేను రాకుమారికి స్వప్న వృత్తాంతము చెప్పగా నీవు త్వరగా నచటికేగుమని నన్ను పంపినది. వీరవర్యా! నీవెవరివో యెవరి కుమారు డవో తెలియజెప్పుమనెను.

హైహయ కాలకేతుల యుద్ధము

అంతలో దైవయోగమున అక్కడకు మహాయోగి యగు దత్తాత్రేయుడు వచ్చెను. ఏకవీరుడాతని నుండి శ్రీయోగీశ్వరీ మంత్రము గ్రహించెను. ఆ మంత్ర ప్రభావముచే అన్నిటిని తెలుసుకొను శక్తియు, అంతటను తిరుగు శక్తియు కలిగెను. ఆ రాక్షసుని పట్టణమునకు హైహయుడు యశోవతియు చేరిరి. రాక్షసులు వీరి రాకను కాలకేతువునకు తెలియజేసిరి. ఆ వీరుడు యుద్ధమునకు వచ్చి యున్నాడు. పోరాటమునకు నీవు త్వరపడుమని విన్నవించిరి. కాలకేతువు ఏకవీరునితో పోరుటకు రాక్షసుల నాజ్ఞాపించి తాను ఏకావళి వద్దకు కూర్చొని ప్రియవచనములు పలుకుచుండెను. ఇంతలో భటులు కొందరు వచ్చి యశోవతి తెచ్చిన సైన్యము మనమీద విరుచుకు పడుచున్నది. నీవు వెంటనే గొప్ప సైన్యముతో వారిని నెదుర్కొనుము. అనిచెప్పిరి! అంతట నాతడు రథము నెక్కి నగరము వెలుపలకు వెళ్ళెను. అదే సమయమున ఏకవీరుడు రథముపై వచ్చెను. అంతట వారిరువురు వాసవవృత్రుల వలె ఘోరముగా పోరిరి. రమాపుత్రుడగు ఏకవీరుడు గదతో కొట్టగా రాక్షసుడు నేలకూలెను. అంతట యశోవతి ఏకావళి వద్దకు వెళ్ళి కాలకేతు మరణము తెలిపి ఏకవీరుడు నీపై అనురాగముతో నిన్ను చూడగోరుచున్నాడని పలికెను.

అప్పుడు ఏకావళి ఆకామార్తుడు తనను స్వంతము చేసికొనునని తలచి మాసిక శరీరముతో మాసిన చీరతో నాతని గుడారమునకేగెను. ఆమెను చూచి కామపరవశుడగు రాకుమారునితో రాజకుమారా! నీవు ఈమె తండ్రి వద్దకు ఈమెను తీసికొనివెళ్ళినచో నాతడీ మెను నీకిచ్చి వివాహము చేయగలడని చెప్పెను. ఏకావీరుడట్లే యని ఏకవళిని తండ్రి వద్దకు కొనిపోయెను. చాలకాలమునకు తన పుత్రిక వచ్చుచున్న విషయము నెరిగి ఎదురేగి యింటికి కొనివచ్చి విషయమంతయు తెలిసికొని ఒక శుభము హూర్తమున వివాహము జరిపించెను. అనేక వస్తువులతో నేకావళిని ఏకవీరునితో పంపెను. ఏకావళికి కృతవీర్యుడను పుత్రుడు కలిగెను. కృతవీర్యుని కొడుకు కార్తవీర్యుడు. ఇట్లు హైహయవంశము భూమండలముపై విస్తరిల్లెను.

విక్షేపశక్తి వర్ణనము

జనమేజయుడు భగవంతుడైనని విష్ణువు గుఱ్ఱపు రూపమేల దాల్చెనని ప్రశ్నింపగా వ్యాసుడు నారదమహర్షి నడిగిన వృత్తాంతమును సమాధానము చెప్పుచున్నాడు. తానుద్వీపమునందు జన్మించుట, చిత్రాంగదుడు చనిపోవుటచే తల్లి సత్యవతి దుఃఖించుట. తల్లి మాటను కాదనలేక తమ్ముని భార్యలందు సంతానము కనుట. దానిచే మమకారమేర్పడుట.

వ్యాసుని మోహవృత్తాంతము

సరస్వతీ తీరమున శాంతిలేక తిరుగుట, తీరని మోహపాశమును గూర్చి చింతించుట- పాండవులు జన్మించుట. భీష్ముడు వారలను పెంచుట, వారేక చక్రపురమందు నివసించుట ద్రౌపదిని వివాహమాడుట నా యీ మోహమునకు కారణమేమని నారదుని ప్రశ్నింపగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులే మాయలోపడు చుండనిక నీనాలెక్కఏమి? యని పలికెను.

నారదుడు స్వవృత్తాంతము తెలుపుట

మోహమునకు కారణమడుగుచున్న వ్యాసుడునకు నారదుడిట్లు చెప్పెను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడ మాయకు లోనైనవారే. వ్యాసమునీశా! నేను పూర్వము భార్యను గూర్చి మోహములోబడి దుఃఖముల ననుభవించితిని. అది యెట్లన పూర్వతడు నేను భూలోకమున తిరుగుచుండగ వర్షకాలము వచ్చుటచే సంజయుడను రాజు నింట నాల్గు నెలలుంటిమి. ఆ రాజు కూతురు దమయంతి మాకు పరిచర్య చేయుచుండెను. ఆ బాలిక సంగీతము తెలిసినది. నేను గానము చేయుచుండుట చూచి యామె నాపై మోహము కలదాయెను. పర్వతుడీ విషయము గ్రహించి నేను కూడ నామెపై ప్రేమతో నున్నట్లు తెలిసికొని నన్ను కోతి ముఖము కలవానిగా శపించి వెళ్ళిపోయెను. దమయంతి నన్నుదప్ప మరొకనిని వివాహమాడనని చెప్పుటచే నామెతో నాకు వివాహము జరిగెను.

నారదుని వివాహము

వానరముఖము గల నేను పెండ్లి చేసికొని బాధపడుచు నచ్చట యెట్లో ఉంటిని దమయంతి మాత్రము నా కోతిముఖము చూచి లేశమాత్రము విచారింపక వికాసముతో కూడిన ముఖముకలదై యుండెను. పిదప పర్వతముని నన్ను చూచుటకు వచ్చెను. నేనతనిని సత్కరించి పూజించితిని. అప్పుడు మేమిరు

పురము శాపముల త్రిప్పివైచుకొంటిమి. పర్వతుడు స్వర్గమునకేగెను. నేనొకప్పుడు విష్ణుమూర్తితో వినోదములు జరుపుచు క్షణములలో ఆడుదానినైతిని. నన్నొక రాజు చూచి మోహించి వివాహమాడెను. నాకొక పుత్రుడు కలిగెను.

మాయా ప్రభావము- నారద వృత్తాంతము

రెండేళ్ళ తరువాత యొక పుత్రుడు కలిగెను. పిమ్మట వరుసగా ఎనిమిది మంది పిల్లలు కలిగిరి. మనుమలను చూచితిని. నేను స్త్రీనైతినని యెన్నడును విచారింపలేదు. పిమ్మట నొకరాజు యుద్ధమునకు రాగా వాని చేతిలో కొడుకులు మనుమలు మరణించిరి. నేను మిక్కిలి దుఃఖపడితిని. అంతట విష్ణువు వృద్ధ బ్రాహ్మణరూపములో వచ్చి పుణ్యతీర్థమున స్నానము చేయించెను. ఆ పుణ్యతీర్థ మున మునుగగనే నేను పురుషుడనైతిని. నా తండ్రి లోకములో నెల్లవారును. నేను శివ విష్ణువులును మాయా మోహితులమే యని చెప్పెను.

సప్తమ స్కంధము

దక్ష సృష్టిక్రమము

సూతమహర్షి యిట్లనెను. ఓ మహర్షులారా! జనమేజయుడు శ్రీదేవీ కథా సుధారసము గ్రోలి యానందభరితుడై సూర్యచంద్ర వంశములందలి రాజుల చరిత్ర వినగోరుచున్నానని ప్రార్థింపగా వ్యాసమహర్షి ప్రసన్నుడై దేవీ కథారసము వెల్లి గొలుపనిట్లు చెప్పెను.

పూర్వము శ్రీమన్నారాయణుని నాభిపద్మము నుండి బ్రహ్మ జన్మించెను. అతడు తీవ్రముగ తపస్సు చేసి శ్రీమహాదేవి నారాధించెను. అప్పుడామె సంతసించి వరమీయగా బ్రహ్మ జగత్తుల సృజింపనారంభించెను. కాని ప్రపంచ సృష్టి చేయజాలకపోయెను. మొదట ఏడుగురు మానస పుత్రులను సృష్టించెను. పిమ్మట బ్రహ్మయొక్క అహంకారమునుండి రుద్రుడుతొడ నుండి నార దుడు బొటనవ్రేలి నుండి దక్షుడు సనకాది మానస పుత్రులుద్భవించిరి. ఎడమ బొటనవ్రేలి నుండి దక్షుని భార్య జన్మించెను. ఆమె పేరు "వీరిణి", "అసిక్ని" అను పేరు కూడ నామెకు కలదు. నారదుడు వీరిణి గర్భమందు జన్మించి పేరు గాంచెను. బ్రహ్మ మానసపుత్రులను కనెను. వారెల్లరు ప్రజాసృష్టి చేయదలచిరి. వారిని చూచి నారదుడు భూమి పరిమాణము తెలిసికొని ప్రజాసృష్టి చేయవలెనని పలుకగా కొందరు తూర్పునకు, మరికొందరు దక్షిణమునకు, కొందరు పశ్చిమ దిక్కునకు, వేరొక కొందరు ఉత్తరదిక్కునకు వెళ్ళిరి. అప్పుడు దక్షుడు మరి కొందరిని ప్రజాసృష్టికై పుట్టించెను. నారదుడు వారిని కూడ భూపరిమాణము తెలిసికొని సృష్టింపుడనగా వారును అట్లే వెళ్ళిరి.

అంతట దక్షుడు కోపించి నీవు నాకు పుత్రుడవై జన్మింపుమని శపించెను. అందుచే వీరిణి గర్భమున నారదుడు పుట్టవలసి వచ్చెను. దక్షునకు పుత్రని యొగదుఃఖము కొంత తగ్గెను. దక్షుడు వీరిణియందు అరువది మంది కన్యలను కూడ పుట్టించెను. వారిలో పదముగ్గురు కన్యలను కశ్యపమహర్షికి భృగువున కిరువుర నిచ్చెను. పదిమందిని ధర్మునకు ఇరవైయేడుగురను చంద్రునకు నలుగురిని అరిష్టనేమికి - ఇరువురను కృశాశ్వునకు మరి యిర్వురను అంగిరసునకు నొసంగెను. వారికి కొడుకులు, మనుమలు జనించిరి. వారే దేవదానవులైరి. వారు తమలో తాము వైరము పెంచుకొనిరి.

సూర్యవంశరాజులు - సుకన్యా వృత్తాంతము

జనమేజయుడు మహానుభావా! సూర్యవంశమున పుట్టిన ధర్మాత్ములగు రాజుల చరిత్ర వినుపింపుమనగా వ్యాసమహర్షి యిట్లు చెప్పెను. పూర్వము విష్ణువు నాభికమలము నుండి బ్రహ్మ జన్మించెను. అతడు ప్రపంచమును సృష్టించుటకు ఘోరమగు తపస్సు నొనర్చెను. అతడు మాతృదేవిని ధ్యానించి గొప్పశక్తిని సంపాదించెను. శుభలక్షణములతో కూడిన మరీచ్యాది మానస పుత్రులను సృష్టించెను. మరీచి కుమారుడు కశ్యపుడు. దక్షుని పదముగ్గురు కుమార్తెలాతని భార్యలు. కశ్యప ప్రజాపతి దేవదానవ యక్ష పన్నగ పశుపక్షులను సృజించెను.

దేవతలందరిలో సూర్యుడు ప్రముఖుడు. అతని పుత్రుడు వైవస్వతమనువు. అతని కుమారుడిక్ష్వాకుడు. వీనికి తొమ్మిదిమంది సోదరులు. నాభాగుడు ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశుడు, నృగుడు, దిష్టుడు, కరూషుడు, పృషధ్రుడు, అనువారలు. ఇక్ష్వాకునకు నూరుగురు కుమారులు. వారిలో పెద్దవాడు వికుక్షి వైవస్వతమనువునకు మరల తొమ్మిదిమంది జన్మించిరి. నాభాగునకు అంబరీషుడు జన్మించెను. ధృష్టుని కుమారులు ధార్షికులు. వీరు బ్రహ్మభూతులు. శర్యాతికి ఆనర్తుడను కుమారుడు చక్కని సుకన్యయను కన్యయు జన్మించిరి. శర్యాతి తన అంద చందాల కుమార్తెను గ్రుడ్డివాడగు చ్యవనమహర్షి కిచ్చెను. ఆమె ప్రభావముచే చ్యవనునకు కళ్ళు వచ్చినవి. సూర్యుని కుమారులైన అశ్వినీదేవతలు మునికి కంటి చూపు ననుగ్రహించిరి. అనగా జనమేజయుడు రాజు తన అందాల బాలునికి గ్రుడ్డివాని కేల యిచ్చెనో తెలుపుమనగా వ్యాసుడిట్లు చెప్పెను.

వైవస్వతుని పుత్రుడు శర్యాతి. వానికి నాలుగు వేలమంది రాజకన్యలు భార్యలై యుండిరి. శర్యాతి కుమార్తె సుకన్య. రాజధాని సమీపమున నొక సుందరమైన సరోవరము కలదు. అచట ననేక వృక్షములు కలవు. కోకిలు, నెమళ్ళు మనస్సు నాకర్షించుచుండును. అది నిర్జన ప్రదేశమగుట భార్గవుడైన చ్యవనుడు అక్కడ తపస్సు చేయుచుండెను. తనపై పుట్టలు పెరిగినను చలింపక సమాధి యందుండెను. ఒకనాడు శర్యాతి విహారమునకై అచ్చటికి వచ్చెను.

సుకన్యా వృత్తాంతము

వ్యాసమహర్షి జనమేజయునకు యిట్లు చెప్పుచున్నాడు. పూర్వము భృగు వంశమున పుట్టిన చ్యవనుడనుమహర్షి శాంతుడు అతడు జన రహితమైన ఒకానొక వనమందు ఘోరనియమములతో తపస్సు చేయుచుండెను. ఆ మునీశ్వరుడు

వీరుకూడ త్రాగక హ్రీంకార స్వరూపిణీయగు పరదేవతను తన హృదయ కమల మందు ధ్యానించుచుండెను. అట్లు నిష్ఠతో నుండగా అతని చుట్టును పైన పెద్దపుట్ట పెరిగెను. ఆ పుట్టనిండ చలి చీమలు వ్యాపించి యుండెను. తనపై పుట్టపెరిగినను కదలకమెదలక అందే కూర్చొనియుండెను.

ఒకనాడు "శర్యాతి" యను సూర్యవంశపు మహారాజు తన యంతఃపుర స్త్రీలతో వనవిహారము చేయుచు అచట నున్న సరస్సువద్దకు వచ్చెను. అందలి నిర్మలమైన నీటిని చూచి తన సుందర స్త్రీలతో ఆ సరస్సునందు క్రీడింపనారంభిం చెను. అతని కూతురు అందగత్తెయైన సుకన్య అను కన్యకామణి అచట పూలు కోయుచు కేరింతలాడుచుండెను. ఆ పడుచుపిల్ల తనశరీరముపై ఆభరణములు తళతళలాడగా గజ్జెలందియలు ఘల్లుఘల్లుమనగా గంతులు వేయుచు చ్యవన ముని తపస్సు చేయుచున్న పుట్ట వద్దకు వచ్చెను. ఆ చిలిపి పిల్లతోటి పిల్లలతో పుట్టవద్ద కూర్చుండి పుట్ట రంధ్రముల నుండి మిణుగురులను పోలిన మినుకు మినుకుమను వాడి వెలుగులను చూచెను. ఆయువతి యిదేమి వింతయోయని వాడి ముల్లును తీసుకొని దానితో ఆ వెలుగులను తీయుటకు పూనుకొనెను. పుట్ట దగ్గరకు చేరిన ఆ యందాల బొమ్మను చ్యవనముని పుట్టలో నుండియే చూచెను. మహర్షి ఆయువతీ రత్నముతో ఓ కల్యాణీ నీవేమి చేయబోవుచున్నావు? నేనీ పుట్టలో నుండి తపస్సు చేయుచున్నాను. ముల్లుతో పుట్టను పొడువవద్దు. దూరముగా పొమ్మ్మ అని పలుకుచున్నను సుకన్య ఆమాటలు పెడచెవినిబెట్టి ముల్లుతో పుట్టలోని వెలుగులను గ్రుచ్చెను. మరియు అటనుండి చెలికత్తెలతో వెడలిపోయెను. చ్యవనమహర్షి తన కళ్ళలోముల్లు గ్రుచ్చుకొనినందున బాధతో కోపించెను. అతని కోపప్రభావముచే సైనికులకు మంత్రులకు రాజునకును మలమూత్రములు బంధించినవి. రాజు ఈ కష్టమునకు కారణము ఏ మాయని విచారముతో తన సైనికులను గూడి తన ఇంటికి వెళ్ళెను.

రాజు ఇంటికి వెళ్ళి తన సైనికులలో ఎవడేని చేయరాని పనిచేసెనేమో యని తెలిసికొనెను. విచారణ చేయగా అచటనున్న సరోవరమునకు పడమర దిక్కున అడవిలో చ్యవనమహర్షి తపస్సు చేయుచుండెనని వినెను. అతనికెవరో ఏదో అపరాధము చేసియుండవచ్చును. అందువలన అందరికినీకష్టము వాటిల్లిన దనియు ఆ తపశ్శాలి భృగువంశమున జన్మించినవాడు మహాతపశ్శాలి. అట్టి మహర్షికెవరో మనవారిలో అపరాధము చేసియుందురు. తెలియని వారెవరో ఆ మహర్షి నవమానించి యుందురు. ఈ యనర్థమునకదియే కారణము కావచ్చునని

రాజు మనస్సులో తలచెను. రాజు ప్రశ్నింపగా సైనికులు మనస్సులో బాధ చెందుచు మేము మనోవాక్కాయములతో నేమహర్షికెట్టి యపకారము చేయలేదనిరి. శర్యాతిమహారాజు చింతాక్రాంతుడై తన సైనికులను మంత్రి వర్గమును కోపముతో మంచిమాటలతోడను కారణమడిగెను. ఆ సమయమున సుకన్య దుఃఖించుచున్న తన తండ్రిని చింతించుచున్న మంత్రులను చూచి ముల్లుతో తాను పుట్టను పొడిచిన విషయమును, అయ్యో! "చచ్చితిని" అను మెల్లని స్వర ముతో పుట్టలోపల నుండి వినబడిన మాటలను ముల్లునులాగి చూడగా దానికి రక్తమంటుకొన్న విషయమును తెలియజేసి అందుకు తాను ఆశ్చర్య పడినట్లును చెప్పగా యిది యంతయు విని ఆమునికి జరిగిన అపరాధమునకు ఫలితమే యిది యని ముని చుట్టును పెరిగిన పుట్టవద్దకు వెళ్ళెను. మునిచుట్టును పెరిగిన పుట్టను పగుల గొట్టించి దుఃఖపడుచు వృద్ధుడైన తపశ్శాలియగు చ్యవనుని చూచెను.

శర్యాతి- చ్యవనుని ప్రార్థించుట - సుకన్యా చ్యవనుల వివాహము

అప్పుడు శర్యాతి చ్యవన మహర్షికి దండ ప్రణామములాచరించి స్తుతించి సవినయముగా నిట్లు మనవి చేసెను. మహాను భావా! నా కుమార్తె బాల్యముచే చిలిపిగా ఆటలాడుచు చేయరానివని చేసినది. ఈ సుకన్యను నీచల్లని చూపులతో కనికరించి కాపాడుము. మునివర్యులు నిత్యము శాంతచిత్తులై యుందురని విందుము. కనుక నా బాలికను క్షమింపుడు. అని రాజు దిగులుతో వినయముతో ప్రార్థించుట చూచి చ్యవనమహర్షి అతనికిట్లనియె.

ఓరాజా! నాకెన్నడును కొంచ మైన కోపములేదు. నీ కన్య సుకన్య నన్నంతగా బాధించినది. ఐనను నేను శపించలేదు. రాజా! నేనే తప్పు చేసి యెరుగను. నీ కన్యమూలమున నాకన్నులకింతగ బాధ కలిగినది. ఈ పాప ఫలితముగా నీవు మిక్కిలి దుఃఖము ననుభవించుచున్నావని నాకు తోచుచున్నది. అపరాజితాదేవి శివకుటుంబినియగు శ్రీదేవీ భక్తునకపకారము చేసినవాడు శివునిచేత రక్షింపబడు చున్నవాడైనను సుఖమును పొంద జాలడు. రాజా! నేను ముసలివాడను ఇప్పుడు గ్రుడ్డి వాడనైతిని. ఇక నాబ్రతుకు కటికిచీకటి మయము. ఇప్పుడిక నాకు కావలసిన పరిచర్యలుచేసి నన్ను సుఖింపజేయువారెవరు అని పలికెను.

అప్పుడు రాజిట్లనెను:- ఓ మునిప్రవరా! తపశ్శాలుర కోపము క్షణమాత్ర ముండును. కనుక క్షమింపుము. నాకు చాలమంది సేవకులున్నారు. వారు

నిన్నెల్లపుడు సేవించునట్లు నియమింతును. అనగా చ్యవన మహర్షి యిట్లు పలికెను. ఓ రాజా! ఇది ఏకాంత ప్రదేశము నేనా గ్రుడ్డివాడను. ఇక నా తపస్సెట్లుసాగును? నీ సేవకులు నాకు యిష్టమైన విధముగా ప్రవర్తింతురని యెట్లు నమ్మదగును? రాజా! నన్ను ప్రసన్నునిగా చేసికొన దలచినచో నాయిష్టమును వినుము. నామాట నిలబెట్టుము. కమలనయన యగు నీకుమార్తె సుకన్యను నాకిచ్చి పెండ్లి చేసినచో ఆమె నాకు యెల్లప్పుడు విడువక పరిచర్య చేయగలదు. ఇట్లైనచో నేను తృప్తి చెందు దును. ఆమె సేవలతో నా తపస్సు నిర్విఘ్నముగా సాగగలదు.

రాజేంద్రా! నేను చెప్పినట్లు చేయుము. నేను సంతోషించెదను. ఇందువలన నీకు మిక్కిలి మేలుకలుగగలదు. రాజా! మనస్సులో చక్కగా ఆలోచించు కొని నీ కుమార్తెను నాకు దానము చేయుము. నేను తపస్సు చేసుకొనెడి వాడను నియతవ్రతుడను. ఆమెను నాకిచ్చుటవలన యెట్టి దోషము నీకు సంభవింపదు. అనగా విని శర్యాతి యీముసలివానికి నాపడుచుపిల్ల నిచ్చుట యెట్లు సంభవము? ఆమె యంగీకరించునా! యని చింతా క్రాంతుడై మౌనముతో నుండెను.

ఈతడు కురూపికూడాను. ఇట్టివానికి దేవకన్యవంటి నాపిల్ల నర్పించిన నేనేమి సుఖపడగలను? నా కూతురేమి సుఖపడును? ఎంత పాపాత్ముడై నను మతిహీనుడైనను రాబోవు మంచి చెడులు తెలిసియు తన కుమార్తె సుఖమును బలిచేయ తలంచునా! నా గారాల పిల్ల ఈ ముసలి చీకును పొంది ఏమి సుఖము ననుభవింపగలదు? ఎట్లు కాలముగడుపగలదో? యౌవనమందున్న అందగత్తె తనకన్నింటను ఈడుజోడుగా నున్న భర్తను పొందికూడ తృప్తిపడదు. ఇకనాసుకన్య ఈముసలి గ్రుడ్డివానితో ఏమి సుఖమును పొందగలదు? మంచి అందము యౌవనముగల అహల్య యింద్రునివలన మోసగింపబడెను కదా! కనుక నాకన్య కెన్నికష్టములు కలిగినను సుకన్యను మాత్రమీతనికీయజాలను. అని తలచి రాజు దుఃఖిత మనస్కుడై తన యింటికి మంత్రులరావించి ఆలోచన జరిపి వారితో నిట్లనెను:-

ఓ మంత్రులారా! ఇప్పుడు నాకర్తవ్యమేమి? నాకుమార్తెను ముసలి బ్రాహ్మణున కీయవలయునా? లేక యీ దుఃఖములను భరింప వలయునా? మీరందరాలో చించి నాకు మంచిమార్గము తెలియజేయుడు. మంత్రులిట్లనిరి:- మహారాజా! ఇట్టి దుస్తరమైన దురంతమైన ధర్మ సందేహములకు మేము మాత్రమేమి సమాధానము చెప్పగలము. ఆ ముసలి గ్రుడ్డివానికీ యందాలచిందునీ సుకన్యను చేజేతులనెట్టు లప్పగింప గలము అని పలికిరి.

సుకన్య తన తండ్రియు మంత్రు లును చింతాక్రాంతులగుట గ్రహించి, నవ్వుచు తన తండ్రితో నిట్లుపలికెను. తండ్రీ! నీ వేలచింతించుచుంటివి? నామను గడ గూర్చి నీవింత దుఃఖముతో విచారింపనేల? ఆ మునిపుంగవుని మనస్సునకు నన్ను నేను బాధ కలిగించితిని. కనుక ఆ మునీంద్రుని సమీపమునకు వెళ్ళి అతనిని ప్రసన్నుని చేయగలను. అతని మనస్సునకు నచ్చునట్లు మాట్లాడెదను. ఆమునివర్యునకు నేను అర్పించు కొందును. అని పలికిన కుమార్తె మాటలు వినిరాజు సంతోషించి మంత్రు లందరు వినునట్లు సుకన్యతో నిట్లు పలికెను.

ఓ సుపుత్రీ నీవబలవు. ఆముని గ్రుడ్డివాడు, వృద్ధుడు, ముక్కోపి, నీవు సహనముతోవాని కెట్లు సేవలందీయగలవు? నీవందగత్తెవు నిన్నొక గ్రుడ్డివాని కెట్లప్పగింపగలను? ఆ ముసలి మునితన సుఖము తాను చూచుకొనును. అతనికి నిన్నెట్లు సమర్పిం చగలను? ఏ తండ్రియైన తన పిల్ల కన్ని విధముల ఈడుజోడు కులము బలము గలవానికిచ్చి వివాహము చేయును. ప్రతివ్యక్తియు తన కుమార్తెను ధనధాన్యములు సంపదలు గలవానికే యిచ్చి వివాహము చేయును. కాని నిరుపేదకీయ సంకల్పించడుకదా!

విశాలాక్షీ! నీనిండు గడుసు జవ్వనమెక్కడ? వనమందు నివసించు ముసలి చీకుఎక్కడ? వయసుమీరి సత్తువకోల్పోయిన మునికి నిన్నెటులీయగలను? నా సైనికులు మేము చచ్చిన చత్తుముగాక బాలామణీ! నిన్నొక గ్రుడ్డివానికర్పించుట నాకెంత మాత్రమిష్టముకాదు. కాగలదియేదియో కాక మానదు. ధైర్యముతో నుందును. బాలా! నీవు గుండె నిబ్బరముతో నుండుము. నా రాజ్యము నా శరీరము ఉన్నను పోయిననూ నాకు దిగులు లేదు. నిన్ను మాత్రము ఒక గ్రుడ్డివాని చేతిలోపెట్టను. కన్నులు లేనివానికేవిధముగా నైనను నిన్నీయను.

అను తండ్రి మాటలు విని తనయంతరాత్మ ప్రబోధించిన మాటల నిట్లు పలికెను. తండ్రీ! నన్ను గూర్చి ఇంత ఆలోచింపనేల? నన్నా ఆ మునివర్యునకిపుడు సమర్పించుము. నావలన లోకమునకు మేలుచేకూరుగాక. పరమపావనుడు మహాశక్తిమంతుడునగు మునివర్యుని పరమ సంతోషముతో సేవించగలను. ఆ ఏకాంత ప్రదేశమునందు పరమభక్తితో పతివ్రతా ధర్మముతో చక్కగా ముసలి మునితో మసలుకొందును. తండ్రీ! నాలో విషయభోగవాంఛలేదు. నా మనస్సునకు విషయ సంకల్ప సంబంధము లేదు. నా మనస్సు ప్రకృతి ప్రశాంతమైనది. అను సుకన్య మంచి మాటలనాలకించి మంత్రులు మిక్కిలి ఆశ్చర్యపడిరి. అపుడు

రాజు చ్యవనమహర్షి సమీపమునకు పరమసంతోషముతో వెళ్ళెను. ఆ తపోధను నకు తలవంచి ప్రణమిల్లిరాజిట్లనెను.

ఓ స్వామీ! నా పుత్రికను నీసేవలకు తప్పక స్వీకరింపుము. అని రాజు వివాహ మంగళ విధానముతో తన కన్య సుకన్యను చ్యవనమహర్షికి ధారాపూర్వకముగా దానమొనర్చెను. చ్యవనముని సుకన్యను స్వీకరించి ప్రసన్నుడాయెను. రాజు కట్నములీయగా మహర్షి వాటిని తాకలేదు. మునీశ్వరుడు సుకన్యను మాత్రమే తన పరిచర్యలకు స్వీకరించెను. అట్లు చ్యవనుడు ప్రసన్నుడుకాగా సైనికులు మొదలగువారు. నిరోధము తొలగి సుఖపడిరి. రాజు తన కన్యను ముని కర్పించి సంతోషముతో తన యింటికి వెళ్ళెను.

సుకన్య తండ్రి మరలి వెళ్ళునప్పుడు తండ్రీ! ఈవిలువైన సొమ్ములు వస్త్రములు తీసికొని వెళ్ళుము. నాకు జింకచర్మము నారచీరలు ఇమ్ము. ముని భార్యకు తగిన వేషము ధరించి నేనీ తపస్వికి సేవలు చేసెదను. తండ్రీ! నీకీర్తి యీ భూమి పైనే కాక స్వర్గ పాతాళములందు కూడ శాశ్వతమై వెలయుగాక. నేను పరలోక సుఖముకొరకే మునివర్యుని రాత్రింబవళ్ళును సేవించెదను. ఈ ముసలి గ్రుడ్డివానికి అందాల జవరాలివగు నన్ను సమర్పించి నందులకు చింతింప కుము. నా సౌశీల్యము చెడునేమోయను ఊహనీకెంత మాత్రము వలదు. అరుంధతి వసిష్ఠునకు ధర్మపత్నియైనట్లు నేనితనికి ధర్మపత్నిగా ప్రవర్తింపగలను.

ఇందుకు నీవు విచారింపవలదు. అత్రికి పత్నియైన అనసూయ పరమసాధ్విగా ప్రసిద్ధినొందినట్లు నేమను యీ మహర్షికి పత్నినై పరమసాధ్విగా లోకములో కీర్తిగడింప గలను. అని ధైర్యము చెప్పెను! ధర్మము తెలిసిన శర్యాతి మహారాజు సుకన్య మాటలను ప్రశంసించి ఆమెకు నారచీరలను జింక చర్మమును తీసి కొనుమని యిచ్చెను. ఈ విధముగా మునిభార్య వేషముతో చిరునవ్వు చిందించు ముఖముతో శోభించు కుమార్తెను చూచి రాజు గొల్లుమని యేడ్చెను. రాణులందరు వచ్చి నారచీరలు ధరించిన సుకన్యను చూచి యెలుగెత్తి యేడ్చిరి. వారు దుఃఖ ముతో పెదవులు తడబడగా పెద్దపెట్టున విచారించిరి. ఈ విధముగా శర్యాతి మహారాజు తన కుమార్తెను చ్యవనమునికి అప్పగింత పెట్టి ముని యనుమతితో మంత్రులు వెంటరాగా తన యింటికి వెళ్ళెను.

సుకన్య చేసిన పతిసేవ-అశ్వినీ దేవతల మాటలు

శర్యాతి మహారాజు ఇంటికి వెళ్ళిన పిమ్మట సుకన్య ధర్మతత్పరురాలై మునిపతికి తీయని ఫలములను కందమూలములను తెచ్చిపెట్టి సేవ చేయుచు

అగ్నులను సేవించుచుండెను. ఆమె ప్రేమతో తనపతిని పన్నీటితో స్నానము చేయించి జింకచర్మము ధరింపజేసి దర్భాసనముపై కూర్చుండబెట్టును. ఆ పతివ్రత మునివర్యుని సమీపములో నువ్వులు యవధాన్యము దర్భలు కమండలువు నుంచి మునివర్యా! నిత్యానుష్ఠాన మొనరింపుము అని మనవి చేయును. నిత్యానుష్ఠానము పూర్తియైన పిమ్మట సుకన్య తన ప్రియభర్తను చేతులతో లేవదీసి దర్భలపైగాని వేరొక ఆసనముపైగాని కూర్చొనబెట్టును. పిమ్మట ఆ రాజకన్య పండిన పండ్లను మంచి నీవారాన్నమును తీసికొని వచ్చి భర్తకు తినిపించును. తన భర్త పూర్తిగా భోజనము చేసిన పిమ్మట సుకవ్య తన ప్రియభర్తను చేతులతో లేవదీసి దర్భలపైగాని వేరొక ఆసవముపైగాని కూర్చుండబెట్టును. చక్కని తాంబూల మందించును.

పిమ్మట భర్త యాజ్ఞతో ఆమె తనపనులు తాను చూచుకొనును. తనపతి తినగా మిగిలినది తాను భుజించి పిమ్మట అతని సమీపమునకు వెళ్ళి ప్రేమ భక్తి ఉట్టిపడునట్లు ప్రభూ! ఏమియాజ్ఞ అని అడుగును. మీయాజ్ఞయైనచో మీ పాదములనొత్తగలనని పలుకుచు సుకన్య నిత్యము పతిసేవాపరాయణయై ప్రఖ్యాతి గడించెను. ముని సాయం కాలము హోమము చేసిన మీదట సుకన్య మునిపతికి తీయని ఫలములను తెచ్చి యిచ్చు చుండును. పిదప మునియను మతితో మిగిలిన ఫలములను తాను భుజించును. ఆ కోమలాంగి తన భర్తను మెత్తని శయ్యపై సుఖ కరముగ పరుండబెట్టును.

తన ప్రియకాంతుడు పరుండి యుండగా కులస్త్రీల యొక్క ధర్మములను గూర్చి యతనినడిగి తెలుసుకొనును. భర్తకు పాదసేవ చేసి యతడు నిద్రించిన పిమ్మట భర్త పాదముల యొద్ద తాను నిద్రించును. ఎండలు మెండుగాకాయు గ్రీష్మకాలమున తన భర్తకు చల్లని విసినికఱ్ఱగాలులతో సేవచేసి సుఖపెట్టుచుండను. హేమంత ఋతువు నందు చిన్నచిన్న పుల్లలు తెచ్చి మంట చేసి యిప్పుడు మీకు వెచ్చగా నున్నదా? యని అడుగుచుండును. తెల్లవారకముందే భర్తనులేపి అతని శౌచక్రియకు నీటిని మట్టిని తెచ్చి యిచ్చుచుండును. అతని శౌచక్రియ పూర్తియైన పిమ్మట ఆమెతన భర్త చేయి పట్టుకొని తీసుకువచ్చి ఒక శుభాసనముపై కూర్చుండబెట్టి అతని పాదములను చేతులను మట్టితో నీళ్ళ తోడను యథా విధిగా కడుగును.

ఆ రాజకన్య మునిరాజునకు ఆచమనము చేయించి పండ్లు తోముకొనుటకు పుల్లను తెచ్చియిచ్చును. తరువాత ఆమె మునిస్నానము కొరకు వేడినీళ్ళు సిద్ధము

చేసి బ్రాహ్మణోత్తమా! పండ్లు తోముట పూర్తియైనచో వేడినీళ్ళు స్నానము చేయుటకు సిద్ధముగా నున్నవి. సమంత్రకముగా స్నానము చేయవచ్చును. తూర్పు దిశను సంధ్యారాగము వ్యాపించుచున్నది. హోమ సమయము సమీపించి నది. యథావిధిగ హోమము నిర్వర్తించి దేవతార్చన చేయవచ్చు.

అని యీవిధముగా సుకన్య మునిపతిని పతినిగా చేసికొని ప్రశంసింపదగిన నడువడికలదై నిత్యము నియమనిష్ఠలతో భర్తకు ప్రేమతో సేవలు చేయు చుండెను. ఆ పతివ్రత ఈ విధముగ అగ్నులను అతిథులను అభ్యాగతు లను పూజించుచు చ్యవనమహర్షిని సంతోషముగా సేవించు చుండెను.

ఇట్లుండనొకనాడు సూర్యుని పుత్రులగు అశ్వినీ దేవతలు ఇద్దరు చ్యవనముని యాశ్రమము వద్ద స్వేచ్ఛగా విహరించుచుండిరి. స్నానము చేసి తనయాశ్రమునకు వెళ్ళుచున్న సర్వాంగ సుందరియగు సుకన్యను వారిరువురును చూచినారు. దేవకన్యవంటి సౌందర్య రాశియగు సుకన్యను చూచి మోహామధికముకాగా ఆమె వద్దకు వెళ్ళి యిట్లనిరి.

ఓ గజగామినీ! సుందరీ! క్షణమాగుము. మేము దేవతలము. మేమడిగిన ప్రశ్నలకు నిజమైన సమాధానములు పలుకుము. అందమైన కన్నులు కలదానా! నీవెవరి బిడ్డవు? ఎవరి పుత్రికవు? నీభర్తఎవరు? ఒంటరిగా నీవీ చెరువులో స్నానము చేయుట కెందుకు వచ్చితివి? లక్ష్మీదేవికి సాటివచ్చు శోభతో వెలు గొందుచున్నావు. నిన్ను గూర్చి తెలిసికొనదలచినాము. నిజము చెప్పుము. పాదరక్షలు లేకపోవుటచే మెత్తని నీపాదములు కందిపోవుచున్నవి. ఈ కటికనేలపై నీయడుగులు పడుట చూడగా మాగుండెలు బ్రద్దలగుచున్నవి. సుందరీ! నీవు విమానము నెక్కదగిన దానవు. ఈ చిట్టడివిలో నెందులకు పంచరించుచున్నావు? వేలాది దాసీజనముచే కొలువబడదగిన దానవు. నీవు రాజకన్యవో దేవకన్యవో నిజము చెప్పుము.

ఓ పుణ్యాత్మురాలా! నిన్ను కన్నతల్లి ధన్యురాలు నీ తండ్రియు ధన్యుడు. ఇక నిన్ను వివాహమాడిన భర్తయదృష్టమేమని చెప్పుము? నీ పవిత్ర పాదములు తాకుటచే ఈ భూమి శోభించుచున్నది. నీభర్త యెవరో నిజముగా చెప్పుము. వారిని చూడగోరుచున్నాము. అనువారి మాటలు విని సుందరాంగి సుకన్య సిగ్గుతో నేను శర్యాతి మహారాజు కుమార్తెను చ్యవనమహర్షి భార్యను నా తండ్రి నన్నీ మునీశ్వరునికిచ్చి వివాహము చేసినాడు. ఈ మునికి నేను సహధర్మచారిణిని. నా భర్త తపశ్శాలి. వృద్ధుడు గ్రుడ్డి. నేను ప్రేమతో భక్తితోడను నిరంతరము నాభర్తను సేవించుచుందును. మీరెవరు? ఏ పనిమీద వచ్చితిరి? నా భర్త ఆశ్రమ

మందున్నాడు. మీరు అక్కడకు వచ్చి ఆశ్రమమును పావనము చేయుడు. అని వినియముతో పలికెను. అని సుకన్య పలుకగా అశ్వినీ దేవతలిట్లనిరి.

ఓ కల్యాణీ! నీ తండ్రి నిన్నీ మునికి ఎందులకు దానము చేసెను? ఓ సుందరీ! నీవీ వనప్రదే శమున మెరపుతీగవలె వెలుగొందుచున్నావు. దేవతలందుకూడ నీ యంతటి అందగత్తె కనబడలేదు. నీవు దివ్యమాల్యాంబరములు దివ్యాభరణములు ధరింపతగిన దానవు. ఈ నార చీరలు నీకు తగవు. ఓ విశాలాక్షీ! నీవు ముసలివానిని గ్రుడ్డివానిని భర్తగా స్వీకరించి ఈ నట్టడవిలో నెందుకు బాధపడుచున్నావు. అయ్యో! విధివిలాసమెంత విపరీతమైనది! మిసమిస లాడు నిండు యౌవనము పొంగులు వారుచుండ ఆ ముసలివానిని వరించి యేమి సుఖపడుదువు? నవయౌవన మందున్న నిన్ను విధాత గ్రుడ్డివానికి భార్యగా చేసినాడు. నీకితడు తగినవాడు కాడు. ఇంకొకనిని పతిగా వరింపుము. లేనిచో నీ జీవితమంతయు వ్యర్థమేకదా! గ్రుడ్డివాడు భర్త యగుట అరణ్యమున నివసించుట జింకతోలు కట్టుకొనుట యివన్నియు నీకు తగినవికావని తలచుచున్నాము.

ఓ శుభాంగీ! ఈ పండు ముసలి మునిని సేవించిన నీకేమి సుఖము? దోరవయస్సు వ్యర్థము చేయకుము. మాలో ఒకనిని వరింపుము శుభాంగీ! నిన్ను పోషించి రక్షించుట చేతకాని వానిని నీలోని కోర్కెలు తీర్చజాలని వానిని భాగ్యహీనుని మునిని వదలి మా యిరువురిలో నచ్చినవానిని వరింపుము. శుభాంగీ! ఇట్టి ముసలి చీకుతో ఎట్లుకాలము గడుపగలవు? నీవు సుందరనందవనమందు చైత్రరథము నందును స్వేచ్ఛగా విహరింపుము. నీవు రాజకన్యవు. శుభ లక్షణములు కలదానవు. ఈ వనమందు తగినజంటలేక ప్రొద్దెట్లు గడుచును? ముసలి మునిని వదలి మాలో ఒక్కనిని వరించి స్వర్గ సుఖములననుభవింపుము. ఈ గ్రుడ్డివానితో ముసలివానితో ఈ అడవియందు నీకేమి సుఖము కలుగును? నీ పడుచు తనమెక్కడ? ఈ గ్రుడ్డి వృద్ధుడెక్కడ? దుఃఖములు నీకిష్టమావేమి?

అశ్వినిదేవతల మాటలు విని మితభాషిణియైన సుకన్యవణుకుచు ధైర్యము పూని వారితో ఇట్లు చెప్పెను:- రవిపుత్రులు, సర్వజ్ఞులు దేవప్రియులునగు మీరు ధర్మశీల కులసతినగునన్నిట్లు మాట్లాడదగునా? సురశ్రేష్ఠులారా! నా తండ్రి నన్ను యోగనిష్ఠుడగు మునివర్యునకు దానము చేసెను. అట్టి నేను సామాన్యకులటా మార్గము నెట్లనుసరింపగలను? సూర్యుడు-కర్మసాక్షి-సర్వలోక చక్షువు కశ్యపసుతుడు. అతనికి కుమారులైన మీరిట్లు పలుకుట సమంజసము కాదు. ఒక కులకన్య తన ప్రాణనాథుని విడిచిపెట్టి పరపురుషునెట్లు చేరగలదు? ఈ

సంసారము సారహీనము మీరు సూక్ష్మధర్మము నిర్ణయింపగలరు. పుణ్యాత్ములారా! నేను శర్యాతి మహారాజు పుత్రికను. సుకన్యను పతిభక్తి పరాయణను మీరిక స్వేచ్ఛగా వెళ్ళవచ్చు. లేనిచో మిమ్ము శపించెదను. అనే సుకన్య మాటలు విని అశ్వీదేవతలు ఆశ్చర్యములో మునిగిరి.

చ్యవనుడు యువకుడగుట-సుకన్య శ్రీదేవిని స్తుతించుట

వారు మునివలన భయము నూహించి సుకన్యతో ఇట్లనిరి. ఓ రాజపుత్రీ! నీ పాతివ్రత్య ధర్మమునకు ప్రసన్నులమైతిమి. నీ శుభము గోరివరము నీయదలచితిమి కోరుకొనుము. సుశీలా! మేము దేవవైద్యు లము. నీ పతిని నవయువకునిగా అందగాడుగా చేయగలము. మేము ముప్వురము సమానముగా వయోరూప దేహములు కలవారనుగుదుము. మాలో ఒక్కని పతిగా వరింపుము. అనువారి మాటలువిని సుకన్య విస్మయమంది తన భర్తవద్దకు వెళ్ళి అతనితో వారు పలికిన విచిత్ర వాక్కుల నిట్లు చెప్పెను:-

ఓ భృగునందనా! మీ యాశ్రమసమీపమున సూర్య పుత్రులు తేజః స్వరూపులై వచ్చియున్నారు. నేను వారిని చూచితిని. వారిరువు రును నాసౌందర్యముచూచి కామపరవశులైరి. నీ పతిని నవయువకునిగా చేయుదు మని మాటయిచ్చినారు. నీ ముసలిపతికి చూపు వచ్చునట్లు చేసెదము. దివ్య దృఢ శరీరుని చేసెదమని చెప్పి నీవు మేము చెప్పిన నియమమును పాటింప వలెననిరి. అది యేమనగా "మేము నీ పతికి మాతో సమానమైన రూపము వయస్సు శరీరము నొసంగుదుము. అప్పుడు మా ముగ్గురిలో ఒక్కని పతిగా వరింపుము" అని సాధుపుంగవా! వారి మాటలు విని యీ అద్భుతవిషయము నీకు చెప్పుటకు తమవద్దకు వచ్చితిని. ఈ క్లిష్టపరిస్థితిలో నేనేమి చేయవలయునో తెలియజెప్పుము. సర్వజ్ఞా దేవతల మాయ తెలియ శక్యముకానిది. వారికపటము నెరుగని దానను. కనుక నీవు చెప్పినట్లు చేసి నీకోర్కె తీర్చెదను. ఆజ్ఞాపింపుము. అని యడిగెను!

అనగా చ్యవనముని యిట్లనియె:- సాధుశీలా! కాంతా! నీవిప్పుడు శీఘ్రమే వెళ్ళి నామాటగా దేవవైద్యులగు సూర్యపుత్రుల నిచ్చటకు తీసికొని రమ్ము. వెంటనే వారి మాట పాటింపుము. దీనికి విచారింప వలదు. అని ధైర్యము చెప్పెను. పతి యనుమతి నొంది. సుకన్య వారివద్దకు వెళ్ళి ఓ యశ్వినీ కుమారులారా! మీరు దేవతలలో గొప్పవారు. నేను మీ నియమము పాటింప గలను అని చెప్పెను. ఆ

మాటలు విని ఆశ్వినులు ముని సమీపము నకు వెళ్లి యిట్లు పలికిరి. ఓ రాజకన్యా! ఇప్పుడు నీ భర్త నీటిలో మునుగవలెను. అప్పుడతనికి చక్కని రూపము యౌవనము ప్రాప్తించును. అని అశ్వినులు పలుకగనే చ్యవనముని నీటిలో మునిగెను. ఆ సరస్సు నుండి ముగ్గురు దివ్యపురుషులు బయలువెడలిరి. ఆ ముగ్గురును దివ్య దేహము కలవారు. నవయువకులు దివ్యకుండలమండితులు సమాన రూపావయవ ములు కలవారును. అప్పుడు వారుముగ్గురు నొకే కంఠముతో పద్మముఖీ! మాలో నీకిష్టుడైన వానినొక్కని పతిగా వరింపుము. నీకు మేలగుగాక. మాలో నీకెవని యెందెక్కువ ప్రేమ కలదో అతనినే వరింపుము అని పలికిరి. అప్పుడు సుకన్య సమాన వయోరూపములు గలవారిని చూచి వారిలో తన భర్తను గుర్తింప లేక వ్యాకులచిత్తయై యిట్లు చింతించెను. ఇప్పుడేమి చేయుదును? ఎవరిని వరింప వలెనో తోచుటలేదు. నేను నాపతిని తప్ప వేరొకనిని వరింపను. అని విచారించిన సుకన్య విశ్వేశ్వరి పరదేవతయగు భగవతిని ధ్యానించి యీ విధముగా స్తుతించెను.

శ్లో॥ శరణంత్వాం ప్రసన్నాస్మి మాతః పరమదుఃఖితా ।
రక్షమేఽద్య సతీధర్మం నమామిచరణేతవ ॥
నమః పద్మోద్భవే! దేవి! నమశ్శంకరవల్లభే ।
విష్ణుప్రియే నమోలక్ష్మి వేదమాతస్సరస్వతి ॥
ఇదంజగత్త్వయా సృష్టం సర్వం స్థావరజంగమమ్ ।
పాసిత్వమిద మవ్యగాతథాత్సి త్వం తుశాన్తయే ॥
బ్రహ్మ విష్ణు మహేశానాం జననీత్వం సుసమ్మతా ।
బుద్ధిదాసి త్వ మజ్ఞానాం జ్ఞానినాం మోక్షదాసదా ॥
అజ్ఞాత్వం ప్రకృతిః పూర్ణాపురుష ప్రియదర్శనా ।
భుక్తిముక్తి ప్రదాపి త్వం ప్రాణినాం విశదాత్మనామ్ ॥
అజ్ఞానాం దుఃఖదాకామం సత్వానాం సుఖసాధనా ।
పతిందర్శయ సర్వజ్ఞే విదిత్వామే సతీవ్రతమ్॥
ఏవం స్తుతాతదా దేవీ తథా త్రిపురసుందరీ ।
హృదయేస్యాస్తదాజ్ఞానంద దావాశు సుఖోదయమ్ ॥
నిశ్చిత్య మనసాతుల్యా వయోరూప ధరాన్ సతీ ।
ప్రసమీక్ష్యతు తాన్సర్వాన్వవ్రే చాలా స్వకంపతిమ్ ॥

స్తోత్రభావము:- ఓ జగన్మాతా! నేను దుఃఖార్తనై నిన్ను శరణు వేడుచున్నాను. నీ పాదపద్మములకు మ్రొక్కుచున్నాను. నాపాతివ్రత్యమును నిలబెట్టుము. ఓం హ్రీం

కారకమలాలయా! దేవీ! నీకు నమస్కారము. ఓ హరిప్రియా! లక్ష్మీదేవీ! వేద మాతా! సరస్వతీ! ఈ చరాచరప్రపంచమంతయు నీచే సృష్టింపబడినది. నీవు లోకములను రక్షింతువు. శాంతికై లోకములను సంహరించెదవు. తల్లీ నీవు బ్రహ్మా విష్ణు మహేశ్వరులకు తల్లివిగదా! అజ్ఞానులకు బుద్ధిని సుజ్ఞానులకు ముక్తిని నీవు ప్రసాదించెదవు. నీవు పరప్రకృతివి. పురుషులకు ప్రియదర్శినివి. నీవు జ్ఞానులందరకును ముక్తిని ప్రసాదింతువు. అజ్ఞానులకు దుఃఖమును కలిగింతువు. ప్రాణులకు సుఖమును కలిగించుటయే నీపని. ఓ యమ్మా! యోగులకు సిద్ధిదాయి నివి. జయదాయినివి కీర్తిదాయినివి. నేనిప్పుడు విశ్వాసముతో నిన్ను శరణు వేడు చున్నాను. ఓ మాతా! నేనిపుడు దుఃఖ సముద్రమున మునిగి యున్నాను. దేవతల మోసమునకు గురియైతివి. వీరిలో నెవరిని వరింప వలెనో తోచుటలేదు. నాపతి దేవుని నాకు చూపింపుమమ్మా దేవీ! నీవు సర్వజ్ఞురాలవు నా పాతివ్రత్యము నీకు తెలియును. నా పతినెరిగింప జేయుము.

అని సుకన్య త్రిపురసుందరీదేవిని ప్రస్తుతించెను. సుకన్య హృదయము చ్యవన మునిని గుర్తించునట్లు దేవిజ్ఞాన నేత్రమునొసంగెను. సమానమైన రూప యౌవనములుగల ఆముమ్మురిలో తన పతి యెవరో గుర్తింపగలిగెను. ఆ విధముగా సుకన్య తన పతిని గుర్తించగలిగి నందులకు దేవతలు సంతోషించిరి. ఆ దేవత లును దేవి యనుగ్రహముచే ప్రసన్నులైరి. సుకన్య పరమ పాతివ్రత్యము నకు ప్రసన్నులై దేవతలు వరముల నిచ్చిరి. దేవతలు మునిని వీడ్కొని వెళ్ళుటకు సిద్ధముగా నుండిరి. అప్పుడు చక్కని చూపును సుందరదేహమును యువశక్తిని భార్యను పొంది చ్యవనమహర్షి దేవవైద్యులకిట్లనెను:-

ఓ యశ్వినులారా! మీ యిరువురి వలన నేను మహోపకారమును పొందితిని. సౌందర్యవతి యగు భార్యను పొందికూడ నేను సుఖపడలేకపోతిని. నాకు కంటి చూపును సౌందర్యమును దేహదార్ఢ్యమును మీరు ఇచ్చినారు. మీకు నేను ప్రత్యుప కారమును చేయదలచితిని. ప్రత్యుపకారము చేయకపోవుట మహాదోషము. ఆ కృతఘ్నుని జన్మము వ్యర్థము. కనుక కోరికను తీర్చదలచియున్నాను. మీ మనో వాంఛ తెలియజేయుడు. అనగా వారు తమలో తామాలోచించుకొనిరి. మహర్షితో నిట్లనిరి. మాతండ్రి దయవలన మా కోరికలన్నియు తీరినవి. కాని దేవవైద్యులమగు మాకు సోమపానము చేయవలెనను కోరికయున్నది. పూర్వము బ్రహ్మ చేసిన యాగములో ఇంద్రుడు వైద్యులమగుటచే దేవతలతోపాటు సోమపానము తగదని నివారించెను. కనుక ధర్మజ్ఞా! నీకు శక్తియున్నచో మాకు సోమపానము చేయు

నవకాశము కలిగింపగోరు చున్నాము. ఈ పని నెరవేర్పుము/మాకు సోమపానము చేయవలెనను ఆసక్తి అత్యధికముగానున్నది. నీవు మాయాశతీర్పగలదిట్టవు. అనగానే చ్యవన మహర్షి దేవేంద్రుని యెదుట మీరు సోమపానము చేయునట్లు నిర్వహింపగలను. నిజము మాట్లాడుచున్నాను,నామాట నమ్ముడు శర్యాతి మహారాజు గొప్ప తేజస్వం తుడు. అతని యజ్ఞములో మీ కోరికతీరగలదు. అని పలుకగా సంతోషముతో అశ్వినులు స్వర్గమునకు వెళ్ళిరి. తరువాత చ్యవన ముని తన భార్యను తీసికొని తన యాశ్రమమును చేరెను.

శర్యాతిని చ్యవనుని చూడవచ్చుట

జనమేజయుడు కోరగా వేదవ్యాసుడు చ్యవనమహర్షి పరమాద్భుత చరిత్ర నిట్లు చెప్పెను:- శర్యాతి మహారాజు యజ్ఞము చేయగా దాని యందు చ్యవన ముని సుకన్యా సుందరితో ప్రసన్నుడై విహరించెను. ఎట్లనగా ఒకనాడు రాత్రి శర్యాతి భార్య చింతాక్రాంత మనస్సుతో వణకుచు తనభర్తతో నిట్లనెను:- రాజా! మన కుమార్తె సుకన్య అడవిలోనున్న గ్రుడ్డి మునికి భార్యయై చచ్చెనా బ్రతికియున్నదో తెలియుటలేదు. ఆ మున్యా శ్రమమున కొకమారు సగౌరవ ముగా వెళ్ళి చూచివచ్చెదము. అటువంటి భర్తతో మన సుకన్య యేమి చేయుచున్న దోకదా! ఆమె లోలోనక్రుంగి కృశించుచుండవచ్చును. ఓ రాజర్షీ తపస్సుచే క్షీణించిన కుమార్తెను నా వద్దకు తీసుకొనిరమ్ము. నా కుమార్తె గ్రుడ్డి ముసలి పతిని చేపట్టి నారచీరలు కట్టి మిక్కిలి కృశించియుండును. ఆమెను తప్పక చూడవలయును అని పలుకగా శర్యాతి యిట్లనెను.

ఓ విశాలాక్షీ! మన సుకన్యను మునిపుంగవుని చూచుటకిప్పుడే వెళ్ళుదునని దుఃఖించుచున్న భార్యనోదార్చి రధమెక్కి వేగమే మున్యాశ్రమమునకు వెళ్ళెను. అచట ఆశ్రమమందు నవయౌవన సంపన్నుడు దేవకుమార సమానుడైన ముని వర్యుని చూచెను. దేవసమానుడైన మునిని చూచి నా పుత్రిక యెంతలోకనింద్య మైన పనిచేసినది? అని రాజు తలచెను. ఈమె మన్మధబాధకు తట్టుకొనలేక వృద్ధుడు గ్రుడ్డియైన భర్తను చంపి వేరొకని పతిగా చేసికొన్నది. నిండు పరువమున మన్మధార్తిని సహించుట శక్యముకానిది. ఈమె మూలమున మా మను వంశము నకు తీరనిమచ్చ యేర్పడినది. ఎవని కూతురు చెడ్డదో అతని జీవితము వ్యర్ధము. సర్వపాపముల దుఃఖము లనుభవించుటకే ప్రాణులకు కుమార్తె జన్మించును. నేను నాస్వార్ధము కొరకు ఎంతటి తగనిపని చేసితిని! అయ్యో ఒక ముసలి చీకునకు నా ప్రియమైన కుమార్తె నంటగట్టితినే? తండ్రి తన కుమార్తెను తగినవానికే దానము

చేయవలయును. నేను చేసిన పనికి తగిన ఫలమనుభవించితిని. ఇప్పుడు చెడునడువడిగల నాపిల్లను చంపినచో తీరని స్త్రీ హత్యాదోషము నాకు ప్రాప్తించును. మనువంశమెంతయో ప్రసిద్ధి నొందినది. అది నేటికి నావలన కళంకముతో కూడిన దయ్యెను. లోకాపవాదము బలవత్తరమైనది. స్నేహ బంధములు తెంపరానివి అని విచారించెను. ఇట్లు రాజు చింతా సముద్రమున మునిగియేమి చేయుటకును తోచక యుండెను.

అంతలో చింతించుచున్న తండ్రిని సుకన్య చూచినది. ఆమె అతని వద్దకు వెళ్ళి ప్రేమతో నిండిన మనస్సుతో ఇట్లు ప్రశ్నించెను. ఓరాజా! సుందరుడు నవయువకుడగు మునివర్యుని చూచి విచారించుచున్నా వేమి? రాజశ్రేష్ఠా విచారింపకుము. రమ్ము నా పతికిప్పుడు నమస్కరిం పుము. అని పలుకుచున్న కూతురి మాటలకు కోపించి శర్యాతి యిట్లనెను.

పుత్రీ! గ్రుడ్డి ముసలి ముని యెక్కడ? ఈ మదోన్మత్తుడగు యువకు డెక్కడ? పాపాత్మురాలా! మునిని చంపి కామబాధచే నీ నవయువకుని భర్తగా చేపట్టితివి. ఈ ఆశ్రమమందలి మునికనబడక చింతాక్రాంతుడ నైతిని. నీవెంత చెడుపని చేసితివి? కులటకు తగిన పనిచేసితివి. ఓసి దుష్టురాలా! నీవలన నేనిప్పుడు దుఃఖసముద్రములో మునిగితిని. అని పలుకగా నవ్వి అతనిని సాదరముగా తనభర్తవద్దకు తీసుకు వచ్చెను.

మరియు ఓ తండ్రీ! ఇతడే చ్యవనముని. ఇతడే నీయల్లుడు. అశ్వినుల దయవలన ఇట్లు మనోహరమూర్తియై నీయల్లుడు ప్రకాశించుచున్నాడు. నా మాటనమ్ముము. అశ్వినులు తమంత తామే యీ యాశ్రమమునకు వచ్చిరి. వారిదయవలన చ్యవనముని యిట్లు తయారయినాడు. తండ్రీ! నేను నీకూతురను. పాపాత్మురాలనుకాను. నీవతని మోహనరూపమునకు ముగ్ధుడవై నన్ను పాపము చేసిన దానిగా తలచుచున్నావు. తండ్రీ! నీవీ భార్గవుడగు చ్యవనమునికి నమస్క రింపుము. నీవడిగినచో ఇతడు విపులముగా జరిగిన సమస్త విషయమును నీకు తెలియజేయుగలడు అనెను. అప్పుడు శర్యాతి వెంటనే ముని వద్దకు వెళ్ళి గౌరవ పూర్వకముగా అతనికి నమస్కరించియిట్లనెను.

ఓ భార్గవా! జరిగిన వృత్తాంతమంతయు వివరింపుము నీకు మరల కన్నులెట్లు వచ్చినవి? నీముసలితనము ఏమయ్యెను? ఓ బ్రాహ్మణోత్తమా! నీ సుందరరూప మును చూచినంతనే నాకు సంశయము కలుగుచున్నది. విషయము తెలిపినచో విని యానందింతును. అనగా చ్యవనమహర్షి యిట్లు పలకెను. ఓ రాజా అశ్వినీ

దేవతలిక్కడకు వచ్చిరి. వారు దేవవైద్యులు. నాకు దయతో వారు మహోప కారము చేసినారు. నీవు చేయు యజ్ఞములో వారికి సోమపానము లభించు నట్లు చేసి ప్రత్యుపకారమొనర్చినవాడనగుదునని వరమిచ్చితిని. మహారాజా! ఇట్లు వారివలన నాకు చక్కని వయస్సు చూపును సంభవించినవి. ఇక మీరు నిశ్చింతగా ఉండుడు. సుఖాసనమున కూర్చుండుడు అని పలుకగా రాజు వాని భార్యయు సుఖముగా కూర్చుండిరి.

పిమ్మట భార్గవుడు రాజా! నీచే యజ్ఞము చేయింతును యాగద్రవ్యములు సమకూర్చు కొనుము. అశ్వినులకు సోమపానము లభింపచేతు నని వరమిచ్చితిని గదా! అది నీయాగముననే జరుగవలెను. రాజేంద్రా! ఇంద్రుడు తేజోబలముచే కన్నుమిన్నుకానకున్నాడు నేనతనిని అడ్డుకొనగలను. నీ సోమ యాగమున వారిచే సోమరసము త్రాగింతును అని ప్రోత్సహించెను. అప్పుడు శర్యాతి సంతోషించి చ్యవనుని మాటకు ఒప్పుకొనెను. రాజు చ్యవన మహర్షిని సమ్మానించి సంతో షముతో మునిని కుశలప్రశ్నములు చేసి భార్యతో కూడ తన నగరమునకు వెళ్ళెను.

శర్యాతి యజ్ఞము - అశ్వినీ దేవతలకు హవిర్భాగము నిచ్చుట

సకలసంపత్సమృద్ధి గల శర్యాతి మహారాజు ఒక శుభదినమున యజ్ఞమునకు తగిన స్థలమును సిద్ధము చేసెను. చ్యవనుడు వసిష్ఠుడు మొదలగు మునుల నాహ్వానించి రాజుచే యజ్ఞము నాచరింపచేసెను. యజ్ఞము ప్రారంభము కాగా దేవతలు సోమపానమునకు ఇంద్రునితో సహా విచ్చేసిరి. అశ్వినీదేవతలు కూడ వచ్చుట చూచి దేవేంద్రుడు వీరు కూడ ఎందుకు వచ్చిరి. దేవవైద్యులు సోమపానమునకు తగరు. వీరినెవరు రమ్మనిరి? అనినెను. దేవతలు మాటడలేదు. అప్పుడు చ్యవనముని అశ్వినీ దేవతలకిచ్చుటకై సోమరసము చేతితో పట్టుకొనగా దేవేంద్రుడడ్డుపడి వారికీ యవలదని నివారించెను.

అప్పుడు సూర్యపుత్రులగు వీరు సోమపానమునకు యెట్లు తగరో చెప్పుమని చ్యవను డింద్రుని ప్రశ్నించెను. వీరు సంకర జన్మకలవారు కారు. సూర్యునకు తన ధర్మపత్నియందు జన్మించినవారు. ఏ దోషముచే వారు సోమపానమున కర్హులుకారో తెలుపుము. దేవేంద్రా! ఈ విషయము గూర్చి దేవతలతో ఆలోచిం పుము. నేను వీరిచే సోమము త్రాగింతునని మాట యిచ్చియున్నాను. అందుచే శర్యాతి మహారాజును యజ్ఞము చేయుమని ప్రేరే పించితిని. నేనన్నమాట సత్యమని

నిరూపించగలను. ఇంద్రా! వీరునాకు నవయౌవనమిచ్చిరి. అందుకు ప్రత్యుప కారముగా సోమపానము చేయింతుని ప్రతిజ్ఞ చేసితిని. అనగా ఇంద్రుడు వీరు దేవవైద్యులు దేవతలచే నిందింపబడినవారు. వీరిరువురును సోమరస పానమున కర్హులుకారు. వారికి సోమమీయవద్దు అనగా చ్యవన మునియిట్లనెను. ఇంద్రా! పనికి మాలినకోపమును వదలి పెట్టుము. సూర్యపుత్రు లెందుకు అర్హులుకారు? అని మాట్లాడగా పెద్ద వివాదము చెలరేగెను. ఎవరును మాట్లాడలేదు. భార్గవుడు మాత్రము తపో బలముతో వారికి సోమమునీయబూనెను.

వెంటనే దేవేంద్రుడు ఓ బ్రాహ్మణాధమా! నీవు వీరిచే సోమపానమును చేయించినచో విశ్వరూపుని చంపినట్లు నిన్ను చంపగలను. అనగా చ్యవనుడు దేవేంద్రా! ఆ మహాత్ములు నాకు రూపసంపదను, దృష్టిని గూడ ప్రసాదించినారు వీరినవమానింపకుము. నన్ను రెండవ దేవునిగా మార్చినారు. వీరిని దేవతలుగా గుర్తించి సోమ పానమునకు అనుమతింపుము అనా పలికెను. అదివిని దేవేంద్రుడు మందమతీ! వీరిద్దరును వైద్యులు. సోమపానమునకనర్హులు. ఒకవేళ నామాట లెక్కచేయక నీవు వారికి సోమమిచ్చినచో నీ తలతెగనరికెదను అని పలికెను.

అనగా చ్యవనుడు కోపముతో అశ్వినులకు సోమము యథావిధిగా నీయబూనెను. ఇంద్రుడు కోపముతో తన వజ్రాయుధమును మునిపై విసిరెను. చ్యవనమహర్షి తన తపోమహిమచే ఇంద్రుని వజ్రాయుధమును స్తంభింపజేసెను. పిమ్మట మునివర్యుడు దేవేంద్రుని చంపదలచి 'కృత్య'కొరకు మారణ మంత్రము లతో హోమమును చేసెను. చ్యవనుని తపోబలముచే "కృత్య" జన్మించెను. దాని వలన మహాబలము గొప్ప శరీరము గల క్రూర రాక్షసుడు బయలుదేరెను. అతని పేరు మదాసురుడు.

అతడు ప్రాణులకు భయంకరుడు. అతని శరీరము పర్వతమంతగానున్నది. వాని శరీరము నల్లగా కాటుకకొండవలె నుండెను. అతనివాడియగు కోరలు మిక్కిలి భయంకరములు. చూపులు క్రూరములు భయంకరములు. నాలుక మరీభీ కరము. అతని శరీరమతి కఠినము కన్నులు దావాగ్నుల వలెనుండెను. అతనిని చూడగనే దేవతలందరు భయముతో వణికిపోయిరి. ఇంద్రుడే భయపడి యుద్ధము మాట మరచిపోయెను. ఆరాక్షసుడు తన పెద్ద నోటితో వజ్రాయుధమును పట్టుకొని ఘోరమైన చూపులతో ముల్లోకములను వ్యాపించునట్లుండెను. మరియు అతడు కోపముతో ఇంద్రుని మ్రింగబోయెను. అయ్యో చచ్చితిమని దేవతలందరొక్క పెట్టున దుఃఖించిరి. దేవేంద్రుని భుజములు స్తంభించిపోయి నవి. ఏ అస్త్రమును

ప్రయోగించుటకైనను అసమర్థుడయ్యెను. దేవేంద్రుడు కాలాంతకుడగు రాక్షసుని చూచి యేమి చేయుటకును తోచక సమయకోవిదుడగు బృహస్పతిని తలచు కొనెను. బృహస్పతి స్మరించినంతనే ఇంద్రునివద్దకు వచ్చెను. గురుడు ఆలోచించి యీ రాక్షసుడు మహామంత్రములకుగాని వజ్రాయుధమునకుగాని సాధ్యుడు కాడని యింద్రునకు తెలియజేసెను. మహాబల వంతుడగు నీరాక్షసుడు చ్యవనమహర్షి తపోబలమున యజ్ఞకుండమునుండి పుట్టినాడు. దేవరాజా! ఇపుడీ రాక్షసుని దేవతలుగాని నీవుగాని నేనుగాని నివారింపలేము. చ్యవనుడు తన "కృత్య"ను తానే నివారింపగలడు. అని గురుడు పలుక దేవేంద్రుడు చ్యవనముని వద్దకు వెళ్ళి భయవినయములతో తలవంచి నమస్కరించి యిట్లు పలికెను. మునివర్యా! సర్వజ్ఞా! నాతప్పు క్షమించుము. నన్ను చంపవచ్చుచున్న రాక్షసుని నివారింపుము. ప్రసన్నుడవగుము. నీ మాటలు చెల్లింతుము.

భార్గవా! బ్రాహ్మణోత్తమా! ఈనాటి నుండి యశ్వినులు సోమ పానమున కర్హులు. నా మాట నిజము. నాయెడ దయజూపుము. తపోధనా! ధర్మజ్ఞా! నీ ప్రయత్నము వ్యర్థముకాదు. అశ్వినులు నీవలన నిరంతము సోమపానము చేయు వారగుదురు. ఈశర్యాతి మహారాజు కీర్తియు శాశ్వతమగును. ముని సత్తమా! నేను చేసిన పనియంతయు నీ తపోవీర్యము వలువురికీ వెల్లడించుట కొఱకే బ్రాహ్మణవర్యా! మదాసురుని ఉపసంహరింపుము. మమ్ము కనికరింపుము. దేవతలకెల్లరకు మేలు చేకూర్చుము అని ప్రార్థించెను.

దేవపతి మాటలు విని చ్యవనమహర్షి తన కోపమును విడిచిపెట్టెను. మదాసు రుని, స్త్రీలు త్రాగుడు జూదము వేట యనునీ నాల్గు స్థలములనుండునట్లు నియ మించెను. మరియు సర్వధర్మాత్ముడగు భార్గవుడు పవిత్రమైన సోమమును దేవేంద్రునిచేత అశ్వినుల చేతను త్రాగించెను. అప్పటినుండి ఆ సరస్సు యూప స్తంభములతో విలసిల్లెను. చ్యవన మున్యాశ్రమము భూమిపై ప్రఖ్యాతి నొందెను. శర్యాతి చ్యవనుని మహిమకు సంతోషించి యజ్ఞము పూర్తిజేసి మంత్రులతో కలిసి తన నగరమునకు వెళ్ళెను. శర్యాతి ప్రతాపముతో ధర్మముతో రాజ్యమేలెను. అని వ్యాసమహర్షి జనమేజయునకు వివరించెను.

జనమేజయునకు వ్యాస మహర్షి భువనకోశము దానివ్యవస్థ, వరాహమూర్తి భూమిని జలమునుండి ఉద్ధరించిన విధమును, అతలాది లోకములను-కర్మగతి-విపాకమును - శ్రీదేవీ పూజా విధానమును - అందువలన కలుగు వివిధ ఫలములను వివరించెను.

రైవతమను వృత్తాంతము

రేవతుడను రాజు రేవతితో బ్రహ్మలోకమునకు వెళ్ళుట యాశ్చర్యకరముగ నున్నది. ఇది యెట్లు సంభవనో తెలుపుగోరుచున్నానని జనమేజయుడు వ్యాసునడుగగా నాతడిట్లు చెప్పెను. రాజా! సుమేరుపర్వత శిఖరములందు సర్వలోకములు కలవు. పూర్వమర్జునుడు దేవేంద్రుని నగరమున ఐదు సంవత్సరములు నివసించెను. అర్జునుడు మానవ శరీరముతోడనే యింద్రుని సన్నిధిలో నుండెను. ఇట్లే మహాభిషుడను రాజు బ్రహ్మలోకమున కేగెను. విజ్ఞులైనవారు మానవులు కూడ ఎల్ల లోకములకేగ వచ్చును. బ్రహ్మలోకమునకు వెళ్ళి రేవతుడేమి చేసెననగా వ్యాసుడిట్లు చెప్పదొడగెను. రేవతుడు తన కుమార్తెకు తగిన వరుని తెలిసి కొనుటకు బ్రహ్మలోకమునకు వెళ్ళెను.

అచట గానసభ జరుగుచుండెను. అది పూర్తికాగా బ్రహ్మకు నమస్కరించి ఓ దేవపతీ! ఈమె నా కుమార్తె. ఈమెకు తగిన వరుని తెలుపుము. ఎందరో రాజపుత్రులు కలరుగాని నాకు ఒక్కడును నచ్చలేదు. నిన్న డుగుటకు వచ్చితి ననెను. నీవిక్కడకు వచ్చి చాలకాలమగుటచే అప్పటి వారందరు కాలగర్భములో కలిసి పోయిరి. నీవంశజులు చనిపోయిరి. నీ పట్టణము దానవుల చేతికి చిక్కినది. అచట చంద్రవంశపు రాజు పరిపాలించుచున్నాడు. అతడు యయాతి వంశజుడు. మధురానగరాధిపతి ఉగ్రసేనుడను పేరుగాంచెను.

శ్రీకృష్ణుడు మధురను విడిచి ద్వారకలోనున్నాడు. యాదవులనందరను ద్వారకలో నివసింపజేసెను. శ్రీకృష్ణుడు తన బంధువులతో నక్కడ నివసించుచున్నాడు. కృష్ణుని అన్న బలరాముడు ఆతడు శేషాంశచే జన్మించెను. హలాయుధుడు, ముసలాయుధుడు వీరుడు. ఆతడు నీ కుమార్తె కన్నివిధముల తగినవరుడు. అతనికి నీ కన్యనిచ్చి వివాహము జరిపించుము. తరువాత నీవు బదరికాశ్రమమున తపస్సు చేయుము. అని పలుకగా రాజు తన కుమార్తెను బలరామునికిచ్చి వివాహము జరిపి తపస్సు చేసికొనుటకు వెళ్ళెను. వైవస్వతమనువు తుమ్మునుండి ఇక్ష్వాకుమహారాజు పుట్టెను. అతడు సూర్యవంశ దీపకుడు/అతడు నిరంతరము శ్రీదేవిని ధ్యానించి తపమొనర్చెను. అతనికి నూర్గురు కొడుకులు. వారిలో వికుక్షి జ్యేష్ఠుడు. ఇక్ష్వాకుడ అయోధ్యరాజధానిగా పాలించెను. అతనికి శకుని మొదలుగా గల ఏబదిమంది కొడుకులు పుట్టిరి. వారిలో కొందరిని ఉత్తరాపథమునకు మరి కొందరిని దక్షిణాపథకమునకు రాజులుగా చేసెను. ఏబదిమంది కొడుకులలో ఇద్దరిని తన సేవకు ఉంచుకొని తక్కినవారిని రాజులుగా చేసెను.

సూర్య వంశరాజ వృత్తాంతము

ఒకానొకప్పుడు అష్టకాశ్రాద్ధము జరుపుటకు వికుక్షిని మాంసము తెమ్మని ఇక్ష్వాకుడాజ్ఞాపించెను. అతడరణ్యమున పలు మృగములను వేటాడి అలసి ఆకలి గొనెను. కుందేటి మాంసమును తిని మిగిలిన దానిని తెచ్చి తండ్రికిచ్చెను. తినగా మిగిలినది పనికి రాదని గ్రహించి వసిష్ఠుడు రాజునకు చెప్పెను. రాజు వానిని దేశమునుండి వెడలగొట్టెను. అతడడవులలో ఫలమూలములు తినుచు కాలము గడిపెను. కొంత కాలమునకు తన తండ్రి మరణించుటను విని వచ్చి రాజ్యమును స్వీకరించెను. అతడు సరయూ తీరమున పెక్కు యజ్ఞములు నిర్వర్తించెను. అతని కుమారుడు కకుత్స్థుడు. అతడింద్ర వాహుడు, పురంజయుడను పేర్లతో ప్రఖ్యాతిగాంచెను. జనమేజయుడాతనికిన్ని పేర్లెట్లు వచ్చినవో వివరింపుమని యడుగగా వ్యాసుడిట్లనెను!

శశాదుడు మరణించగా కకుత్స్థుడురాజై చక్కగా రాజ్య పరిపాలనము చేయు చుండెను. ఆ సమయమున దేవతలు దానవులకు నోడి పోయిరి. వారు విష్ణుని శరణువేడగా అతడు దేవతలారా! మీరు కకుత్స్థుని ప్రక్కవైపున రక్షకునిగా ఉండు మనుడు. అతడు దానవులను చంపగలడు. పరాంబికా శక్తి యతని యందు కలదు అని చెప్పెను. అంత దేవతలాతని వద్దకు వెళ్ళిరి. కకుత్స్థుడు వారిని సత్కరించి వచ్చినపని నడుగగా వారు నీవింద్రునకు మిత్రుడవై సహాయుడవుగా నుండవలెనని కోరిరి. అప్పుడు రాజు, వాహనముగా ఇంద్రుడున్నచో నేను పార్శ్వ రక్షకుడనగుదునని పలికెను.

అప్పుడు దేవతలు అభిమానము విడిచి యింద్రుని వాహనముగుమనిరి. ఇంద్రుడు సిగ్గుపడుచు వృషభమైరాజునకు వాహనమయ్యెను. వృషభరూపమున నున్న ఇంద్రుని మూపుపై కూర్చొనినందున కకుత్స్థుడయ్యెను. (కకుద్- అనగా ఎద్దు మూపురము) ఇంద్రుని వాహనముగా చేసికొనుటచే ఇంద్రవాహుడయ్యెను. దైత్యులపురమును జయించుటచే పురంజయుడాయెను. అతని వంశము వారెల్లరు కాకుత్స్థులుగా పిలువబడుచున్నారు. కకుత్స్థుని కుమారుడు పృథుచక్రవర్తి. అతని కుమారుడు విశ్వరంధి. విశ్వరంధి కొడుకు, అతని కొడుకు చంద్రుడు, అతని పుత్రుడు యువనాశ్వుడు. అతని పుత్రుడు శావంతి. అతని కొడుకు బృహదశ్వుడు. వాని పుత్రుడు కువలయాశ్వుడు.

అతడు దుంధువను రాక్షసుని చంపుటచే దుంధు మారుడని పిలువబడెను. వాని పుత్రుడు దృఢాశ్వుడు. వాని కొడుకు హర్యశ్వుడు. అని కుమారుడు నిశుం

ఘుడు. వాని పుత్రుడు బర్హణాశ్వుడు. అతని తనయుడు ప్రసేనజిత్తు, వాని కొడుకు యౌవనాశ్వుడు. అతని సుతుడు మాంధాత. అతడు తన తండ్రి పొట్టచీల్చుకొని పుట్టెను. జనమేజయుడది యెట్లు సంభవించెనని యడుగ వ్యాసుడిట్లునియె.

యౌవనాశ్వనకు సంతతిలేదు. అతనికి నూర్గురు భార్యలు కలరు. అతడు సంత లేదని దుఃఖించుచు నరణ్యమున మునులు చూచుచుండ నిట్టూర్పు విడుచుచుండెను. వారు నీ దుఃఖమునకు కారణమేమని యడుగా నాకు సంతానము లేనందున దుఃఖము కలుగుచున్నదని చెప్పి మరియు నాకు సంతతి కలుగునట్లు యజ్ఞము చేయింపుడని కోరెను. వారు యజ్ఞమును జరిపించిరి. ఆ బ్రాహ్మణులు కలశమందు జలమును వేదమంత్రములతో అభిమంత్రించిరి. ఒకరాత్రి రాజు దప్పికగొని ఆమంత్రజలమును త్రాగెను. భార్యకు సంతానము కొరకుగా ఉంచబడిన జలము నీతడు త్రాగెను. నెలలునిండినపిదపమంత్రులుపొట్ట కుడిభాగమును చీల్చి కుమారుని బయటకు తీసిరి. దైవకృపచే రాజు చావలేదు. ఈ కుమారునకు పాలెవ్వరిత్తురని మంత్రులాలోచించుచుండ ఇంద్రుడు 'మాంధాత' నన్ను చీకుమని పలికెను. ఆ బాలుని బొటనవ్రేలున అమృతరూపియై యింద్రుడు నిలిచెను. నాటినుండి మాంధాతయని యాతడు పిలువబడెను.

మాంధాత చక్రవర్తి యయ్యెను. దస్యులితనికి భయపడి కొండ గుహలలో నివసించిరి. అందుచే ఇంద్రుడీతనికి త్రసద్దస్యుడని పేరు పెట్టెను. శశిబిందుని కూతులైన బిందుమతిని మాంధాత భార్యగా స్వీకరించెను. బిందుమతియందు మాంధాతకు పురుకుత్సుడు ముచుకుందుడనను పుత్రులిరువురు జన్మించిరి. పురుకుత్సునకు అరణ్యకుడు జన్మించెను. అతడు పరమధార్మికుడు. అరణ్యకునకు బృహదశ్వుడు జన్మించెను. బృహదశ్వుని కొడుకు హర్యశ్వుడు అతడు పరమార్థజ్ఞానము కలవాడు. అతని పుత్రుడు త్రిధన్వుడు వాని కుమారుడు అరుణుడు. అతని పుత్రుడు సత్యవ్రతుడు. అతడు స్వేచ్ఛాచారి. అతడు వివాహ సమయమున ఒక బ్రాహ్మణ స్త్రీని అపహరించెను. తండ్రి యాతని చండాలురతో కలిసి తిరుగుమని బహిష్కరించెను. తన తండ్రిని నివారించలేదని సత్యవ్రతునకు వసిష్ఠునిపై కోపము కలిగెను. అరుణుడు సంతానార్థియై తపస్సు చేయుట కరణ్యానకేగెను. ఆ రాజ్యమున పన్నెండు సంవత్సరములు వానలు కురియలేదు. ఆ దినములలో విశ్వామిత్రుడు కౌశికీతీరమున గొప్ప తపస్సు చేయుచుండెను.

విశ్వామిత్రుని భార్య పిల్లలను పోషింపలేక నడిమి కుమారుని అమ్మి తక్కిన వారిన పోషించుటకు బయలుదేరినది. సత్యవ్రతుడామెను నీవేల యేడ్చుచుంటివి.

యెక్కడకు పోవుచున్నావని ప్రశ్నింపగా ఆమె తన విషయమునంతను చెప్పెను. అంతట నాతడు ఓ పతివ్రతా! నీవీ పుత్రుని అమ్మవద్దు. నేను నీకు భరణమిచ్చె దనము. నీ భర్త తరువాత రాగలడు. నీయాశ్రమము ముందున్న చెట్టునకు ప్రతి దినము అన్నము మూటకట్టి వెళ్ళెదను. నీకది ఆహారమగును. ఇది నా సత్యవ్రతము అని రాజుపలుకగా మునిపత్ని తన కుమారునితో ఆశ్రమము చేరెను. ఆ కుమారుడు మహాముని యయ్యెను. రాజు ప్రతిదినము వేటాడి జంతుమాసము మూట కట్టి బెట్టుకొని తగిలించుచుండెను. ఒకనాడు రాజున కడవిలో మృగములు కనబడ లేదు. వసిష్ఠుని గోవతనికి కంటపడగా దానిని చంపి మాంసమును తాను కొంతతిని మిగిలినది చెట్టునకు కట్టెను. వసిష్ఠుడు తన గోవును చంపినందుకు కోపించి ఓరి దుర్మార్గుడా? స్త్రీ హరణము. తండ్రి కోపము గోవధ ఈమూడు మచ్చలు నీకు కలుగుగాక ఈ మూడు శంకువులవలన నీవు త్రిశంకువను పేరు పొందెదవు పిశాచ రూపముతో తిరుగుచుందువు అని శపించెను. సత్యవ్రతుడిట్లు వసిష్ఠునిచే శపింపబడి తన యాశ్రమమున తీవ్రముగా తపమాచరించుచుండెను. అతడొక నాడు ఒక మునిపుత్రుని దయవలన శ్రీదేవీ మంత్రమును గ్రహించి జపింపసాగెను.

త్రిశంకు వృత్తాంతము

జనమేజయుడు త్రిశంకునకు శాపవిముక్తి యెట్లు కలిగెనో తెలుపుమనగా వ్యాసుడిట్లనియె. సత్యవ్రతుడు దేవీభక్తి పరాయణుడై శ్రీనవాక్షర మంత్రరాజ మును జపించి హోమము చేయదలచి ఓ విప్రులారా! నేను చేయు యజ్ఞమున మీరు ఋత్విజులుగా నుండుడని బ్రాహ్మణులను కోరెను. నీవు శపింపబడి పిశాచ రూపముతో తిరుగుచుంటివి. గనుక యజ్ఞము చేయుటకు తగవని పలికిరి. ఆతడు తన జీవితము వ్యర్థమని తలచి చితి పేర్చి అందు ప్రవేశింపదలచి చండికా దేవిని మనస్సులో తలచెను. చితికినిప్పంటించి మహా మాయాదేవిని సంస్మరించెను. అప్పుడు శ్రీభగవతిదేవి ఆకాశమున ప్రత్యక్షమై రాజా! శ్రీదేవి యిట్లు పలికెను.

ఓ మహాత్మా! నీవీ మంటలో దుముకవద్దు. నీతండ్రి నీకు రాజ్యమిచ్చి తపమున కరణ్యము చేరదలచెను. ఎల్లుండి నీవింటికి వెళ్ళుము. నీ తండ్రి నీకు పట్టాభిషేకము చేయును. పిమ్మట నాతడు బ్రహ్మలోకమును చేరగలడు. అని దేవి పలికి అంతర్ధానము చెందెను. అప్పుడు రాజపుత్రుడు అయోధ్యకు వెళ్ళెను. అరుణుడు నారదుని వలన తన కొడుకు చావదలచుట విని దుఃఖించెను. ధర్మాత్ముడగు రాజు తన కుమారుని తీసికొని రండని మంత్రుల కాజ్ఞాపించగా వారతనిని

సగౌరవముగ అయోధ్యకు తీసికొని వచ్చిరి. రాజు కుమారుని చూచి బాధపడి యాతనిని కౌగిలించుకొనెను. పిమ్మట కుమారునకు రాజు అనేక విషయములను బోధించి పరదేవతా పూజను భక్తితో నెరవేర్పవలెను. ఆ మహా దేవియే సర్వము అనుభావము తో నుండవలెనని ఆమె పాదతీర్థము త్రాగినవానికి జన్మముండదని పలికెను.

త్రిశంకుడు తండ్రి బోధించిన రాజనీతిని ఆధ్యాత్మిక విషయమును శ్రద్ధగా వినెను. పిమ్మట రాజు వేదవిదులైన బ్రాహ్మణుల పిలిచి ఒక శుభముహూర్తమున త్రిశంకుని పట్టాభిషిక్తుని చేసెను. రాజు తన భార్యతో గంగాతీరమున వానప్రస్థుడై తీవ్రమైన తపమొనర్చెను. అరుణుడు స్వర్గస్థుడై ఇంద్రునొద్ద నుండెను. త్రిశంకునకు శాపవిముక్తి యేట్లేర్పడెనో వివరింపుమని ప్రార్థింపగా వ్యాసుడు సత్యవ్రతుడు శ్రీదేవి నుపాసించి క్షణములో దివ్యదేహధారి యయ్యెననియు వసిష్ఠు ప్రసన్నుడాయెననియు తండ్రి కాతనిపై ప్రేమ కలిగెనని కూడ చెప్పెను. త్రిశంకుడు దేవిని గూర్చి ధర్మబుద్ధితో ననేక దేవీ యజ్ఞములొనర్చెను. త్రిశంకునకు హరిశ్చంద్రుడు జన్మించెను. సర్వశుభ లక్షణములు గల కుమారుని రాజు చేసి మానవ శరీరముతో స్వర్గమందు సుఖమనుభవింపదలచెను. అతడు వసిష్ఠుని చేరి నమస్కరించి బ్రహ్మ పుత్రా మహానుభావా! ఈ మానవ శరీరముతో స్వర్గములో సుఖముల ననుభవింప కోరికతో నున్నాను. అందుకు తగిన యజ్ఞమును నాచే చేయింప నీవే తగినవాడవని ప్రార్థించెను. అంత వసిష్ఠుడు రాజా నీకోరిక అసంభవము. యజ్ఞము చేసి మరణించిన యనంతరము స్వర్గమును చేరుమనెను. త్రిశంకువు నేను వేరొక పురోహితునితో యజ్ఞము జరిపింతునని పలుకగా వసిష్ఠుడు కోపించి చండాలుడవగుమని శపించెను. వెంటనే త్రిశంకుడు చండాలుడయ్యెను.

అంతట మిక్కిలి బాధపడి సాధువుల సేవించుచు జగదంబను స్మరించుచు పాపకర్మను పోగొట్టు కొందునని గంగాతీరమున పశ్చాత్తాపముతో కాలము గడుపుచుండెను. యువరాజు హరిశ్చంద్రుడు తన తండ్రి శాపగ్రస్తుడైన విషయము విని అతనిని తీసికొని రండని మంత్రులను పంపెను. త్రిశంకుడు నగరమునకు వెళ్ళక మంత్రులతోను నిట్లు కుమారునకు చెప్పుడనెను. పుత్రా నేను రాను రాజ్యము వివేకముతో పాలింపుము. అంత మంత్రులు హరిశ్చంద్రుని రాజుగా పట్టాభిషిక్తుని చేసిరి. త్రిశంకుని తరువాత చరిత్రమును చెప్పుమనగా వ్యాసుడిట్లనెను. త్రిశంకుడు తన కుమారుడు పట్టాభిషిక్తుడగుటను విని సంతోషించి శ్రీదేవిని స్మరించుచు కాలము గడుపుచుండెను. విశ్వామిత్రుడు తపస్సు పూర్తి

చేసికొని యింటికి వచ్చి కరువుకాలములలో దారిద్ర్యముచేతను పడిన కష్టములను తెలిపి నీవెట్లు గడిపితి వని ప్రశ్నించెను. అంత నాతని భార్య ఇట్లు చెప్పెను.

ఆ కరువుకాలములో పిల్లలు ఆకలితో ఏడ్చుట చూడలేక ఒక కుమారుని అమ్మి అధనముతో తక్కిన పిల్లను పోషింపదలచుచుండగా సత్యవ్రతుడనురాజు నన్ను చూచి నీవు బాలుని అమ్మవద్దు. ముని తిరిగివచ్చు వరకు ప్రతిదినము నేను మాంసము నిచ్చెదనని అట్లు చేయగా నీ పిల్లలు దుఃఖసముద్రము దాటిరి. అట్టి రాజు ఒకనాడు మాంసము దొరక వసిష్ఠుని యావును చంపెను. ముని అతని చండాలునిగా శపించెను. నా వలన రాజకుమారుడు చండాలుడయ్యెను. కనుక నీ ప్రబలతపముచే ఆ రాజును రక్షింపుమని భర్తను కోరెను. కౌశికముని ఆలోచించి త్రింశంకుని వద్ద కేగెను. త్రిశంకువు విశ్వామిత్రుని చూచి నమస్కరించెను. అంతట విశ్వామిత్రుడు రాజా నీవు నా కొరకు మునిచే శపింపబడితివి. నీకు కావలసిన ఉపకారము చేయవచ్చితిననగా త్రిశంకుని శరీరముతో స్వర్గమును అనుభవింపవలెనని తన కోరిక నెరిగించెను. విశ్వామిత్రుడు యజ్ఞ ద్రవ్యములు సమకూర్చుకొని మునుల కాహ్వానములు పంపెను. ఎల్లరు మునులును యజ్ఞము గూర్చి వినిరి.

కాని వసిష్ఠుడు నివారించుటచే వారు యాగమునకు వెళ్ళలేదు. విశ్వామిత్రుడు బాధపడి త్రిశంకుడున్నచోటికి వెళ్ళి రాజా! వసిష్ఠుడు నివారించుటచే బ్రాహ్మణు లెల్లరు యజ్ఞమునకు వచ్చుటలేదు. ఐననేమి? నా తపశ్శక్తిచే నిన్నిప్పుడే స్వర్గమునకు పంపెదను అని దోసిటితో నీళ్ళు తీసికొని గాయత్రితో నభిమంత్రించి తన పుణ్యమతనికి ధారపోసెను. అంతట నీకు మేలగుగాక యనెను. విశ్వామిత్రుడిట్లు పలుకగనే త్రిశంకుడు పక్షివలె పైకెగిరెను. చండాలరూపముతో స్వర్గమునకు వచ్చుచున్న త్రిశంకుని చూచి యింద్రుడు ఓరి చండాలుడా! కంపుగొట్టు రూపముతో దేవలోకమునకు రావలదు నేలమీదికి పొమ్మనెను. అంతట త్రిశంకుడు క్రిందపడ నారంభించెను.

విశ్వామిత్రా! క్రిందపడుచున్నాను కాపాడుమని పెద్దగా దుఃఖింప ఆగుమాగుమని విశ్వామిత్రుడు పలుకగా ఆకాశము నడుమనాగెను. విశ్వామిత్రు డచటనే రెండవ స్వర్గము నిర్మింప నీటిని తాకి యజ్ఞమునకు సంకల్పించెను. అంతట ఇంద్రుడు విశ్వామిత్రుని వద్దకు వచ్చి మునివర్యా! ఇక నీ ప్రతిసృష్టి చాలించి నీకేమి కావలయునో కోరుకొనుమనెను. విశ్వామిత్రుడు దుఃఖించుచున్న త్రిశంకుని నీలోకమునకు కొని పొమ్మనగా ఇంద్రుడు మాటడలేక త్రిశంకుని దివ్యదేహుని చేసి విమానము కూర్చుండబెట్టుకొని విశ్వామిత్రు ననుమతి పొంది స్వర్గమున

కరిగెను. ఇంద్రుడు త్రిశంకుని స్వర్గమునకు కొనిపోగా విశ్వామిత్రుడు తన యాశ్రమములో సుఖముగా నుండెను. విశ్వామిత్రుని మహోపకారము చేతన తండ్రి స్వర్గమును చేరుట విని హరిశ్చంద్రుడానందించెను. అయోధ్యాధిపతియగు హరిశ్చంద్రునకు సంతానము కలుగనందున వసిష్ఠుని వద్ద నాతడు తన బాధను తెలిపెను. వసిష్ఠుడు సంతానము ననుగ్రహించువాడు వరుణుడొక్కడే యని చెప్పగా గంగాతీరమున హరిశ్చంద్రుడు తీవ్రముగా తపస్సు చేసెను. వరుణుడు ప్రసన్నుడై వరము కోరుకొనుమనగా నాకు కుమారుడు జన్మింపవలెనని వరము కోరెను. నీకు జన్మించు పుత్రుని బలిపశువుగా నాకు యాగమందర్పించుచో నీకు పుత్రుడు కలుగగలడని వరుణుడు వరమిచ్చెను.

అట్లే నా కుమారుని బలి పశువుగా నిత్తునని ప్రతిజ్ఞ చేసి హరిశ్చంద్రుడింటికి వెళ్ళెను. కొంతకాలమునకు "శైబ్య" యను నాతని పట్టమహిషి గర్భము ధరించెను. పదవనెలలో నామె యొక శుభముహూర్తమున పుత్రుని కనెను. రాజు హరిశ్చంద్రుడమితానందముతో ననేక దానముల నొనర్చెను. సంగీత నృత్యగోష్ఠులు జరిపించెను. రాజభవనమున పుత్ర మహోత్సవము జరుగుచుండగా వరుణుడు బ్రాహ్మణ వేషమున వచ్చి రాజా! నేను వరుణుడను. త్వరగా నీ కొడుకుతో యజ్ఞము చేయుము. నీవంధ్యత్వము తొలగినది కదా! అని పలుకగా హరిశ్చంద్రుడు చాల బాధపడి ఆలోచించి మహానుభావా! ప్రతిజ్ఞ ప్రకారము యజ్ఞము చేయగలను పురిటి శుద్ధి పదియవనాడు జరుగును గదా! తదనంతరము యాగమొనర్తుననగా వరుణు రాజా! నేను వెళ్ళుచున్నానని పలికి వెడలిపోయెను. హరిశ్చంద్రుడు సంతోషించెను.

హరిశ్చంద్రోపాఖ్యానము

హరిశ్చంద్రుడు తన కుమారునకు రోహితుడని పేరు పెట్టెను. ఒక నెలగడచిన పిమ్మట వరుణుడు మరల బ్రాహ్మణ రూపములో వచ్చి యిప్పుడే యజ్ఞము చేయుమనెను. రాజు దుఃఖింతుడై దోసలియొగ్గి యిట్లనెను.

ఓ జలాధిపతీ! పిల్ల వానికి పండ్లు రానిదే యజ్ఞపశువుగా నుండనుండుట తగదు. కనుక పండ్లు వచ్చిన పిదప యాగమొనర్తుననెను. వరుణుడు సరేయని వెళ్ళిపోయెను. పిల్ల వానికి పళ్ళు వచ్చిన తరువాత వరుణుడు రాగా తలవెంద్రుకలు తీసిన పిదప యాగము చేసెదననెను. పుట్టు వెంద్రుకలు తీసిన పిదప మరల వరుణుడు రాగా ఉపనయనమైనగాని యాగమున కర్హుడుకాడు. గనుక ఉపనయనము పిల్ల వానికి జరుగు వరకు వేచియుండుమని రాజు పలికెను. దయదలచి

వరుణు వెళ్ళిపోయెను. రాజు సంతోషించెను. తరువాత పదకొండవయేట ఉపనయన సంస్కార మొనర్చుచుండగా వరుణుడు ప్రత్యక్షమై నిలువుగా నతనిని పొగడి సమావర్తన సంస్కారమైన పిమ్మట యాగము తప్పక చేయగలననెను. రాజకుమారుడు తన తండ్రి దుఃఖ కారణము నెరిగి నగరము విడిచి వెళ్ళిపోయెను.

వరుణుడు వెళ్ళిన తరువాత రాజు రోగపీడితుడయ్యెను. వనమందున్న రాకుమారునకు తండ్రి రోగగ్రస్తుడైన విషయము తెలిసెను. తండ్రిని చూడవలెనని తలచిన రోహితుని ఇంద్రుడు నిన్ను నీ తండ్రి యజ్ఞ పశువును చేయును గనుక యింటి వెళ్ళ వద్దని వారించెను. ఒక సంవత్సరము పిమ్మట చావునకు తెగించి తండ్రిని చూడ గోరగా మరల ఇంద్రుడు బ్రాహ్మణవేషముతో వచ్చి నివారించెను.

అంత రాజుతన రోగము తగ్గుటకు వసిష్ఠునితో నాలోచింపగా ఎవన్నికైన డబ్బునిచ్చి వాని కుమారుని తెచ్చి యాగమొనర్చిన నీ రోగము తగ్గునని ఆతడు ఉపాయము చెప్పెను. దరిద్రుడైన అజీగర్తుని ముగ్గురు కుమారులలో మధ్యవాని డబ్బుతో కొని తెచ్చి యజ్ఞపశువుగ నాతని సిద్ధపరచెను. బాలుడు మరణమునకు భయపడి వణకుచుండమును లెల్లరు బాధపడిరి. విశ్వామిత్రుడు పిల్లవానిని చంప జాలనని చెప్పెను. రెట్టింపు ధనమిచ్చినచో ధనార్థినైన నేనే చంపెదనని అజీగర్తుడు కొడు కును చంపబూనెను. సభలోని వారెల్లరు హాహాకారములు మిన్నుముట్ట ఓ పాపాత్ముడా! కన్నకొడుకు నెట్లు చంపదలచితివి? అని కోలాహలము చేయుచుండ విశ్వామిత్రుడక్కడకు వచ్చెను. హరిశ్చంద్రునకు అనేక విధములుగా చెప్పి విశ్వామిత్రుడు భయపడి యేడ్చుచున్న బాలుని రక్షించుట ప్రయత్నించెను. కాని హరిశ్చంద్రుడు నా వ్యాధి నన్ను పీడించుచున్నది. కనుక నితనిని వదలననెను.

విశ్వామిత్రుడు శునఃశేపునిపై దయ గలిగినవాడై ఆ బాలుని వద్దకేగి ఓరి! నాయనా! నేను వరుణమంత్రము నిచ్చెదను. దానిని జపించినచో నీకు మరణ ముండదని మంత్రోపదేశము చేసెను. బాలుడా మంత్రము జపించినంతనే వరుణుడు ప్రత్యక్షమయ్యెను. హరిశ్చంద్రుడాతని క్షమింపుమని వేడుకొని నీ దర్శనముచే నా వ్యాధి పూర్తిగా పోయినదని పలుకగా వరుణుడు దయాళువై శునశ్శేపుని చంపకుండ విడువుమనెను. నీవు రోగవిముక్తుడవైతివని పలికెను. సభయందంతట జయజయ ధ్వానములు మిన్నుముట్టెను.

విశ్వామిత్రుడా బాలుని చేయి పట్టుకొని నాయనా! యింటికి పోదము రమ్మని ప్రేమతో పలికెను. వరుణుడు ప్రసన్నుడై వెళ్ళెను. ఋత్విక్కులు సభ్యులు తమ తమ నివాసముల కలిగిరి. హరిశ్చంద్రుడు రోగవిముక్తుడై సుఖముగా నుండెను.

హరిశ్చంద్రుడు రాజసూయ యాగము చేసి యందు వసిష్ఠుని హోతగానుంచెను. యాగసమాప్తి యందు హరిశ్చంద్రుడు వసిష్ఠుని ఘనముగా సత్కరించెను. ఇంద్ర సభలో విశ్వా మిత్రుడు వసిష్ఠుని నీకీ సత్కారమెవరొ నర్చిరని ప్రశ్నించెను. వసిష్ఠుడు నాశిష్యుడు యజమానుడైన హరిశ్చంద్రుడు యాగము చేసి నాకీ సత్కారమొన సెగనని చెప్పి. అంతటి సత్యవాది ధర్మవర్తనుడు నభూతో నభవిష్యతి. లోకములో మరొకడు లేడని పలికెను. విశ్వామిత్రుడు నీ శిష్యుడు అసత్యవాదియని నిరూపింతునని ప్రతిజ్ఞ చేసి ఓడిపోయినవాడు తన పుణ్యమునంతను కోల్పోవునట్లు పందెము పెట్టెను. ఇట్లా మునులిరువురు వాదించుకొనుచు స్వర్గము విడిచి తమతమ యాశ్రమములకు పోయిరి.

ఒకప్పుడు విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని వద్దకు వచ్చి రాజా! వసిష్ఠుడు నిన్ను గూర్చి గొప్ప దాత కీర్తిశాలి అటువంటి రాజు లేడని చెప్పెను. కనుక నిన్ను ప్రార్థించు చున్నాను. రాజా! నేనొక వివాహము జరుపవలెను. నా కొడుకు పెండ్లికి ధనము కావలెను. అని పలుకగా బ్రాహ్మణోత్తమా! నీవు కోరినది యిచ్చెదననెను. అంతట విశ్వామిత్రుడు మాయచే ఒక కుమారుని పదియేళ్ళ వయస్సు గల కన్యను చూపి వీరి వివాహము జరుపవలసియున్నది. అనగా రాజు బ్రాహ్మణోత్తమా నీకు కావలసిన దడుగుము. తప్పక యిచ్చెదను. కీర్తి లేనిదే బ్రతుకు వ్యర్థముగదా! యని పలికెను.

అంతట విశ్వామిత్రుడు రాజా! నీ సర్వస్వమును రాజ్యమును దానమిమ్ము అని కోరెను. రాజు వెనుకాడక దానమిచ్చెను. విశ్వామిత్రుడు పుచ్చు కొంటినను చు రాజా! దక్షిణ లేనిదానము వ్యర్థము. కనుక తగినంత దక్షిణ నీయవలె ననెను. ఎంత ధనమిమ్మందువో చెప్పుమని రాజడుగగా రెండున్నర బారువుల బంగారము దక్షిణగా నీయవలెననెను. రాజాశ్చర్యపడి యిచ్చితిననెను. రాజు విచారించుచు నంతఃపురమునకు వెళ్ళెను. రాణిచింతించుచున్న తన భర్తను చూచి కారణమ డిగెను. రాజు తన చింతకు కారణము జెప్పెను. రాజునకు భోజనము రుచించలేదు. నిద్ర పట్టలేదు- మరునాటి ఉదయమే విశ్వామిత్రుడు వచ్చి రాజునకు తన రాక తెలిపెను. రాజు వచ్చి నమస్కరించెను. అపుడు ముని రాజునకిట్లనెను.

రాజా! నీ రాజ్యమును విడిచిపెట్టుము. రాజేంద్రా! బంగారము నిమ్ము. సత్య వచనుడవగుము అని పలుకగా రాజిట్లనెను. నా సర్వస్వము నీకిచ్చితిని. నేనిప్పుడు బంగారము దక్షిణగా నిచ్చుటకు అసమర్థుడను. నాకు ధనము లభించినచో నీకు దక్షిణ చెల్లింపగలను. నీకు దక్షిణ చెల్లించనిదే భోజనము చేయను. ఇది నా

ప్రతిజ్ఞ ఇక నీవు విచారింపవలదు. నాకు ధనము చేతకి వచ్చు వరకు ఓపిక పట్టుము. దిగులు పడకుము అని పలికెను. నీ సర్వమును దానము చేసితివి, ఇక నీకు ధనమెట్లు వచ్చును? అని విశ్వామిత్రుడు రాజును ప్రశ్నించెను. మరియు నేనీయలేనని ఒక మాట చెప్పుము. నా యాశను వదలుకొని స్వేచ్ఛగా వెళ్ళుదును అని పలికెను.

హరిశ్చంద్రుడామాటలు విని బ్రాహ్మణోత్తమా! తప్పక యిచ్చెదను. కాశీలో మమ్ము కొనువానిని చూడుము. వానికి మేము అమ్ముడు పోయినీ ఋణము తీర్చెదను అని పలికెను. రాజు భార్యా పుత్రులతో కాశీనగరమునకు వెళ్ళి అక్కడ నివసింపదలచెను. ఇంతలో మునిరాగా రాజు నమస్కరించి నీవిచ్చిన నెలగడువు నకు సగము రోజులు మిగిలియున్నవి యనిన సరే మరల వత్తునని ముని వెళ్ళి పోయెను. రాజు వీని ఋణమెట్లు తీర్చగలనని విచారించుచుండగా అతని భార్య నాధానన్నెవనికైన దాసిగా విక్రయించి ముని ఋణము తీర్చుమని సలహా యిచ్చెను. ఆ మాట విని రాజు మూర్ఛనొందెను. వాని జూచి ఆమెయు మూర్ఛనొందెను. కుమారుడు రోహితుడు అమ్మా! అన్నము, నాయనా! అన్నమని యేడ్వసాగెను. ఇంతలో విశ్వామిత్రుడు మూర్ఛిన రాజు ముఖముపై నీరుచల్లి నీవీయవలసిన దక్షిణను యిమ్మనెను. నేడు ప్రొద్దు క్రుంకులోపల దక్షిణ నీయనిచో నిన్ను శపింతునని వెళ్ళిపోయెను. అంతట విచారించుచు దుఃఖించు భర్తను చూచి రాణి మహాత్మా నన్నమ్మి ఋణము తీర్చుమని మరల కోరెను. ముని శాపము నకు గురికావలదని పలికెను.

హరిశ్చంద్రుడు శోకముతో భార్య నమ్ముటకు నిశ్చయించి భార్యను వెంట బెట్టుకొని నగరవీధిలో నిలిచి పేరులారా! ఎవరికైన దాసి కావలసినచో నా ప్రియు రాలిని అమ్మగలను అనుచుండగా విశ్వామిత్రుడు బ్రాహ్మణరూపమున వచ్చి ఆ దాసిని నాకిమ్ము. నీకు కావలసిన ధనమిచ్చెదననెను. ధర్మశాస్త్ర ప్రకారము నీకు ధనమిచ్చుచున్నానని విప్రుడు వస్త్రముపై ధనము నుంచి రాణి తలవెంట్రుకలు పట్టి లాగెను. తల్లిని లాగుచుండుట చూచి కుమారుడు వెంటబడెను. అప్పుడు రాణి ఈ బాలుని కూడ కొని నాకు సంతోషము కలిగింపుమనగా, ఈ ధనము తీసికొని పిల్లవానిని కూడ నిమ్మనెను.

ఆ బ్రాహ్మణుడు తల్లిని బాలుని తీసికొని తన ఇంటికి వెళ్ళెను. రాణి వెళ్ళి పోవునప్పుడు భర్త పాదములపై పడి నమస్కరించి మరుజన్మమున నాకీతడేపతి యగుగాక యని ప్రార్థించెను. రాజు భార్యాపుత్రుల నమ్ముకొని నందుకు విచారించుచుండ విశ్వామిత్రుడు ప్రత్యక్షమై రాజా! దక్షిణ నిత్తునని మాట యిచ్చి

తివి. నీవు మాట నిలబెట్టుకొనువాడవైనచో దక్షిణనిమ్ము అని నిర్బంధించెను. అప్పుడు రాజు భార్యా పుత్రుల నమ్మగా వచ్చిన పదకొండు కోట్ల బంగారము నాతనికిచ్చెను. విశ్వామిత్రుడు మరికొంత ధనమిచ్చినగాని దక్షిణ పూర్తికాదు. ఇంకను కొంత సంపాదింపుము లేనిచో నా తపోబలము చూడ గలవనెను పగటిలో నాల్గవ భాగము పూర్తియగు వరకు వేచియుందును అప్పటికి నీవు దక్షిణ నీయనిచో నీతో మాట్లాడు పని నాకు లేదు. అని ధనము తీసికొని వెళ్ళెను.

హరిశ్చంద్రుడు నన్ను కొనువాడైన ఉన్నచో వెల నిర్ణయింపవచ్చునని చూచు చుండగా చండాలుడొకడు నాకు దాసుడు కావలెను. నిన్ను దాసునిగా తీసి కొందును. నీకెంత ధనమీయవలెనో తెలియజేయుము అనగా రాజు నీవెవ్వడతని ప్రశ్నించెను. నేను చండాలుడనని యాతడు బదులు పలికెను. రాజు ఆలోచించు చుండగా విశ్వామిత్రుడక్కకు వచ్చి యీ చండాలుడు నీకిచ్చు ధనమును యజ్ఞ దక్షిణగా చెల్లింపుము నిన్ను కొని చండాలుడిచ్చిన ధనమును నాకీయనిచో నాశాపా గ్నిచే నిన్ను కాల్చివై చెదననెను.

రాజు మునివర్యా! నాకు చండాలసేవ తొలగించుము. నీకే సేవ చేసి ఋణము తీర్చుకొందుననగా విశ్వామిత్రుడు చండాలుని పిలిచి ఈతడు నాదాసుడు ఈతని నీకమ్ముచున్నాను. నీవీతని గ్రహించి యెంత ధనమిత్తువో తెల్పుమనెను. చండాలుడు పరమానందముతో విశ్వామిత్రుని ముందునకు వచ్చి ప్రయాగమండలమున పదియోజనముల నేల మిక్కిలి విలువైనది దానిని నీకిచ్చె దను. ఇతనిని నాకిమ్మనెను. చండాలుడు వేయి బంగారు నాణెములు, మృత్యము మునికిచ్చెను. రాజు ధైర్యము వహించి యేమియు మాటలాలేదు. అంతలో అకశవాణి ఓ మహనీయా! నీ నీయవలసిన దక్షిణ ధనమిచ్చి ఋణ విముక్తుడవైతివి యని వినిపించెను. రాజు తలపై పుష్ప వర్షము కురిసెను. అప్పు డింద్రాదు లెల్లరు మేలుమేలని రాజును మెచ్చుకొనిరి. అంతట హరిశ్చంద్రుడు సంతోషముతో విశ్వామిత్రునకిట్లనెను.

మహాత్మా నన్ను ఋణవిముక్తుని చేసితిని. అని పలికి నేటి నుండి నేనేమి చేయవలెనని ప్రశ్నింపగా చండాలుని మాట ప్రకారము నడుచుకొనుము. నీకు శుభమగుగాక యని పలికి ధనము తీసికొని విశ్వామిత్రుడు వెడలిపోయెను. రాజు చండాలు నింటికి వెళ్ళి యేమి చేసెనని యడుగగా సూతుడిట్లు చెప్పెను. విశ్వామిత్రుడు వెళ్ళిన పిమ్మట చండాలుడు శవములపై కప్పిన వస్త్రములు లాగు టకు రాజు నాజ్ఞాపించెను. శ్మశానమున మనకు న్యాయముగ వచ్చునది తీసి

కొనుము. ఈ పాతకత్తును తీసికొని వెంటనే వెళ్ళుమనెను. హరిశ్చంద్రుడు శ్మశానమునకు వెళ్ళెను. అచటి దృశ్యములను చూచి రాజు వలవల యేడ్చెను. రాజు పండ్రెండు నెలలు గడిపెను.

ఒకనాడు రోహిత కుమారుడు సమిధల మోపును తెచ్చుచు విశ్రాంతికై దానిని ఒక పుట్టపై నుంచెను. అంతలోనొక కాలసర్పము విశ్వామిత్రుని ప్రేరణచే వెలు పలకు వచ్చి రోహితుని కాటువేసెను. వెంటనే యాతడు మరణించెను. అతని తోటిబాలురు వాని తల్లికి రోహితుని మరణము చెప్పగా నామె నేలపై కూలి పోయెను. బ్రాహ్మణుడామెను కుమారుని వద్దకు వెళ్ళ నీయలేదు. అర్ధరాత్రి యజ మాని పాదములొత్తి ప్రార్థింపగా నతడు నీవు కుమారుని వద్దకు వెళ్ళి అతని యంత్యక్రియలు జరిపి వెంటనే తిరిగిరమ్ము. నా యింటి పనులకు ఆటంకము కలుగకూడదనెను. ఆమె యారాత్రి ఒంటరిగా ఏడ్చుచువెళ్ళెను. చని పోయిన కుమారుని చూచి శోకపీడితయయ్యెను. నగరపాలకులామె యేడ్పు విని యామె వద్దకేగి నీవెవరవు? ఈ బాలుడెవని పుత్రుడు మొదలగు ననేక ప్రశ్నలడి గిరి. అమె సమాధానము చెప్పలేదు. వారీమె బాలఘాతిని రాక్షసి కావచ్చునని యామెను చండాలు అప్పగించి వెళ్ళిపోయిరి. పిమ్మట చండాలుడు నీవీ దుష్టురాలిని చంపుమనగా హరిశ్చంద్రుడీ పనిమాత్రము నాచేత కాదనెను. అంతట చండాలుడీ దుష్టురాలు పెక్కురు చిన్నపిల్లలను పాటను పెట్టుకొనినది. దీనిని చంపిన నీకు పుణ్యమే కలుగును.

కనుక దీనిని తప్పక చంపుమనెను. హరిశ్చంద్రుని తిట్టి ఈ కత్తి తీసికొని దాని తల తెగనరుకుము అని రాజుచేతికి కత్తి నిచ్చెను. రాణి తనను చంపి సిద్ధ పడుచున్న రాజును చూచి చనిపోయిన నా కుమారుని దహనక్రియలు జరుపు నంతవరకు తాళుము. పిమ్మట నన్ను కత్తితో చంపుమనెను. రాజు సరేయని పంపగా రాణి ఘోరముగ నేడ్చుచు కుమారుని శవమును తెచ్చి శ్మశానమందుంచి నేలపై కూర్చొనెను. రాజు రాణి ఒకరినొకర్తు పట్టలేదు. మరణించిన బాలుని తన కుమారునిగా చూచి నిశ్చయించి కన్నీరు కార్చుచు మిక్కిలి విచారించెను. రాణి భర్తను తలచుకొని యేడ్వగా నామె తన భార్య యని తెలిసి కొనెను. రాణి కూడ దురవస్థయందున్న భర్తను గుర్తించెను. అంతట హరిశ్చంద్రుడు చితిపై తన కుమారుని శవము నుంచి భార్యయు తానును నమస్కరించుచు నిలబడి దేవిని హృదయమున స్మరింపగా ధర్మదేవతను ముందిడుకొని ఇంద్రాది దేవతల చ్చోటి కరుదెంచిరి. ధర్మదేవత నోటితో వారు రాజునకిట్లనిరి.

ఓ మహాప్రభూ! వినుము నేను ధర్మదేవతను ముల్లోకములకు మేలుకోరు వాడను. అందరము నీకు మేలు చేయగోరి వచ్చినాము. నేను ధర్మదేవతను నీ గుణములకు ప్రసన్నుడనైతిని అని రాజును మెచ్చెను. ఇంద్రుడిట్లనెను! హరిశ్చంద్ర మహాశయా! నీవు భార్యాపుత్రులతో సనాతన లోకముల గెలిచితివి. ఇంద్రుడమృత వృష్టినిచితిపై కురిపించెను. చచ్చిన బాలుడు బ్రతికెను. హరిశ్చంద్రుడు కొడుకును కౌగలించుకొనెను. అతడు భార్యాపుత్రులతో సంపదలతో కూడి దివ్యమాల్యాం బరములు ధరించెను. ఆనందభరితుడై నిశ్చింతుడుగా నుండెను. ఇంద్రుడు స్వర్గమునకు రమ్మనగా నా ప్రజలను విడిచి రాననగా సాకేత నగరమందు స్వర్గము నకు వెళ్ళగోరువారెల్లరు హరిశ్చంద్రునితోపాటు స్వర్గమునకు రావచ్చునని యింద్రుడు పలికెను. హరిశ్చంద్రుడు తన కుమారుని రాజుగా చేసి పురప్రజలతో స్వర్గమును అలంకరించెను.

శతాక్షీమాహాత్మ్యము

జనమేజయుడు పరదేవత, శతాక్షియను పేరునెట్లు పొందెనో తెలుపుము అని అడుగగా వ్యాసుడిట్లు చెప్పెను:- రాజా! నీవు శ్రీదేవీ భక్తుడవు. నీకు చెప్పరాని విషయమేదియు లేదు. పూర్వము హిరణ్యాక్షుని వంశములో రురుకుమారుడను వాడుకలడు. అతడు దుష్టరాక్షసుడు. వేదములు దేవతలకు జీవనౌషధములు అవి నష్టమైనచో వారును నశింతురు అని యాతడాలోచించి హిమాలయ పర్వత మునకు వెళ్ళి వాయుభక్షకుడై బ్రహ్మను గూర్చి వేయి సంవత్సరములు తీవ్రమైన తపస్సు చేసెను. అతని తపస్సు వేడికిలోకములన్నియు సంతాపము నొందినవి. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై నీకు వరములిచ్చుటకై వచ్చితినని ఆరాక్షసునితో చెప్పగా ఆతడు బ్రహ్మను పూజించి యిట్లనెను. "ఓ సర్వేశ్వరా! నాకు వేదముల నిమ్ము. దేవతలవద్ద బ్రాహ్మణులవద్ద నున్న వేదమంత్రము లన్నియు నాయొద్దనే ఉండవలెను. మరియు దేవతలెల్లరు ఓడిపోవునట్టి బలము నాకిమ్ము."అని కోరగా అట్లేయగుగాకయని బ్రహ్మ సత్యలోకమునకు వెళ్ళెను.

ఆనాటి నుండి బ్రాహ్మణులు వేదములను మరిచిపోయిరి. స్నాన సంధ్యా వందన శ్రాద్ధకార్యాదులు లోపించినవి. అప్పుడా ఆరాక్షసుడు స్వర్గముపై దండెత్తి వెళ్ళెను. అతనితో యుద్ధము చేయలేక దేవతలు పారిపోయిరి. దేవతలు గుహలలో దాగినారు. లోకములో యజ్ఞయాగాదులు లేనందున వానలు కురియుటలేదు. నేలబీటలువారినది. చెరువులు బావులు ఇంకిపోయినవి. చిరకాలము అనావృష్టి యేర్పడుటవలన, జనులు ఆవులు, ఇతర పశుపక్ష్యాదులు మరణించెను. అప్పుడు

బ్రాహ్మణులు హిమవత్పర్వతమునకు వెళ్ళి శ్రీ పరాంబికనారాధించి ఆమెకు శరణాగతులై సమాధి ధ్యానపూజలచే దేవిని సంతోషపరచిరి. మరియు ఓ పరాంబికా! మేము పామరులము. మాపై దయ జూపుము ఓ సర్వాంతర్యామినీ! తల్లీ కోపించకు. ఇప్పుడు మాకు నీవు తప్పవేరే దిక్కులేదు. నీవు సర్వసమర్థు రాలవు. ఏదియెట్లైనను చేయగలవు. మహేశానీ! ఈ ఘోరసంకటము నుండి మమ్ము రక్షింపుమమ్మా సకలప్రాణికోటి జీవనమైన నీరేలేనిచో మేమేమి చేయ గలము? అఖిలాండకోటి బ్రహ్మాండనాయికా! నీకు నమస్కారము మా యెడల ప్రసన్నురాలవగుము. నీకు వందనములు తల్లీ! అని ప్రార్థించిరి.

అని యిట్లు ప్రార్థింపగా త్రిభువనేశ్వరి యగు పార్వతి అనంత నేత్రములతో వారికి ప్రత్యక్షమయ్యెను. ఆమె కన్నులు నల్లకలువలవలె ప్రకాశించుచుండెను. ఆమె చేతులయందు కమలము, బాణము, కూరగాయలు, తీయని పండ్లు, పూవులు, చిగురుటాకులు పట్టుకొనియున్నది. ఆమె అందాల రాశి. ఇట్లు ప్రత్యక్ష మైన ఆ తల్లి తన వేలాది కన్నులనుండి వర్షధారలను సమృద్ధిగా లోకము నందు కురిపించినది. తొమ్మిది రాత్రులు కుంభవృష్టి కురియుటచే లోకము లన్నియు సంతసించినవి. మరియు నేలపై మరల ఓషధులన్నియు నుద్భవించినవి. నదీ నదములన్నియు వెనుకటివలె ప్రవహింప నారంభించెను. గుహలలో దాగి యున్న దేవతలు బయటకు వచ్చిరి. అప్పుడు దేవతలు బ్రాహ్మణులును శ్రీదేవిని యిట్ల భినందించిరి. ఓ వేదాంతవేద్యా! బ్రహ్మ స్వరూపిణీ! నీకు నమస్కారము నీవు మాయచే లోకములను సృష్టించు చున్నావు. నీవు భక్తులపాట కల్పవృక్షమవు. దేవీ! భక్త సంరక్షణమునకై అనేకావతారములను దాల్చుచుందువు. ఓ భువనేశ్వరీ! నీకు నమస్కారము మాయందరి సుఖశాంతులకై వేయికన్నుల ధరించినావు. నీవు దయతో మాకు వేదములను అనుగ్రహింపుము. ఆకలి దప్పులచే పీడింపబడి నిన్ను స్తుతించుటకు కూడ శక్తి చాలక యిట్లున్నాము అని స్తుతించిరి.

అనువారల మాటలువిని చేతులలోని కూరగాయలను తీయనిపండ్లను దుంపలను వారికి తినుటకై దేవిని యిచ్చినది. ఆనాటి నుండి దేవికి శాకంభరియను పేరు ప్రసిద్ధిగాంచినది. పిమ్మట దేవతల యొక్క మానవుల యొక్కయు అభివృద్ధిని విని ఆ రాక్షసుడు దేవి సమీపమందున్న దేవతలపై బాణవర్షమును కురిపించెను. బ్రాహ్మణుల గుంపులను కూడ అడ్డగించెను. అప్పుడు దేవతలు బ్రాహ్మణులును దేవీ! రక్షించుము, రక్షించుమని కేకలు పెట్టిరి. పరదేవత వారి మొరనాలకించి దేవతల చుట్టును తేజోమయమగు నొక చక్రమును నిర్మించెను. అది వారికి రక్షాకవచమై ఏ బాధయులేకుండ జేసినది. ఇక దేవికి రాక్షసులకు

మధ్య ఘోరమగు యుద్ధము సంభవించెను. వారి బాణవర్షములు సూర్యుని కప్పి వైచినది. బాణములు రాచుకొని నిప్పులు కురియుచుండెను.

అట్టి యుద్ధ సమయమున దేవి శరీరమునుండి యనేకములైన తీవ్ర శక్తులు పుట్టినవి. వారు కాళిక, తారిణీ,బాల, త్రిపురసుందరి, భైరవి, రమ, బగళ మాతంగి, త్రిపుర, కామాక్షి, తులజా దేవి, జంభిని, మోహిని, ఛిన్నమస్త, గుహ్యాకాళి, దశసహస్ర బాహుక అను పేర్లు కలవారు. వీరుకాక మరి ముప్పది రెండుమంది, తర్వాత నరువది నలుగురు పిమ్మట లెక్కలేనంతమంది శక్తులు దేవి దివ్యావయవముల నుండి పుట్టిరి. వారందరు ఆయుధములను ధరించి యున్నారు. ఆశక్తు లందరి వలన రాక్షసుని యొక్క నూరక్షౌహిణుల సేనరూపు మాసెను. యుద్ధ రంగమున మృదంగ శంఖ వీణాధ్వనులు మిన్నుముట్టెను.

అప్పుడు సేనాపతియైన దుర్గమాసురుడు ముందుకు దుమికి విభిన్నశక్తులతో పోరాడ తలపడెను. అట్లు పదిదినములు భీకరమైన పోరు జరుగగా కొన్ని యక్షౌహిణుల రాక్షస సైన్యము హతమయ్యెను. పదునొకండవ దినమున ఎఱ్ఱని పూలమాలలు, ఎఱ్ఱనివస్త్రములు రక్తచందనము ధరించి మహాసంబర ముతో రథమెక్కివచ్చి యారాక్షసుడు శక్తులనందర నోడించెను. తరువాత తన రథమును పరదేవత రథము ముందునకు పోనిచ్చెను. అతనికి దేవికి మధ్య ద్వంద్వ యుద్ధము జరిగెను. పోరుఘోరముగ రెండు జాములు నడచెను.

పిమ్మట దేవి పదునైదు బాణములను రాక్షసునిపై విసిరి నాల్గింటితో గుఱ్ఱము లను ఒక బాణముతో సారథిని రెండింటితో, వాని కళ్ళను రెండింటితో వాని భుజములను ఒక బాణము తో ధ్వజమును ఐదింటితో ఆతని హృదయమును చీల్చివైచెను. ఆ రాక్షసుడు నోటనెత్తురుగ్రక్కుచు శ్రీదేవి సన్నిధిలో ప్రాణములను విడిచెను. అతని నుండి యొక దివ్యతేజస్సు వెడలి దేవిలో లీనమయ్యెను. ఆతడు మరణించగనే దేవతలెల్లరు అన్ని ప్రాణులును ఆనందము నందినవి.

ఆ సమయమున బ్రహ్మాది దేవతలు పరమభక్తితో మధురవాక్కులతో జగదంబనీ వీతిగ సన్నుతించిరి. ఓ పరమేశ్వరీ! బ్రహ్మాండములన్నియు నీవల్లనే పుట్టి పెరుగుచున్నవి. సకలోపనిషత్తులచే స్తుతింపబడు జ్ఞాన ప్రసూనాంబవు నీవే. ఓ దుర్గమాసురభంజనీ! జయజయ మంగళ స్వరూపిణీ! మాయేశ్వరీ! నీకివే మావందనములు నీవు దయా మయురాలవు పరమేశ్వరివి విశ్వైక మాతవు. శతాక్షీ మాతవు పామరులమైన మాకై దుంఖించినావు. సర్వేశ్వరుడు కూడ నిట్లుచేయడు అని బ్రహ్మ, విష్ణువు మొదలుగా గల దేవతలు దేవిని స్తుతించి అనేకవిధముల

పూజించిరి. దేవి అప్పుడు సంతోషించెను. పరదేవత ప్రసన్నురాలై వేదములను తెచ్చి బ్రాహ్మణుల కిచ్చి యిట్లు పలికెను:-

ఈ వేదములు నా శరీరము వంటివి. వీటిని భద్రముగా రక్షించుకొనుడు. వీటిని కోల్పోయి నందువలన ఎట్టి యనర్థము సంభవించునో ఇప్పుడే మీరు చూచితిరికదా! నన్ను నిరంతరము పూజిం పుడు సేవింపుడు. మీ మేలుకోరిన నేను చెప్పుచున్నాను. ఈ ఉత్తమదివ్యమాహాత్మ్యమును మీరు పఠించు చుండుడు. దానివలన నేను సంతోషించి మీ కోరికలను తీర్చుచుండెదను. దుర్గమాసురుని సంహరించి నందువలన ఏర్పడిన దుర్గానామమును, శతాక్షీ నామమును ఉచ్చ రించినవాడు మాయను దాటి పరమపదమును చేరగలడు. అని పలికి సచ్చిదానంద స్వరూపిణీ యెల్లవారికిని సంతోషము కలిగించుచు దేవతలందరు చూచు చుండ గనే అంతర్ధానము చెందెను. ఈ విధముగ పరమ కల్యాణకారకమగు శ్రీదేవీ మాహాత్మ్యమును గూర్చిన కథ రహస్యమైనను నీకు వివరించినాను. దీనిని ప్రయత్నముతో రహస్యముగా నుంచుము. ఎవడీ శ్రీదేవి పరమాధ్యాయమును విశ్వాత్మభావముతో భక్తిశ్రద్ధలతో వినునోవాడీ లోకమున కోరికలనన్నిటిని తీర్చు కొని పిమ్మట శ్రీదేవి యుండు లోకమునకేగి నిత్యము పరమబ్రహ్మా నంద మను భవింపగలడు. ఇందులకేమాత్రము సంశయములేదు.

శ్రీ దేవీ గీతలు

జనమేజయుడు వేదవ్యాసునిట్లు ప్రశ్నించెను. 'మహర్షీ! గౌరీలక్ష్మీ సరస్వతు లను వరుసగ శివ, విష్ణు, బ్రహ్మలకు సహధర్మచారిణులుగ పరదేవత యిచ్చి నట్లు చెప్పితివిగదా! గౌరీ లక్ష్ములకు మరల కన్యాభావమెట్లు సంప్రాప్తమైనదో తెలియుటలేదు. ఈ సంశయమును తీర్చుమని'అడిగెను. వ్యాసుడు సమాధాన మిట్లు చెప్పనారంభించెను. ఓయీ! శ్రీదేవీ భక్తుడవగు నీకు చెప్పరాని రహస్యము లేదు వినుము:- శ్రీపరాంబిక పూర్వము దేవీత్రయమును త్రిమూర్తుల కిచ్చెను. ఆనాటి నుండి త్రిమూర్తులు తమతమ సృష్ట్యాదికార్యములు కొనసాగించిరి.

పూర్వము హాలాహలులను రాక్షసులు గొప్ప పరాక్రమవంతులై యుండిరి. వారు బ్రహ్మవర ప్రభావమున బలిసి కైలాస వైకుంఠములపై దాడిచేసిరి. హరి హరులు ఆ రాక్షసులతో యుద్ధమునకు సిద్ధపడిరి. వేల సంవత్సరములు ఘోరమగువారి యుద్ధము కొనసాగినది. దేవదానవ సేనలలో హాహాకారములు మిన్నుముట్టినవి. హరిహరులు రాక్షసులనెందరినో సంహరించిరి. వారిండ్లకు వెళ్ళి తమతమ భార్యల వద్ద రాక్షసులను మేమే మాబలముతో సంహరించితిమని గొప్పలు చెప్పు కొనగా

వారి స్వాభిమానమునకు లక్ష్మీ గౌరులిరువురును పరిహాసముగా నవ్విరి. హరిహరులకు వారి నవ్వువలన కోపము కలిగెను. కనుక అవమానకరముగా మాట్లాడిరి. అకారణముచే లక్ష్మీ గౌరులంతర్ధానము చెందిరి. లక్ష్మీ గౌరులనవ మానించుటచే హరి హరులు తేజస్సును శక్తిని కోల్పోయిరి.

బ్రహ్మ వారిరువురను చూచి హరిహరులు కార్యదక్షతలేనివారుగ కనిపించు చున్నారేమి? యని ఆశ్చర్యము చెంది. దేవతలలో ప్రముఖులైన వీరుశక్తి హీనులగుటకు కారణమేమి? ఇందుకు ప్రతిక్రియ ఎట్లు చేయవలెను? అని కన్నులు మూసి కొని ధ్యానించెను. పరదేవత యొక్క కోపము చేతనే యిట్లు జరిగినదని గ్రహించి వారిరువురి పనులను తానే చక్కబెట్టుచుండెను. మరియు హరిహరుల మేలు కోరి ధర్మాత్ముఁడగు బ్రహ్మ తన కుమారులగు మన్వాదులను సనకాదులనుగూడ ఆహ్వానించెను. వారు వచ్చి బ్రహ్మకు నమస్కరించగా బ్రహ్మవారితో నిట్లనెను:-

నేననేక కార్యములలో మునిగియుండి తపస్సు చేయజాలకున్నాను. హరిహరులిర్వును దేవీ కోపమునకు గురియై శక్తి హీనులుగానున్నారు. ఆమె సంతోషించుటకే జగద్భారమునంతను నేనే మోయవలసి వచ్చినది. కనుక మీరు యేకాంతభక్తితో అత్యద్భుతముగ తపస్సు చేసి పరాంబికను సంతోషపెట్టుడు. తద్వారా హరిహరులు మరల శక్తియుక్తులగునట్లు చేయుడు. మీ కీర్తి వర్ధిల్లగలదు. ఆ గౌరీలక్ష్ములు ఎవనియింట జన్మింతురో ఆ వంశము మిక్కిలి పవిత్రము. కన్న తల్లిదండ్రులు ధన్యజీవులు. అని పలుకగా దక్షప్రజాపతి మొదలగు వారెల్లరును నిర్మలమైన మనస్సుతో జగదంబ నారాధింపవనములకు వెళ్ళిరి. వారందరును హిమాలయ వనములకు వెళ్ళి మాయాబీజజప పరాయణులై నిశ్చలముగ తపస్సు నారంభించిరి. చిరకాలము వారు ధ్యానించగా శ్రీదేవి యనుగ్రహించి వారికి దర్శనమిచ్చెను. ఆ సచ్చిదానంద స్వరూపిణి దయారస ముప్పొంగనాల్గు చేతులతో పాశాంకుశ వరాభయముద్రలు ధరించెను. లోకములనన్నిటిని పరిపాలించు జగజ్జనని చూచి నిర్మలమనస్సు గల మహర్షులు దేవినిట్లు స్తుతించిరి.

శ్లో॥ నమస్తే విశ్వరూపాయై వైశ్వానరసమూర్తయే
నమస్తే జలరూపాయై సూత్రాత్మవపుషే నమః।
యస్మిన్ సర్వేలింగదేహా ఓతప్రోతావ్యవస్థితాః ।
నమః ప్రాజ్ఞ స్వరూపాయై నమోవ్యాకృత మూర్తయే।
నమః ప్రత్యక్స్వరూపాయై నమస్తే బ్రహ్మమూర్తయే ॥
నమస్తే సర్వరూపాయై సర్వలక్ష్యాత్మ మూర్తయే॥